T.T.D. Religious Publication Series No. 1154
Price :

## ఇటీవలి ప్రచురణలు

| | | |
|---|---|---|
| శ్రీరామవిజయం | : | సాయినాథుని నారాయణరావు |
| శ్రీమద్భగవద్గీత | : | డా॥ చింతగుంట సుబ్బారావు |
| వేదాంతసారః | : | డా॥ పి. శశిరేఖ |
| తిరుమల దివ్యతీర్థాలు | : | డా॥ సి. లలితరాణి |
| శ్రీ తులసీ రామాయణము | : | మిట్టపల్లి ఆదినారాయణ |
| జీవనచిత్రాలు | : | డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య |
| తిరుమలప్పపై ఇప్పటి కవులు | : | డా॥ గల్లా చలపతి |
| అధ్యాత్మ రామాయణము (పద్యకావ్యం) | : | వైద్యం వేంకటేశ్వరాచార్యులు |
| శివానంద రామాయణము | : | డా॥ వి.ఎల్.ఎస్ భీమశంకరం |
| శ్రీవేంకటాచలమాహాత్మ్యము (మూలం) (ప్రథమ భాగము) | : | తిరుమల తిరుపతి దేవస్థానములు |
| శ్రీవేంకటాచలమాహాత్మ్యము (మూలం) (ద్వితీయ భాగము) | : | తిరుమల తిరుపతి దేవస్థానములు |

Published by **Dr. D. Sambasiva Rao,** I.A.S., Executive Officer,
T.T.Devasthanams, Tirupati and Printed at T.T.D. Press, Tirupati.

# శ్రీ నరసింహశతకము

– శ్రీమతి ఎం.కె. ప్రభావతి

తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

# శ్రీ నరసింహశతకము

శ్రీమతి ఎం.కె. ప్రభావతి

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2015

**SRI NARASIMHA SATHAKAMU**

By

**Smt. M.K. Prabavathi**

T.T.D. Religious Publication Series No: 1154
© All Rights Reserved

*T.T.D First Edition : 2015*

Copies: 1000

*Published by :*
**Dr. D. SAMBASIVA RAO**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P:***
Office of the Editor-in-Chief,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

## ముందుమాట

భక్తుల దర్శన సౌకర్యాలతోపాటు ధర్మప్రచారానికి తి.తి.దేవస్థానం విశేష ప్రాధాన్యత ఇస్తున్నది. ఇందులో భాగంగానే రామాయణ, భారత, భాగవతాది గ్రంథాలను, ఇతర ధార్మిక గ్రంథాలను ముద్రించి భక్తులకు అందుబాటులో ఉంచుతుంది. ఈ కోవలోనే ముద్రింపబడుతున్న గ్రంథం "శ్రీ నరసింహశతకము". దీని రచయిత్రి శ్రీమతి యం.కె. ప్రభావతిగారు.

ఆంధ్ర కర్ణాటక సరిహద్దుల్లోని 'దొడ్డధాళవట్టం' అనే గ్రామంలో స్వయంభువుగా వెలసినదైవం శ్రీ లక్ష్మీనరసింహస్వామి. కర్ణాటక, ఆంధ్రరాష్ట్రాల్లోని భక్తులు నిత్యం అచ్చటికి వెళ్లి స్వామివారిని దర్శిస్తుంటారు. రచయిత్రి పుట్టిన ఊరుకావడం, స్వామివారిపై అనన్యమైన భక్తిభావం కలిగి ఉండటంవల్ల శ్రీమతి ప్రభావతిగారు శ్రీ నరసింహశతకమును రచించారు.

**"దొడ్డధాళవట్టములోని దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే నారసింహ!"**

అనే మకుటంతో 110 సీసపద్యాల్లో ఈ శతకం రచింపబడ్డది. భగవంతుని గుణగణములు, మహిమలు, క్షేత్రమహిమ, భగవంతుని దశావతారముల వర్ణనలతోపాటు అనేక సామాజికాంశాలను రచయిత్రి వర్ణించి చెప్పడం ముదావహం. శాస్త్రాన్ని బోధించిన అధ్యాపకురాలు కావడంవల్ల శాస్త్రీయ విషయాలను చక్కగా సమన్వయం చేశారు. ప్రతి పద్యానికి భావాన్ని వ్రాయడంతోపాటు విశేషాంశాలను చెప్పడంవల్ల పాఠకులు సులభంగా అర్థం చేసుకోగలరు. తి.తి.దే ప్రచురిస్తున్న ఈ భక్తిశతకాన్ని సాహిత్యాభిమానులైన పాఠకులు ఆదరిస్తారని అభిలషిస్తున్నాను.

*సదా శ్రీవారి సేవలో....*

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



## అంకితం

తే.గీ॥ దేవ! జనియింపఁజేసితి దివ్యమైన
నీదుగ్రామాన నందుకొను నాదుకృతిని
గుండె గుడిలోన నిత్యమ్ము కొలువుచేయు
దొడ్డధాళవట్టములోని దొడ్డవేల్ప!
నమ్మినానయ్య! నిన్నునే నారసింహ!

## మున్నుడి



శ్రీ లక్ష్మీనరసింహస్వామి స్వయంభువుగా దొడ్డధాళవట్టమనే చిన్ని గ్రామంలో వెలిశారు నాల్గుదశాబ్దాల క్రితం. ఈ గ్రామం కర్ణాటకకు చెందిన తుముకూరు జిల్లాలోని మధుగిరి తాలూకా యంచుల్లో, ఆంధ్రదేశపు టెల్లలలో నున్న హిందూపురానికి ఆరుమైళ్ల దూరములో నున్నది. అనేక వ్యయప్రయాసలకోర్చి భక్తులీ స్వామిదర్శనార్థమై వచ్చేవారు. ఇటీవల దశాబ్దంగా బస్సులు నడుస్తున్నవి. హిందూపుర – ఐ.డి. హళ్ళి మధ్య నడిచే బస్సులు భక్తులు స్వామిని చేరుకోవడంలో గల పాట్లను తగ్గించి సరాసరి కోవెలముందుకు చేరుస్తున్నవి.

భగవదనుగ్రహంచేత 1991లో నేను అవధానప్రదర్శనల కుపక్రమించాను. ఆ రోజుల్లో కవితాధార పెంపొందించుకోవడానికి శతకరచన చేయమని గురువర్యులు కవిరత్న బిరుదాంచితులు శ్రీ దాదన చిన్నయ్యగారు మరియు శ్రీ చక్రాల లక్ష్మీకాంతరాజారావు గారు నన్నాదేశించారు. వారి ఆదేశం మేరకు రచించాలనుకుంటున్న తరుణంలో, దొడ్డధాళివట్టం మా తల్లికి పుట్టిల్లు అవడం మూలంగా, పసితనం నుండి స్వామిని దర్శిస్తూ, ఆయన మహిమలు వినినట్టి నాకు, ఆ స్వామిపైననే శతకం వ్రాద్దామనే సంకల్పం కలిగింది. 1992లో రథోత్సవంనాడు శతకరచన పూర్తయి స్వామికి అంకితమివ్వగలిగాను.

ఆర్థికపరమైన ఇబ్బందులు పుస్తకముద్రణ కడ్డు వచ్చాయి. ఈ 1998 నాటికి ఆ అడ్డంకులు ఛేదించుకొని రావడానికి వరంగల్లులోని RECలో గణితశాస్త్ర ప్రొఫెసరు అండ్ హెడ్ డా॥ అయ్యంగారు గారి చేయూత ప్రధానమైనది. ఇందు కా మహనీయునకు వినమ్రతతో కృతజ్ఞతాంజలి సమర్పించుకొంటున్నాను.

విజ్ఞానశాస్త్రమునకు వేదాంతమునకు సమన్వయమును చూపు విషయములెన్నో ఈ రచనలో పొందుపరచబడినవి. చదువరులు ఇందలి సారస్యమును గ్రహించి రసానందమందగలరని నా ఆశ.

1986లో పుస్తక రూపముగా ముద్రింప చేశానే కాని జనం మధ్యకు తీసుకువచ్చేపని అంటే అమ్మడం నా వలన చేతకాలేదు. బహుమతి రూపంగా బంధుమిత్రులకు ఇస్తూ వచ్చాను. ఇట్లా తీసుకొన్నవారిలో కొందరు తాత్పర్యంతోపాటు విశేషార్థాలు నేను తెలిపితేనే తెలుస్తున్నవి, కనుక వాటిని పునర్ముద్రణ చేస్తే నన్నే వ్రాయమని సలహాయిచ్చారు. వారి సలహాలమేరకు తాత్పర్యవిశేషార్థాలతో యీ శ్రీ నరసింహ శతకాన్ని పునర్ముద్రణకై తిరుమల తిరుపతి దేవస్థానం వారికి సర్వహక్కులతో అప్పగిస్తున్నాను.

ఈ సందర్భంలో–

నా సాహిత్య సేవకు అన్ని విధాల సహకరిస్తున్న నా పతిదేవులు శ్రీ పి. శ్రీనివాసరావుకు అక్షరరూపంలో కృతజ్ఞతలు. అమ్మచేస్తున్న పనిలో అడుగడుగునా తన వంతు సహాయమందిస్తున్న పెద్దకుమారుడు రమణను వాడి భార్యాబిడ్డలను, రెండవ కుమారుడు కిరణు, ఏకైక పుత్రిక కళ్యాణి దూరాన నుండి తమ శుభాకాంక్షలను తెలుపుతున్న వారిని వారి కుటుంబాలను శ్రీ నరసింహస్వామి శుభదృష్టులతో బ్రోచుగాక!

ఈ విధంగా భగవత్సేవకు పూనుకొన్న నాకు గుడిపూడి నాగరాజు, మేనేజరు, స్టేటుబాంక్ ఆఫ్ ఇండియా, పాకాల వారు మరియు వారి కుటుంబ సభ్యుల సహకారం లభించింది. వారికి, వారి కుటుంబ సభ్యులందరికీ శ్రీనరసింహుని దివ్యాశీస్సులు లభించాలని మనసారా ప్రార్థిస్తున్నాను.

'నీ చిత్తము నా భాగ్యమయ్య' అని త్యాగరాజుల వారన్నట్లు దొడ్డధాళవట్టములోని దొడ్డవేల్పుకు మోకరిస్తూ...

*బుధజనవిధేయ*

**యం.కె. ప్రభావతి**

# అభినందనలు

శ్రీ వేదాద్రి నరసింహస్వామివారి దర్శనభాగ్యము వలన, ఆయన కరుణతో, నా జీవితములో వీలయినన్ని, వీలయితే అన్ని నృసింహక్షేత్రములూ దర్శించవలెననే సంకల్పమునకు ప్రేరణ కలిగినది.

ఆపనిలో భాగముగా, శ్రీ నృసింహస్వామివారికి సంబంధించిన క్షేత్రముల వివరముల కొఱకు, శ్రీ నృసింహస్వామివారికి సంబంధించిన సాహిత్యమంతా సేకరించడం మొదలుపెట్టాను. అన్ని భాషలలోను, అన్ని రకాల సాహిత్యప్రక్రియలలోనూ ఈ సేకరణ జరిగింది. వాటిలో క్షేత్రమాహాత్మ్యాలు, శతకములు, సుప్రభాతములు, నక్షత్రమాలలు, స్తోత్రములు, స్తుతులు, ఉదాహరణలతో పాటు శ్రీ నృసింహావతార తత్త్వమునకు సంబంధించిన అనేక గ్రంథాలున్నాయి. వీటిలో ఒక్క శతక సాహిత్యము మీదనే దాదాపు రెండు వందల శతకములు వున్నాయి. వీటిలో శ్రీమతి ఎం.కె. ప్రభావతిగారు రచించిన ఈ శతక మొకటి.

నిజానికి, పైన పేర్కొన్న శ్రీ నృసింహసాహిత్య సేకరణలో, ముఖ్యముగా కొన్ని ప్రత్యేకపుస్తకముల కొఱకు పడ్డకష్టములు వివరముగా వ్రాస్తే, అది ఆ పుస్తకములకన్నా పెద్దదిగా వుంటుంది. అలాంటి ప్రత్యేక సేకరణలలో ఈ పుస్తకము కూడా ఒకటి.

రచయిత్రి, ఈ శతకమును మొదటిసారి 1998 వ సంవత్సరములో వ్రాసి, ప్రచురించేనాటికి, ఆమె రంగారెడ్డి జిల్లాలోని వికారాబాద్‌లో నివసిస్తున్నట్లు తెలిసింది. ఈ పుస్తకము కొఱకు అక్కడి ఆమె చిరునామాలో ఎంత ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ఆ సమయానికి ఆమె గుంతకల్‌కు మారిపోయారు. తరువాత, కొంతకాలానికి, ఆమె చిరునామా దొరికి, ఆమె వద్ద నుంచి ఈ పుస్తకమును పొందడం జరిగింది. ఈ పుస్తకము అందుకున్న తరువాత, ఈ శతకము కర్ణాటక రాష్ట్రములోని తుముకూరు జిల్లాలోని మధుగిరి తాలూకాలోగల దొడ్డధాళవట్టమనే గ్రామములో నెలకొన్న శ్రీ లక్ష్మీనృసింహస్వామివారి మీద రచింపబడినదిగా తెలిసి ఎంతో

సంతోషించాను. ఎందుకంటే, తెలుగులో తప్ప, మరే ఇతర భాషలలోనూ శతకసాహిత్యము చెప్పుకోదగినంతలేదు. సంస్కృత, కన్నడ భాషల్లో కొంత శతకసాహిత్యమున్నా, అది తెలుగులో వున్నంత లేదు. అందువల్ల, ఇతర రాష్ట్రాలలో వున్న నృసింహదేవాలయాలమీద శతకసాహిత్యము ఒకటో, రెండో తప్ప కన్పించలేదు. తమిళనాడురాష్ట్రములోని ఘటికాచలము (షోలింగర్) మీద తెలుగులో కొన్ని శతకములు వెలువడ్డాయి. అలాగే, సంస్కృతములో కూడా ఈ స్వామివారి మీద ఒక శతకమున్నది.

వీటికి కొనసాగింపుగా, మరో రాష్ట్రమయిన కర్ణాటకలో వెలసివున్న ఈ స్వామివారి మీద తెలుగులో మరో శతకము ఈ రచయిత్రి రచించడం నాకెంతో సంతోషాన్ని కలిగించింది.

ఈ శతకమును తనకు అంకితముగా, ఈ రచయిత్రి చేత చెప్పించుకున్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారి దేవాలయము పురాతనమయినది. పూర్వము ఈ ప్రాంతములో 'దళమహర్షి' తపస్సు చేసి శ్రీ లక్ష్మీనృసింహస్వామివారిని ప్రత్యక్షం చేసుకున్నాడు. దళమహర్షి కోరిక మీద శ్రీ స్వామివారు తన సాలగ్రామశిలారూపాన్ని, మహర్షికి అనుగ్రహించాడు. దానిని ప్రతిష్ఠించి, తన జీవితకాలపర్యంతం, ఆ దళమహర్షి సేవించాడు. తరువాత, శ్రీ స్వామివారు మరుగునపడ్డారు.

తరువాత కాలంలో, రేనాటి చోళులు ఈ ప్రాంతాన్ని పరిపాలించే కాలంలో, సమీపంలోగల హిందూపూర్‌కు చెందిన కొందరు వ్యాపారులు తమ వ్యాపారనిమిత్తము ప్రయాణం చేస్తూ, ఈ ప్రదేశానికి చేరుకున్నారు. పూర్వము శ్రీ స్వామివారి సాలగ్రామశిల ప్రతిష్ఠితమయిన చోట విడిది చేసి, విశ్రాంతి తీసుకుంటూ, అన్నం వండుకోవడానికి కొన్ని రాళ్ళు సేకరించి, వాటితో ఒక పొయ్యి ఏర్పరచుకుని, దానిమీద అన్నం వండుకున్నారు. కానీ, ఆ అన్నము రక్తాన్నముగా మారిపోయింది. భయస్థులయిన ఆ వ్యాపారులు, స్థానికులను విచారించగా, వారు ఆ విషయమై తమకు ఏమీ తెలియదన్నారు.



ఇంతలో శ్రీలక్ష్మీనృసింహస్వామివారు, ఆ గుంపులోగల ఒక బాలకునికి ఆవేశించి, తాను శ్రీలక్ష్మీనరసింహస్వామినని తెలియజేసి, వారు పొయ్యి నిర్మాణానికి సేకరించిన రాళ్ళలో, తన సాలగ్రామశిలామూర్తి వున్నదని తెలియజేసి, అందువల్లనే వారు వండిన అన్నము రక్తవర్ణముగా మారిందనీ, ఆ తప్పిదపరిహారార్థము, తన సాలగ్రామశిలను ప్రతిష్ఠించి, ఒక దేవాలయం నిర్మించాలని ఆదేశించాడట. శ్రీ స్వామివారి ఆజ్ఞ మేరకు, ఆ వ్యాపారులూ, స్థానికులూ కలసి, శ్రీ స్వామివారి సాలగ్రామశిలను గుర్తించి, దానిని ప్రతిష్ఠించి, ఒక చిన్న దేవాలయమును నిర్మించారు.

ఈ ధాళవట్ట గ్రామము, తాలూకా కేంద్రమయిన 'మధుగిరి'కి సుమారు 40 కి.మీ. దూరంలో వుంటుంది. ఈ ప్రాంతము ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రములకు ఎల్లలలో వుండినది. మనరాష్ట్రములో హిందూపూర్‌కు ఈ ధాళవట్టము సుమారు 16 కి.మీ.ల దూరంలో వుంటుంది. పూర్వము హిందూపూర్ నుంచి ఈ దేవాలయాన్ని చేరుకోవడానికి కొంచెం కష్టమయినా, నేడు హిందూపూర్ నుంచి నడపబడుతున్న కొన్ని బస్సులు ఈ ఊరి నుంచి వెళ్తూ వుండటం వలన, ప్రస్తుతము హిందూపూర్ నుంచి ఈ దేవాలయాన్ని చేరుకోవడము తేలికే.

ఈ దేవాలయము చాలా ప్రశాంతమయిన వాతావరణములో నెలకొని వున్నది. ఈ క్షేత్రమును 'శ్రీక్షేత్ర'మని పిలుస్తారు. విజయనగర రాజుల కాలంలో 'మధుగిరి'ని పాలించే రాజులు, తమ సరిహద్దుల రక్షణ కొఱకు పెద్దసైన్యమును పోషించారు. దానిని కన్నడ భాషలో 'దొడ్డదళ' అని రాజులు పిలిచేవారట. అప్పటి మధుగిరి ప్రభువు శ్రీ చిక్కప్పగౌడు, దొడ్డదళ పేరున ఈ ప్రాంతాన్ని దొడ్డదళవట్టముగా నామకరణం చేసాడంటూ, ఆయన తన మీదకు ఆ సమయంలో దండెత్తి వచ్చిన కారేహళ్ళికి చెందిన ఖైరేంద్ర పాళ్యగర్ మీద 'పెనుగొండ' వద్ద సాధించిన విజయానికి గుర్తుగా, యుద్ధములో పాల్గొని, తనకు విజయాన్ని చేకూర్చిపెట్టిన 'దొడ్డదళ' పేరు శాశ్వతముగా చేయడానికి ఆ విధముగా ఏర్పరిచాడు. ఆయనే నేడున్న ఈ దేవాలయాన్ని నిర్మించినట్లుగా చెబుతారు.

ఆయనచే నిర్మించబడిన రాజగోపురం సుమారు 50 అడుగుల ఎత్తుతో ఎంతో సుందరంగా వుంటుంది. ఇటీవల ఈ గోపురం పునర్నిర్మాణం చేయబడింది. ఈ గోపురం మీద శ్వేతవర్ణంలో అనేక మూర్తులు అత్యంత సుందరంగా చెక్కబడ్డాయి. గుడిలోపల ఒక భవనసముదాయాన్ని కూడా ఇటీవలే నిర్మించారు.

రాజగోపురం దాటి లోపలకు ప్రవేశించగానే, దేవాలయం ఒక విశాల ప్రాంగణం మధ్యలో అందంగా కన్పిస్తూవుంటుంది. ముందుగా ఒక పంచలోహ ధ్వజస్తంభం దర్శనమిస్తుంది. దేవాలయ ప్రదక్షిణ మార్గం చాలా విశాలంగా వుంటుంది. సుఖనాసీ మండపంలో దశావతారమూర్తులు, ఇంకా అనేక నృసింహమూర్తులు దర్శనమిస్తాయి. ఇక ధ్వజస్తంభానికి వెనుకగా, ప్రధానాలయానికి ఎదురుగా గరుడాళ్వారు నెలకొనియున్నారు.

ఇక, అంతరాలయంలోనికి ప్రవేశించగానే, కుడి ప్రక్కన వినాయకుడు, ఆంజనేయస్వామివార్ల విగ్రహాలతోపాటు శ్రీ శారదాదేవి విగ్రహముంది. ఇంకా రంగమండపం భోగమండపాలున్నాయి. ఆ దేవాలయనిర్మాణం ద్రావిడశైలిలో వుంటుంది. దేవాలయములో దొరికిన ఒక శాసనం ప్రకారము ప్రతిసంవత్సరము ఆషాడశుద్ధ దశమి నుంచి పౌర్ణమి వరకూ బ్రహ్మోత్సవాలు జరిగేవన్న విషయాన్ని తెలియజేస్తూ వుంటుంది.

ఈ ఆలయస్తంభాలపై యోగనరసింహ, స్థాననరసింహ అనగా స్తంభోద్భవ, చెంచులక్ష్మిని ఆలింగనం చేసుకున్న నరసింహ, నృత్య నరసింహ శిల్పాలున్నాయి. ఆలింగన నరసింహమూర్తి శిల్పాలు కర్నాటకలోని హేమావతిలోనూ, ఆంధ్రదేశంలోని కదెలిలోనూ వుండగా, నృత్యనరసింహ శిల్పాలు చాలా అరుదనే చెప్పాలి. ఆంధ్రరాష్ట్రంలోని వరంగల్లు జిల్లాలోగల హన్మకొండలోని వేయిస్తంభాల గుడిలో మరో అద్భుతమయిన నృత్యనృసింహ శిల్పం వుంది.

1982వ సంవత్సరములో, పూర్వం ప్రతిష్ఠించబడిన సాలగ్రామ శిలకు తోడుగా, ఒక చక్కని, నల్లని శ్రీలక్ష్మీనృసింహస్వామివారి విగ్రహము



ప్రతిష్ఠించబడినది. గర్భాలయముతో ఉద్భవమూర్తితోపాటు, ఈ లక్ష్మీ నృసింహుడు ఎంతో ప్రసన్నంగా దర్శనమిస్తుంటాడు. శ్రీ లక్ష్మీఅమ్మవారు శ్రీ స్వామివారి అంకస్థిత. శ్రీ లక్ష్మీఅమ్మవారికి విడిగా దేవాలయములో ఒక సన్నిధి వున్నది.

శ్రీలక్ష్మీనృసింహస్వామివారి జన్మనక్షత్రమయిన 'స్వాతినక్షత్రము' రోజున ప్రతిమాసమూ, దేవాలయంలో సుదర్శనహోమము నిర్వహించబడుతుంది. ఆషాడమాసంలో జరిగే బ్రహ్మోత్సవాలలో భాగంగా రథోత్సవం నిర్వహిస్తారు. ఈ స్వామికి మ్రొక్కులు మ్రొక్కుకున్న భక్తులు, ఆ మ్రొక్కులు చెల్లించడానికి, పల్లకీసేవ అనే ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ ఉత్సవం ఎంతో సుందరంగా వుంటుంది. ఆ పల్లకిని గ్రామం అంతా ఊరేగిస్తారు. కర్నాటకరాష్ట్రం నుంచీ, సమీపంలోగల ఆంధ్రరాష్ట్రం నుంచి వచ్చే భక్తులతో, ఈ దేవాలయము నిత్యమూ కళకళలాడుతూ వుంటుంది.

శ్రీ స్వామివారి దేవాలయానికి అనుబంధంగా ఒక పురాతనమైన కోనేరువున్నది. పురాతనమయినా ఇది నేటికీ మంచిస్థితిలోనే వున్నది. దీనిని గజాగుండం అని పిలుస్తారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా, ప్రతి సంవత్సరమూ ఈ కోనేరులో తెప్పోత్సవం జరుపుతారు. ఇంక ఊరిలో శ్రీ లక్ష్మీనృసింహస్వామివారి దేవాలయానికి దగ్గరలో ఒక శివాలయంవున్నది.

ఈ ప్రాంతంలో దొరికే రూబీస్టోన్స్ చాలా పేరు పొందాయి. రాజస్థాన ప్రాంతీయులకు, ఈ ప్రాంతంతో రూబీస్టోన్స్ వ్యాపారనిమిత్తం రాజుల కాలంనుంచీ సంబంధాలున్నాయి.

ఈ మహిమాన్వితక్షేత్రములో వెలిసివున్న శ్రీ లక్ష్మీనృసింహస్వామివారిని తన చిన్నతనం నుంచీ దర్శిస్తున్నట్లు రచయిత్రి శతకంలోని తమ 'మున్నుడి'లో చెప్పారు. ఈ ఊరు ఆమె తల్లిగారి పుట్టిల్లట. మరియు జన్మస్థలమట అందువల్ల చిన్నతనం నుంచీ తన తల్లితో కలిసి, తన అమ్మమ్మ గారి ఊరు వెళ్ళినప్పుడల్లా, ఈ స్వామివారిని దర్శిస్తూ వుండటం వల్ల,

ఆ స్వామివారిమీద ఒక శతకము రచించాలనే కోరిక కలిగినట్లు తెలియజేసారు. దానికి తోడు, ఆమె 1991 సంవత్సర ప్రాంతములో అవధానాలు చేయాలని సంకల్పించుకొన్నప్పుడు, ఆమెకు మార్గదర్శకులయిన గురువులు కవితాధార కొరకు ఒక శతకము రచించమని ఆదేశించారట. అయితే ఇది పురాతన సంప్రదాయమే.

పూర్వకవులందరూ ఇదే చేసారు. కవిత్వం చెప్పడం మొదలుపెట్టిన తొలినాళ్ళలో, తమఇష్టదైవము మీదనో, తమఊరిలో నెలకొనివున్న దేవునిమీదనో ఒక శతకము వ్రాసేవారు. ఇలాంటి సంప్రదాయము ఈ కవయిత్రి పాటించడం వల్లనే తనవృత్తిలోనూ, ప్రవృత్తిలోనూ నిరాటంకంగా నెగ్గుకొచ్చారు. వృత్తిపరంగా ప్రశాంతమయిన జీవనమూ, ప్రవృత్తి రూపేణా మంచి కీర్తిప్రతిష్ఠలూ పొందారు.

అలాగే సంప్రదాయబద్ధంగానే ఈ రచయిత్రి ఈ శతకాన్ని 110 పద్యాలలో రచించారు. తమ రచనలో శ్రీ స్వామివారి స్తుతి, వర్ణన, దేవాలయ విశేషాలు, ఉత్సవాలను మనోహరంగా వర్ణించారు. 52 వ పద్యము నుంచి 61 వ పద్యము వరకూ దశావతారాలను వర్ణిస్తూ, జీవపరిణామక్రమాన్ని స్థాలీపులాక న్యాయంగా ఉటంకించారు. 102వ పద్యంలో వేదాంత పరమయిన 'పూర్ణము'ను ఎంతో హృద్యంగా వివరించారు. 105 వ పద్యములో శ్రీ స్వామివారు తన భక్తులను బ్రోచిన వివరాలు తెలియజేస్తూ శరణం పలికిన విధానము ఎంతో మనోహరము.

శ్రీ లక్ష్మీ నృసింహస్వామి కరుణా కటాక్షములతో, ఈ రచయిత్రి మరెన్నో కావ్యాలు రచించి, మరింత పేరు ప్రఖ్యాతులు పొందాలని నా ఇష్టదైవమయిన ఆ నరసింహదేవుని వేడుకుంటున్నాను.

**అరిశెట్టి సాయిప్రసాద్**
నరసింహోపాసకుడు
గుంటూరు



**దొడ్డధాళవట్టం నరసింహస్వామివారు**



శ్రీ కమలాంబ అమ్మవారు

శ్రీలక్ష్మీనారసింహ ప్రసన్నః

## కృతికర్త్రి వంశావళి

సీ. మడకసిరా గ్రామ – మాన్య వాస్తవ్యులై
నా తాత తండ్రులు – నేతలయిరి
నంజుండయార్యుడు – నా తండ్రికగు తండ్రి
లలితమ్మ తన గృహ – లక్ష్మికాగ
కొమరుల నిర్వుర – కూతుళ్ళనల్వుర
కొమరొప్ప గని వారు – కూర్మిగనిరి
శారద నరసమ్మ – శ్యామల సుబ్బమ్మ
మేనత్తలై నాకు – మెరసినారు

తే.గీ. జ్యేష్ఠ పుత్రుడు నా తండ్రి – శ్రేష్ఠుడతడు
కృష్ణమూర్తి నా పేరున – కీర్తినందె
నర్మిలి సుతుడు శ్రీకంఠ – శర్మయయ్యె
నాదు పినతండ్రి ప్రేమతో – నన్నుబ్రోచె 1

**భావము :** మడకసిర అనంతపురం జిల్లాలోని ఒక తాలూకా. కర్ణాటక రాష్ట్రానికి అంచుల్లో ఉన్నది. నా కంటె మూడు తరాల ముందటివారు ఆ ఊరి రెడ్డి పదవిని నిర్వహిస్తూ గ్రామప్రజల మన్ననలందుతూ ఉండినారట. మా పితామహుల పేరు నంజుండయ్య. మా పితామహి లలితమ్మ. వీరికి ఇద్దరు కుమారులు. పెద్దవాడు మా తండ్రి కృష్ణమూర్తి, ముగ్గురాడపిల్లల తరువాతివాడు శ్రీ కంఠశర్మ. ఆడపిల్లలు నలువురు శారదమ్మ. నరసమ్మ, సుబ్బమ్మ, కడగొట్టుపిల్ల శ్యామలమ్మ.

'కృష్ణమూర్తి నా పేరున కీర్తినందె' అనడంలో అందమేమిటంటే కృష్ణమూర్తి అనబడు పేరుతో అని ఒక అర్థము కాగా, కవయిత్రినైన నేను మడకసిర కృష్ణ ప్రభావతిగా పిలువబడుతున్నాను. అంటే ఇందులోని మొదటి

రెండుపదాలు ఆయనకు సంబంధించినవే. అంటే నా కీర్తితో పాటు ఆయన పేరు కూడ కీర్తికి భాజనమవుతున్నది అనేది రెండవ అర్థము.

**సీ. కపినీప శాస్త్రి నా - కన్న తల్లికి తండ్రి**
**పుట్టనరసమాంబ - పొల్చెగృహిణి**
**జపతపశీలియై - చండియాగముచేసి**
**బిరుదు వహించిన - పెద్దయతడు**
**కన్నడసంస్కృత - కబ్బాలుచదివిన**
**యాచార్య మేటియై - యతడువెలిగె**
**నా పుణ్యమూర్తుల - కపురూపసంతుగా**
**నమ్మయు మామ నే - దవనినుండ్రి**

**తే.గీ. వేంకటాచలపతి మామ - సంకటాల**
**దొడ్డధాళవట్టములోన - త్రోవగనక**
**పుట్టలక్ష్మమ్మ తనభార్య - పొందుదక్క**
**బ్రతుకు కష్టమయము గాగ - బ్రతుకుచుండు 2**

**భావము:** కపినీపతిశాస్త్రి మా మాతామహులు. పుట్టనరసమ్మ మా మాతామహి. ఈతడు గొప్ప ఆచారవంతుడు. నిరంతరం జపతపాలల్లో మునిగియుండేవాడు. చండీయాగము నిర్వహించినమేటి. కన్నడము మరియు సంస్కృతభాషలందు పాండిత్యమున్నవాడు. ఆ భాషోపాధ్యాయుడిగా మధుగిరిలో పనిచేసి విశ్రాంతజీవితమును స్వగ్రామమైన దొడ్డ ధాళవట్టములో గడిపినాడు. ఈ పుణ్యదంపతులకు కలిగిన సంతానములో ఈ శతకరచన చేసే కాలము నాటికి మా తల్లిగారు మరియు మేనమామ వేంకటాచలశాస్త్రిగారు మాత్రమే జీవించి యుండిరి. ఈ మామ కూడ పెద్ద వయసులో కలిగిన సంతానంతో, పల్లెటూరిలో జీవనయాత్ర చేయుటకున్న కష్టనష్టముల ననుభవిస్తూ, ధర్మపత్ని పుట్టలక్ష్మమ్మ అన్ని రకాలుగా అనుకూలవతియై చరిస్తూ ఉండగా జీవిస్తూ ఉండినాడు.



**సీ. పెద్దల యాస్తులు - పేరున నిలువంగ**
**కడుపుచేత నిడుచు - కదలినాడు**
**బళ్ళారి రైల్వేలో - బాగుగా కొలువుండె**
**నంజుండయార్యుడు - నాదుతాత**
**నడిమివయసు నందె - నా తాత దివికేగ**
**దిటవు గుండె నిల్పె - దివ్యయవ్వ**
**సంసారమును తానె - చక్కగాదిద్దెను**
**తన సంతతికి నెల్ల - దారిఁజూపె**

**తే.గీ. బుద్ధిశాలిని మాయవ్వ - ముదితలందు**
**నన్ను గారాల నోమెను - నాదు యవ్వ**
**నతుల గొనుమవ్వ లలితవ్వ - యతులితముగ**
**మెచ్చు మనుమరాలిచ్చెడు - హెచ్చుమెచ్చు 3**

**భావము :** మా పితామహుల కాలము వచ్చేటప్పటికే దేశము ఆర్థికంగా బాగా దెబ్బతిని ఉన్నది. కరువుకాటకాలు, ప్రపంచయుద్ధాల ప్రభావం దేశంలోని ప్రతికుటుంబం మీద పడింది. ఫలితంగా మాతాత నంజుండయ్య పొట్టచేత బట్టుకొని రైల్వే ఉద్యోగములో చేరుటకు గుంటూరు సమీపంలో ఉన్న నరసరావుపేటకు వచ్చారు కుటుంబంతో. బహుశా ఇది 1930 దశకంలో ఉండవచ్చు. అటుపై దశకానికి బళ్ళారికి చేరుకొన్నారు. దురదృష్టవశాత్తు ఆయన నడివయస్సులోనే అస్తమించారు. ఇద్దరాడపిల్లలకు, పెద్దకుమారునికి పెండ్లి చేశారు. తక్కిన వారెవ్వరు స్థిరపడలేదు. అటువంటి గడ్డుపరిస్థితులలో కూడా మా నాయనమ్మ లలితమ్మ ధైర్యంతో సంసారాన్ని ముందుకు తీసుకువచ్చింది. మగపిల్లలకు ఉద్యోగాలు, పెళ్ళిళ్ళు, ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసి అందరి బ్రతుకులను ఒడ్డున వేసింది. ఇటువంటి ధీశాలిని, ధైర్యశాలిని మా లలితమ్మవ్వ. ఆమెకు నేనంటే చాల సంబరంగా ఉండేది. తనకు తెలిసిన వారందరితోను నా గురించి గొప్పగా చెప్పుకొని ఆనందించేది.

అటువంటి ప్రియమైన మా నాయనమ్మకు బాష్పాంజలి సమర్పిస్తున్నాను ఈ శతకరచన సందర్భంగా.

**సీ. దక్షిణరైల్వేలో - దక్షత పనిచేసె**
**గార్డుగా నా తండ్రి - కరముప్రీతి**
**లలితమ్మ నా తల్లి - లావణ్య వరసీమ**
**ఉత్తమగృహిణిగా - నుర్వి వెలసె**
**నన్యోన్య మగునట్టి - యపురూప దాంపత్య**
**మా యింట వెలసె నా - దబ్బురముగ**
**నదియేమొ విధిచేత - యాయువు ముగియించె**
**నలుబదేడవ యేట - నాన్నగార్కి**

**తే.గీ. మగని కేద్చునా నా తల్లి - మరులు వీడ**
**బిడ్డ లేవుర కేద్చునా - గడ్డ నిలుప**
**ఏమి యాధరువునులేని - యింతి నాడు**
**కుంతి తలపించె గనువార్కి - వంత గొలిపె** **4**

**భావము :** మా తండ్రి కృష్ణమూర్తి. దక్షిణరైల్వేలో గార్డుగా పనిచేసినారు. హొసపేట, ధర్మవరం, గుంతకల్లులలో పనిచేసి 1953 నుండి 1963 వరకు దొనకొండ గ్రామంలో (ఆనాడు నెల్లూరు జిల్లా) ఈనాడు ప్రకాశం జిల్లాలో ఉన్న చోట గూడ్సు గార్డుగా పనిచేశారు. మా తల్లి పేరు లలితమ్మ. మహా సుందరాంగి. ఉత్తమ గృహిణి. మా తల్లిదండ్రులది ఆదర్శ దాంపత్యమని చెప్పవచ్చు. కాని విధివ్రాతనేమని చెప్పాలి? నలుబదేడవయేటనే నాయనగారు స్వర్గస్థులైనారు. అప్పటికి మేము ఐదుమంది పిల్లలం. భర్తపోయిన దానికి ఏడ్వాలో, పిల్లల భవిష్యత్తు గురించి ఏడ్వాలో తెలియని అయోమయ స్థితిలో ఆమె ఉండినది. పెద్దల ఆస్తులు లేవు. సంపాదనా మార్గము తెలియని ఆ తల్లిని పిల్లలను చూచిన ఆ ఊరి వారందరికి ఆమె భారతంలోని కుంతీదేవి వలెనే కన్పించినది.



**సీ. చెట్టుమొదలు గొట్ట - చుట్టుమొలచుశాఖ**
**లట్టుల సాహాయ్య - మబ్బెనపుడు**
**పినతండ్రి నీడలో - పినతల్లి తోడులో**
**కాలేజి చదువంత - గడచెనాకు**
**ఎందరో దాతలు - ముందుకువచ్చిరి**
**చదువుకొనగ నాకు - సాయపడిరి**
**అధ్యాపికా వృత్తి - నటుపైన మొదలిడి**
**చెల్లెళ్ళ తమ్ముని - చేరదీసి**

**తే.గీ. పెంచి చదివించి పెళ్ళిళ్ళు - పేర్మిజేయ**
**భర్త యనుకూలుడై యుండ - వలనుపడియె**
**అమ్మసేవల వర్ణింప - నలవికాదు**
**అన్నివేళల ననుగాచె - కన్నతల్లి** **5**

**భావము :** అటువంటి దుర్దినములలో నాకు ఎందరినుండియో సహాయమబ్బినది. అది ఎట్లుండినది అనగా ఒక పెద్దచెట్టును మొదలు వరకు కొట్టిన తరువాత కొన్ని నాళ్ళకే అనేకమైన చిన్న శాఖలు పుట్టుకొని వచ్చును. ఆ విధంగా పినతండ్రియైన శ్రీ కంఠశర్మగారు అన్న ఉన్నప్పుడు చూపిన ఆదరణనే తరువాత కూడ కొనసాగించినారు. వారింటిలో నీడనిస్తే, పిన్నమ్మ తిండిపెడితే, తిండితోపాటు ఆత్మీయతను పంచితే నాయనగారు గతించిన తరువాతి మూడు సంవత్సరముల కళాశాల చదువు నాకు సాగినది. కళాశాలకు కట్టవలసిన ఫీజులు వగైరా కొంతవరకు స్కాలరుషిప్పులతో మరియు కొంతమంది దాతలిచ్చిన ఆర్థికసహాయముతో నడిచినది. బళ్ళారిలో కాలేజి జీవితం ముగిసినది.

చదువైన పిదప గుంతకల్లులో సైన్సు అసిస్టెంటు పదవిలో చేరినాను. మున్సిపల్ బాలికల పాఠశాలలో ఆరేళ్ళ తరువాత రైల్వే ఉన్నత పాఠశాలలో

సైన్సు అసిస్టెంటుగా చేరినాను. RRB లో సెలెక్టయిన తరువాత అటుపై ముగ్గురు చెల్లెళ్ళకు, కడగొట్టు తమ్ముడికి చదువులు చెప్పించి పెళ్ళిళ్ళు చేసి తల్లిదండ్రులకు నేనిచ్చిన మాట (కొడుకులాగ చూచుకొంటానన్నది) నిలుపుకో గలిగాను. ఇది ఎట్లా సాధ్యమైనదంటే కేవలము నా భర్తయొక్క ఔదార్యము వలననే. ఇంటిలో గృహిణిగా బాధ్యతానిర్వహణ మరియు ఉద్యోగనిర్వహణ సమర్థవంతంగా చేయడానికి అన్ని వేళల్లో నా కండదండలనిచ్చి నా కన్నతల్లి లలితమ్మ నన్ను కాపాడుతూ వచ్చినది.

ఈ పద్యం మొదట్లో ఇచ్చిన పోలిక చాల అర్థవంతమైనది. ఆలోచించితే ఇది ఎవరికైనా మనోహరమని తెలుస్తుంది.

**సీ. అన్యధనాపేక్ష – యావంతయును లేని**
**యతివ యుమాధ్యాను – నమలచరిత**
**సౌహార్ద మూర్తియై – సద్గుణ రాశియై**
**మీన మోహను వెల్గు – మెలతలందు**
**సహనలక్ష్మి భువిని – సశరీరయై వచ్చి**
**విద్య జోయిసు రూపు – వెదకికొనెనొ**
**సౌజన్య మూర్తియై – సౌమ్యకు భర్తయై**
**మా ప్రసాదందెను – మంచిపేరు**

**తే.గీ. ముగ్గురు చెల్లెండ్రు తమ్ముండు – మురువుసూప**
**నాల్గు భుజముల యట్లుగా – నన్నుగాతు**
**రాణి ముత్యమౌ తులసమ్మ – యాడుబిడ్డ**
**బాగు కోరెదు నిర్వురు – బావలుండ**
**ఈ ప్రభావతి జీవిత – మిటులసాగు. 6**

**భావము :** ఉమాదేవి నా పెద్దచెల్లి. ఆమె భర్త సత్యధ్యాన్ లక్ష్మీశ్వరు. ఆమెలోని ప్రత్యేకత ఏమిటంటే ఎవరైనా ఎంత దగ్గరి బంధువులైనా వారినుండి ఈమె ఏ కానుకలు పుచ్చుకొనదు. కేవలము తమ సంపాదనతోటే తృప్తిగా జీవనము చేసే స్వభావమామెది.



మీనాక్షి రెండవచెల్లి. ఆమె భర్త మారుతీ మోహనరావు. సుహృద్భావము గలిగి, సద్గుణాలతో ప్రకాశించే యామె ఎంతో క్రమశిక్షణ కలిగి అత్తవారింట్లో మణిలా ప్రకాశించి వెలుగుతూ ప్రేమాదరాలను అందరికి పంచేది.

మూడవచెల్లి విద్యావతి. ఈమె భర్త నీలకంఠజోయిసు. సహనలక్ష్మి. తనకొక శరీరముంటే బాగుంటుందని మాచెల్లిలో ప్రవేశించినదేమో అనిపిస్తుంది. పెద్దదైన కుటుంబభారాన్ని యీ దంపతులు సంతోషంగా మోస్తూ అందరికి అన్ని రకాల సేవలనందించినారు.

తమ్ముడు అందరికంటె చిన్నవాడు. పేరు రామదత్త ప్రసాదు. ముగ్గురు మగపిల్లలను పోగొట్టుకొన్న తర్వాత జన్మించినాడని రాముడిచ్చిన ప్రసాదమని మాతండ్రి ఈ పేరు పెట్టారు. ఇతడొక సౌజన్యమూర్తి. ఇతని భార్య సౌమ్య. ఈ జోడు అతిథిఅభ్యాగతుల ఆదరణలో ఆనందం వెతుకుకొనే బాపతు.

ఈ నల్గురు విష్ణుమూర్తికి నాలుగు భుజములున్నట్లు నాకు ఎల్లప్పుడు తోడు నీడుగా ఉంటున్నారు.

భర్త తరపున ఇద్దర బావగార్లున్నారు. సత్యనారాయణరావు మరియు శ్రీరాములు. ఒక ఆడుబిడ్డ పేరు తులసమ్మ. ఉదాత్త స్వభావురాలు. వీరందరు మా కుటుంబక్షేమాన్ని కాంక్షించేవారు. ఇందరి ఆశీస్సులతో నా జీవన నౌక ముందుకు నడుస్తున్నది.

**సీ. బిజవర గ్రామంపు – సుజనుడౌ కొమరప్ప**
**సుబ్బరావున కిచ్చె – సుతను లక్ష్మి**
**నా దంపతులు గని – రైదు మందిని ప్రీతి**
**శ్రీనివాసుడు కదు – చిన్నవాడు**

తండ్రి గతింపగా – తల్లి యిడుమలంది
తీరుగా పిల్లల – తీర్చిదిద్దె
శ్రీనివాసుడు నాదు – చేయి యిమ్ముగపట్టి
చెల్లెళ్ల తమ్ముని – చేర్చిబ్రోచె

తే.గీ. నట్టి నిష్కామ యోగినా – కయ్యె పతిగ
నట్టి పురుషుని కూర్చిన – యా ప్రభునకు
వంద వందల వందనా – లందజేతు
దీర్ఘ శుభమంగళిగ నన్ను – తీర్చమందు 7

**భావము :** బిజవరమనే గ్రామం మధుగిరి తాలూకాలో ఉన్నది. ఆ గ్రామ వాస్తవ్యుడైన కుమారస్వామి తన కుమార్తెయైన లక్ష్మీదేవిని సుబ్బారావను వరునకిచ్చి వివాహం చేశాడు. ఈ దంపతులకు కలిగిన సంతానము ఐదుమంది. వారిలో అందరికంటె చిన్నవాడు శ్రీనివాసరావు. ఇతడికి ఏడాదిన్నర వయసున్నప్పుడే తండ్రి దివంగతుడయినాడు. అప్పుడెన్నో కష్టాలనుభవించి లక్ష్మీదేవి తన పిల్లలకు చదువులు చెప్పించింది. వారు స్వతంత్రంగా బ్రతకడానికి దారి చూపించి ఈ శ్రీనివాసుడే నన్ను వివాహమాడినాడు. వివాహసమయములో మేము చేసికొన్న ఒడంబడిక ప్రకారము నా పుట్టింటివారు అయిన నా తల్లిని, చెల్లెళ్ళను, తమ్ముడిని సాకుట, చదివించుట, పెళ్ళిపేరంటములు చేయుట, మొదలగు వాటినన్నింటిని చేయుటయందు నాకండగా నిలిచాడు.

ధనముపై వ్యామోహములేనివాడు నా పతిదేవుడు. ఒక నిష్కామ యోగి అని ఇతనిని పేర్కొనవచ్చును. ఇటువంటి భర్తతో నా జీవితమును ముడివేసినందుకు ఆ పరమాత్మునకు వేల నమస్కారములను చేయుచున్నాను. దీర్ఘసుమంగళిగా నన్ను కడతేర్చమని ప్రభువును ప్రార్థించుచున్నాను. 'ఇందులో వంద వందల వందనాలందజేతు' సొగసుగా కుదిరిన పాదము.



సీ. పలువిధ రూపాల పలు – చోట్ల నెగడుచు
భగవంతు దండయై – ప్రజలబ్రోవ
శక్తి కొలది తమ – భక్తిని ప్రజచూపి
ముక్తి గోరుచు సేవ – రక్తికనగ
యితర శక్తులు లేమి – యేమియు నేరక
యుక్తులేమియు లేక – యున్ననాకు
సూక్తుల పలుకంగ – సొగసైనకవితను
ప్రభువు ప్రసాదించె – పరమప్రీతి

తే.గీ. ఇదియ యగుగాక సేవని – యెంచినాను
నారసింహుని క్షేత్రమై – పేరుపొందు
ధాళవట్టము నా జన్మ – ధాత్రి కాగ
యేర్చికూర్చితి నక్షర – చర్చసేయ 8

**భావము :** భగవంతుడనేక పేర్లతో అనేక స్థలములలో వెలసి భక్తులను కాపాడుచున్నాడు. ప్రజలు కూడ తమకు అందుబాటులో నున్న దేవాలయములు, క్షేత్రములు మొదలగు వానివద్ద తమ శక్తి కొలది సేవలు చేసి రక్తిని, ముక్తిని పొందుచున్నారు.

నేను అతి సామాన్యను – నావద్ద పెద్దయెత్తున ధనధాన్యములు లేవు. అధికారము లేదు. బలము లేదు. వస్తువాహనములు లేవు. ఇట్లున్న నాకు చక్కని మాటలను పలుకుటకు భగవంతుడీ దశలో కమ్మగా కవిత్వమునల్లు శక్తి నిచ్చాడు.

కనుక ఇదే నేను చేసే సేవయని భావిస్తున్నాను. నేను పుట్టినఊరు, మా తల్లిగారు పుట్టిల్లు అయిన దొడ్డధాళవట్టములో నరసింహస్వామి స్వయంభువుగా అవతరించిన స్థలము కనుక ఆ స్వామికే అక్షర చర్చ చేయదలచినాను.

ఈ పద్యములో 3 వ పాదములో "యుక్తులు" అను పదము బాగుగా పొదగబడినది. నేరక+ఉక్తులు అన్నప్పుడు సంధిలేని చోట యడాగమం వస్తుంది కాబట్టి ఉక్తులు యుక్తులుగా మారినది. ఉక్తులు అంటే మాటలు. యుక్తులు అంటే ఉపాయాలు. ఇవి రెండు కూడా అక్కడి భావ ప్రకటనకు చక్కని పోషకాలే.

అట్లే నాల్గవ పాదంలో "సూక్తుల పలుకంగ" అనుచోట కూడ అర్థమిలా చెప్పుకోవాలి. 'ఉక్తులు' అను మాటకు ముందు 'సు' అనే ఉపసర్గ చేరితే సూక్తులు అవుతుంది. సూక్తి అంటే లోక వ్యవహారంలో సామెత. అక్షరార్థ పదంగా తీసికొంటే మంచిమాటలు. ఇవిరెండు కూడా ఇక్కడ సాధించబడ్డాయి. అలాగే 'అక్షర చర్చచేయుట' కూడ మిక్కిలి అర్థవంతమైనది. క్షరమంటే నశించేది. అక్షరమంటే నాశనము లేనిది. చర్చ అంటే అలదుట చందనచర్చ వలె అని ఒక అర్థము. చర్చ అనగా ఒక విషయమై పదిమంది తమయభిప్రాయములు వెలిపుచ్చుట అని ఇంకొక అర్థము. అంటే అక్షరములు (భాషను లిపిగా తెలిపే సంకేతములు) అని సామాన్యార్థము. ఇటువంటి అక్షరములతో నరసింహునికి అక్షరాలతో సేవ మరియు నాశనముకాని చర్చ రెండును సాధింపబడినవి.

**సీ. ఇర్వదారేండ్లుగా - యేను జెప్పిన శాస్త్ర**
**మిమ్ముగా గన్పింప - నెల్లకడల**
**వేదాంత గ్రంథాల - విమలంపుతత్త్వాలు**
**వానితో పెనవేయ వరుసనమరె**
**పరమాత్మ దర్శన - వరకాంక్ష మిక్కిలి**
**బలముగా నాలోన - పాదుకొనగ**
**గుండెలోతుల నుండి - గొబ్బున దూకిన**
**నక్షర రూపమై - యమరె కవిత**



**తే.గీ. చిన్న యార్యుడు దిద్దగా - చెంతచేర**
**నొప్పు తప్పుల ప్రేమతో - నోర్పుతోడ**
**భారతీసాహితిసమితి - వారి సభ్యు**
**లంత విని యొప్ప యర్పణ - కంపుచుంటి** **9**

**భావము :** ఈ కవ్వితమల్లు సమయానికి సైన్సు టీచరుగా 26 సంవత్సరములు అనుభవము వచ్చినది. ఇందులో నేను బోధిస్తున్న విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన అనేక విషయాలకు, వేదాంతగ్రంథములలోని తత్త్వములకు సమన్వయము కుదురుచున్నది. ఇన్నేండ్ల జీవనగమనంలో నాకు కలిగిన బలమైన కోరిక ఏమిటనేది ఆత్మావలోకనం చేసి చూసుకొంటే తెలిసినది పరమాత్మను దర్శించడం. ఈ కోరికను వెలిపుచ్చడానకి, నా ఆత్మ నివేదనకు ఒక మాధ్యమం దొరికింది. అదే గుండెలోతులలో నుండి గొబ్బున బయటకు కవితారూపంలో దుమికింది.

అయితే కవిత్వరచనలో నాదింకా బాల్య ప్రాయమే. కనుక 'కవిరత్న' బిరుదుపొందిన స్థానిక కవివర్యుడు శ్రీ దాదన చిన్నయ్యగారి వద్దకు పోయి ప్రతిపద్యమును వారికి వినిపించి ఇందులోని తప్పులను సరిచేసికొన్నాను. ఎంతో ఓర్పుతో ప్రీతితో వారు సహకరించినారు. అటుపైన గుంతకల్లులోని శ్రీ భారతీసాహితీసమితి సభ్యులందరిని ఒక వేదికవద్దకు చేర్చి వారికందరికి దీనిని వినిపించి అందరు ఆమోదముద్ర వేసిన పిదప హే నరసింహమూర్తీ! దీనిని నీ కర్పణ చేస్తున్నాను.

# శ్రీ నరసింహశతకము

**సీ. శ్రీ రమాసతిలోల - శ్రితజనపరిపాల**
**అరవిందదళనేత్ర - యార్తమిత్ర**
**నీలమేఘశరీర - నిరవధికోదార**
**నిర్భరగుణరూప - నిర్వికల్ప**
**కాంచనపరిధాయి - కమనీయగుణధాయి**
**సజ్జనపాథేయ - సామగేయ**
**నారదసన్నుత - శారదసుస్మిత**
**కౌస్తుభమణిధారి - ఖలవిదారి**

**తే.గీ. శంఖచక్రగదాశార్ఙ్గ - చారుహస్త**
**గుండెగుడిలోన కొలువుండు - నిండుగాను**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ!** 1

**భావము :** శ్రీ నరసింహశతకములోని మొదటి పద్యములో విష్ణుమూర్తి యొక్క సాకార వర్ణన చేయబడింది. హైందవసంప్రదాయంలో ఆధ్యాత్మికపు టెత్తులను చేరుకోవడానికి సాకారార్చన తొలిమెట్టు. ఈ శతకమంతటికీ అర్చాస్తుతి యిది యొక్కటే.

శ్రీకారంతో గ్రంథం ప్రారంభింపబడటం అన్ని విధముల అందరికి శ్రేయస్కరమైనది. స్వామికి సంబోధనలే యీ సమాసములన్నీ. ఈ పద్యము భావము శ్రీలక్ష్మి కనుసన్నలలో మెలగువాడు, తెల్లతామరలపోలు వెడద కన్నులవాడు, ఆపదలలోనున్న వారికి స్నేహితుడైనవాడు, నీలమేఘము పోలు శరీరఛాయ గలవాడు, అంతములేని ఔదార్యము కలవాడు, నిర్భరమైన గుణరూపములు కలవాడు, వికల్పములు లేనివాడు, పీతాంబరమును ధరియించువాడు, మనోహరమైన గుణములు కలవాడు, సజ్జనులచే

దారిబత్తెమువలె సంస్మరణ చేయబడువాడు, సామవేదముచే గానము చేయబడువాడు, నారదమునిచే నిరంతరము స్తుతింపబడువాడు, శరత్కాలపు వెన్నెల వంటి చల్లనినవ్వులు చిలుకువాడు, శంఖచక్రాదులు, గద, శార్ఙమను ఆయుధములను హస్తములందు ధరించువాడు అయిన హే విష్ణు భగవానుడా! నా గుండెయను గుడిలోపల నిండుగా కొలువు సేయుమయా!

ఈ నరసింహశతకమునకు మకుటము దొడ్డధాళవట్టము అను గ్రామములో స్వయంభువుగా వెలసిన నరసింహమూర్తి కిది వేడికోలు.

ధాళవట్టములు రెండున్నవి. పెద్దధాళవట్టమునకు రెండు మైళ్ళ దూరములో చిన్నధాళవట్టమను గ్రామమున్నది. స్వామి యుండు స్థలమును కన్నడభాషలో దొడ్డధాళవట్టమందురు. ఇది కర్ణాటకరాష్ట్రములోనున్నది. అందువలన అదే ప్రశస్తిని నిలుపుటకు ఆ పేరు నట్లాగే ఉపయోగించుకొన్నాను. అతడు దొడ్డవేల్పు. అనగా మిక్కిలి పెద్ద దేవుడు అందులో సందేహమేవలదు. ప్రహ్లాదబాలుని హిరణ్యకశిపుడు 'విష్ణువెక్కడరా' అని అడిగినపుడు ఎందెందు వెదకిన అందందే గలడని చెప్పగా ఉద్భవించినస్వామి కనుక అట్టి దొడ్డవేల్పును మనసారా నమ్మినానని అనతికి విన్నవించుకొనుట మకుటమున కర్థము.

**విశేషములు :** పురుషుడు స్వభావతః స్త్రీకన్నా కఠినుడు. ప్రకృతితో కలిసినపుడు కాఠిన్యము కరిగి కారుణ్యము పెరుగును. అందులకే శ్రీరమాసతితో క్రీడించు స్వామి ఆశ్రితజనులను పరిపాలించుటకు సర్వదా సన్నద్ధుడై యుండును. అందమైన ఆ కమలనేత్రములు ఆర్తులను చూడగనే మరిమరి వికసించును.

శరీరమురంగు నల్లన, ఔదార్యము ఇంతని చెప్పలేనిది. గుణరూపములు వర్ణింపనలవికాదు. అతని సంకల్పములకు అడ్డులేదు. కట్టిన పట్టువస్త్రము, ధరించిన కౌస్తుభము అతని భాగ్యమును చాటుచున్నది.



భగవంతుడు షడ్గుణైశ్వర్యోపేతుడు. మానవలోకంలో గొప్ప అనిపించుకొనుటకు ఈ ఆరుఐశ్వర్యములలో ఏ యొక్కటి ఉన్నను చాలును. కాని పరమాత్మను మనము ఎట్లు, ఏమి కోరుచు ప్రార్థించిన దానిని తప్పక దయ చేయును.

ఈ పద్యములోని వర్ణనలో భగవంతుని అలౌకిక సౌందర్యము నేత్ర, శరీరఛాయముల, చల్లనినవ్వులచే వర్ణింపబడినది. అంతః సౌందర్యము నిర్భర గుణరూపములచే మరియు నిర్వికల్పత్వముచే చెప్పబడినది. అతని సంపద కాంచనపరిధానముచేత, కౌస్తుభముచేత సూచించబడినది. అతని కీర్తిని సామవేదము, నారదుడు, సజ్జనులు స్తుతింతురని తెల్పబడినది. అతని యీవి ఆశ్రితపాలనము, నిరవధికౌదార్యము మొ॥ వానిచే సూచింపబడినవి. అతని బలము ఆర్తమిత్రుడు, ఖలవిదారి, నిర్వికల్పుడు మరియు అతడు ధరించు అసామాన్య ఆయుధములచే తెల్పబడినది. అతని త్యాగము పద్యములోని ప్రతిపదము వెనుక ప్రచ్ఛన్నముగా నున్నది.

ఇన్ని విధములుగా శోభిల్లు పరమాత్మ రూపమును వర్ణించుటలో ప్రతి అర్ధపాదమునందు అంత్యప్రాసలుగల పదములుండుట చదువరికి పలుకుటకు, వినుకలికి వినుటకు యింపుగా నుండును. ఉదా॥ లోల, పాల, నేత్ర, మిత్ర

ఇట్టి పరమాత్మస్వరూపుడు ఎవరి గుండెలో ఒకింత సేపు కొలువున్నను, అది తప్పక గొప్ప మందిరమే యగును.

**సీ. ఏడేదు లోకాల – నేలేటి సామికి**
**యేపాటి కానుక – లేనుతెత్తు?**
**అంతట తానయై – యావరించిన వాని**
**కిది నాది కొమ్మని – యేమియిత్తు?**

**అన్యులెఱుగనట్టి – యపురూప తత్త్వమ్ము**
**తెలిసి చెప్పుదమన్న – తెలివిచాల**
**దారాట మేదియో – యంతరంగములోన**
**నటమట బుట్టింప – నాగలేక**

**తే.గీ. నాదిశంకరు గురుజాడ – నాశ్రయించి**
**యల్లుచుంటిని పద్యాల – నందుకొమ్ము**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మి నానయ్య నిన్ను నే – నారసింహ! 2**

**భావము :** పదునాల్గులోకాలకు ప్రభువైన ఓ స్వామీ! నీకు కానుకగా ఏమివ్వగలను? విష్ణుశబ్దంతో పిలువబడే వాడివి నీవు. ఆ పదానికర్థము చరాచరజగత్తంతా ఆక్రమించుకొన్నవాడివనీ, అలాంటి నీకు 'ఇదినాది' అని చెప్పుకోగలిగే ఎలాంటి వస్తువు నీయగలను? వస్తువులీయకపోతే పోనీ భావనాపరమైన వానిని – క్రొత్తవాటిని ఇద్దామా అంటే నేనేమో అల్పజ్ఞానిని. మరి యీ సోది అంతా ఎందుకంటావేమో? ఏదో ఒక ఆరాటము నా మనస్సును కుదిపేస్తోంది. దానిని అణచుకోలేక యీ పద్యాలను వ్రాయాలని అనుకొన్నాను. ఇలాచేస్తూ ఆదిశంకరులను తలచుకొని ఆ గురువు మార్గాన్నే అనుసరిస్తూ యీ పద్యశతకరచన చేసి నీకు అందిస్తూ ఉన్నాను. అందుకోవయా స్వామీ!

వివరణ – భూమిపై భాగం ఏడులోకములు. భూమి, భువము, సువము, జన, తప, సత్యలోకములు. భూమి క్రింది భాగాన ఏడు లోకములున్నవి. అవి అతల, వితల, సుతల, తలాతల, మహాతల, రసాతల, పాతాళములు. వీటినన్నింటిని పరిపాలిస్తూ ఉండే వాడు శ్రీ మహావిష్ణువు. ఇంతటి గొప్ప పరిపాలకునికి ఎంతటి గొప్ప కానుకలను ఇవ్వాలి? దేవుడు కొండంత అయితే కొండంతపత్రితో పూజ చేయలేము కదా! ఇక్కడ



మానవులఅల్పత్వాన్ని తెలియజేస్తున్నదీ పాదము. రెండవపాదములో అసలు ఇది నాది అని చెప్పుకోవడానికి యే ప్రాణికైనా అవకాశమనేదే లేదే.

'మానవసేవయే మాధవసేవ' అనే దృక్పథంతో రేయింబవళ్ళు నిద్రాహార విహారాదులను లెక్కించక నిరంతరం ప్రయోగశాలల్లో సత్యశోధన చేస్తుండేవారు, క్రొత్తపరికరాల అన్వేషణ చేస్తున్న వారెందరో పరిశోధకుల జాబితాలోకి నేను రాలేను. ఎందుకంటే నాది చాల పరిమితమైన జ్ఞానము.

ఇన్ని విధాలుగా చేతగాని తనాన్ని చెప్పుకొంటూ చేసినదేమిటి? అంటే నీ పేరుతో పద్యశతకాన్ని రచించి అది నీకే అప్పగించడం. ఇది ఏ ధైర్యంతో చేయగలిగానంటే మనసులోని ఆరాటాన్ని అణచడానికి సాధ్యం కాని పరిస్థితుల్లో పురందరదాసు, జగద్గురువులు శంకరాచార్యులు గుర్తుకు వచ్చారు. వారిని అనుసరించాను. ఎలాగంటే కన్నడ భాషలో పురందరదాసు చెప్పిన గీతమిది "కెరెయ నీరను కెరెగె జల్లి, వరవపడెదవ రంతె కాణొరొ, హరియ కరుణదళాద భాగ్యపు హరి సమర్పణమాడి బ్రతుకొరొ".

దీని కర్థము 'చెరువులోని నీటిని దోసిట్లోకి తీసుకొని శ్రీహరికి అర్ఘ్యమీయండి. ఆ స్వామి కరుణించి వరములను ఇస్తాడు. శ్రీహరి కరుణ ద్వారా పొందిన సంపదలను ఆయనకే సమర్పించి బ్రతకండి.'

ఆదిశంకరులు కూడా తమ సౌందర్యలహరిలో చివరి శ్లోకంలో యీలా ప్రార్థిస్తారు.

**ప్రదీప జ్వాలాభిః దివసకర నీరాజనవిధిః**
**సుధా సూతేః చంద్రోపల జలలవైర్ఘ్య రచనా**
**స్వకీయై రంభోభిః సలిలనిధి సౌహిత్యకరణం**
**త్వదీయైర్వాగ్భిః తవజనని వాచాంస్తుతిరియం.**

దీని తాత్పర్యమేమనగా వెలుగులను చక్కగా ప్రసరింపచేస్తున్న సూర్యభగవానునికి కాగడాలతో నీరాజనమిచ్చినట్లుగా, చంద్రకాంతికి

కరిగిన చంద్రకాంత శిలలోని కొంచెము జలముతో చంద్రునికి అర్ఘ్యమిచ్చినట్లుగా, మహాసముద్రము చెంతకుచేరి దోసిట్లో నీళ్ళు తీసికొని ఆ సముద్రునికే అర్ఘ్యముగా సమర్పించినట్లు. ఓ తల్లీ, సౌందర్యలహరీ! నీవు ప్రసాదించిన యీ వాక్కులతోటే నిన్ను స్తుతి చేస్తున్నాను.

ఆదిశంకరులే తమ రచనా సామర్థ్యాన్ని ఇలా వివరించుకొన్నప్పుడు ఇక నే నెంతటికి దానను? కనుక ఆ గురువుజాడయే స్ఫూర్తిగా యీ శతకరచనకు పూనుకొన్నాను.

**సీ. రథివి నీవగుచు సా – రథిగ జీవుని నుంతు**
**దేహము నా బదు – తేరుజరుగు**
**పంచేంద్రియమ్ములే – పరువెత్తుహయములు**
**సంయమనంబగు – జళుపుకొరడ**
**మంచిచెడ్డలనెడు – మార్గమన్వేషింప**
**జీవనకాలంబు – పోవవిడుతె**
**సారథి నీవయి – చక్కంగ నరునకు**
**తెలిపిన గీతల – తెరువు గనుదె**

**తే.గీ. ఎన్ని తేరులో తెన్నులో – యేను చాల**
**గనగ హే విరాడ్రూపుండ! – కనికరించు**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 3**

**భావము :** హే పరమాత్మ! ఉపనిషత్తులు తెలిపే విధంగా మానవశరీరము ఒక రథమని భావించాను. అందులో రథికుని స్థానంలో నీవున్నావు. సారథిగా యీ జీవుడు రథాన్ని నడుపుతున్నాడు. ఈ బండిని నడిపే ఐదుగుర్రాలు పంచేంద్రియాలే. వాటిని అదుపులో ఉంచే కొరడా సంయమనమే. మరి జీవనకాలములో మంచిచెడ్డలనెడు మార్గాలలో నడుపుతుండగా నీవు



గమనిస్తున్నావా? అర్జునునికి సారథిగా నుండి తెలిపిన గీత ననుసరించి యీ నరుడు నడుపుతున్నాడా లేదా అని గమనిస్తున్నావా?

ఈ ఊహ నాకు తట్టగానే కోటానుకోట్ల జనులు తేరులుగా కనిపించారు. అలా భావిస్తూ ఉంటే క్రమంగా నా బుద్ధి మొద్దుబారుతున్నది. కనుక ఓయీ విరాట్స్వరూపుడా! ఆనాడు అర్జునుడు నీ రూపాన్ని యెక్కువ సేపు చూడలేక, సాధారణకృష్ణరూపమునే ధరించమని వేడికొన్నాడట. ఇప్పుడు నా పరిస్థితి అదే.

ఇట్లే ఆయా కవులు రకరకములుగా శరీరాన్ని భావించారు. ఉదాహరణకు వీరశైవ ప్రతిపాదకుడైన బసవణ్ణ దేహమే దేవాలయమని, కాళ్ళే దేవాలయ స్తంభములని, శిరసే గుడిగోపురమని, ఆజ్ఞాచక్ర స్థితుడే పరమాత్మయని పోలిక చెప్పినారు.

ఇదే విషయాన్ని ఒక సినిమా కవి 'అడుగడుగున గుడివుంది, అందరిలో గుడివుంది' అనే పాట ద్వారా తెలుపుతారు.

**సీ. ఉత్సవమూర్తివై – యూరేగ వత్తువే**
**మొండివాడుగ నిల్వ – మూలమూర్తి**
**ఏడాది కొకపరి – యేతెంచు చుందువే**
**గుడివీడి దాటుచు – గోపురమ్ము**
**నూరినేలకు గాలి – కొక్కపూతత్వము**
**నొప్పుగా నొసగదే – యొక్కసారి**
**త్వత్పురులెవ్వరో – తామసులెవ్వరో**
**పేరుపేరున జూతె – యూరువెడలి**

**తే.గీ. కనకకశ్యపు ద్రుంచిన – కమలనాభ!**
**బాలు ప్రహ్లాదు గాచిన – భక్తవరద!**

**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!**
**నమ్మినానయ్య నిన్ననే - నారసింహ!** 4

**భావము :** మనదేశంలోని అనేక దేవాలయాల్లో ఏడాది కొకసారి 'తిరునాళ్ళు' లేక 'పరుష' అనే పేరుతో రథోత్సవాలు జరుగుతాయి. ఇందులోని అంతర్యమిదేనా దేవా?

మూలవిగ్రహానికి నిత్యపూజలు, నిత్యోత్సవాలు జరుగుతూనే ఉంటాయి. ఈతడు గుడిలో స్వయంభువుగా వెలసియుండడమో లేక అర్చామూర్తిగా ప్రతిష్ఠింపబడి యుండడమో అయి ఉంటుంది. ఈతడు కదలడు. ఉత్సవమూర్తులను పంచలోహాలతో తయారు చేయిస్తారు. వీటిని వారోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవాలలో గుడిచుట్టూ త్రిప్పుతారు. ఏడాదికొక్కసారి రథముపై నుండి ఊరిలోనికి ఊరేగింపుగా తీసుకువస్తారు.

ఇలా చేయడంలో ఉద్దేశ్యమేమిటీ? భగవానుడు తిరుగుతున్న రథము ప్రచలితమై ఆ నేలకు, గాలికి ఒక పవిత్రతను చేకూర్చేటందుకా? ఔననే అంటారు పెద్దలు. ఆ స్వామిదర్శనార్థమై వచ్చిన జనసమూహములో ఆయన కొఱకే వచ్చిన నిజమైన భక్తులెవరూ? మరియు 'సందులో సడేమియా' యని భక్తరాండ్రపై చూపులు, వారి యాభరణాలపై చేతులు వేసే వారెందరు? వీరందరిని ప్రత్యక్షముగా తిలకించడానికి వస్తున్నావా?

ఎత్తుగీతిలో కనకకశ్యపుత్రుంచిన కమలనాభుడవు కావున కనక జీవులపని పడతావని, బాలప్రహ్లాదుని కాచిన భక్తవరద యనడంతో అమాయకులైన భక్తులను రక్షించగలవని నమ్ముచున్నానని తెల్పుకోవడం జరిగింది.

**సీ.** **విద్యలు వేవేలు - విపులమ్ముగా నేర్వ**
**గలుగుదురొక కొద్ది - కఠిననియతి**
**నేర్చిన దానిని - నేర్వరు చెప్పంగ**
**కొలదిమందికి నగు - కూసువిద్య**



**చెప్పంగ నేర్చినా - చేయరద్దానిని**
**యే యొక్కరో దక్క - యింపుగాను**
**కార్యశూరులయిన - ఘనులుండ్రు కొందరే**
**యట్టివారి గనిన - నాత్మపొంగు**

**తే.గీ.** **నిలిచి యుండిరీ జగతిని - నీకుతోడు**
**పుణ్యమూర్తులు నెలకొన్న - పుడమియిదియె**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!**
**నమ్మినానయ్య నిన్ననే - నారసింహ!** 5

**భావము :** భగవద్గీత 7వ అధ్యాయములో 3వ శ్లోకమిది.

**మనుష్యాణాం సహస్రేషు**
**కశ్చిద్యతతి సిద్ధయే**
**యతతామపి సిద్ధానాం**
**కశ్చిన్మాంవేత్తి తత్త్వతః**

దీనిని ఆధారంగా చేసికొని ప్రపంచాన్ని గమనించి వ్రాసినదీ పద్యము. మనిషి నేర్చుకోవడానికి వేలవేల విద్యలున్నాయి. అందులో యే ఒకటో, రెండో మాత్రమే యెంతో కష్టపడితే మనిషి నేర్చుకోగలడు. అయితే ఇలా కష్టపడి ఒకవిద్యను వేయిమంది నేర్చుకొంటే అందులో ఒక్కడికి మాత్రమే తాను నేర్చుకొన్న దానిని ఇతరులకు నేర్పించగలిగే శక్తి అబ్బుతుంది. ఇలా నేర్పించేవారు వేయిమందియుంటే వారిలో ఒక్కడుమాత్రమే నేర్పిన సూత్రాలను ఆచరణలో పెట్టగలుగుతాడు. మిగిలిన 999 మందికి వాచాశూరత్వమే కాని కార్యశూరత్వముండదు.

ఈ ప్రపంచం నడవడానికి ధర్మపరులైన అటువంటి కార్యశూరులే అవసరం. అట్టివారిని తలచిన, చూచిన పుణ్యమే కదా. అట్టివారు ఎందరో మహానుభావులు జన్మించిన పుణ్యధాత్రి యీ భరతభూమి. ఓయీ నరసింహస్వామీ! నీకు వారికి కూడా నా నమస్కృతులు.

**సీ. ధాళవట్టములోన – దళితుల రక్షింప**
**వెలసితివే స్వామి – విలసితముగ**
**వ్యాపారి యొకసంజ – నాహారమును వండ**
**రెండుబండలకు నీ – బండగూర్చె**
**ఎఱ్ఱంగ మారెగా – యింపైన యన్నంబు**
**మఱల వండ యతడు – మఱలమారె**
**తడవతడవ మార – సడిసేయ కప్పుడు**
**పస్తుగా నిదురించె – వర్తకుండు**

**తే.గీ. కలను కనిపించి చెప్పితే – కరుణ చూపి**
**నీదు ఉనికిని గుర్తింప – నీరజాక్ష!**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 6**

**భావము :** ఇది దొడ్డధాళవట్టములోని నరసింహస్వామి స్థలపురాణము.

ఇదమిత్థముగా కాలమును నిర్ణయించే ఆధారము నాకు లభించలేదు. కాని జనశ్రుతిలో 400 సంవత్సరాల క్రితం అని మాత్రమే చెబుతున్నారు. అప్పట్లో జరిగిన ఒక విచిత్రసంఘటన యిది.

కలిగిన వ్యాపారాలు గుఱ్ఱాలు, ఎద్దులబండ్లపై ఊరూరు తిరుగుతూ వ్యాపారం చేసికొనేవారు. ఇవి లేనివారు కాలినడకనే ఆశ్రయించి తమవస్తుసామగ్రిని ఆయా వూళ్ళల్లో, సంతలలో అమ్ముకొని జీవిస్తూ ఉండిన కాలమది.

ఇటువంటి సాధారణ వ్యాపారి ఒకనాటి సంధ్యవేళకు దొడ్డధాళివట్టం చేరుకొన్నాడు. ఇప్పుడు గుడివుండే స్థలానికి దగ్గరగా గుడారం వేసికొన్నాడు. రాత్రికి భోజనార్థమై వండుకొనే పొయ్యి యేర్పాటు చేసికోవడానికి భూమిలోనే ఉన్న రాతినొక దానిని చూచి దాని ప్రక్కన మరో రెండు రాళ్ళు తెచ్చిపెట్టి,



అన్నము వండేందుకు గిన్నె నుంచినాడు. అన్నమయింది. కాని అది ఎర్రగా రక్తపుముద్దగా మారింది. దానిని చూస్తుంటే వ్యాపారికి జుగుప్స కలిగింది. దానినంతా పారబోశాడు. క్రొత్తగా వండాడు. ఇప్పుడు కూడా అన్నం ఎర్రగా అయింది. మరల పారబోశాడు. మరల, మరల అన్నం వండడం, అది ఎర్రగా మారడం, విసిగిపోయాడు వర్తకుడు. ప్రొద్దుపోయింది. ఏమీ తినకుండానే నిద్రలోకి జారుకున్నాడు.

నిద్రలో నరసింహమూర్తి దర్శనమిచ్చాడు. స్వప్నంలో 'ఒరే నాకు నీవు నిప్పుపెట్టావురా, అందుకే అన్నమట్లయింది' అని చెప్పాడు.

**సీ. స్వప్నాన కనిపింప – సంతసించిన శ్రేష్ఠి**
**యపరాధమును వేడి – యర్చజేసి**
**గుడిని కట్టగ బూని – గురుతర భక్తితో**
**సంకల్పమును చేసి – సాగినాడు**
**అంచెలంచెలుగాను – వ్యాపారమందున**
**యధిక లాభాలొంద – నవనిపెరిగె**
**దృఢభక్తి తొణకాడ – కృషిచేసి గుడికట్టి**
**నిత్యసేవార్చనల్ – నియతినిలిపె**

**తే.గీ. నాల్గువందల యేండ్లుగా – నమ్మినట్టి**
**భక్తజనులను బ్రోవవే – ప్రాభవాన**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్నునే – నారసింహ! 7**

**భావము :** ఇది 6వ పద్యములోని స్థలపురాణమునకు కొనసాగింపు.

కలలో నృసింహస్వామి కనిపించి తన ఉనికిని గురించి చెప్పగా, ఆ వర్తకుడు మిక్కిలి బాధపడి, అయినను తనపైన కరుణ కలిగినందుననే స్వామి కనిపించినాడని మనసును సమాధానపరచుకొని, తనయపరాధమును

క్షమించమని యెంతగానో వేడుకొన్నాడు. అంతేగాక తాను వ్యాపారంలో బాగుగా లాభాలను గడించగలిగితే స్వామికక్కడ గుడిని నిర్మించుతాననే సంకల్పం చేసికొని ముందుకు సాగినాడు. అతని యదృష్టమేమో స్వామియనుగ్రహప్రభావంతో అతదుపట్టినదంతా బంగారమయింది. దానితో ఆ వైశ్యుడు నిండారుభక్తితో ఎంతో శ్రమదమాదులకోర్చి, స్వామి స్వయంభువుగా వెలసిన చోట గుడిని నిర్మింప చేశాడు. నిత్యసేవలు, అర్చనలు జరిపే యేర్పాటు చేశాడు.

వీటినంతటిని ప్రత్యక్షంగా చూచిన స్థానికులు, ఆ దేవుని వేడుకోవడం, తమకష్టాలు తొలగడం, ఇష్టాలు పూరింపబడటం జరుగుతూ ఉంటే పరిసరాలలోని గ్రామస్థులు కూడా రావడం, స్వామివారి యనుగ్రహం పొందడం, అనతికాలంలో స్వామిమహిమలు, భక్తపరాధీనత దూరతీరాల ప్రాంతాలకు చేరడం, గుడి క్రమక్రమంగా వైభవస్థితికి చేరుకోవడం జరిగింది. ఇలా నాలుగుశతాబ్ధాలకు పైబడి కమలాసహితుడైన శ్రీ నారసింహుడు భక్తజనుల పూజలందుకొంటున్నాడు ఈ గ్రామంలో.

ప్రతి ఆషాఢశుద్ధదశమి రాత్రి స్వామి వారికి కళ్యాణోత్సవం మరునాడు అంటే ఆషాఢ శుద్ధయేకాదశినాడు రథోత్సవం జరుగుతుంది. దీనిని చూడడానికి యెక్కడెక్కడి నుండియో భక్తులు ఎన్నో రకాల వ్యయప్రయాసల కోర్చి ఇందులో పాలుపంచుకొంటారు.

**సీ. మందాసనమ్మునం - బంధించు నటు దోప**
**మాధవా! నిన్నుంచ - మనసురాదు**
**పసుపుకుంకుమచల్ల - ప్రాణేశ్వరా! యొప్ప**
**నీదు నిర్మలరూపు - నేనుగనమి**
**కుసుమాల సేవింప - కొఱతది యేర్పడు**
**వాడిపోవును గాన - చూడజాల**



**అగరువత్తుల గొని - యంటింపగా నొప్ప**
**బూడిదగుచు చోటు - పాడుజేయు**

**తే.గీ. నాదు బుద్ధియే వక్రమా - నళిననయన!**
**ఆడలేనిది మద్దెల - వోదనినటు**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ!** **8**

**భావము :** హే నారసింహా! మందాసనములో నిన్నుంచి పూజించుటయనగా అందు బంధించుచున్నట్లుగా నాకనిపించుచున్నది. అందుంచిన నీ మూర్తిపై పసుపు, కుంకుమలతో పూజించగా అవి నీ మూర్తిపై పడి అసలు రూపమును మూసివేయును. పూలతో పూజింతమనుకొన్న అవి కొలదిగంటల తరువాత వాడివత్తులగును. అగరువత్తుల నంటించినపుడు అవి కొన్ని నిమిషాలపాటు సువాసనలు వెదజల్లును, కాని ఆ చోటంతా బూడిద నిలిచి పోవును.

ఇట్లు ఆలోచించుచున్న నాదు బుద్ధియే వక్రమార్గమున నున్నదా స్వామీ! లోకమందు ప్రచురముగా ఒక సామెతయున్నది. చక్కగా లయానుకూలముగా నాట్యము చేయవలసిన నాట్యగత్తె తన చేతకాని తనమును కప్పి పుచ్చుకొనుటకై మద్దెల వాద్యము ఓటిగా నున్నదని కారణము చెప్పినదట.

ప్రభూ! భారత దేశములో విగ్రహారాధనకు ఎక్కువ ప్రాచుర్యమున్నది. కాని అక్కడక్కడ కొందరు సద్గురువులు భారతీయసనాతన వైదికధర్మంలోని మూలాలను విడువక మతవ్యాప్తికి సహకరిస్తూనే విగ్రహారాధన అవసరం లేదు అనే విషయమై ప్రజలకు బోధలు చేస్తున్నారు. ఇటువంటి వాటికి ప్రభావితమైన నా ఆలోచనా విధానం, బాహ్యపూజలో ఉండే లోపాలను ఎంచుతూ వాటిని వదిలించుకోవడానికి, నా సోమరితనం కప్పి పెట్టుకోవడానికి కారణాలు వెదకుతున్నదా?

**సీ. ఆ యహో బిలముల - నవతరించితె సామి**
**నరసింహరూపుడై - నరుల గాతె**
**మంగళాచలమునం - పానకాల గుడుతె**
**కదిరి క్షేత్రములో - కరము బ్రోతె**
**వరవరాహ నృసింహ - వరదుడై నిలిచితే**
**సింహాద్రి శిఖరాన - శివము గూర్తె**
**యాదగిరీంద్రుడై - వ్యథలను నడగింతె**
**ధర్మపురీశుడై - కర్మమడతె**

**తే.గీ. దొడ్డధాళవట్టమునందు - దొరగ వెలసి**
**చిత్త మిగురొత్త మమ్మర - క్షింపనెంతె**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ!** **9**

**భావము :** ఈ పద్యంలో నేను దర్శించిన ఆంధ్రప్రదేశంలోని నారసింహ క్షేత్రాలను పేర్కొనడం జరిగింది. కర్నూలు జిల్లా నంద్యాల సమీపంలో ఉన్న అడవులలో ఎగువనున్న గుహలో 'అహోబిల క్షేత్రము' దిగువనున్న నరసింహున కొక దేవాలయము నిర్మించినారు. అనంతపురంజిల్లాలో ఉరవకొండకు సమీపంలో 'పెన్నహోబిలం' అనే నృసింహక్షేత్రమున్నది.

గుంటూరు, విజయవాడల మధ్య 'మంగళగిరి' యను గ్రామంలో కొండపైన పానకాల నరసింహరాయుడున్నాడు. ఈతని ప్రశస్తి ఏమంటే భక్తులు సమర్పించిన పానకం పాత్రలో సగం మాత్రమే తాగుతాడు. మిగిలిన సగం భక్తులకు ప్రసాదంగా యిస్తాడు. కొలతయేదైనప్పటికి సూత్రం మాత్రం ఇదే.

కొండపై దర్శనం మధ్యాహ్నం కాలం వరకు మాత్రమే. కొండ దిగువన గ్రామంలో ఉన్న నరసింహాలయంలో సాధారణ పద్ధతుల్లో నిత్యార్చనలుంటాయి.



అనంతపురంజిల్లాలో కదిరిలో అతిపురాతనమైన నారసింహ క్షేత్రమున్నది. అన్నమయ్య పాటలో కూడా యీ పేరు పేర్కొన్నాడు. ఇతనినే ఖాద్రినరసింహుడంటారు. కాలక్రమంలో ఖాద్రి కదిరిగా మారినది. చైత్రమాసంలో ఈ స్వామికి బ్రహ్మోత్సవాలు చేస్తారు.

విశాఖపట్టణానికి సమీపాన సింహాచలమున్నది. ఈ స్వామిని వరాహ నారసింహుడంటారు. సామాన్యప్రజలు 'అప్పన్న' అని పిలుచుకొంటారు. 'అప్ప' అంటే తండ్రి అనే అర్థం. పాతకాలంలో మగవారి పేరులకు అప్ప, అన్న, అయ్య వంటివి చేరియుండేవి. ఈ స్వామిమహిమ కూడ అపారము. ఈ స్వామి ప్రత్యేకత నిత్య గంధార్చన. ప్రతినిత్యము గంధముపూతపై మఱల పూయించుకొంటూ ఏడాది కొక్కసారి గంధమును పూర్తిగా తొలగించుకొని, ఆ నాడు నిజరూప దర్శనమిస్తాడు. అప్పుడిక్కడ తిరునాళ్ళు జరుగుతాయి. ఈ స్వామిమహిమను శతకరూపములో ప్రత్యక్షీకరింప చేశారు గోగులపాటి కూర్మనాథకవి. తురుష్కులు పల్లె, పట్నం వదలకుండా దోచుకొంటూ దేవాలయాలను కూల్చివేస్తూ అప్పన్న దేవాలయాన్ని ధ్వంసం చేయడానికి వస్తూ కొండమధ్యభాగంలో సాయంత్రం విడిది చేశారు. ఇది తెలిసిన కూర్మనాథులవారు "వైరిహర రంహ సింహాద్రినారసింహ" అనేమకుటంతో అధిక్షేపిస్తూ శతకం మొదలుపెట్టారు. ఇది సగమయ్యేటప్పటికి శత్రువులు వెడలిపోయారట. ఎలాగంటే ఉన్నట్లుండి తుమ్మెదలు కోట్లకొలది పుట్టుకువచ్చి తురకసైన్యంపై దాడిచేశాయట. ఇప్పటికి ఆ స్థలాన్ని తుమ్మెదలమిట్ట అని పిలుస్తారు.

హైదరాబాదుకు సమీపానగల భువనగిరి నానుకొనియున్న ఒకానొక కొండ 'యాదగిరి'. ఈ కొండ గుహలో వెలసినవాడే యాదగిరీశుడు. భక్తపోషకుడు. రాష్ట్రరాజధానికి సమీపంలోనున్నవాడు కనుక భక్తుల సందడి కూడా ఎక్కువగా ఉంటుంది.

తెలంగాణములోని మరియొక సుప్రసిద్ధ నృసింహక్షేత్రము 'ధర్మపురి' ఈ స్వామిని తెలుగు ప్రజలను దగ్గరగా చేసిన మహాకవి శేషప్ప.

**భూషణవికాస శ్రీధర్మ - పుర నివాస!**
**దుష్టసంహార నరసింహా - దురితదూర!**

ఇది సీసముపై ఎత్తుగీతిలో చివరి పాదములు. ఆ శతకానికి ఆయన కీర్తికి మకుటము. సులభశైలిలో జీవితసత్యములను, వైరాగ్యములను అందించి స్వామి ప్రభావమును దూరప్రాంతము వారికందరికి తెలియపరచినాడు.

ఇట్టులాంధ్రదేశములో అనేకచోట్ల అవతరించిన హేస్వామీ! కర్ణాటక రాష్ట్రంలోని ఒక కుగ్రామమైన యీ దొడ్డధాళవట్టములో కూడా మా మాతామహుల స్వగ్రామంలో నీవు స్వయంభువుగా వెలసి యిక్కడి వారందరిని రక్షించుటకై అవతరించినావా నరసింహప్రభూ! నమస్తే నమస్తే నమః

**సీ. ఆంధ్రుబిడ్డలు తెచ్చు - ఖ్యాతియే నీదని**
**కాసు సుకవి తెల్పె - కంజనేత్ర!**
**నే సమర్థన జేతు - నెయ్యుని పల్కులు**
**నిన్ను రమ్మన రయ్య - నేటిజనులు**
**లక్ష్మిని రమ్మని - లాలించి పిలుతురు**
**విడచిన నేడ్తురు - వీడనీరు**
**భూదేవి కొఱకెన్నొ - పోట్లాట లగుచుండె**
**నాది నాదనుచును - మేదినీశ!**

**తే.గీ. తమకుమారుడా మారుడు - ధరణి నేలు**
**పెరిగె సిగపట్లు గంగకై - పెద్దలందు**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ!** **10**



**భావము :** కాసుల పురుషోత్తమకవి వ్రాసిన ఆంధ్రనాయకశతకంలోని ఒక్క పద్యమిది.

**సీ. ఆలు నిర్వాహకు - రాలు భూదేవియై**
**అఖిల వాహకుడన్న - నాఖ్యఁదెచ్చె**
**ఇష్టసంపన్ను రా - లిందిర భార్యయై**
**కామితార్థదుడన్న - ఘనతతెచ్చె**
**కమలగర్భుడు సృష్టి - కర్త తనూజుడై**
**బహుకుటుంబికుడన్న - బలిమితెచ్చె**
**కలుషవిధ్వంసిని - గంగ కుమారియై**
**పతితపావనుడన్న - ప్రతిభతెచ్చె**

**తే.గీ. ఆంధ్రుబిడ్డలు తెచ్చు ప్ర - ఖ్యాతి గాని**
**మొదటి నుండియు నీవు దా - మోదరుడవె**
**చిత్ర చిత్ర ప్రభావ దా - క్షిణ్యభావ!**
**హత విమతజీవ శ్రీకాకు - ళాంధ్రదేవ!**

మహావిష్ణువునకు భార్యలిద్దరు భూదేవి, శ్రీదేవి. పెద్దకుమారుడు బ్రహ్మ, కుమార్తె గంగ. వీళ్ళందరు చేస్తున్న పనులు వరుసగా భారాన్ని మోయడం, సంపదలనందించడం, సృష్టికార్యాన్ని నిర్వహించడం మరియు జనుల పాపాలను తొలగించడం. వారు చేస్తున్న పనులకు నీకు కలిగిన బిరుదులు వరుసగా అఖిలవాహకుడు, కామితార్థదుడు, బహుకుటుంబీకుడు, పతితపావనుడు. ఇట్లు భార్యలు, పిల్లలు తెచ్చి కీర్తితో ప్రకాశిస్తున్నావుగాని, ఆది నుండి నీవు దామోదరుడివే అని ఎత్తిపొడువు.

'దామోదరుడు' అనే పదాన్ని దరిద్రునకు పర్యాయపదంగా లోకంలో వాడుతుంటాము. ఇలాగ ఒకవైపు నింద కనిపిస్తుంటే అవే విశేషణాలు అవే కార్యాలు సామాన్యమైనవి కావని ఆయా పేళ్ళతో, పదబంధాలతో

స్వామి నిర్వహిస్తున్నవి లోకోత్తర కార్యాలని 'దామోదరుడు' ఉదరమువరకు వ్రేలాడే వనమాలను ధరించినవాడని విష్ణువుకున్న మరో వ్యుత్పత్తి ద్వారా వ్యక్తమయ్యే మరియొక అర్థం తెలుపుతుంది.

ఇంత వ్యంగ్యాన్ని నేను రచించిన శ్రీనరసింహశతకంలోని యీ పదవ పద్యంలోనికి తీసుకువచ్చాను. ఎలాగంటే

హే మహావిష్ణూ! నేను పురుషోత్తమకవి పలుకులకే వత్తాను పలుకుతాను. ఈ నాడు నేను చూస్తున్న జనలందరు ఆ కవి పలుకులనే నిజం చేస్తున్నారు. లక్ష్మి అంటే సంపదలు కావాలని అనేక పేళ్ళతో ఆమెనే పూజిస్తున్నారు. ఏ కారణం చేతనైనా ధనార్జన కొంత తగ్గిందంటే ఏడుపే.

ఇక భూమికోసం పోట్లాటలు రాజులు, మంత్రులనుండి సామాన్యులవరకు సామాన్యమైపోయినవి.

నీ కుమారులలో ఒకడైన మన్మథుని లీలలకు అంతేలేదు. ధరణిలో వాడిది యిష్టారాజ్యమే.

నీ కుమార్తె గంగమ్మ. ఈమె కోసం సామాన్యుల నుండి ప్రభుత్వాల దాకా కొట్లాటలు నడుస్తూ, న్యాయస్థానాల దాకా వెళ్తున్నాయి.

ఈ విధంగా సంపదలకు, భూమికి, నీటికి, విలాసాలకు జనం ఎట్లా ఎగబడుతున్నారో, ఆధ్యాత్మికవిషయాలకు ఎంతగా వెనుకబడుతున్నారో అనే విషయం వ్యంగ్యంగా చెప్పబడింది. మేదినీశ, కుమారుడు – మారుడు వంటి పదాలు శోభాదాయకాలు.

**సీ. శేషప్పకవి నాడు – చెప్పిన చొప్పున**
**నొప్పరికించంగ – తప్పుకాదొ**
**పిల్లలు పెండ్లాలు – వీధిన బడినారు**
**వారించగారావొ – వారిజాక్ష!**



**నిద్రింతువే నీవు – నిమ్మళముగ నీట**
**నిమ్మకు నీరెత్త – నిలుచులాగ**
**లేలెమ్ము రారమ్ము – రేలుపవలునాక**
**పోట్లాడు ప్రజకీవు – బోధపఱచు**

**తే.గీ. భిక్ష నిడుము నీ భువికి – సుభిక్షముగను**
**ధర్మమింపొంది పెంపొంది – తనరునాడు**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ!** **11**

**భావము :** 10వ పద్యమునకు వలెనే 11వ పద్యము కూడా మరియొక కవిని సమర్థిస్తూ చెప్పినది.

శ్రీధర్మపురనివాసుని సంబోధిస్తూ శేషప్పకవి ఒక పద్యమీలాగున చెప్పారు.

**సీ. పసరంబు పంజైన – పసులకాపరితప్పు**
**ప్రజలు దుర్జనులైన – ప్రభునితప్పు**
**భార్య గయ్యాళైన – ప్రాణనాథునితప్పు**
**తనయుండు దుడుకైన – తండ్రితప్పు**
**సైన్యంబు చెదరిన – సైన్యనాథునితప్పు**
**కూతురు చెడుగైన – మాతతప్పు**
**అశ్వంబు దురుసైన – ఆరోహకునితప్పు**
**దంతి దుష్టయిన మా – వంతుతప్పు**

**తే.గీ. ఇట్టి తప్పులెఱుంగ – యిచ్చువచ్చి**
**నటుల మెలగుదురిప్పుడీ – యవని జనులు**
**భూషణవికాస శ్రీధర్మ – పుర నివాస!**
**దుష్టసంహార నరసింహ – దురితదూర!**

ఈ పద్యంలో లోకంలోని సంబంధబాంధవ్యాలలో తప్పులేర్పడే కారణాలను ఉటంకిస్తున్నాడు కవి. అర్థాలు విడమరచి చెప్పవలసిన అగత్యం లేదు – ఎందుకంటే నిత్యం మనం వాడుకభాషలో ఉపయోగించే పదాలే కాబట్టి.

శేషప్పకవి చెప్పినట్లుగా నీవు ఉపేక్ష చేయుట మూలముగా నీ భార్యలు, పిల్లలు ఆగడములు చేయుచున్నారు. అందువలన అపకీర్తి పాలగుచున్నారు. మరి నీవు వారిని ఎందుకు అదుపులో పెట్టుటలేదు. ఎక్కడో పాలసముద్రంలో నిశ్చలంగా నిద్రపోతున్నావా? నిద్రయింక చాలును. లేచి రావయ్యా, రేయింబవళ్ళు తేడా లేకుండా పోట్లాడుతున్న ఈ జనులకు ధర్మాన్ని బోధపరచు. నీ ప్రవేశంతో, నీ బోధలతో మరల ధర్మము నిలద్రొక్కు కొంటుంది. భూమి సుభిక్షమవుతుంది.

సీసములోని 2,3 పాదాలు, తేటగీతిలోని 1,2 పాదాలు అర్థ సౌందర్యాన్ని పెంపొందింప జేసేవిగా ఉన్నాయి. 'నాడు' అంటే భూమి మరియు ఆ దినము అనే అర్థాలు.

**సీ. ధనకనకాదుల – దండిగా పొందంగ**
**కోరికలుండుగా – యేరికైన**
**చెమటోడ్చి పొందిన – చెలువుగా నుండదె**
**యుద్దదారుల నేల – గడ్డికరవ**
**నడుమంత్రపు సిరియు – నడుమనే రాలంగ**
**నీచంబుగా నిల్చి – నిందబొంది**
**యిక్కట్లు పాలయి – స్రుక్కుచు పొక్కుచు**
**హేయంపు బ్రతుకీడ్చు – నెద్దె మనిషి**

**తే.గీ. మూర్ఖ దనుగమించును కదా – మూర్ఖజనుని**
**ధీవిశాలుం డొరుని గని – దిద్దుకొనును**



**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 12**

**భావము :** ప్రతిమనిషికి దండిగా డబ్బు సంపాదించవలెనని, తద్వారా లభించే సుఖాలు అంటే వస్తువాహనములు ఇల్లు, పొలం, నగలు మొ॥ ఏర్పరచుకోవాలనే కోరికలు సహజంగా ఉంటాయి. మన ధర్మశాస్త్రాలు కూడా యీ కోరికలను తప్పుపట్టడం లేదు. పైగా వాటినన్నింటిని ఎలా సంపాదించుకోవాలి అనేదానికి అనేక శాస్త్రాలను ఏర్పరచింది కూడా.

అయితే ఇప్పుడు జరుగుతున్నదాంట్లో ఒక్కతేడా కనిపిస్తోంది. అది ఏమిటంటే న్యాయంగా, ధర్మంగా కాకుండా అడ్డదారులలో ఆర్జన. ఇలాగ సంపాదించిన ధనం అంటే 'నడుమంత్రపుసిరి' ఎక్కువకాలం నిలువదు. పైగా అపకీర్తి తెస్తుంది. అంతేకాకుండా అకృత్యాలకు తగినట్లుగా మనిషి ఎన్నో శిక్షలకు గురి అవుతాడు.

ప్రపంచంలో ఇలా సుఖాలందుకొని వెంటనే బాధలకు లోనయ్యేవాళ్ళను ఎంతోమందిని చూస్తున్నాము. ఇలాంటి నిలువెత్తు ఉదాహరణలను ప్రతిరోజు చూస్తున్నా మూర్ఖుడు అదే ఊబిలో చిక్కుకొంటున్నాడు. బుద్ధిమంతుడు అటువంటి వాటి జోలికిపోక తాను సక్రమమార్గంలో ధనార్జనచేస్తూ, సుఖమయజీవితం గడుపుతున్నాడు.

**సీ. పదిపైసలను బెట్టి – వందలు వేలును**
**పొందజూచును గాదె – భువిని నరుడు**
**కోళ్ళుపొట్టేళ్ళను – గుఱ్ఱాలు పావురా**
**లాటలాడగనపంపి – చేటునొందె**
**మటకా యనెడు పెద్ద – పటకారునకు జిక్కె**
**పేకలనాడుచు – జోకరయ్యె**

స్టాకుమార్కెట్టు లా - టరియను పేర్లతో
వ్యసనాల బానిసై - వాడుచుండె

తే.గీ. నుదధి కలియును నదులంచు - వెదక కడగె
దాహముడుపంగ నా నీరు - త్రాగగలదె?
దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!
నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! **13**

**భావము :** పాతకాలంనుండి యీ కాలం వరకు ఉన్న అనేక జూదాలిక్కడ పేర్కొనబడినవి. జూదమేదైనప్పటికి కొద్ది మొత్తాన్ని మదుపుపెట్టి వందలు వేలు రెట్లుగా డబ్బును సంపాదించడమే లక్ష్యం.

కోళ్ళు, పావురాలు, పొట్టేళ్ళు, ఎద్దులు, గుఱ్ఱాలు మొదలగు జంతువులను పందాలలోకి దింపి వాటిద్వారా సంపాదించడం. ఇలాంటి ఆటలే ప్రమాదకరంగా పరిణమించి రాజ్యాలను కూడా కూల్చివేసినవని చరిత్రలు చెబుతున్నాయి.

పేకాట వంటి జూదాల ద్వారా ఉన్నదంతా ఊడ్చిపెట్టి, భార్యాబిడ్డలను వీధిలోకి నెట్టి జోలెపట్టుకున్నవారు ఎందరో?

సమాచారవ్యవస్థ అభివృద్ధి చెందిన ఈ కాలంలో పుట్టి, పెరిగి, ఎందరినో సోమరులను తయారుచేసి, వారి జీవితాలను నాశనం చేస్తున్న వ్యసనాలే మటకా లాటరి వంటివి.

నదులన్ని సముద్రంలో కలుస్తున్నాయి కదా, అక్కడ నీరు తీసికొని త్రాగుదామనుకొంటున్నాడు కాని, ఆ సముద్రపునీరు త్రాగగలడా, త్రాగితే దాహం తీరుతుందా?

ఇక్కడ ఇచ్చిన ఉపమానం చాలా ప్రశస్తమైనది. స్వచ్ఛమైన నదినీరు కష్టార్జితమైన డబ్బుతో పోల్చబడ్డది. సముద్రంలోకి చేరినది నదులనీళ్ళే



అయినా, అది దాహార్తిని కూడా దీర్చలేనిదవడం. అట్లే ఎందరి కష్టార్జితాలో ఒకచోట ప్రోగుపడినా, ఆ డబ్బు ఏ ఒక్కకుటుంబపోషణకు పనికిరాకుండా పోతున్నది. ఇది అందరం చూస్తున్న నిష్ఠురసత్యమే కదా!

సీ. స్త్రీ బలహీనతల్ - తెలివిగా కనిపెట్టి
రాతికాలపు నాడె - పాతనరుడు
సొమ్ములచీరల - సుదతికిచ్చిన జాలు
గొల్లెయై చుట్టును - కూర్మిగులుకు
కాలాలు మారినా - కలికిలో మార్పేది
కానంగ రాదుగా - కమలనయన!
సాటి సతులపైన - సాధింప వెఱవదు
చీరలసొమ్ముల - జేయనెఱగ

తే.గీ. తప్పుపట్టుట యేటికి - ధర పురుషుల
తనను దిద్దుకొనగజాలు - దారి జూపు
దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!
నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! **14**

**భావము :** స్త్రీ జాతికి ఎన్నో సుగుణాలు ఉన్నవి. వాటితో పాటు కొన్ని బలహీనతలు ఉన్నవి. అవియేవనగా ఆభరణాలన్నా, అందమైన వస్త్రాలన్నా అపరిమితమైన ప్రీతి. ఈ లొసుగులను రాతియుగంలో జీవించిన మగవాడే కనిపెట్టాడు. అందువలనే మాతృస్వామ్య వ్యవస్థ పటిష్ఠంగా ఉన్న ఆ సమాజం నుండి స్త్రీ తన అధికారాన్ని పోగొట్టుకొని పితృస్వామ్య వ్యవస్థ అంటే మగవాడి చేతికి అధికారాలనప్పగించి అతడి నీడలో బ్రతకడానికి అలవాటు చేసికొన్నది. నాటినుండి నేటివరకు స్త్రీలనుపట్టి పీడిస్తున్న వీ బలహీనతలు. వాటిని ఎరగా పెట్టి, ఎన్నో దుష్కృత్యాలను చేస్తున్నారు, చేయిస్తున్నారు మగవారు.

హే భగవాన్! మానవజాతిలో స్త్రీ, పురుషులనే ఈ రెండు లింగ బేధాలున్న వారిలో పురుషులను మాత్రమే ఇలా స్త్రీలను పాడుచేస్తున్నారు అని నిందవేయడం తప్పే అవుతుంది. ఎందుకంటే రెండవ లింగమైన స్త్రీ కూడ బుద్ధి జీవియే. కనుక ఆమెకు తన యింగితాన్ని ఉపయోగించుకొని తనకు తాను బలహీనతలనుండి బయటపడగలిగే బుద్ధివికాసము కలిగించమని ప్రార్థిస్తున్నాను నిన్ను.

**సీ. ఆవిర్భవించిన - యన్ని జంతువులకు**
**నధిపతి చేసితి - వయ్య నరుని**
**కాలరాచె నరుడు - క్రమవికాసము నొంది**
**యితర జంతుతతిని - హతమొనర్చె**
**కోట్లజీవులలోన - కొంచెమే తానని**
**గ్రహియించలేదుగా - ఘాతకుండు**
**బ్రతుకుము పరులను - బ్రతుకంగ నిమ్మను**
**సూక్తుల చెవిలోన - సోకనీడు**

**తే.గీ. పెత్తనం బీయ తలయంత - పేను కొఱుకు**
**రీతి నయ్యెగా మానవు - చేత లకట!**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ!** **15**

**భావము :** హే నరసింహా! 84 లక్షల జీవకోట్లను సృష్టించినావని ఉద్గ్రంథములు ఘోషించుచున్నవి. ఇన్నింటిపై ఆధిపత్యమును మనుష్యునకొసంగినావు. అయితే అతడేమి చేసినాడు మరియు చేయుచున్నాడు. తన యభివృద్ధిని మాత్రమే చూచుకొన్నాడు. దాని కొరకు ఇతర వృక్ష, జంతుజాలాన్ని అంతటిని నాశనము చేశాడు. ఇన్ని కోట్ల భగవత్సృష్టిలో తానుకూడ ఒకరకము మాత్రమేనని గ్రహించలేదు.



ఆంగ్లములోని ఒక సూక్తి "LIVE AND LET LIVE" అనగా నీవు బ్రతుకుము, నీ తోటిజీవులను కూడా బ్రతుకనిమ్ము అను దానిని పాటించలేదు. ఈ సూక్తినే అతడు అనుసరించియుండినచో ఈనాడు పర్యావరణము ఇంత కలుషితమైయుండదు. ఎన్నో రకములైన వృక్ష, జంతుజాలములు సృష్టినుండి అంతరించి యుండవు. ఏలననగా అన్ని జంతువులకు శత్రుజాతిని అంతము చేయుటకు రెండే కారణములున్నవి. ఒకటి ఆహారముకొరకు, రెండు ఆత్మరక్షణకై. ఒక మానవుడు మాత్రమే వినోదముకొరకు మరియు ఇతర స్వార్థప్రయోజనములకొరకు సృష్టిని, ప్రకృతిని అతలాకుతలము చేస్తున్నాడు. దీనినంతను పరిశీలించిన ఒక సూక్తి జ్ఞప్తికి వచ్చుచున్నది. అదియేమనగా "పేనువంటి క్షుద్రజీవికి పెత్తనమిస్తే తనకు ఆధారభూతమైన తలనంతటిని కొరికివేస్తున్నట్లున్నది".

**సీ. తిండిబట్టయు నిచ్చి - కండపుష్టిని యిచ్చి**
**మనుజు మనగజేసె - మ్రాకులకట!**
**ఇంట వాకిలిబల్ల - లిచ్చి కుర్చీలయి**
**మనుజు మనగజేసె - మ్రాకులకట!**
**ఇంధనముగ మండి - యింటింట వెలుగిచ్చి**
**మనుజు మనగజేసె - మ్రాకులకట!**
**వనమూలికల నిచ్చి - వ్యాధుల మాన్పించి**
**మనుజు మనగజేసె - మ్రాకులకట!**

**తే.గీ. ఇటుల మేళ్ళను చేసిన - నెదుగ నీక**
**చంపుచున్నాడు చెట్లను - చవటమనిషి**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ!** **16**

**భావము :** ప్రకృతి – భగవత్సృష్టి యను ముందరి పద్యమునకు కొనసాగింపే ఈ పద్యము. ఇక్కడ చెట్లు వాని యుపయోగములు ప్రముఖముగా ప్రస్తావింపబడినవి.

సృష్టిలోని సకలజంతుజాలానికి అన్నదాతలు చెట్లే. ప్రతిజీవి జీవించడానికి గాలి, నీరు, ఆహారము ప్రాథమ్యాల స్థాయిలో వరుస క్రమంలో ఉంటాయి. అందులో మూడవదైన ఆహారాన్ని జీవులైన చెట్లు తమకవసరమైన వాటిని తాము తయారు చేసికొని బ్రతుకుతూ మిగిలిన జీవులకు ఆహారాన్ని అందిస్తాయి.

జీవులలో శ్రేష్ఠులైన మానవుని జీవితావసరాలలో కూడు, గుడ్డ, నీడ, ప్రాథమ్యాల ఆరోహణలో ఉంటాయి. అందులో ప్రథమమైన దానినిప్పుడే చెప్పాను. కాగా రెండవదైన వస్త్రాలు నూలు, ఊలు, పట్టు మొ॥ మొదటిది నేరుగా ప్రత్తిమూలమని తెలిసినా రెండవ, మూడవరకాలైన వాటికి జంతువులు ప్రధానకారకములు. అయినా అవి బ్రతికి బట్టల కవసరమైనంత ఉన్ని, పట్టు తయారయ్యే వెంట్రుకలు లేక స్రవములు తయారవడానికి అవి తినే ఆహారమే కదా ప్రధాన కారణం.

మూడవ ప్రాథమ్యమైన గృహనిర్మాణంలో ఉపయోగించే వాకిళ్ళు, కిటికీలు, ఇంట్లో కూర్చోవడానికి, పడుకోవడానికి అవసరమయ్యే కుర్చీలు, మంచాలు మొదలైనవి చెట్ల వలననే మనకు లభిస్తున్నవని వేరే చెప్పపని లేదుకదా.

వంట చేసికొనేందుకు ఇటీవలి వరకు అంటే యుగయుగాలనుండి మానవులకు ఉపయోగపడిన ఇంధనం చెట్లే కదా. ఈ కాలంలో ఉపయోగిస్తున్న 'గ్యాసు' కిరోసిన్ వంటి ఇంధనసామగ్రి కూడా యుగాల క్రితం భూకంపాలవలన భూగర్భంలోకి చేరి శిలాజాలుగా మారిన అడవుల ద్వారా లభించినవి. 'పెట్రోలియం' అని పిలువబడేవి చెట్ల అవశేషాలే అని



శాస్త్రజ్ఞులు తేల్చారు. కాబట్టి అవి బ్రతికినా, చచ్చినా భూగర్భంలో లేక సముద్రగర్భంలో పూడ్చబడినా ఈ తరానికి కాకపోతే మున్ముందు తరాల వారికి బొగ్గు, పెట్రోలియం వంటి ఇంధనం లభించాలన్నా అది చెట్ల ద్వారానే సాధ్యం.

ఈ ఉపయోగాలే కాకుండా ఆయుర్వేదమనే వైద్యశాస్త్రంలో చెప్పినట్లు వైద్యశాస్త్రానికి పనికిరాని మొక్కంటూ ఒక్కటి కూడా ప్రకృతిలో లేదు.

ఇవన్నీ చెట్లవలన కలుగుతున్న కొన్ని రకాల మేళ్ళు మాత్రమే. ఇంకా తెలుసుకోవలసినవి ఎన్నో ఉన్నాయి. కనుక చెట్లను పెంచి పోషించవలసిన, వ్యాప్తి చెందించవలసిన అగత్యం మానవులకెంతో యున్నది. కాని అజ్ఞానంతో వృక్షాలను నరికి తన చేటును తానే తెచ్చుకొంటున్నాడు చవటగా మారిన మనిషి.

**సీ. కోరిన విద్యల – కూర్మిని నేర్చుట**
**గత దినమ్ములమాట – కమలనయన!**
**యిష్టమౌ వృత్తిని – యెంచి చేపట్టుట**
**గత దినమ్ములమాట – కమలనయన!**
**వలసిన యూరిలో – వాసంబొనర్చుట**
**గత దినమ్ములమాట – కమలనయన!**
**కోరిన యల్లుళ్ళ – కోడళ్ళ గూర్చుట**
**గత దినమ్ములమాట – కమలనయన!**

**తే.గీ. ఇటుల స్వాతంత్ర్యమన్నింట – నింకిపోవు**
**దినములే వచ్చె నెట్టులో – దేవ దేవ!**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్పు!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 17**

**భావము :** గతము మరియు వర్తమానము వీటిలో మానవుడు పొందుతున్న లాభనష్టాలు, స్వతంత్రత, అస్వతంత్రత ఎలా ఉంటున్నవి అన్నవి ప్రస్తావింపబడుతాయి. ఎప్పటికప్పుడు క్రొత్తగా వస్తున్న సాంకేతిక శాస్త్రాలనందుకొంటూ మనము ఎటువైపు పయనిస్తున్నాము. కొంచెం ఆలోచించండి.

గతకాలంలో ఏ వ్యక్తి అయినా తనకు నచ్చిన విద్యను నేర్చుకొనే వెసులుబాటు ఉండేది. ఆనాడు కావలసినది, ఆ విద్యకు సంబంధించిన పరిజ్ఞానం తగినంతగా ఉన్నదా అనేది మాత్రమే.

గతకాలంలో ప్రతివ్యక్తి తనకిష్టమైన వృత్తిని ఎంచుకొని జీవించేవాడు. అలాగే ఎవరికి నచ్చిన ఊళ్ళో లేక వాళ్ళు పుట్టి పెరిగిన గడ్డపై జీవనం చేసేవాళ్ళు. తమ పిల్లలకు కావలసిన సంబంధాలను పెద్దలే ఎంపిక చేసికొనేవాళ్ళు.

పైన తెల్పిన అన్ని విషయాలలో ఈనాడు వ్యతిరేకపరిస్థితులను మనము చవిచూస్తున్నాము కదా! మనము పొందిన స్వాతంత్ర్యము, నవనాగరికత మున్నగునవి పురోగమనానికా లేక తిరోగమనానికా అన్న విషయం ఆలోచించవలసిందే కదా!

**సీ. స్వాతంత్ర్యమన నేమొ – స్వైరం బనగ నేమొ**
**తెలియక నడతురీ – తెఱవలిపుడు**
**ఫలరసాయనమట్లు – బలమిచ్చు భామిను**
**లరుదుగా నున్నారె – యవని పైని**
**మత్తిల్ల జేసెడు – మధువును పోలిన**
**మించు బోంట్లు గలరు – మిక్కుటముగ**
**కొమ్మలో గల కొయ్య – గొడ్డలిలో దూరి**
**కులమునంతను తానె – కూల్చినట్లు**



**తే.గీ. లేకి నడవడి తోడుత – లేమ లకట**
**పతితలగుచు చేతురె పృథ్వి – పతనముగను**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్పు!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 18**

**భావము:** ఈనాడు స్త్రీలకు స్వాతంత్ర్యము, స్వైరము అనే పదాలకర్థము తెలియకుండా ప్రవర్తిస్తూ ఉన్నారు. రెండు ఒకటే అనే రీతిలో ఉంటున్నది వారి నడవడిక.

గతకాలంలో స్త్రీలు, పురుషుల అహంకారానికి, దమనశక్తికి లోబడి బానిసబ్రతుకులను వెళ్ళదీస్తుండేవారు. ఈలాంటి పరిస్థితుల నుండి విమోచనం కలిగించాలని ప్రపంచవ్యాప్తంగా స్త్రీలయభివృద్ధికి, స్త్రీ స్వాతంత్ర్యానికి ప్రాధాన్యమిచ్చి అన్ని రంగాలలో ఆమె అభివృద్ధికి ఎన్నో ప్రోత్సాహకాలను ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు కూడా అందిస్తూవస్తున్నాయి. ఇరవై, ఇరవయ్యొకటవ శతాబ్దంలో యీ ప్రయత్నాలు, ప్రోత్సాహకాలు మరింత ఊపందుకొన్నాయి.

అయితే ఇలాంటి సమయంలోనే స్వాతంత్ర్యాన్ని స్వైరంగా మార్చుకొంటూ ఉన్నారు కొందరు మహిళలు. అంటే అభివృద్ధి కొరకు ఉపయోగించుకొనే స్వేచ్ఛకు కొన్ని పరిధులు, నియమాలు కూడా ఉంటాయి. వాటినన్నింటిని అతిక్రమించే మితిమీరిన స్వేచ్ఛ వినాశనానికే దారితీస్తుంది. దీనినే స్వైరమంటారు పెద్దలు.

ఇప్పుడు స్త్రీలను మనము రెండు తెగలుగా విభజించవచ్చును. ఏ స్త్రీ సాహచర్యంచేత ప్రక్కనున్నవారు ముఖ్యంగా పురుషులు సత్త్వగుణాన్ని లేక సద్గుణాలిని పెంపొందించుకొంటారో అలాంటి వారిని తాజాగా తయారు చేసిన మంచిపండ్ల రసాలతో పోల్చవచ్చు. ఫలరసాలు శరీరానికి పుష్టిని నాల్కకు తుష్టిని కల్గించేటట్లే యీ స్త్రీల నడవడిక పురుషులను ఉత్తములుగా తీర్చిదిద్దుతుంది.

అదే రెండవతెగ స్త్రీలు పులిసిన ఫలరసాల వంటివారు. వీరు తమ చెంతనున్న పురుషులను తమశరీరాల వంపుసొంపులతో ఆకర్షించి వాళ్ళల్లోని బలహీనతలను రెచ్చగొట్టి తమకు దాసులుగా చేసికొంటారు. పులిసిన ఫలరసాలు మత్తుపదార్థాలుగా ఉపయోగింపబడినపుడు, మానవులు ఆ మత్తుకు లోబడి ఎన్నో రకాల తప్పులను చేస్తుంటారు. అట్లే వారి మైకంలో చిక్కుకున్న పురుషులు తమస్సులోకి జారుకుంటారు.

ఇటువంటి వనితలు తాము చెడిపోతూ తమ సాంగత్యంలోనికి వచ్చిన పురుషులను కూడా చెడగొడతారు. ఇలా సమాజానికి చీడపురుగుల్లా తయారవుతారు వీరు.

ఈలాంటి స్త్రీలు తమ జాతికి చేసే ద్రోహము నిలా చక్కని ఉపమానంతో పోల్చవచ్చు.

గొడ్డలి ఇనుముతో చేసినది ఎంత పదునైనదైనప్పటికి అది చిన్న కట్టెను కూడా చీల్చలేదు. అదే గొడ్డలి కన్నంలోనికి కొయ్యను చేర్చగా అదియెంతటి బలవత్తరమైన చెట్టునైనా ముక్కలు ముక్కలుగా నరికి వేయగలదు. ఇట్లు స్త్రీజాతి పతనానికి స్త్రీలే కారణమవుతున్నారు.

ఉత్తమస్త్రీలను తాజాఫలరసాలుగా, నీచస్త్రీలను పులిసిన ఫలరసాలుగా పోల్చుట నా బుద్ధికు తట్టిన యోచనే.

**సీ. కోటివర్ణములుండ - కోరుకొంటివె నల్పు**
**అందంద మేమిటి - నందమేమి?**
**మల్లెపూవును బోలు - తెల్లనివర్ణమో**
**పసిడివన్నెను బోలు - పచ్చరంగొ**
**లేగులాబులు నుండు - లేలేత రంగులో**
**నయిన మెత్తురు గాదె - యవని జనులు**



**నీవు దేవుడువౌట - నెరసులెన్నక ప్రజ**
**పూజ చేయుచునుండె - పూలతోడ**

**తే.గీ. నీవె నల్లని నరుడుగా - నిలిచితేని**
**నవ్విపోదురు జనులెల్ల - నారసింహ!**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! 19**

**భావము :** భగవంతుని నీలమేఘశ్యామునిగా వర్ణిస్తారు. సృష్టిలోని అన్ని రంగులు అందమైనవే. కాని మానవుల శరీరవర్ణాల సౌందర్యాన్ని గురించి మాట్లాడుకొనేటప్పుడు యూరోపియన్ల శరీరచ్ఛాయలైన తెలుపు, లేత గులాబీలరంగులపట్ల ఆకర్షితులమవుతాం. ఇక పసినిమ్మపండువంటి బంగారుఛాయల గురించిన వర్ణనలు పుస్తకాలకే పరిమితమైనవి కాని వాస్తవప్రపంచంలో యీ కాలంలో కనిపించడం లేదు. నలుపు, ఛామనఛాయ రంగులు విస్తృతంగా ఉన్నాయి మనదేశంలో.

భారతదేశంలోని ప్రతి స్త్రీ గర్భిణిగా ఉండేటప్పుడు తనకు పుట్టేబిడ్డ తెల్లని శరీరవర్ణంతో మెరిసిపోవాలని కోరుకొంటుంది. పుట్టిన తరువాత ఆ రంగు ఏదైనా సరే సరిపుచ్చుకొంటుందనుకోండి. ఎందుకంటే అది మన చేతుల్లో లేదు కాబట్టి.

ఇక్కడి వ్యంగ్యం ఏమిటంటే శ్రీరాముడు, శ్రీకృష్ణుడు మొదలైన అవతారాల్లో విష్ణుమూర్తిని నల్లని (నీలము) రంగుతో అవతరించాడని తెలుసుకొంటున్నాము. అంతకుముందు యుగాల్లో తెల్లగా, పచ్చగా అవతరించాడట. అవి యీ యుగంలో తలపబడటం లేదు. ఇప్పుడు నల్లని వర్ణమే ప్రాచుర్యంలో ఉన్నది. మరి భగవంతుడు కాబట్టి అతడు ఏ రంగులో అవతరించినప్పటికి భయమో, భక్తియో ఉండబట్టి ఆతడిని వెక్కిరించక పూజలు చేస్తున్నారు జనులు. కాని నల్లని రంగుతో పుట్టిన స్త్రీ పురుషులందరు

జీవితంలో అనేక సందర్భాలల్లో అవహేళనకు గురియవుతుంటారు. 'గ్యారంటీ రంగు' అని వారిని తెల్లతోలుకల ప్రజలు చిన్నబుచ్చడం అందరెరిగిన సత్యమే కదా!

**సీ. నారాయణా! హరీ! – నల్లని దేవుడా!**
**ఎట్టి యఘము నేని – నిట్టె యోర్తె!**
**నారాయణా! హరీ! – నల్లని దేవుడా!**
**సుంత తాపమునైన – చెంత నిడవె!**
**నారాయణా! హరీ! – నల్లని దేవుడా!**
**తగ తెత్తువే వెల్గు – తమము చీల్చి**
**నారాయణా! హరీ! – నల్లని దేవుడా!**
**నీలిమ నింపితే – నేర్పుమీర**

**తే.గీ. పంచభూతములకు నీవు – దంచితముగ**
**యెంచ కష్టంబు తవలీల – యిందిరేశ!**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్పు!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 20**

**భావము :** ముందరి పద్యములో నున్న నలుపు రంగుకున్న ప్రాధాన్యమేమిటో ఇక్కడ ఊహింపబడుతున్నది.

పుణ్యమును తెలుపురంగుతో, పాపమును నలుపు రంగుతో పోల్చడం కవి సంప్రదాయం. కావున ఓ నారాయణమూర్తీ! జనులు చేసే పాపాలు ఎన్నయినా, ఎంతటివైనా వాటిని నీలో విలీనం చేసికొంటావా, అందుకే నల్లరంగులో ఉన్నావా?

భౌతికశాస్త్రాన్ననుసరించి తెలుపురంగు వేడిమిని చాలా నిదానంగా గ్రహిస్తుంది. కాని గ్రహించిన వేడిమిని తొందరగా విడువదు. దీనికి వ్యతిరేకంగా నలుపురంగు తొందరగా వేడిమిని గ్రహిస్తుంది. తొందరగా విడిచి పెడుతుంది. ఈ రకంగా జనుల తాపాలు – మూడు రకాలైనవి – వారికి ఎక్కువ బాధ కలిగించకుండా నీవే భరిస్తున్నావా నారాయణా!



చిక్కని చీకటిని చీల్చుకొని లేత సూర్యుని వెలుగు కిరణాలు భూమి మీదకు ప్రసరించడం మనం నిత్యం చూస్తున్నాము. భగవంతుని అనేక పేర్లలో నిరంజనుడనేది ఒకటి అంటే దీని అర్థమిదే. చీకటిని చీల్చి వెలుగును ప్రసాదించేవాడని. పైనున్నది నల్లనిరంగే అయినా అందుండివచ్చేది వెలుగేయని. నారాయణా! ఇది సరియేనా?

ఇలా ఎన్నో రకములైన కారణాలతో నల్లని రంగును కోరుకొన్నావా ప్రభూ! మరి నీ స్వరూపమైన ప్రకృతి – అందులోని పంచభూతాలకు యీ నీలిమనే ప్రసాదించావా?

పంచభూతాలకు 'నీలిమ' ఎట్లు?

**1. జలము :** స్వచ్ఛమైన నీటికి రంగు, రుచి, వాసన లేవు. కాని మనకు కనిపించే జలశయాలు, నదులు, సముద్రాలు మొదలైనవన్ని నీలిరంగులోనే కనిపిస్తున్నాయి. ఆకాశమందులో ప్రతిఫలించడం ప్రధాన కారణం కావచ్చు చిత్రకారులు నీరున్న ప్రదేశాలను నీలిరంగుతోనే చిత్రిస్తారు.

**2. ఆకాశము :** ఈ శబ్ధానికి శూన్యమని అర్థం. అయితే మనకు కనిపించే రోదసి నీలిరంగులోనే యుంటుంది. ఇందుకు శాస్త్రజ్ఞులు చెప్పే కారణం 'ఈథరు' అనే పేరుగల ఒక పదార్థం ఈ శూన్యాన్ని ఆవరించి ఉంటుంది. అందువలన దాని కా రంగు వచ్చిందంటారు. దీనికి తోడు మేఘాలు–నలుపువే కదా. శాస్త్రపరిభాషలో నీలానికి నలుపుకు తేడా లేదు. కావ్యభాషలో కూడా సమానార్థకాలే.

**3. అగ్ని :** అగ్ని మండేటప్పుడు అనేకరంగులలో జ్వాలలు ఎగసివస్తుంటాయి. వీటి కా రంగులు రావడానికి, మండే పదార్థాలలోన రసాయనాల లక్షణాలే

కారణమంటారు శాస్త్రజ్ఞులు. అన్ని రంగులకంటే నీలిరంగు మంట అత్యధికమైన ఉష్ణోగ్రత నిస్తుందని చెబుతారు. నిత్యము మన ఇళ్ళల్లో వాడే స్టౌలలో కూడా నీలిరంగు మంటకే ప్రాధాన్యం.

**4. వాయువు :** గాలి నైట్రోజను+ఆక్సిజనుల మిశ్రమమని 4:1 నిష్పత్తిలో ఇవి వుంటాయని విజ్ఞానశాస్త్రము చెప్తున్నది. అందులోని నైట్రోజను జడమని, ఆక్సిజను చురుకుదనాన్ని తగ్గించడాని కిది సహకరిస్తుందని కూడా చెబుతున్నది. సాధారణ ఉష్ణోగ్రత, పీడనాల వద్ద వాయురూపంలో కనిపించే యీ రెండు మూలకాలతో కూడి మిశ్రమమైన గాలి అధిక పీడనము, అల్ప ఉష్ణోగ్రతలను కల్పిస్తే – 190°C వద్ద ద్రవంగా మారుతుందని అప్పుడది నీలిరంగులో ఉంటుందని రసాయనశాస్త్రం తెలియజేస్తుంది.

**5. భూమి :** భూమి మధ్యపొరలలో, అగాధాల్లో అంతులేనంత ఇనుము వుందని, అదే భౌమాయస్కాంతము లాగా పనిచేస్తుందని భూగర్భ శాస్త్రజ్ఞులు చెప్పేమాట. ఇనుమురంగు నలుపే కదా.

ఎంతటి నేర్పుతో నీ నల్లని రంగును పంచభూతాలకు పంచావయ్యా నారాయణా!

**సీ.** **బలహీనుడౌ బిడ్డ – బలియుడౌ నందాక**
**ప్రత్యేకవసతులు – వారికిత్తు**
**రంగవైకల్యమౌ – నదనపుటర్హత**
**ఉద్యోగముల నీయ – నూళ్ళనేల**
**తాతముత్తాతల – తప్పుల ఫలితంబు**
**మనుమని కిత్తురు – మహినినేడు**
**సాధించినామని – సామాజిక సమత**
**మురియుచు నున్నారు – దొరలునేడు**



**తే.గీ.** **అన్ని యంగాల యునికియు – నగ్రవర్ణ**
**మందు జన్మంబు శాపాలె – యయ్యొ దేవ!**
**దొడ్డధాళివట్టములోని – దొడ్డవేల్పు!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ** **21**

**భావము :** ఈనాటి సామాజిక, రాజకీయ పరిస్థితులను తెలియజేసే పద్యమిది.

మనకు స్వాతంత్ర్యం రాకపూర్వం ఏదైనా పదవి లేక చదువు కావాలంటే కేవలము యోగ్యతను నిర్ణయించేది బుద్ధికి సంబంధించిన తెలివితేటలు. కాని స్వతంత్రం వచ్చాక పరిస్థితుల్లో చోటు చేసికొన్న మార్పుల్లో యీ క్రిందివి ప్రధానమైనవి. 1. కులము, 2. అంగవైకల్యం. వీటినే 'రిజర్వేషన్లు' అంటున్నారు. వీటినేర్పాటు చేసేటప్పుడు అంబేద్కరు, గాంధీ వంటి వారి దృక్పథము ఇలా ఉండినది.

ఒక కుటుంబములో పదిమంది పిల్లలుంటే అందులో ఒకడు బలహీనంగా మరియొకడు అంగవైకల్యంతో పుట్టాడనుకొందాం. అలాంటప్పుడు బలవంతులైన ఇతర పిల్లలతో సమానంగా వీరు ఎదగలేరు కనుక వీరికి కొన్ని అదనపు సౌకర్యాలు కల్పించుదామని భావించారు. అనగా పౌష్టికాహారము ఎక్కువగా ఇవ్వడం, కొన్ని టానిక్కులు, మందులు మొదలగువానిని యిచ్చి, వైద్యుల సలహాలమేరకు వారు తక్కిన అందరితో సమాన ఆరోగ్యస్థాయికి వచ్చేవరకు తగిన వసతులు కల్పిస్తే కొంతకాలానికి వారు పుంజుకొంటారు. వారి మధ్య అసమానతలు లేకుండా జాగ్రత్తపడతారు.

అగ్రకులాలవారిలో అర్హులున్నప్పటికి వారు అణచివేతకు గురియవుతున్నారు. ఈ ఆవేదన వెళ్ళబోసుకుంటే మీతాత, ముత్తాతల కాలంలో మమ్ములనిట్లా అణచి వేశారు కదా అని జవాబిస్తున్నారు.

రిజర్వేషన్లు కల్పనలో సామాజిక సమత్వాన్ని సాధించినామనే భ్రమలో ఉన్నారు. అణచివేతకు గురియయినవారు ఎందుకైనా యీ అగ్రకులాల్లో పుట్టినావెూ, మాకు అంగవైకల్యముంటేనైనా బాగుండేది అని అంగలార్చుతున్నారు.

**సీ. జీవన రథమిది - చెన్నుగా సాగంగ**
**నరనారు లిద్దరు - నడుపవలయు**
**ఎవ్వరు కుంటినా - నేగునా నరదమ్ము**
**చక్కని నడకతో - సద్దులేక**
**హెచ్చుతగ్గు లనెడు - హేయవుభేదాలు**
**మానిన నాడుగా - మనికికలుగు**
**నందల మెక్కంగ - నందరు కోరంగ**
**బోయీ లెవరు సామి - సాయపడగ**

**తే.గీ. కాన నొక్కడు నేతగా - వాని నంటి**
**యితరు లందరు నేగంగ - నెసగు ప్రగతి**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! 22**

**భావము :** సమాజములో కనీసప్రమాణము కుటుంబము. అంటే భార్యాభర్తలు. తమ సంసారజీవితమనే రథానికి వీరిరువురు చక్రాలవంటివారు. ఒద్దికతో ఇద్దరు కలిసి సహజీవనం జరిపినపుడే వారి జీవితాలు సుఖమయంగా, సంతోషమయంగా ఉండగలవు. అలా కాకుండా వీరిద్దరిలో ఏ ఒక్కరికైనా హెచ్చు, తగ్గు అనే భేదాలు అంటే ఆంగ్లంలో తెలిపే 'సుపీరియరు', 'ఇన్ఫీరియరు కాంప్లెక్సు'లు ఏర్పడినవంటే ఆ సంసారం సవ్యంగా సాగదు. కొట్లాటలు, పీకులాటలు, ఇరువైపుల బంధువుల జోక్యాలు, ఇరుగుపొరుగు వారికి కూడా ఈ తలనొప్పులు అంటించిన వారవుతారు.



భార్యాభర్తలిద్దరికి సమానబాధ్యతలు, సమానసుఖాలు అని భావించితేనే సుఖంగా ఉండగలరు. ఇంతేకాక ఒక కుటుంబంలో నల్గురు సంపాదించేవారుంటే ప్రతియొక్కరు ఆధిపత్యం తమకే కావాలనుకుంటే ఆ సంసారం ప్రగతిని పొందలేదు. ఇది ఎలా ఉంటుందంటే నేనే పల్లకిలో కూర్చోవాలి, మిగిలిన వాళ్ళందరు నన్ను మోయాలి అనేటట్లవుతుంది. కనుక దీనికి పరిష్కారమొకటే. ఆ ఇంటిలో ఒక్కడి చేతికే పెత్తనమిచ్చిన ఆతని నాయకత్వంలో కుటుంబమంతా నడచిననాడు ఆయిల్లు సర్వతోముఖంగా అభివృద్ధి చెందడమేకాకుండా ఇరుగుపొరుగు వారికి కూడా ఆదర్శంగా ఉంటుంది. వారి అభివృద్ధి దేశాభివృద్ధికి సహజంగానే తోడ్పడుతుంది.

**సీ. వనిత తానుండెగా - వంటింటి శశమట్లు**
**నేండ్లు పూండ్లుగ చిక్కి - యిరుల యందు**
**రామమోహన రాజు - రక్షింప సతులను**
**నీశ్వరు త్యాగాల - నింతిపెరిగె**
**వీరేశలింగము - వెలుగిచ్చు గురజాడ**
**మహిళల బ్రతుకుల - మార్పుతేగ**
**స్త్రీజాతి యెంతయో - ఋణపడె వీరికి**
**నతుల జేయుదు నిట్టి - నరవరులకు**

**తే.గీ. కలికిబాధలు పూర్తిగా - తొలగలేదు**
**సృష్టి జేయుమా కొందర - శ్రేష్ఠనరుల**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! 23**

**భావము :** ఈ పద్యంలో భారతీయస్త్రీల గతచరిత్ర వర్ణింపబడింది. యుగయుగాలనుండి పురుషులు స్త్రీలను ఈ మూడు పనులకే వాడుకొన్నారు.

1. కడుపునింపడం – అంటే భర్తయొక్క మరియు అతని కుటుంబ సభ్యులకు వేళకు తగినట్లుగా వండి వార్చడం.

2. కడుపుపండడం – అంటే భర్తయొక్క వంశాభివృద్ధికి భార్య తోడ్పడాలి.

3. పడకసౌఖ్యం – భర్త కోరుకొన్న సమయంలో అతడి కామదాహాన్ని తీర్చడం

ఇలా జీవితాలను వెళ్ళదీస్తున్న స్త్రీజాతి చరిత్రలో రెండువందల సంవత్సరాలక్రితం నాటికి సమాజంలో ఎన్నో దురాచారాలు చోటు చేసికొన్నాయి. ప్రధానంగా 1. బహు భార్యత్వం. 2. సతీ సహగమనం. 3. బాల్య వివాహాలు మొ॥ బెంగాలు రాష్ట్రములో రాజా రామమోహనరాయ్ అనే మహానుభావుడికి ఈ రకమైన ఆచారాలు జుగుప్సాకరంగా తోచి అప్పటి ఆంగ్లప్రభువులతో సంప్రదించి క్రొత్తచట్టాలు చేయించారు. సతీ సహగమనాన్ని, బహుభార్యాత్వాన్ని ఆపించగలిగాడు. బాల్యవివాహాలను ఆపేందుకు శారదాచట్టం తీసుకువచ్చారు. వితంతువివాహాలను ప్రోత్సహించారు. అటుపై ఏర్పడిన దురాచారాలను తొలగించుటకై ఈశ్వర చంద్రవిద్యాసాగరు పూనుకొన్నారు. స్త్రీవిద్యకు కంకణం కట్టుకొన్నారు. రాజారామమోహనరాయ్‌గారు తెచ్చి మార్పులను అమల్లో పెట్టించారు. ఈ మహనీయుల, సంఘసంస్కర్తల ప్రభావం ఆంధ్రదేశం దాకా ప్రసరించింది. అందువలననే కందుకూరి వీరేశలింగము, గురజాడ అప్పారావు మొదలైన మహానుభావుల ఉద్బోధల ద్వారా మహిళలజీవితాలలో వెలుగురేకలు విచ్చుకొన్నాయి.

ఈనాడు మహిళాలోకం పురుషులతో సమానంగా కొన్ని రంగాలలో పురుషులకంటె ముందంజలో కొన్ని రంగాలలో కూడా ఉన్నారంటే అదంతా పై సంస్కర్తల మరియు వారి అనుయాయుల చలువే.



అయితే ఈనాటి స్త్రీకి ఎటువంటి కష్టాలులేవు అని చెప్పే దశలో లేము. మరి ఇప్పుడున్న కష్టాలు తొలగిపోవాలంటే మరికొందరు మహానుభావులు ఈ భూమిపైకి రావాలి. ఆ పనిని జరిపించవలసింది నీవే నరసింహా! నీవే, నీవే.

**సీ. మంచిని కల్గింప – మ్రగ్గెడు వానికి**
**మార్గంబు తెల్పంగ – మనుజజాతి**
**వంచనలే చేసి – ఫలమును పొందంగ**
**వాంఛించు చుండును – వసుధలోన**
**నిట్టి మనుజులుండ – నెదుగునా దేశమ్ము**
**దెంత చేసిన గాని – యెన్నడైన**
**కష్టించు పనిలోన – కలిగెడు తృప్తిని**
**నెందరో పొందుట – నిలనునేడు**

**తే.గీ. ధర్మసూత్రాల వల్లింప – ధర్మమగునె**
**ఈ యధర్మంబు బాపంగ – నెపుడు రాక?**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహా! 24**

**భావము :** కష్టాలలో నుండే మనిషికి సహాయం చేయాలని కొన్ని మార్గాలను చూపిస్తారు సజ్జనులు. అయితే వీటిని ఆసరాగా చేసికొని వంచనలను చేసి అటువంటి సహాయాలను పొందాలని మనుష్యులు ప్రయత్నిస్తూ ఉంటారు. ఇటువంటి విధంగా తప్పుడు పనులకు వత్తాసుపలుకుతూ, అక్రమమార్గాల ద్వారా ధనార్జన చేస్తున్నారు.

ఉదాహరణకు ఒక ఉద్యోగి చనిపోతే అతని కుటుంబం పోషించేవారులేక వీధిలో పడుతుంది. ఈ దౌర్భాగ్యాన్ని అరికట్టేందుకు ప్రభుత్వము ఉద్యోగి భార్యకు లేదా ఎదిగిన బిడ్డలుంటే వారిలో ఏ ఒక్కరికైనా

ఉద్యోగమిస్తుంది. తద్వారా ఆ కుటుంబం తమకు తాముగా నిలదొక్కుగోగలుగుతుంది. ఇట్లు చేయడం ప్రభుత్వ విధానమైతే కొన్నిచోట్ల జరిగిన, జరుగుతున్న అవకతవకలు ఎలా ఉన్నాయంటే-

చనిపోయిన ఉద్యోగులకు ఏమాత్రం సంబంధం లేనివారు. ఎక్కడో ఉంటే వేర్వేరు విధవల వద్దకుచేరి వారికి ప్రభుత్వ ఉద్యోగాలిప్పిస్తామని, అందుకు కొంత సమర్పించుకోవాలని చెప్పి, వారి దగ్గర డబ్బు గుంజుకొని చనిపోయిన వారి భార్యలు వీరే అని తప్పుడు పత్రాలు చూపించి వారికి ఉద్యోగాలిప్పించడం.

ఒక ఉద్యోగికి భార్యావియోగం కలిగింది. పిల్లలు పెద్దవారయి స్థిరపడ్డారు. ఎటువంటి బాధ్యతలు ఆ ఉద్యోగికి లేవు. తనకు వచ్చే పెన్షనుతో సుఖజీవనము చేస్తున్నాడు. కాని తాను చనిపోతే పెన్షను పొందేటందుకు ఎవరు లేరు కదా అని ముసలితనంలో పెళ్ళాం కావాలని పెళ్ళి చేసుకొనే దొరలిప్పుడు ఎక్కువవుతున్నారు.

ఈ విధంగా మోసాలుచేస్తూ వక్రమార్గాల్లో సంచరించేవారు పెరుగుతుండగా దేశాభివృద్ధి ఎలా జరుగుతుంది?

శ్రమైకజీవనసౌందర్యాన్ని అనుభవించే మనుష్యులెంత మంది ఉంటున్నారు? ధర్మసూత్రాలను వల్లించినంత మాత్రం సరిపోదు. ఆ సూత్రాలను ఆచరణలోకి తీసుకువస్తేనే అభివృద్ధి.

**యదా యదాహి ధర్మస్య**
**గ్లానిర్భవతి భారత!**
**అభ్యుత్థాన మధర్మస్య**
**తదాత్మానం సృజామ్యహం**

అని చెప్పావు కదా! ఎప్పుడొస్తావు స్వామీ!



**సీ. మంచిచెడ్డలగను - మార్గంబు తెల్పంగ**
**మతమను పేరును - మనుజుడిడెను**
**ఒక్కొక్క ప్రాంతాన - నొక్కొక్క కాలాన**
**నొక్కొక్క యుగకర్త - యుద్భవించె**
**నందరు తెల్పిరి - యాత్మతత్త్వమ్మునే**
**అసలైన సత్యమ్ము - ననుగమింప**
**నదియేమి చిత్రమో - యన్ని కాలాలలో**
**నన్ని దేశాలలో - నర్థరహిత**

**తే.గీ. మైన మారణహోమాలు - మతముపేర**
**నెవరు సంస్కరించగలరు - భువిని జనుల**
**దొడ్డధాళవట్టములోని దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! 25**

**భావము :** మతము అనగా ఏది మంచి ఏది చెడు అని తెలిసికొని తదనుగుణంగా నడచుకోవడమే. ఈ విధంగా మార్గదర్శనం చేసే పెద్దలు ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క కాలంలో పుట్టారు.

ఎవరు బోధలు చేసినా అందరిమార్గాలు స్థూలంగా ఒకటే. పరోపకారమే పుణ్యకార్యము. పరపీడనమే పాపకార్యం అని అన్ని మతాల సారాంశం.

కాని చిత్రమేమిటంటే అన్ని దేశాలలో అన్ని కాలాలలో ఆయా మతాల పేరు పైననే మారణకాండలు జరిగినవి. ఇప్పుడు కూడా జరుగుతున్నవి. మరి ప్రపంచ జనులందరిని కూడ ఒకే రకంగా సంస్కరించడం మానవులకు సాధ్యమేనా నృసింహమూర్తీ!

**సీ. దళితోద్ధరణకయి - ధర్మమూనిననాడు**
**వారిని తేవలె - పైకిగాని**

**మద్యంబు సేవించి – మైకాన పొర్లాడ**
**సమతది కలుగును – సరియెయదియు**
**బసవన్న వలె తాను – బద్ధకంకణుదైన**
**బదుగు జనంబులు – బాగుపడరె**
**రామానుజుల వోలె – నామామృతము పంచ**
**కులమతభేదమ్ము – కూలిపోదె**

**తే.గీ. మేటి యొజ్జలు తెల్పిన – బాటనడిచి**
**మనిషి సుఖమందునట్లుగా – మలచుమీవు**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 26**

**భావము :** ఈ పద్యంలో కొందరు మతసంస్కర్తలు చేసిన గొప్పకార్యాలను ప్రస్తావించడం జరిగింది.

దళితులను ఉద్ధరించాలని కంకణం కట్టుకున్న వారు నిజంగా అందుకై కృషి చేయాలి. అంటే ఇతరఅగ్రకులాల వారితో సమానంగా వ్యవహరింపబడే స్థితికి తీసుకురావాలి.

ఆ విధంగా శ్రమించిన మహానుభావులు ఈ కాలంలో మహాత్మాగాంధీ, లాల్‌బహదూరుశాస్త్రి వంటివారు. ప్రాచీనులలో బసవేశ్వరులు మరియు రామానుజాచార్యులు వంటి వారున్నారు.

సత్ప్రవర్తన కలిగినవారు ఏ కులంలో జన్మించినా వారు శివపూజ చేయుటకు అర్హులేనని, కలం వలన బ్రహ్మణ్యం రాదని బోధలు చేసి అన్ని కులాల వారిని సమస్థితిలో చూచిన మహనీయుడు బసవేశ్వరుడు.

రహస్యమైన తిరుమంత్రాన్ని ఉపదేశంపొంది దాన్ని జపిస్తే భగవంతుని అనుగ్రహం పొందుతామని తెలుసుకొన్న రామానుజాచార్యులు ఒకవేళ అనర్హుడైన వాడికీ యుపదేశంచేస్తే చెప్పినవాడి తల బ్రద్దలౌతుందని



గురువులు చేసిన హెచ్చరికను లెక్కచేయకుండా తన తలబ్రద్దలైనా ఫరవాలేదని అనేక మందికి భగవదనుగ్రహం కలుగుతుంది కదా అని గుడిగోపురమెక్కి అక్కడినుండి జనులందరి దృష్టిని తనవైపుకు మరలించుకొని అక్కడి నుండే ఆ రహస్యమంత్రాన్ని అందరు జపించమని అరిచి చెప్పాడు.

పెద్దవాడైనాక దేశమంతా తిరిగి కులమతభేదాలను ప్రక్కకునెట్టి వైష్ణవాన్ని వ్యాప్తి చెందించాడు.

భక్తిప్రాధాన్యతను జనులకు వివరించి సన్మార్గంలోనికి అగ్రకులాలు, నీచకులాలు అనే తేడా లేకుండా నడిపించాడు.

కాని ఈనాడు జరుగుతున్న ఉద్ధరణ ఎలా ఉందంటే క్రిందనున్న వారు మద్యం సేవిస్తుంటే వారితోపాటు పైనున్నవారు కూడా ఆ మద్యాన్ని సేవించి వీరితో సమానంగా మైకంలో తూలుతూ ఉండే సమానత్వాన్ని తీసుకువస్తున్నారు.

హే ప్రభూ! సద్గురువులు చూపిన మార్గంలో నడిచి మానవులు ఎదిగేటట్లు చేయవయ్యా!

**సీ. మానవచరితలో – మహిమాన్వితంబైన**
**కాలంబు గడచును – కనులముందె**
**నిన్ననుగమనించి – నేడు రేపును కూడ**
**జాగరూకత తోడ – చనగవలయు**
**రేపను దానికి – రూపూహలే గాని**
**నిలుచునో నిలువదో – తెలియరాదు**
**వర్తమాన మొకటె – కర్తవ్యమును చేయ**
**నాలసించితివేని – నదియుజారు**

**తే.గీ. నిట్టి సూత్రాలనెన్నియో – బట్టి పట్టి**
**యాచరణ శూన్యనయితినే – నాదిదేవ!**

**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ!** **27**

**భావము :** మానవుని జీవితంలో కాలము పాత్ర చాల ప్రధానమైనది.

పెద్దలు తెల్పే విషయము ఏమిటంటే గతములో జరిగిన మంచి చెడ్డలను తెలిసికొని భవిష్యత్తులో జరుగవలసిన దానికి తగిన ప్రణాళికలు వేసుకొని వర్తమానములో చేయదగిన పనులను చేయుమని.

అయితే వీటన్నింటిని వినడంవరకే జరిగింది. నోటితో చెప్పడం వరకు అయినది. ఎంతవరకు కర్తవ్యనిర్వహణాధర్మంలో నేను కృతకృత్యురాలినయ్యాను? అని ప్రశ్నించుకోవలసి వస్తున్నది. ఓయీ స్వామీ! నిన్న, నేడు, రేపులను సక్రమంగా వినియోగించుకొనేటట్లు చేయవయా.

**సీ. బాల్యంబులో చూడ – భక్తి యెంతయు మెండు**
**రాగరాగ నదియు – రహితమగును**
**యవ్వన మదమున – నగుపించు దేవుండు**
**బూటక కథలుగా – పొల్లుగాను**
**నడిమివయసులోన – కడగండ్లు తానొంద**
**వాని నధిగమింప – పడునుపాట్లు**
**వృద్ధాప్యమంతలో – వెదకుచువచ్చును**
**నాలుబిడ్డల చింత – లధికమగును**

**తే.గీ. ఎప్పటెప్పటి కా చింత – లుప్పతిల్ల**
**నరుని కెప్పుడు పొసగు నీ – నామజపము**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ!** **28**

**భావము :** ఈ పద్యములో మానవుని వివిధ దశలలో ఆధ్యాత్మికత పొందే మార్పులు చెప్పబడినవి.



బాల్యదశలో ఇంట్లో ఉండే పెద్దలను అనుకరించే లక్షణం అధికంగా ఉంటుంది. కాబట్టి పెద్దలు చేస్తున్నట్లుగా దేవతార్చనకు పిల్లలు ఎగబడతారు. వారు చేసినట్లు నామోచ్చారణ చేస్తుంటారు. పెద్దలు నేర్పితే శ్లోకాలు, పద్యాలు, పాటలు నిస్సిగ్గుగా పాడతారు. నమస్కారాలు చేస్తుంటారు.

అదే పిల్లలు యవ్వనదశకు వచ్చేసరికి దేవతా సంబంధమైన కథలన్నీ కల్పితాలుగా అగుపిస్తాయి. అర్థరహితాలని తోస్తాయి.

నడివయసు వచ్చేటప్పటికి మరల దేవుడిపట్ల భక్తి ఏర్పడుతుంది. ఎందుకంటే అప్పటికే ఎన్నో రకాలైన కష్టనిష్ఠూరాలతో తల బొప్పులు కట్టియుంటుంది. ఆ బాధలను తొలగించుకోవడానికి తప్పనిసరిగా దేవుడి సహాయాన్నే అర్థిస్తారు.

ఇంతలో ముసలితనం కూడా వస్తుంది. పెళ్ళాం, పిల్లల చింతలధికమౌతాయి. వీటితోనే జీవితమంతా గడచిపోతుంది. భగవంతుని ఈ దశలో కూడా తలచుకొంటారు. ఎందుకంటే తమకు కలిగిన చింతలను పోగొట్టమనేటంత వరకే ఆ భక్తి పనిచేస్తుంది.

ఇదే విషయాన్ని ఆదిశంకరులు భజగోవిందంలో ఇలా చెప్పారు.

**బాలస్తావత్క్రీడాసక్తః**
**తరుణస్తావత్తరుణీ సక్తః**
**వృద్ధ స్తావచ్చింతాసక్తః**
**పరే బ్రహ్మణి కోఽపి న సక్తః**

బాల్యంలో ఆటలపై, యవ్వనంలో తరుణులపై, వృద్ధాప్యంలో చింతలపై మానవులదృష్టి తగుల్కొని యుంటుంది. పరబ్రహ్మమును తలచుకోవడానికి ఎవనికి ఏ దశలోను ఆసక్తిలేదు – ఇదీ పై శ్లోకాని కర్థము.

**సీ. నరహరినిను చేర - నవవిధోపాయాలు**
**పన్నుగా తెలిపిరి - భాగవతులు**
**మానవసేవయే - మాధవసేవని**
**మహనీయులాడిరి - మహితరింప**
**మాతృభూసేవలో - మానాల ప్రాణాల**
**నొడ్డుటే ఘనమని - రుర్విజనులు**
**ప్రాకృతవిద్యల - పరిశోధనలు చేసి**
**ప్రజల కందించుటే - పరమమనిరి**

**తే.గీ. ఇటుల తెల్పిన విధముల - నే యొకటియు**
**చేయనే లేదు నన్నేమి - చేతు శ్రీశ!**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! 29**

**భావము :** ఈ పద్యములో లోకంలో ఉత్తములని చెప్పబడేవారు చేసే పనులను గురించి తెల్పబడినవి.

భాగవతంలో ప్రహ్లాదుడు భగవంతుని చేరుటకు తొమ్మిది రకాలయిన భక్తివిధానా లున్నాయని తెలిపాడు.

**మ. తనుహృద్భాషల సఖ్యమున్, శ్రవణమున్ దాసత్వమున్ వందనా**
**ర్చనముల్, సేవయు, నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్, చింతనం**
**బను నీ తొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స**
**జ్జనుఁడై యుండుట భద్రమంచుఁదలతున్ సత్యంబు దైత్యోత్తమా!**

1. సఖ్యం, శ్రవణం, దాస్యం, వందనం, అర్చనం, సేవనం, ఆత్మనివేదనం, కీర్తనం, చింతనం అని భక్తిమార్గాలు తొమ్మిది. వీనిలో ఏ ఒక్క పద్ధతిలోనైనా నిన్ను అనుసరించడానికి తగిన కృషి నేను చేయలేదు.



2. ఎందరో మహానుభావులు కష్టాలలో ఉన్న మానవులకు చేయూతనిచ్చి అదియే భగవంతుని సేవగా తలచారు. ప్రసిద్ధిని పొందారు.

3. మరికొందరు దేహదారుఢ్యమును పెంచి వివిధాస్త్రశస్త్రప్రయోగ నైపుణ్యమును పెంచి మాతృదేశరక్షణకై తమప్రాణాలను పణంగాపెట్టి ఘనత వహించారు.

4. మరికొందరు బుద్ధిమంతులు రేయింబవళ్ళు పరిశోధనాశాలలలో కృషిచేస్తూ మానవులు సుఖజీవనము సాగించుటకై వలసిన వస్తువాహనాల తయారీ మరియు రోగాలను దూరంగా ఉంచేందుకు కావలసిన మందులు మొదలుగా ఎన్నింటినో కనిపెట్టుటకై శ్రమిస్తున్నారు. అంటే కర్తవ్య నిర్వహణయే భగవదర్చన అని వీరి సిద్ధాంతము "WORK IS WORSHIP" అని ఆంగ్లంలో అంటారు.

ఇట్లెన్నో విధానములున్నను నేను ఏ ఒక్కటియు ఈ జన్మలో చేయలేకపోయినాను. ఇట్టి నన్నేమి చేతువయ్యా దేవా!

**సీ. చెట్టంత మనుజుండు - పిట్టంత మనసును**
**వశవర్తిగా నుంచ - వలనుపడదె?**
**సిగరెట్టు తననెంతొ - ఛిద్రమ్ము చేసినా**
**పొగయు బూడిదగాగ - సొగయుచుండు**
**సారాయి త్రాగిన - సత్తువవచ్చునే**
**గుల్లచేయునుగాక - యిల్లునొళ్ళు**
**మాదకద్రవ్యముల్ - ఖైదీగ తను చేయ**
**వదిలించుకోలేక - వాడువాడు**

**తే.గీ. నిందు దేహంబుపోషింప - నేదిగలదు**
**పుష్టి నీకున్న పోనిమ్ము - నష్టపరచు**

**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ!** **30**

**భావము :** ఈ పద్యములో మానవులు ఆయా వ్యసనాలకు బానిసలగుట దానివలన పొందు కష్టనష్టాలు చెప్పబడినవి.

చెట్టంత ఎత్తుగా ఎదిగిన మానవుడు పిట్టంత చిన్నగా ఉన్న మనస్సును అదుపులో నుంచుకోవడం సాధ్యపడునా?

సిగరెట్టు, బీడీ, చుట్టవంటి పొగాకుతో కూడినవాని పొగలను పీలుస్తూ, అవి తనశరీరాన్ని చెడగొట్టినా అవి విడిచే పొగలాగా, బూడిదలాగా మారేవరకు వాటిని వదిలిపెట్టడు.

సారాయి, కల్లు, విస్కీ, బ్రాందీ వంటి మత్తుకల్గించే ద్రవాలను త్రాగుటకు అలవాటు పడినవారికి ఈ ద్రవాల వలన ఎటువంటి బలము వస్తుంది? వారి ఇళ్లు సంపదలను కోల్పోయి గుల్ల అవుతుంది. మరియు ఒంట్లో ఉన్న కాలేయము, మూత్రపిండాలు వంటి అంగాలు చెడి ఒళ్ళు గుల్లవుతుంది.

మాదకద్రవ్యాలు సేవించినవారు తమకు తాము ఆ పదార్థాలకు బందీలుగా మారిపోతారు. ఈ స్థితినుండి వదిలించుకోలేక అతడు వడలిపోతాడు.

ఇప్పుడు తెల్పిన వానిలో శరీరాన్ని పోషించడానికి ఏ ఒక్క పదార్థములేదు. శరీరానికి బలమివ్వడమటుంచి రోగాలపాల చేస్తుంది దేవా! ఇలాంటి వారికి మనోబలమిస్తే తప్ప యీ వ్యసనాలనుండి బయటపడలేరు. ఆ శక్తిని ప్రసాదించు స్వామీ! వాడు వాడు అనడంలో మొదటిది అతడని రెండవ దానికి వాడిపోతాడు అనే క్రియగా తెలిసికోవాలి.



**సీ. హరియె వైద్యుండన – హరి హరీ నమ్మితి**
**హరికెద్ది యర్థమో – యరయనైతి**
**హరియింత్రు ధనమును – హరియింత్రు బలమును**
**హరియింప లేరయ్య – ధరరుజంబు**
**నరహరి నామంబు – నానిన నరునకు**
**హరియించు రోగాల – ననెడుమాట**
**వినక నే చెడితయ్య – వెన్నుడా వినవయ్య**
**యెట్టుల బాపుదో – యేమిసేతొ**

**తే.గీ. చెప్పుకొనగరాని రోగాల – చిక్కితేను**
**కరుణ కాపాడు మా దేవ – కంజనేత్ర!**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ!** **31**

**భావము :** రోగాలతో వ్యాపారం చేసే వైద్యుల గురించి యీ పద్యం.

'వైద్యో నారాయణో హరిః' అనేది ఆర్యోక్తి. అయితే 'హరి' యనే పదానికెన్నో అర్థాలున్నవి. ఈనాటి వైద్యులు ధనమును, బలమును ప్రజలనుండి హరియిస్తున్నారే తప్ప రోగములను హరియింపజేయకున్నారు నరహరీ. నీ నామాన్ని సదా తలచెడువారికి రోగాలు తాముగా తగ్గిపోవునను మాట తెలిసినను, ఆచరణలో పెట్టక నేను చెడినాను. హా శ్రీహరీ! బయటకు చెప్పుకోలేని రోగాల పాలయినాను స్వామీ! కరుణించి కాపాడవయా.

వినకనే చెడితయ్య అనడంలో వినకుండానే అని మరియు వినక నేను అని రెండువిధాలుగా చదవవచ్చు. ఎత్తుగీతిలోని రెండవపాదంలో 'కాపాడు మా దేవ' ను రెండువిధాలుగా చదువుకోవచ్చు. కాపాడుమా దేవ 'యని' కాపాడు మా దేవ' యని.

సీ. శివునాజ్ఞ లేనిది - చీమైన కుట్టునా
యనుచు పల్కుదురయ్య - యవనిజనులు
తండోప తండాల - తప్పులు చేయుచు
తమకేమి పాపమ్ము - తగులదంద్రు
శివుడవై యుందువు - చిరకాల సాక్ష్యమై
జీవుని కర్మాల - త్రోవనెరుగ
తమసాటి యెవరంచు - తలనేల ద్రిప్పరు
సంచితకర్మంబు - మంచిదైన

తే.గీ. పాపకర్మాల ఫలితంబు - వచ్చినపుడు
నిన్ను దూరుదు రెన్నుచు - నేరములను
దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!
నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! 32

**భావము :** 'శివునియాజ్ఞ లేనిది చీమైనా కుట్టదు' అనేది ప్రపంచంలో చెప్పుకొనే ఒక సామెత.

ఎన్నెన్నో తప్పుడు పనులుచేస్తూ, వాటిని చేయడానికి ప్రేరకుడు శివుడేయని, ఈ కారణంగా తమకు పాపములు రావని వారు తలంతరు. కాని ప్రభూ! జీవులు చేసే ప్రతిపనికి నీవు సాక్షిగా ఉంటున్నావు. అయితే లోకులు తమ పూర్వకర్మముల ఫలము మంచిదిగా వచ్చినపుడు తమకు సాటి యెవ్వరులేరని గర్వంతో తలను క్రిందికి దింపరు. అదియే పాపకర్మల ఫలితములు ఎదుర్కొనవలసి వచ్చినపుడు నిన్నే తిట్టుకొందురయ్యా, అవి నీవే యిచ్చినావందురు.

సీ. క్రూరమృగమ్ముల - క్రూరత్వమును మించె
మనుజుల చేతల - మానసాల



మానవాకృతి నూని - దానవకృత్యాల
చేయంగ కంటినే - క్షితితలాన
రామాయణములోని - రాక్షసమాయల
నేనాడొ మించిరి - దానవారి!
భారతకథలోని - నేరస్థులందరు
ప్రబ్బియుండిరి నేడు - పలువిధాల

తే.గీ. నవతరించుట యెన్నడో - యవని పైన
కల్కిగా నంతదనుకీవు - పల్కవేమి?
దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!
నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! 33

**భావము :** హే నృసింహమూర్తి! ఈ కాలపు మానవసమాజంలో మనుష్యులవలె ఆకారములో కన్పించుచున్నారు. కాని వారు చేసే పనులు, మానసికవికృతులు అటవీమృగాలైన సింహాది క్రూరజంతువుల క్రూరత్వమును మించినవి. క్రూరమృగాలు తమ తిండికోసం, రక్షణకోసం మాత్రమే ఇతరజంతువులను, మానవులను హింసిస్తాయి. కాని మానవుడట్లు కాదే. పైన కనిపించేది మానవ ఆకారమే. కాని చేస్తున్న పనులు మాత్రం దానవులవి. రామాయణభారత కథలలో చెప్పుకొంటున్న రాక్షసులు, కుటిలురు, నేరస్థులు త్రేతాద్వాపరయుగాల నాటి వారి కన్నా మిక్కిలి క్రూరచరిత్రులు.

వీరినందరిని మట్టుపెట్టగా భూమిపై నీరాక ఎప్పుడు? కల్కి యవతారమని వింటున్నాము కాని - అంతవరకు నీవు పల్కవాయేమి?

సీ. వ్యాజస్తుతులతోడ - వ్యాజనిందలతోడ
కమ్మగా వ్రాయంగ - కాసుకవినె?

నిత్యసత్యాలెన్నొ - నేర్పుతో గుప్పింప
ధర్మపురీ వాస - ద్రష్టగాను
భోగియై జోగియై - భువిచూచి కవియైన
వేమన్న నేగాను - వెలుగుచూప
చంపకోత్పలమాల - చక్కంగ కైసేయ
రామదాసును గాను - రామ! నేను

తే.గీ. నబల నజ్ఞాని నవివేకి - నతి విమూఢ
నైన నను నెట్లు బ్రోచెదో - యవనిపైన
దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!
నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! 34

**భావము :** ఈ పద్యములో నేను మెచ్చుకొనే కవులు - వారి కవిత్వములోని పసలను బట్టి గొప్పవారని నాకనిపించిన వారిని ప్రస్తుతిస్తున్నాను.

కాసుల పురుషోత్తమకవి - ఆంధ్రనాయకశతకమును రచించారు. ఇందులోని ప్రతిపద్యములో వ్యాజస్తుతి లేదా వ్యాజనింద అలంకార ముందును. ఎట్లుచెప్పినా భక్తి అంతఃసూత్రము.

శేషప్ప - ధర్మపురి నివాసి - ఈయన శ్రీనరసింహశతకమును అతి సామాన్యులు కూడా అర్థము చేసికొను విధంగా లౌకికవిషయాలను, ఆధ్యాత్మికవిషయాలను బహుచక్కగా వ్రాసినాడు.

వేమన తొలుత భోగిగా, అటుపై యోగిగామారి పల్లెపట్నం తేడాలేక దేశమంతా తిరిగి తాను తెలిసికొన్న సత్యములను చక్కని ఉపమానములతో పామరులకు కూడ అర్థమయ్యే విధంగా లలితమైన ఆటవెలదుల్లో ఇమిడించాడు.

కంచెర్ల గోపన్న భద్రాద్రీశునికి గుడిగోపురాలు కట్టించి భౌతిక పద్ధతిలో సేవ చేయుటయేకాక ఎన్నో భక్తిగీతములను భజనల కనుకూలముగా వ్రాసినాడు. అంతేకాక అక్షరసుమాలతో చంపకోత్పలములను చేసి ఆ స్వామి గళసీమకు సమర్పించాడు. 'దాశరథీ కరుణా పయోనిధీ' అనే మకుటంతో ఉన్న యీ శతకపద్యాలు తెలుగువారి నోళ్ళల్లో ఎప్పుడు నానుతుంటాయి.



ఇటువంటి వారి లాగున నేనేమి వ్రాయలేక పోయానే. అబలను, అజ్ఞానిని, అవివేకిని, అతివిమూఢను అయిన నన్ను నీవెట్లు కాపాడెదనో స్వామీ!

రామశబ్దానికి రాముడని, స్త్రీ అని అర్థాలు రెండింటిని అన్వయించుకోవచ్చు.

సీ. నాదముపాసించి - నరహరీ! నినుచేర
త్యాగరాజును కాను - తగనుపాడ
పదముల వేలల్లి - పరమాత్మ నినుపాడ
నన్నయ్య క్షేత్రయ్య - నసలుగాను
పలుకుపలుకులోన - చిలికించి మధువును
పోతన్న లా వ్రాయ - పూతగాను
కష్టాలొ నష్టాలొ - కడదాక నినునమ్మి
గోపన్న నేగాను - గుడినికట్ట

తే.గీ. నిట్టు లెందరో చేసిరి - యెన్నొకృతుల
కూర్చకొండంత తృణమిదే - కొనుము స్వామి!
దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!
నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! 35

**భావము :** ఈ పద్యములో భక్తకవులు, వాగ్గేయకారులైన వారిని ప్రస్తుతి చేస్తున్నాను. మరియు నా అశకత్తను తెలుపుకొంటున్నాను.

"సంగీతజ్ఞానము భక్తివినా సన్మార్గముగలదే' యని నాదోపాసన చేస్తూ రామచంద్రునిపై వేలకొలది కీర్తనలు వ్రాసి, పాడి ఆనాటి ప్రజలను గానామృతంలో ఓలలాడించాడు. భక్తిమార్గాన్ని అనుసరించాడు త్యాగరాజు.

అన్నమాచార్యుడు తిరుపతి వేంకటేశ్వరుని ముద్రగా పెట్టుకొని వేలకొలది భక్తి, శృంగార, వైరాగ్య కీర్తనలను రచించాడు.

మువ్వగోపాలుని ముద్రతో క్షేత్రయ్య శృంగారవైరాగ్యగీతాలను రచించాడు.

రామచంద్రుడు పలికిస్తే పలుకుతున్నానని, దానిని పలికితే భవహరమగునని భాగవతాన్ని ప్రతిపద్యంలో మందారమకరందాలను స్రవింపజేస్తున్నట్లు మధురాతిమధురంగా వ్రాశాడు పోతన్న.

కంచెర్లగోపన్న కష్టాల, నష్టాలనెన్నో భరించి భద్రాచలములో గుడి కట్టించినాడు.

ఈ విధముగా భక్తాగ్రేసరులెందరో ఎన్నోవిధములుగా నిన్ను సేవించినారు. వీరందరివలె గొప్ప పనులు నేను చేయలేను. తృణమును పోలిన యీ చిన్నిశతకమును అందుకొనుము స్వామీ!

నాల్గవ పాదములోని 'గోపన్న నేగాను గుడిని కట్ట' అనడాన్ని రెండు విధములుగా చదువుకొని అర్థము చేసికోవచ్చు. గుడిని కట్టుటకు నేను గోపన్నను కాదు అని ఒక అర్థము. నేను గోపన్నను కాదు, గుడిని కట్టలేను. అని రెండవ అర్థము.

'కృతులు' అనే పదానికి పాటలు మరియు పనులు అనే అర్థాలున్నవి. పై వాగ్గేయకారులవలె, కవులవలె నేనేమీ చేయలేక పోతిననే ఆర్తి ఇక్కడ వ్యక్తీకరించబడినది.



**సీ. నీ నామ భజనలో నిన్ను - నిల్పుదమన్న**
**మాయదారిని చూపు - మాయనాకు**
**నీ గుణగానంబు - నెమ్మి చేయుదమన్న**
**రాగమేది? కలచు - రాగజలధి**
**నీ ఘనచరితను - నెనరుతో చదువంగ**
**నదియేమి నిద్రయో - యావహించు**
**నీ మూర్తి కర్చనల్ - నియతి చేయుదమన్న**
**నేమాల కెప్పుదు - నామమిడెద**

**తే.గీ. వందనాలను చేతును - పలుకునందె**
**మ్రొక్కుచుండ మనసు చుట్టు - దిక్కు దిక్కు**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! 36**

*f* ì=ò : భగవంతుని ఆశ్రయించేందుకు పెద్దలు చూపిన విధులెన్నో ఉన్నాయి. వాటి నాచరణలో పెట్టేందుకు ప్రయత్నించినపుడు నాకు కలిగే ఆటంకాల నిక్కడ వివరించాను.

భగవన్నామాన్ని భజనద్వారా మనసులో నిల్పుకొందామని ప్రయత్నించాను. కాని నిలువటం లేదు. మాయయేదో క్రమ్ముకొంటుంది. ఎక్కువసేపు భజన చేయలేను.

నీ గుణములను వర్ణించే పాటలెన్నోయున్నవి. అట్లు పాడుటకు ప్రయత్నించాను. మధురంగా పాడాలని అనుకొన్నా. కాని రాగమాలపించే శక్తి నాకు లేకపోయింది. దీనికి తోడు సంసారానికి సంబంధించిన అనురాగాల బంధాలు - భర్త, పిల్లలు వారికి సంబంధించిన వ్యవహారాలు గుర్తుకువస్తాయి. పాటలు కూడా ఎక్కువసేపు పాడలేకపోతాను.

నీ మహిమలను తెలిపే గొప్పపుస్తకాలు ఎన్నో సేకరించాను. ఇష్టముగా చదివేటందుకు ప్రయత్నించాను. కాని అదేమిటో నాలుగు పేజీలు చదివేటప్పటికి ఆవలింతలు, నిద్ర ముంచుకు వస్తాయి.

నీ విగ్రహాలకు అర్చనాదికాలు చేద్దామని ప్రయత్నించాను. కాని అట్లు చేయడానికున్న నియమనిబంధనలను పాటించడం అన్నిరోజుల్లో నాకు సాధ్యపడటంలేదు.

వందనాలను కూడా నేను మాటల్లోనే చేస్తున్నాను. శరీరము ఒక దిక్కుగా ప్రదక్షిణము చేస్తుంటే మనసు పది దిక్కులకు ప్రదక్షిణము చేస్తుంటుంది.

నవవిధభక్తిమార్గాల్లో ఇలాంటి మార్గాలన్నింటికీ నేను అనర్హురాలౌతున్నాను కదా దేవా!

**సీ. పుట్టుక నుండియు – గిట్టెడు వరకును**
**నాలోననే యుండి – నన్నుచూతె?**
**పొగడంగ నే పొంగ – తెగడంగ నే క్రుంగ**
**నిశ్చలమ్ముగ నీవు – నెగడుచుందె?**
**నిప్పులో కాలక – నీటిలో తడవక**
**నే కాల తడవగ – నివ్వటిలుదె?**
**నా శక్తి యల్పంబు – నీ శక్త్యనల్పంబె**
**యొక్కింత నాకీగ – తక్కువగునె?**

**తే.గీ. నీదు నంశంబు కానొకో – నేను దేవ!**
**యయిన జీవదేవులు నాగ – ననుట యేల?**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 37**



**భావము :** భగవద్గీతలో ఇచ్చిన జీవదేవ లక్షణాలను చదివి జీవుడిగా దేవునికి చేసిన వేడికోళ్ళు ఇలా ఉన్నాయి.

ప్రతిప్రాణిలో జీవుడు, దేవుడు పుట్టుకనుండి గిట్టువరకు కలిసేయుంటారు. జీవుడు నిందాస్తుతులకు క్రుంగడం, పొంగడం జరుగుతుంటుంది. కాని దేవుడు వీటికి నిశ్చలంగా ఉంటాడు. నిప్పులో కాలేది నీటిలో తడిసేది జీవుడు. కాని దేవునిశక్తి అనల్పము. జీవుడు దేవునిలోని ఒక అంశమే అన్నప్పుడు జీవుని ఉద్ధరణకు మరికొంత శక్తిని ప్రసాదించవా దేవా?

**సీ. గీతబోధనవిని – బ్రాతిగా నను కొంటి**
**శీతోష్ణముల సమ – స్థితిని పొంద**
**ఎండలో నడుగిడ – మండిపోయెను కాళ్ళు**
**తనువంత స్వేదాన – తడిసిపోయె**
**చలిగాలి నొక్కింత – సరకుసేయక పోవ**
**వ్రేళ్ళు కొంకర్లొంది – వ్రేలదొడగె**
**తుమ్ములు దగ్గులు – తోడ్తోడ నేతెంచె**
**నూపిరాడగ నీక – యుసురు దీసె**

**తే.గీ. ముదిమిలోన తొలి సమర్త – మోజు తీరె**
**నొల్ల శీతోష్ణసమతను – నల్లతేడ!**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్న నే – నారసింహ! 38**

**భావము :** గీత బోధించిన సమతాస్థితిని అందుకోవడంలోని కష్టాలిక్కడ వ్యంగ్యంగా హాస్యస్ఫోరకంగా పేర్కొనబడినవి.

గీతలోని భక్తియోగంలో శ్రీకృష్ణపరమాత్మ అర్జునునికి బోధచేస్తూ సమతాస్థితినందుకొన్న భక్తుడు నాకు మిక్కిలి ప్రియుడంటాడు. అది చదివి

ద్వంద్వాలలో ఒకటయిన శీతోష్ణసమత్వాన్ని అలవరచుకొనే ప్రయత్నంలో పడ్డాను.

అది ఎండాకాలము. అయినా ప్రయత్నం చేయాలికదా. బయటకు అడుగుపెడితే కాళ్ళు మండిపోయాయి. బొబ్బలెక్కాయి. కెవ్వున కేకలు వేయాలని ఉన్నప్పటికి బలవంతంగా నిగ్రహించుకొన్నాను. కన్నీళ్ళు ఆగకుండా కారిపోతున్నాయి. మరోవైపు ఒళ్ళంతా చెమటలు. ఎంతగా అంటే స్నానం చేసినట్లుగా తడిసిపోయాను. ఇలా వేడిమిని సహించలేకపోయాను.

ఇంతలో శీతాకాలం వచ్చింది. చలిగాలిని లెక్కచేయకుండా పనులు చేసుకోవాలని ప్రయత్నించాను. కాని శరీరము వినిపించుకోవటము లేదు. చేతివ్రేళ్ళు కొంకరలుపోయి ఏ వస్తువును పట్టుకోలేక పోతున్నాను. కాలివ్రేళ్ళు కొంకరలుపోయి నడకకు అడ్డుతగులుతున్నవి. ఒళ్ళంతా వణుకు.

కొంచెంసేపటికే తుమ్ములు, దగ్గులు కూడా వెంటబడి వస్తున్నాయి. ఊపిరాడటం కష్టమైపోయింది.

ఇదంతా చూడగా ఎలా ఉందంటే ముసలి వయస్సులో తొలిగా సమర్త అయితే ఎలా ఉంటుందో అలాగున్నది. ఇప్పుడు తెలిసింది కృష్ణుడు చెప్పిన ద్వంద్వాల్లో ఒక్కటైన శీతోష్ణ సమతకు ఈ నా శరీరం పనికిరాదని. కనుక దీనినింతటితో విరమిస్తున్నాను దేవా!

**సీ. దేశంబు పేదంద్రు – దినములు గడుచుటే**
**కష్టమనెద రుంద్రు – కల్లుపాక**
**కూటికి కఱవంద్రు – గుడ్డకు కొఱతంద్రు**
**జూదంబులన్నింట – జోగుచుంద్రు**
**పుణ్యభూమిది యంద్రు – పొలతి దేవతయంద్రు**
**మానభంగాలవి – మానవకుంద్రు**



**కవిగాయక వరుల – ఘనభూమి యిదియంద్రు**
**సాహిత్యసంగీత – సభకురారు**

**తే.గీ. రామకృష్ణులు పుట్టిన – భూమి యంద్రు**
**యిష్టపడరు ప్రజలు తల్వ – కష్ట మంద్రు**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 39**

**భావము :** గొప్ప విషయాలు చెప్పుకోవడానికి, ఆచరణలో వాటిని చూపించడానికి నేటిసమాజంలో ఉన్న పరిస్థితు లీ పద్యంలో వివరింపబడినవి.

దేశం పేద దంటారు. దినములు గడవటం కష్టమై పోయిందంటారు. కాని కల్లు పాకలకు కొదవలేదు. అందులోకి చేరుతున్న ప్రజలకు కొదవలేదు. వాటికి వచ్చే ఆదాయాలకు కొదవలేదు. ఈ కాలములో ఆదాయ సముపార్జనకు ప్రభుత్వమే వాటిని ప్రోత్సహించేటందుకు ఎక్కువ మందికి లైసెన్సులిస్తున్నది.

దేశము పేదదంటే అర్థము. అక్కడ ఎక్కువమంది దరిద్రులున్నారనే కదా. దరిద్రులంటే కూటికి గుడ్డకు కష్టపడేవారే కదా.

అయితే యిలాంటి దరిద్రపుప్రజలున్న దేశంలో అనేక రకాల జూదాలున్నవి. వాటిలో పణం పెట్టేందుకు కలిగినవాళ్ళు, మధ్యరకం కుటుంబీకులే కాదు, కూటికి, గుడ్డకు కొఱత ఉండేవాళ్ళు కూడా వీటిలో మునిగి తేలుతూ ఉంటారు. అన్ని రకాల పాతకాలపు జూదాలతోపాటు ఇటీవల కాలంలో క్రికెట్టు ఆటపై పెట్టే జూదాలు కూడా ఎక్కువ అని జనులందరికీ తెలిసిన విషయమే.

మన భారతదేశము మిక్కిలి పవిత్రమైనది. పుణ్యపురుషులు, పతివ్రతామతల్లులు ఇక్కడ ప్రభవించినారు అనే విషయమై ఉపన్యాసాలను

గంటల తరబడి వినిపింపజేస్తారు. స్త్రీలిక్కడ దేవతలతో సమానమంటారు. కాని ప్రతిరోజున మానభంగాల గూర్చిన వార్తలే.

మనకవులు రచించిన గొప్పకావ్యాల గురించి మన సంగీతంలోని మహిమలను, వాటిని పాడి అదే జీవనంగా నమ్ముకొన్న మహనీయులను గురించి ఘనంగా చెప్పుతారు.

కాని అటువంటి సాహిత్యసభలకు లేదా సంగీతసభలు ఏర్పాటుచేస్తే అక్కడికి ప్రేక్షకమహాశయులు రారు.

రాముడు, కృష్ణుడు, శంకరులు, మధ్వులువంటి మహనీయులీ గడ్డపైన పుట్టారు. ఈ నేలపై పెరిగారని చెప్పుకోవడమే కాని వారి మహిమలను తెలియజేసే సభలను పెడితే వచ్చే జనము తక్కువే స్వామీ! ఇదయ్యా, ఈ నాటి మాదేశ ప్రజల సంస్కారము.

**సీ. తెల్లవారిన యంత – తెల్లవారిచ్చిన**
**తేనీరొ కాఫియో – తీసికొనుట**
**క్రాపుల ఫ్రాకుల – కట్టింగు లందున**
**నించుకైనను భేద – ముంచకుంట**
**యిటులెన్నొ యలవాట్ల – నెంచిగొంటిమిగాని**
**సమయ నిర్దేశంబు – సాగనీము**
**క్రమశిక్షణావిధి – క్రమము నేర్వముగాని**
**నేర్చితి మవలీల – నెఱసులెన్నొ**

**తే.గీ. మంచి మాత్రము గ్రహియించు – మానవుండు**
**కోటి కొక్కండు గల్గునా – కూర్మరూప!**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ!** **40**



**భావము :** మంచిచెడు అలవాట్ల స్వీకరణ ఈ పద్యంలో ప్రస్తావించబడింది. బ్రిటీషు వాళ్ళ పరిపాలన మూడువందల ఏండ్లు సాగినది. ఇంతకాలములో మనము వాళ్ళనుండి గ్రహించినదేమిటంటే తెల్లవారేసరికి ప్రతియింట్లో కాఫీ లేక టీ త్రాగాలి ప్రతియొక్కరు.

వీరి రాకకు పూర్వము కాఫీ, టీలు తెలియవు మనదేశస్థులకు. త్రాగాలనుకుంటే ఉన్నవాళ్ళు పాలు, పేదవాళ్ళయితే అంబలి, కలి వంటివి త్రాగేవారు.

రెండవది దుస్తుల విషయము – పురుషులు పాంట్లు, షర్టులు మొ॥ ధరించడం, క్రాపుల కట్టింగులు ఇంగ్లీషు వాళ్ళనుండి అనుకరించే విషయం రెండుశతాబ్దాల క్రితమే జరిగిందని ఆనాటి చిత్రపటాలనుంచి మనకు తెలుస్తున్నది. స్త్రీల విషయానికి వస్తే ఈ అరశతాబ్దిలో పరాయిదేశాల వేషాలననుకరించడం బాగా ఫ్యాషన్ అయిపోయింది. జుట్టు విషయం అంతే. మొత్తానికి ఈ కాలంలో దేశీయమైన వస్త్రధారణ, కట్టు, బొట్టూ అని పిలిపించుకొనేదంతా అనాగరికంగా భావిస్తూ పరిహరింపబడుతున్నది.

అయితే పరాయిదేశస్థులంతా పనికిరానివారేనా? వారిలో గొప్ప గుణాలు లేవా? మనం తెలుసుకోవలసిందేమీ లేదా? అంటే అది తప్పే అవుతుంది. ఎందుకంటే వారిని చూచి నేర్చుకోవలసినవి కూడా ఎన్నో ఉన్నవి. ఉదాహరణకు సమయపాలన, బిగ్‌బెన్ గడియారం కదలికల లెక్కింపు స్టాండర్డుగా తీసుకొనబడింది ప్రపంచానికి. ఏ సభ అయినా, సమావేశమయినా, కోర్టు, కచేరీలయినా, సాధారణ ఆఫీసులు, బడులు అన్నిచోట్ల సమయాన్ని ఖచ్చితముగా పాటించేవారు ఇప్పటికీ పాటిస్తున్నారు. బ్రిటీషువారు అధికారములో ఉన్న రోజుల్లో అది అతిక్రమిస్తే శిక్షలుండేవి. దేశం స్వతంత్రమైనాక కాలానుక్రమణిక అనుసరణకు ప్రజలు స్వతంత్రం ఇచ్చేశారు. ఎవరికి ఇష్టము వచ్చినట్లు వాళ్ళురావడం. ఇదేమని అడిగిన

వారికి నాయిష్టంవచ్చినట్లు వస్తాను. నీకు చేతనైనది నీవు చేసికో అనే సమాధానాలు పెద్దలనుండి పిన్నలవరకు వస్తున్నవి. ఈ ఒక్క లక్షణము అవలక్షణంగా మారడంతో జరిగే అనర్థాలు ఎన్నో. ప్రతిఒక్కరి జీవితములో ఇదే రీతి కార్యాలయాల్లో ఉద్యోగుల క్రమశిక్షణపై ఎంత దుష్ప్రభావం చూపుతున్నది? సభలు, సమావేశాల వరిష్ఠప్రయోజనాలను నీరు గార్చుతున్నది.

రెండవ ఉదాహరణగా క్రమశిక్షణ తీసుకొందాం. ఆంగ్లేయుల పాలనలో ప్రతి ఉద్యోగి క్రమశిక్షణతో తప్పనిసరిగా మెలగితీరవలె. ఏ రకమైన విధుల్లోనైనా క్రమశిక్షణను ఉల్లంఘిస్తే చట్టాలు, శిక్షలు కఠినంగా అమలు చేసేవారు. స్వతంత్రం వచ్చాక దీనినికూడ మన ప్రజలు, పాలకులు అందరు బేఖాతరు చేశారు. అందువలననే అన్ని రంగాల్లో అవినీతి, అలసత్వం విచ్చలవిడిగా రాజ్యం చేస్తున్నాయి.

హే ప్రభూ! కూర్మరూపంలో ఉండి సముద్రములోని భూమిని హిరణ్యాక్షుడు ముంచుతుంటే ఉద్ధరించావు. కాని మానవుడు బుద్ధిజీవిగా ఉంటూ ఇతరులలోని అవలక్షణాలను సొంతం చేసికొంటూ వారిలో ఉండే మంచి లక్షణాలను గ్రహించలేకపోతున్నాడు. కోటికొక్కడు ఇట్లు సల్లక్షణాలను తమలో జీర్ణించుకోవడానికి, అన్వయించుకోవడానికి ఉంటాడేమో. అలాంటివారి సంఖ్యను హెచ్చించవయా.

**సీ. గీతార్థమరయంగ – లోతుగా యోచించి**
**కష్టసుఖంబుల – కలయగంటి**
**కష్టసుఖాలలో – కలరూపు చెడకుండ**
**యొక్కటై నిలుచుట – యక్కజంబు**
**నిందకు స్తుతులకు – నొందక సొగయక**
**స్పందింపకుండుట – సాధ్యమగునె**



**స్పందన లేనట్టి – బ్రతుకులో రసికత**
**లోపింప జడమగు – లోకమందు**

**తే.గీ. జ్ఞానులు మునులు దర్శింప – గలుగునట్టి**
**సమత యనెడు స్థితి యెటుల – సాధ్యమగునొ**
**దొడ్డధాళపట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మి నానయ్య నిన్ను నే – నారసింహ! 41**

**భావము :** నా దృష్టి అనేకమార్లు గీతలో బోధించిన సమతాస్థితి మీదనే నిలబడసాగింది. ఆ ఆలోచనల తోటే ఆ పదముయొక్క అర్థాన్ని లోతుగా ఆలోచించసాగాను. ద్వంద్వాలను సమదృష్టితో చూడగలిగినవాడే సమతాస్థితి నందుకొంటాడు. శీతోష్ణములను సమంగా గ్రహించే విషయం, అందులకై నేపాటుపడిన విషయం 38వ పద్యంలో వివరించబడింది. ఈ పద్యంలో నిందాస్తుతులను సమదృష్టితో చూచే విషయం ప్రస్తావిస్తున్నాను.

కష్టసుఖాల ననుభవించేటప్పుడు దిగులు చెందకుండా మరియు ఆనందంతో తేలిపోకుండా ఉండడమనే లక్షణమే చాల ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. మనలను నిందించినపుడు బాధపడకుండా ఎలా ఉండగలము? అట్లే ఎవరైనా పొగడితే సంతోషించకుండా ఉండడం కూడా సాధ్యంకాదు.

అలా ఉండడమంటే రాయిలా బ్రతకడమే కదా అనిపిస్తుంది. రాయిని పువ్వుతో స్పృశించినా, ముల్లుతో స్పృశించినా ఎటువంటి స్పందనను చూపదు కదా. ఈ రకంగా రాయిలా లేదా నిర్జీవంగా ఉండే బ్రతుకులో రసికత్వముండదే. రసికత్వములేని బ్రతుకు వ్యర్థంగా తోస్తుంది కదా. కనుక ఇది సరికాదేమో అనిపిస్తున్నది. మరి జ్ఞానులు మునులు మొదలగువారు దర్శించి అనుభవంలోకి తెచ్చుకొంటున్న సమతాస్థితి ఎట్లు సిద్ధిస్తున్నది అనేది ప్రశ్నార్థకంగానే నిలిచింది స్వామీ!

**సీ. కులము వంశంబని – కులుకుచు పలుకరే**
**గుణహీనుడైనచో – కులమదేల?**
**డబ్బు డబ్బుంచును – ధనికుల చుట్టరే**
**దానమీయగలేని – ధనమదేల**
**బలిమిని గలదని – బాగుగ పొగడరే**
**బలహీను గావని – బలమదేల?**
**చదువు నేర్చితి మంచు – మదమున పొదలరే**
**వినయ రహితమైన – విద్యయేల?**
**తే.గీ. దేశసేవ యూపిరనుచు – తిరుగుటేల?**
**ఒక్కరికి కూడ నుపకార – మొదవనపుడు**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్పు!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 42**

**భావము :** ఈ ప్రపంచంలో జనులు కొన్నిలక్షణాలకు ఎక్కువ విలువనిస్తున్నారు. వాటిలో కొన్నింటిని ప్రస్తావిస్తూ ఆ లక్షణాలకున్న ఉపయోగాలను వివరిస్తున్నాను. ఆయా ఉపయోగాలను ఆయా లక్షణాలు సాధించలేనప్పుడు అవి యెంతగొప్పవని మనం మురిసిపోయినా వాటివలన ప్రయోజనముండదు.

అభిజాత్యానికి భారతీయులు మొదటినుండి ఎక్కువ విలువనిస్తూవచ్చారు. ఫలానవంశంలో, ఫలానాకులంలో పుట్టినవారంటే వారికి గౌరవమెక్కువగా ఇస్తారు. అలాంటిది కులమొక్కటే గౌరవహేతువు కాదు. వ్యక్తియొక్క గుణంకూడ మంచిదైనపుడే దానికి విలువ అని లోకం చూస్తే తెలుస్తుంది.

డబ్బు ప్రపంచాన్ని శాసిస్తుంది. డబ్బులేనివాడు డబ్బుకు కొఱగాడనేది సామెత. డబ్బువలన ఎన్నో వస్తువాహనాలను, ప్రాపంచికసౌఖ్యాలను



పొందవచ్చుననేది జగమెరిగిన సత్యం. అయితే డబ్బువలన ఎన్నో లాభాలున్నప్పటికీ ఐహికసుఖాలున్నప్పటికీ, తద్వారా పొందవలసిన ముఖ్యప్రయోజనాల్లో దానం ఒకటి. దీనివలన పారమార్థిక ప్రయోజనముంది. సత్పాత్రునికి దానమిస్తే, అది పరమాత్మకు ప్రీతికరమౌతుంది. ఆ విధంగా దానమియలేనిచోట ఆ డబ్బు వృథాయే.

ప్రపంచంలో మనుష్యులు తమనుతాము రక్షించుకొనుటకు తగినవిధంగా బలాన్ని పెంపొందించుకొంటారు. ఇలాంటి వారిలో ఎక్కువ బలాన్ని పెంపొందించుకొన్నవారు తమనేకాక ఆపద సమయాల్లో బలహీనులకు రక్షగా నిలబడతారు. ఇలాంటి శారీరక బలాన్ని చూచి యిచ్చే ఉద్యోగాలుకూడా ఆనాడు, ఈనాడు ఉన్నవి. అయితే బలహీనులకు అండగా నిలబడలేనివాడు ఎన్ని కండలను పెంచినా ప్రయోజనమేమిటి?

చదువునేర్వడం ఒక గొప్పసాధన. చదువువలన ఎన్నో ప్రయోజనాలు పొందుతాడు మానవుడు. కాని దానివలన మదమేర్పడితే అది ఇతరులకుపయోగపడదు సరికదా తనకు కూడా హానిచేస్తుంది. వినయములేని విద్య రాణించదు.

ఇట్లే నేను దేశభక్తుడను, దేశానికి సేవచేయడమే నా ఊపిరి అని తిరిగే నాయకమ్మన్యులు ఈ కాలంలో కొల్లలుగా ఉన్నారు. దేశమును ప్రేమించడమంటే దేశప్రజలను ప్రేమించడమే. వారియొక్క న్యాయపరమైన అవసరాలను తీర్చడానికి యథాశక్తి సాయపడడమే. దీనికి డబ్బులుండే వారే పనికివస్తారని నియమంలేదు. ప్రతిమనుష్యుడు సాటివారిపట్ల దయాదాక్షిణ్యాలు కలిగియుండడం, అక్రమార్కులనుండి సాధ్యమైనంత రక్షణ కలిగించడంవంటి లక్షణాలన్ని నిజమైన దేశభక్తులకుంటాయి.

**సీ. అధికారి యదలించు – నణగియుండిన వాని**
**నణకువ విలువల – నరయబోడు**

తప్పుకల్గినవాడు - తైతక్క లాడును
ముందువెనుక గనక - సందువెదకు
తనవంతు తప్పెంత - పనివాని తప్పెంత
కనను పూనుగొనక - కనలుచుండు
మంచిచెడ్డల తెల్పు - మానిసి తొలగించు
మెరమెచ్చులను వారి - దరినిజేర్చు

తే.గీ. నీ ప్రపంచపు కథలివి - యెన్నొ నేడు
చెలగు చుండెను ధర్మమ్ము - చీలుచుండ
దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!
నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! **43**

**భావము :** కొందరు అధికారులు తమ క్రింద పనిచేస్తున్న వారిలో నోరు పారేసుకొనే ఉద్యోగుల జోలికిపోరు. కాని అణగిమణగి పనిచేసేవారిపై కారాలు మిరియాలు నూరుతుంటారు. పొగరుబోతులు, బాధ్యతారహితులు అయినప్పటికి వారిని లొంగదీసుకొనుట చేతకాక బలహీనులు సజ్జనులు అయినవారిలో చిన్నతప్పు దొరలినా ముందువెనుక చూడక వారిని సాధించే పనులు చేస్తారు. ఇట్లు అధికారులు తమ విధి నిర్వహణ చేసేటప్పుడు తన వలన జరిగిన తప్పెంత, క్రిందిస్థాయి ఉద్యోగి చేసిన తప్పెంత అనునది గమనించక కోపగించుచుందురు.

ఎవడైతే యజమాని మంచికోరి రాబోయే మేలుకీళ్ళను వివరిస్తాడో అలాంటి వారి బోధనలను అతడు ఇష్టపడడు. పైకి పొగడుతూ ఉండేవారిని దగ్గరకు తీసుకొంటాడు. ఇలాంటి అధికారులు, ప్రభువులు బహుశా పాతకాలాల్లోకూడా ఉండియుంటారు. కాని నేడిట్టివారి సంఖ్య అధికమైనది నారసింహా! ధర్మమిట్లు అధర్మంగా రూపుదిద్దుకొంటోందయ్యా.



సీ. ఫాషనిదేనని - భామినుల్ పరుగిడె
నర్థరహితమైన - నార్తితోడ
నంగప్రదర్శన - కనువైన దుస్తుల
ధరియించి సాగంగ - దారిలోన
సహజమర్కటులైన - సరసంపుదొరలింక
నూరకుందురె యిక - వీరిగాంచి
యలుసివ్వగా నేల - యలుక పొందగనేల?
యదుసు త్రొక్కుచు - కాళ్ళు కడగనేల?

తే.గీ. సిగ్గ ముగ్ధ మనోహర - శీలగాంచ
కడిదియై పోయెనోయి యో - కమలనాభ!
దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!
నమ్మి నానయ్య నిన్ను నే - నారసింహ! **44**

**భావము :** స్త్రీలు సుందరాంగుల మనిపించుకోవడానికి పడేపాట్లు ఇక్కడయివ్వబడినవి. ఈనాటి ఫ్యాషన్ ఇదేనంటూ ఎప్పటికప్పుడు స్త్రీలు తమవస్త్రాలకు, నగలకు ఇవ్వవలసిన దానికంటే ఎక్కువ ప్రాముఖ్యమిస్తుంటారు.

ఇది వ్రాస్తుంటే పేపర్లో చదివిన ఒక ఘటన గుర్తుకు వస్తున్నది. పారిసు నగరంలోని స్త్రీలు ఫ్యాషన్‌పట్ల అతిగా ప్రేమ పెంచుకొంటారు. ఫ్యాషన్ అంటే క్రొత్తశైలి అతివేగంగా మారిపోతుంటుంది. మనదేశంలో ఒకటిరెండు సంవత్సరాలపాటు లేదా కనీసం కొన్ని నెలలపాటైనా యాధోరణి కొనసాగుతుంది. కాని కొన్నిదేశాల్లో త్వరితంగా మారిపోతుంటుంది. ఇలాంటి దేశాల్లో ఫ్రాన్సు ఒకటి. ఆ దేశస్థురాళ్ళలో కూడా లేటెస్ట్ ఫ్యాషన్‌గా ఉండేదాన్ని నేనే, ఫ్యాషన్ ట్రెండ్‌సెట్టర్ నేనే అనే భావజాలంతో తిరిగే కొందరు స్త్రీలుంటారట. అందులో ఒకామె అంగడిలో బట్టలను కొని దర్జీ దగ్గరకు

వెళ్ళి కావలసిన డిజైనులో కుట్టమని ఆర్డరు చేసిన సాయంకాలానికి ఆ దుస్తులను రెడీగా ఉంచమన్నదట. అతడట్లే తయారు చేసియిచ్చాడు. ఈ యువతి ఆ క్రొత్త దుస్తులు ధరించి పార్టీకి వెళ్ళిందట. ఆ పార్టీలో యీమె ధరించిన క్రొత్తప్యాషన్ దుస్తులను ఎవరు పొగడలేదట. ఎందుకంటే ఆ రకమైన పాషను దుస్తులను ప్రొద్దున ఆఫీసులో చూశాం. ఇప్పుడిది పాతరకమే అని కొందరు స్త్రీలు గుసగుసలాడుకుంటుంటే ఈవె కన్నీళ్ళ పర్యంతమైనదట. ఇలాగ ప్రొద్దున క్రొత్త ప్యాషనుగా ఉన్నది సాయంత్రానికి పాతప్యాషనైనది అని ఆ స్త్రీలు ప్యాషన్లకిచ్చే ప్రాముఖ్యాన్ని, అలా కనిపించడానికి వాళ్ళుపడే తాపత్రయాన్ని చక్కగా వర్ణించినారు. ఈ సంఘటనలో వివరించినంత తీవ్రంగా కాకపోయినా మన దేశంలోని స్త్రీలుకూడా దీని ప్రభావానికి బాగుగానే లోబడుతున్నారు. ఈ కాలంలో స్త్రీ అందాన్ని ఎలా పొగడుతున్నారంటే ఆమె సెక్సీగా ఉందని చెప్పుకోవడంలోనే. ఇటువంటి దురదృష్టకర స్థితికి వచ్చామని ఎక్కువమంది స్త్రీలు తెలుసుకోవడం లేదు. పై పెచ్చు శరీరాంగ ప్రదర్శనలకు అనుకూలంగా ఉన్న దుస్తులను ధరించి పార్టీలకు, పెళ్ళిళ్ళకు ఇలా పబ్లిగ్గా ఉన్నస్థలాలలో తిరుగుతుంటారు.

వయసులో ఉన్న అబ్బాయిలు కోతుల్లాంటివారని సంస్కృతంలో చెప్పుతారు. అలాంటి సరసపుదృష్టి ఉన్న పురుషులు, ఆకతాయి గుణాలున్నవారు ఇటువంటి యువతులను, అందునా అంగప్రదర్శన చేస్తున్నవారిని చూచి ఊరికే ఉంటారా?

వీరి చూపులకు, మాటలకు, చేతలకు ప్రతిస్పందించే స్త్రీలు మమ్ములను ఇలా మాట్లాడారు ఇలా చేశారు అని చెప్పుకోవడం ఎలా ఉంటుందంటే బురదలో కాళ్ళుపెట్టడం, ఆపైన మంచి నీళ్ళలో కాళ్ళు కడుగుకోవడంలా ఉంటుంది.



సౌందర్యమనేది కేవలం బాహ్యమైన లక్షణాలతోనే కాదని మానసిక సౌందర్యమనేది మొదట స్త్రీలు అర్థం చేసికొంటే కదా పురుషులకు తర్వాత అర్థమయ్యేది. ఇంతకు చెప్పవచ్చేదేమిటంటే ప్రభూ కమలనాభా! అచ్చమైన మనోహరమైన శీలము గలిగిన స్త్రీల దర్శనము చాలా అపురూపమైపోతోంది. నానాటికి, పల్లె, పట్నం తేడా లేక బ్యూటీపార్లర్లు వెలుస్తున్నాయి. యవ్వనం, నడివయస్సు, ముసలితనం తేడాలేక అన్నివయస్సుల్లో ఉండే స్త్రీలు ఎగబడుతున్నారు బాహ్యసౌందర్య పోషణకు. అంతర సౌందర్యముపై దృష్టి లేనేలేదు.

**సీ. ఒక్కొక్క బ్రతుకులో – నొక్కొక్క విధమున**
**కష్టసుఖాలిచ్చి – కనుదెజగతి**
**ఒక కథయున్నట్లె – యొక కథయుండిన**
**రచయిత పొందదు – వ్రాతతృప్తి**
**ఒక చిత్రమున్నట్లె – యొక చిత్రముండిన**
**నిర్మాత పొందదు – నిండుతృప్తి**
**ఒక రాగమున్నట్లె – యొక రాగముండిన**
**గాయకు దనుకోడు – ఘనతగాను**

**తే.గీ. హే మహాకవి! నిర్మాత! – సృష్టికర్త**
**హే మహాగాయక! నటకా! – హే ముకుంద!**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మి నానయ్య నిన్ను నే – నారసింహ 45**

**భావము :** ఈ పద్యములో భగవంతునిలోని కవిని, నటుని, గాయకుని, నిర్మాతను వెలికితీసి ప్రస్తుతి చేస్తున్నాను.

కథారచయిత ఎవరైనా ప్రతికథలోను ఏదో ఒక వైవిధ్యం చూపిస్తాడు. అప్పుడే అతనికి మంచిరచయిత అనే తృప్తి కలుగుతుంది. ప్రజలనుండి కూడ మంచిఆదరణ లభిస్తుంది.

ఒక చిత్రకారుడు/ చిత్ర నిర్మాత కూడ గీసే/ తీసే ప్రతిచిత్రములోను క్రొత్తదనాన్ని చూపించినపుడే వారికి ఆనందము మరియు తృప్తి కలుగుతుంది. ‘ఆ చిత్రము/ సినిమా చూచినవారికి ఆనందానుభూతులను అందిస్తుంది.

ఒక ఉత్తమగాయకుడు కూడ కేవలం ఒకటి రెండు రాగాలను చక్కగా నేర్చుకొని పాడి తానొక శ్రేష్ఠ గాయకుడనని సంతోషించడు. ఎన్నోరాగాలను పాడినపుడు మాత్రమే ఉన్నత స్థితికి తానెదుగుతున్నట్లు తెలుసుకొంటాడు. అదేవిధంగా ఆ గాయకుని సామర్థ్యాన్ని ప్రత్యక్షంగా విని, చూచినవారే అతని ఘనతను గుర్తించగలరు.

ఇట్లాంటి ఘనులైన కళాకారులను కొద్దిమందిని మాత్రమే మనము ప్రపంచములో చూస్తున్నాము. కాని కోటానుకోట్ల మనుష్యులను అనేక సమానగుణాలతో సృష్టించి వారిలో ప్రతి యొక్కరికి కష్టసుఖాలిచ్చి, వాటిలో చిన్నతేడాలను కల్పించి ఒక్కొక్క బ్రతుకును ఒక్కొక్క కథగా మలిచావు. ఎవరి కథకు వారినే నాయికానాయకులుగా తీర్చిదిద్దావు. ఇలాంటి నిన్నుమించిన కథకుడు, నటుడు, నిర్మాత, గాయకుడు, సృష్టికర్త ఎవరు ఉంటారు? నీకు నీవే సాటి. సకల కళావల్లభుడవు, జగన్నాటక సూత్రధారివి నీవుకాక మరెవరున్నారు ముకుందా!

**సీ. నా భాష గొప్పని – నా భూమి గొప్పని**
**ద్వేషరోషాగ్నుల – తిరుగుచుంద్రు**
**దేహంబు నందలి – వివిధాంగములలోన**
**నొక్కటి పనిమాని – యూరకున్న**
**దేహి పాట్లెటులుండు – దేనిని గొప్పను?**
**యెఱుగరయ్య జనులీ – యింగితంబు**
**నే సమాజమయిన – హెచ్చుతగ్గులు మర్చి**
**యొకరి యవసర మిం – కొక్కరెతిగి**



**తే.గీ. మసలు కొనినచో నానాడు – మన్ననందు**
**పోరుమానుచు కావలె – చేరువగను**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్పు!**
**నమ్మి నానయ్య నిన్న నే – నారసింహ! 46**

**భావము :** ఈ ప్రపంచంలో నేను, నాదిగొప్ప అనుకోవడంలో గల మంచి చెడ్డలను ఈ పద్యంలో విమర్శించాను.

ప్రభూ! ఈ నీ సృష్టిలో ఎన్నో దేశాలు ఉన్నవి. ఆయాదేశాల భాషలు, సంస్కృతులు ఎన్నో విధములుగా ఉన్నవి. దేని ప్రత్యేకత దానికి ఉంటుంది. ఆయా దేశముల శీతోష్ణపరిస్థితులకు, అక్కడఉన్న వాతావరణాను కూలమును బట్టి ఆయా దేశాచారములుండును. అయితే ఇటువంటి విషయాలను అర్థము చేసికోకుండా ప్రతిదేశస్థుడు నాదేశమే గొప్పదని అట్లే ప్రతిభాష మాట్లాడేవాడు తనభాషే ప్రపంచంలో అన్నింటికంటె శ్రేష్ఠమైనదని వాదులాటలకు దిగుతూ, ఇతర దేశస్థులపట్ల, ఇతర భాషీయులపట్ల ద్వేషాన్ని పెంచుకొని రోషాగ్నులను ప్రేరేపిస్తూ రగిలి పోతుంటారు.

ఈ పరిస్థితి ముఖ్యంగా ఇప్పుడు ఆంధ్రదేశంలోనే దాపురించింది. ఇప్పుడున్న దేశపు దుస్థితిని చూస్తుంటే నాకొక్క పోలిక గుర్తు వస్తున్నది. మన దేహము చక్కగా పనిచేయాలంటే దేహములోని వివిధ భాగాలు తమ తమ పనులను సవ్యంగా నెరవేర్చాలి. నఖశిఖ పర్యంతములో ఏ ఒక్క చిన్న భాగము తను చేయవలసిన పని మానిందంటే శరీరి రోగగ్రస్తుడవుతాడు కదా. అప్పుడు తన శరీరములో ఈ భాగమే గొప్పది ఇది కాదని చెప్పగలడా?

ఇదే రీతిగా సమాజం కూడ. ప్రతిసమాజము కూడా వివిధకార్యాలు చేసే వ్యక్తులతో కూడియుంటుంది. ఒకరు చేసే పని గొప్పదని ఒకరిది నీచమని చెప్పరాదు. ప్రతియొక్కరు తాము చేయవలసిన పనినిచేస్తూ ఇతరులతో కలసిమెలసియున్నప్పుడే, ఒకరి అవసరానికి ఇంకొకరు

సహాయానికి వచ్చినప్పుడే ఆ దేశము, రాష్ట్రము లేక సమాజము అభివృద్ధిని చెందుతుంది. ఎత్తుగీతిలోని 'ఆనాడు'కు రెండర్థాలు, ఆదినము మరియు ఆ దేశము.

**సీ. అధికంబులై కొన్ని - యల్పంబులై కొన్ని**
**యాహారమై దేహి - నవనిబ్రోచు**
**నధికంబులై కొన్ని - యల్పంబులై కొన్ని**
**చేతలు దేహికి - శివముగూర్చు**
**నధికంబులై కొన్ని - యల్పంబులై కొన్ని**
**మాటలు దేహికి - మంచిచేయు**
**నధికంబుగా కొంద - రల్పమై కొందరు**
**సేవల దేహికి - చేయుచుంద్రు**

**తే.గీ. ఏది యెక్కువ తక్కువ - యింగితంబు**
**తెలిసి మెలగెదు మనుజుడే - ధీయుతుండు**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!**
**నమ్మి నానయ్య నిన్ను నే - నారసింహ! 47**

**భావము :** అధికములు, అల్పములు ఇవి మానవునికి ఏవి, ఎంతలో ఉండాలి అని ఒక క్రొత్తదృక్పథముతో తెలియజేస్తున్న పద్యమిది.

మనం స్వీకరించే ఆహారములో కొన్ని పదార్థాలు ఎక్కువగా కొన్ని పదార్థములు తక్కువగా ఉంటాయి. ఉదాహరణకు బియ్యము/ గోధుమలు/ రాగులు/ జొన్నలు ఎక్కువగా దానికంటె తక్కువగా కందిపప్పు/ శనగపప్పు/ పెసరపప్పు దానికంటె తక్కువగా నెయ్యి/ నూనె ఉంటాయి.

శాస్త్రీయంగా చెప్పుకొంటే కూడా పిండిపదార్థాలు ఎక్కువ మోతాదులో, దాని తర్వాత మాంసకృత్తులు, దానికంటె తక్కువ మోతాదులో క్రొవ్వుపదార్థాలు దానికంటె తక్కువగా లవణాలు, విటమిన్లు అన్నింటికంటె



ఎక్కువగా నీరు మనఆహారంలో ఉండాలని దీనినే సమతుల్య ఆహారమని చెబుతున్నాము.

బియ్యము, పప్పు, నెయ్యి, కూరలు వీటన్నింటితోపాటు అతితక్కువ పరిమాణంలో పసుపు, ఇంగువ, మిరియాలు, జీలకఱ్ఱ, దాల్చినచెక్క వంటి సుగంధద్రవ్యాలను వాడుకొంటున్నాము. శరీరనిర్మాణానికి, ఆరోగ్యాన్ని స్థిరంగా నిలుపుకోవడానికి ఆయా పదార్థాలు ఎంతెంత పరిమాణంలో వాడాలి అనేది మనకు అనుభవైకవేద్యమని వేరే చెప్పనక్కరలేదు కదా.

మానవులమైన మనకే కాదు. మనకు ఆహారాన్ని అందించే చెట్లు తీసికొనే పోషకాలు కూడా రెండురకాలుగా ఉంటాయని శాస్త్రజ్ఞులు చెప్తున్నారు. Macro Nutrients మరియు Micro Nutrients అని అంటే కర్బనము, నత్రజని, ఉదజని, ఆమ్లజని మొదలగువాటిని ఎక్కువ మోతాదుల్లో గ్రహిస్తాయి. కనుక వానిని స్థూలపోషకపదార్థములంటారు. తామ్రము, యశదము, గంధకము వంటివి తక్కువమోతాదులో గ్రహిస్తాయి కనుక వాటిని సూక్ష్మపోషకపదార్థములంటారు. జీవులు ఏవైనా తక్కువగా తీసికోవలసినవి ఎక్కువ చేరినా, ఎక్కువగా తీసికోవలసినవి తక్కువగా చేరినా అవి రోగగ్రస్తులుగా మారడం, అనతికాలంలో మరణించడం తథ్యం.

కనుకనే అధికంగా కొన్ని, అల్పంగా కొన్నిపదార్థాలు ఆహారరూపంలో జీవులను చేరి సంరక్షిస్తున్నవి.

కొన్ని రకముల పనులు ఎక్కువగా, కొన్ని రకముల పనులు తక్కువగా చేసినప్పుడే అవి మానవునికి మంచి చేయగలుగుతాయి.

కాళ్ళు, చేతుల కండరాల కదలికలు ఎక్కువగా ఉన్నప్పుడే దేహము ఆరోగ్యంగా ఉండగలదు. ఆ విధంగా మెదడును పనిచేయిస్తూ శరీరాంగాలను కదిలించే పనులు దేహానికి ఎక్కువగా కావాలి. అదేవిధంగా సృష్టి అవయవాలకు కూడ పని అవసరమే. అయితే అది అల్పంగా ఉండాలి.

ఈ రకంగా ఒకే శరీరంలోని అవయవాలు పనులలోని ఎక్కువ తక్కువలను తెలుసుకొని వ్యవహరిస్తే ఆ శరీరం చాలకాలం ఆరోగ్యాన్ని నిలబెట్టుకొంటుంది.

మనప్రపంచంలో మాటలకు, అందువలన కలిగే సంతోషదుఃఖాలకు, ఏర్పడే శత్రుమిత్రభావనలకు ఎంతో ప్రాధాన్యమున్నది. కనుకనే కొన్ని మాటలు ఎక్కువగా, కొన్నిమాటలు తక్కువగా ఉపయోగించాలి.

నీతిబోధలు, భగవత్పరమైనమాటలు, శాస్త్రజ్ఞానాన్ని అందించే మాటలు, వ్యాపారంలో ఉన్నప్పుడు లాభాలనార్జించేందుకు మాట్లాడేవి ఇటువంటివి ఎక్కువగానే ఉండాలి. పిల్లలను దండించేవి, పెద్దలను కూడ తప్పుదారినుండి సక్రమమార్గానికి మళ్ళించాలనేటప్పుడు కూడ తక్కువగానే మాట్లాడాలి. కోపంతో, రోషంతో, అసహనంతో ఉండేటప్పుడు వీలైనంత తక్కువగా మాట్లాడాలి. ఈ విధంగా మాటల ప్రభావముంటుంది కాబట్టి మంచి సంబంధబాంధవ్యాలను నిలుపుకోవడానికి ఒక ఇంట్లోనే కాదు సమాజంలో అందరితో మాటలసంబంధాన్ని సక్రమంగా వినియోగించుకోవాలి. కావున మాటలలో ఎక్కువ తక్కువలను బుద్ధితో నియంత్రించుకోవాలి.

మానవుడు సంఘజీవి. పుట్టిన దగ్గరనుండి గిట్టే వరకు ఎందరితోనో సంబంధాలు పెట్టుకోవాలి. అనేకమంది నుండి సేవలందుకోవాలి. మనము కూడా సేవలనందించాలి.

ప్రతివ్యక్తి జీవితంలోను తల్లిదండ్రులు, రక్తసంబంధీకులైన కుటుంబ సభ్యులు ముఖ్యంగా భార్యాభర్తలు ఎక్కువ సేవలనందించే వారుగా ఉంటారు.

డబ్బులు తీసుకొన్నప్పటికీ చేసే పనికి న్యాయంచేసస్తూ సేవలందించేవారు ఉపాధ్యాయులు, డాక్టర్లు, లాయర్లు, వ్యాపారాలు,



జీతబత్తెములకోసం పనిచేసేచోట యజమానులు ఇలాంటి వారుపైన తెల్పిన వారికంటే తక్కువస్థాయిలో ఉంటారు.

ఇరుగుపొరుగువారు, బజారు, రైల్వేస్టేషను, బస్సుస్టాండులలోనో మనదగ్గరఉండే వ్యక్తులతో ఆయా సమయాలకు తగినట్లు చిన్నచిన్న సేవలనెన్నో అందుకోవలసివస్తుంది. మరియు అందించవలసి వస్తుంది.

ఇలాగ ఎందరెందరితోనో ప్రతినిత్యం ప్రతిమనిషి సేవలందుకొంటాడు మరియు సేవలనందిసస్తూ ఉంటాడు. అయితే ఎక్కువసేవలు అందించవలసినచోట్ల తక్కువగా, తక్కువగా అందించవలసిన చోట్ల ఎక్కువగా సేవలందించేవారికి కష్టాలు, నష్టాలు, నిందలు తప్పవు.

కాబట్టి ప్రపంచంలో మనం మంచివ్యక్తులుగా మసలుకోవాలంటే పైన చెప్పిన నాలుగురకాలైన వానిని ఇంగితాన్ని ఉపయోగించి ఎక్కువ తక్కువలైన వానిని వింగడించుకోవాలి. ఈ పద్యార్థం చదివినాక భగవద్గీతలోని "యుక్తాహారవిహారస్య" అనే శ్లోకం గుర్తుకు వస్తుంది కదూ!

**సీ. ఇంట నుద్యోగాల - నెందరు చేసినా**
**నధిపతి యొక్కడై - యమరుచుండ**
**తక్కిన వారెల్ల - తనయాజ్ఞ పాటింప**
**శాంతిసౌఖ్యంబులు - సౌరుగొల్పు**
**నింటనే నిముడక - యెదురెదురైనచో**
**సుఖశాంతు లాయింట - సున్నయౌను**
**ఈ చొప్పువర్తించు - నిఖరాజరక్షక!**
**దేశాల రాష్ట్రాల - దిశలదిశల**

**తే.గీ. గృహములోన గెలువ గదా - గెలుచు రచ్చ**
**నాటి సామెత కాబోదు - నీటిమూట**

**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్పు!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 48**

**భావము :** నాయకత్వము, విధేయతల నీ పద్యంలో ప్రస్తావిస్తున్నాను.

ఒక కుటుంబంలో నల్గురు పనిచేస్తున్నారనుకొందాం. అందరు ఉద్యోగాలుచేసి ధనార్జన చేస్తున్నారు. అప్పుడు ప్రతివారు ఇంటిలో నా మాటే చెల్లుబాటుకావాలి. నాచేతిలోకే అందరు తమ జీతాలను పోయాలి అని అనుకొంటే ఆ యిల్లు వృద్ధిలోకి వస్తుందా?

ఇట్లా కాకుండా ఆ నలుగురు కలిసి వారిలో ఎక్కువ శ్రమపడగలిగేవాడు కుటుంబఅవసరాలను సమర్థంగా తీర్చగలిగే వాడిని నాయకుడిగా భావించి, తమకు అవసరమయే కొంతధనాన్ని తాముంచుకొని మిగిలినసంపాదనను నాయకుడన్న వాని చేతికిస్తే ఆ కుటుంబం అన్నివిధాల అభివృద్ధిమార్గంలో పయనిస్తుంది.

ఈ చిన్నిసూత్రాన్ని లెక్కచేయక ఇంట్లో ఉన్న నలుగురు నాలుగు రకాలుగా అభిప్రాయభేదాలు పెంచుకొని ఒకరిని ఇంకొకరు మనసులో లేక బాహ్యంగా తిట్టుకొంటూ ఉంటే ఆ ఇంట్లో సుఖశాంతులు లుప్తమైపోవడం ఖాయం.

ఇదే సూత్రమే రాష్ట్రాలకు, దేశాలకు కూడా వర్తిస్తుంది. దీనినే ఒక సినిమా పాటలో ఇలా చెప్పారు.

**"అందరికోసం ఒక్కడునిలిచి**
**ఒక్కడివెంట అందరుకలిసి"**

పనిచేస్తే సాధించలేని సౌభాగ్యం ఏముంటుంది అని మన పెద్దలు చెప్పిన గొప్ప సామెతల్లో ఒకటిది 'ఇంట గెలిచి రచ్చ గెలువు' అన్నది. దీనిని నాయకలక్షణాలున్నవాడు ఋజువు చేసికోవాలి. ఇంటిలో, వాడలో, తానున్న



ఊరిలో అటుపై రాష్ట్రానికి, దేశానికి ఇలా నాయకుడిగా ఎదగగలుగుతాడు. నరసింహప్రభూ! మాదేశానికి ఇలాంటి గొప్ప నాయకులు కావాలి.

**సీ. అక్షరాలవి కొన్ని – నవి పేర్చికూర్చంగ**
**పదములేర్పడు గదా – పలురకాలు**
**మూలకాలవి కొన్ని – మొత్తంబు జగమును**
**నిర్మింప జేసితి – నేర్పదేమొ**
**పోషకాహారాలు – పుడమిలో నవికొన్ని**
**వేలభోజ్యమ్ములై – విస్తరించె**
**వృక్షసంతతి యంత – పెరుగంగ గొనునట్టి**
**మౌలికాహారాల – మాటయేమి?**

**తే.గీ. నీదు నంశంబు లొక కొన్ని – నెగడెకాదె**
**భిన్నరూపాల కూర్పుకై – పృథ్విపైని**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్పు!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 49**

**భావము :** అల్పంనుండి అనల్పంగా మారిన భగవత్సృష్టిని ఇక్కడ విడమరిచి చూపుతున్నాను.

పదార్థవిజ్ఞానశాస్త్రజ్ఞులు పదార్థనిర్మాణమును గురించి చెప్పే వివరాలివి. మనము చూస్తున్న ప్రపంచమంతా కేవలము మూల పదార్థములతో తయారైనది. ఈ మూలపదార్థాలు కొన్ని కలిసి వేలకొలది విడదీయలేని సమ్మేళనాలుగా మరికొన్ని కలిసి అవసరాలనుబట్టి విడదీసేటందుకు వీలుగా ఉన్న వేలకొలది మిశ్రమములనే పదార్థాలుగా ఏర్పడ్డవి.

సకలజీవరాసులు బ్రతకడానికి తీసుకొంటున్న పదార్థాలను పోషకాహారాలు అంటాము. మొక్కలు తీసుకొనే లవణాలు పరిమిత సంఖ్యలోనే ఉంటాయి. వాటిని తీసుకొనే వేలరకాల వృక్షాలు జీవిస్తున్నవి.

మానవులు తీసుకొనే ఆహారములో కేవలము 6 రకాల పోషక పదార్థాలున్నాయని శాస్త్రజ్ఞులు చెప్తున్నారు. అవియేమంటే 1. పిండి పదార్థాలు 2. మాంసకృత్తులు 3. క్రొవ్వులు 4. ఖనిజలవణాలు 5. విటమిన్లు 6. నీరు. ఈ 6 రకాల పదార్థాలతో ప్రపంచం మొత్తంలో ఎన్ని వేలరకాల ఆహారపదార్థాలు తయారీలో ఉన్నాయో, వినియోగంలో ఉన్నాయో ఇది చదువుతున్న వారికందరికీ తెలుసు.

ఇవి యిలా ఉండగా బుద్ధిజీవుడిగా దేవుడు సృష్టించిన మానవుడు దేవునిసృష్టికి దీటుగా ఎన్నో పరికరాలను, జ్ఞానాన్ని పంచుకోవడానికి, పెంచుకోవడానికి శాస్త్రాలను సృజించుకొన్నాడు. ఇలా జ్ఞానాభివృద్ధికై సృష్టించుకొన్నదే భాష. ఏ భాష చూసినా అందులోని అక్షరాలు పరిమితంగానే ఉంటాయి. ఇంగ్లీషు భాషకు 26 అక్షరాలయితే తెలుగు భాషకు 56 ఉన్నాయి. కాని పరిమితఅక్షరాలతో అపరిమితమైన అంటే లక్షలసంఖ్యల్లో పదాలు ఏర్పరచుకొన్నారు. ఈ పదాలనుపయోగించి ఎన్ని వేలకోట్లపుస్తకాలను తయారు చేసుకొన్నారు.

నరసింహరాయా! ఇన్ని రకాలుగా నీ సృష్టి అల్పంలోనుండి అనల్పానికి విస్తరించింది కదా. నీదగు పంథాలోనే మానవుడు కూడా నడుస్తూ తన నాగరికతను పెంచుకొంటూ ఉన్నాడు. ఇలా జరగడానికి నీదగు అంశాలే కారకములని నేను భావిస్తున్నాను.

**సీ. క్రమపరిణామము - కలిగె జీవులకను**
**సిద్ధాంతమును నేడు - చేసిరయ్య**
**ప్రాతది క్రొత్తది - బలమైన కథలివి**
**కలయిక మేల్గాగ - కలిగెముదము**
**నవతారములు పది - యమరంగ నందందు**
**మానెగా ఖేదమ్ము - మనసునందు**
**తెలిపెద వానిని - చెలువుగా వినుమీవు**
**జంతుకథలకును - పొంతనంబు**
**తే.గీ. నెంత చిత్రంబు సూత్రంబు - సుంత దొరికె**
**కనిన మేరకే తెలిపెద - కంజనేత్ర!**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! 50**

**భావము :** నరసింహ ప్రభూ! విజ్ఞాన శాస్త్రము చదువుకొన్నప్పుడు తెలిసిన విషయాలకు, హైందవగ్రంథాలు చదివినప్పుడు తెలిసిన విషయాలకు కొన్నిచోట్ల పొంతన కుదిరినది. ముఖ్యముగా శ్రీహరి దశావతారము లెత్తినాడని హిందూగ్రంథములు ఘోషించుచున్నవి. అందులోను ముఖ్యముగా మొదటి నాలుగవతారములు జంతు సంబంధములైనవి. వీటిని విజ్ఞానశాస్త్రము చెప్పే విషయాలతో పోల్చినపుడు వాటి మధ్య కలిగే సమన్వయము ఎలా ఉంటుంది అనబడే విషయాలను వివరించబోతున్నాను స్వామీ.

**సీ. సృష్టి మొదలిడితే - చిన్నగాపొన్నుగా**
**వృష్టిసమిష్టిగా - వారియందు**
**హరిత మిమిడ్చితే - నందు కొన్నింటికి**
**నోగిరమ్మును చేసి - యుసురునిలుప**
**పంచభూతములను - ప్రాణశక్తిగ మార్చు**
**విద్య నొసంగితే - వృక్షములకు**
**బుద్ధితీక్ష్ణత పెంచి - భువిపైన పెరుగంగ**
**శక్తి నొసంగితే - జంతుతతికి**
**తే.గీ. వేదవిద్యల నానాడె - విధికి నొసగ**
**దాని సార మెరుగుచుండె - ధాతనాడు**

దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!
నమ్మి నానయ్య నిన్ను నే - నారసింహ! **51**

**భావము :** జీవశాస్త్రము తెల్పిన విషయాలనిక్కడ ప్రస్తావిస్తున్నాను దేవా! సృష్టి వృష్టిగా మొదలుపెట్టావు. ఏకకణ జీవులతో బాక్టీరియాలు, అమీబా, యూగ్లినా వంటి వాటితో క్రమక్రమంగా ఇవి దగ్గరదగ్గరగా చేరి సమిష్టి జీవులుగా (కాలనీలు) జీవించనారంభించాయి (వోల్వాక్స్ వంటివి). అందులో కొన్నిజీవులకు పత్రహరితాన్ని ప్రసాదిస్తే అవి తమ ఆహారమును తాము తయారు చేసికొనుటకు ఆరంభించాయి. ఇవి తమనుతాము నిలబెట్టుకోవడమేకాక ఇతరజీవులకు కూడా ఆహారము నందించసాగాయి. క్రమపరిణామంలో ఏకకణజీవులు, బహుకణజీవులుగా అభివృద్ధిని పొందినాయి. వీనిలో పత్రహరితమున్నవి చెట్లు. పత్రహరితమునకు గొప్ప శక్తి ఉన్నది. అదిఏమిటంటే పంచభూతాలను ఒకటిగా చేర్చి ప్రాణశక్తిగా మార్చే నేర్పున్నది. ఇట్లు పత్రహరితము అంటే ఆకుపచ్చదనము కలిగిన జీవులని చెట్లంటున్నాము. పత్రహరితము లేని కణాలలో నాడీవ్యవస్థను వృద్ధిపరిచావు. వీటిని జంతువులనే పేరుతో పిలుస్తున్నాము.

ఇట్లు సృష్టి అభివృద్ధి చెందే రోజులలోనే వేదవిద్యలను నీవు పుట్టించిన బ్రహ్మకు ఇచ్చి ఉంటావు. అందులోని సారాన్ని ఆయన తెలుసుకొంటూ ఉండియుంటాడు.

సీ. ఆగమాల విలువ - నరసినయసురుండు
దొంగిలి చనియెను - తోయనిధిని
మీనంబులే నాటి - మేటి జంతువులౌట
పెనుచేప వైతివి - వెదకితీవు
నసురుడా సోమకు - నంతము చేసితి
వేదాల కొనివచ్చి - విధికినిచ్చి



వెలసితివే దేవ - వేదవిదిత రూప
ప్రకృతిగా పెరుగుచు - ప్రబలినావె

తే.గీ. కడిది చేతలు కళ్యాణ - గాత్ర నీవి
మంగళము దేవ నీ కథ - మంగళంబు
దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!
నమ్మి నానయ్య నిన్ను నే - నారసింహ! **52**

**భావము :** ఆ కాలానికే సోమకుడను రాక్షసుడు వేదాల విలువను అర్థం చేసికొన్నవాడు బ్రహ్మదేవుని వద్దనుండి దొంగిలించుకొనిపోయాడు. సముద్రంలో దాగియున్నాడు. అప్పటికి ఉన్న జంతువులలో పెద్దది చేపయే. కనుక నీవు చేపగా అవతరించి ఆ సముద్రములో దాగియున్న సోమకుని సంహరించి ఆ వేదనిధులను మఱల బ్రహ్మదేవునికిచ్చి సృష్టిని సాగించమంటివి.

జీవశాస్త్రము బోధించే క్రమపరిణామం (Organic Evolution) లో వెన్నెముకలేని జీవులు మొదట పుట్టగా వెన్నెముక కల్గినవి తరువాత వచ్చినవి. వెన్నెముక ఉన్నవానిలో మొదట పుట్టినవి చేపల జాతులే.

ఇట్లు నీ మొదటి అవతారము మత్స్యమైనదని నేనూహించుచున్నాను.

సీ. సాగరమథనంబు - జరిగెనో యదిలేదొ
యానవాళ్లీనాడు - కానమయ్య
నీటిమట్టము తగ్గి - నేలమట్టము హెచ్చె
నుభయ చరములప్డు - నుద్భవించె
నటుపై సరీసృపా - లంతట నేర్పడె
నిలజలమ్ములనవి - కలచితిరిగె
కూర్మావతారంబు - కూర్మితో నపుడెత్తి
యూర్ముల మధ్యలో - నోర్మినుంటె

**తే.గీ. ఆధునికశాస్త్రవిజ్ఞాన - మంద ననెద**
**నీ ద్వితీయావతారంబు - నెగడెనిట్లు**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!**
**నమ్మి నానయ్య నిన్ను నే - నారసింహ! 53**

**భావము :** నరసింహప్రభూ! ఇప్పటి విజ్ఞానశాస్త్రం చెప్పే విషయాలిలా ఉన్నాయి. క్షీర సాగరమథనం జరిగినదో లేదో చెప్పడానికిప్పుడు ఆనవాళ్ళేమి కనిపించడంలేదు.

సముద్రపునీటితో నిండినది భూమి. క్రమం క్రమంగా నీటి మట్టము తగ్గుతూ వచ్చినది. నేలమట్టము పెరుగుతూ వచ్చింది. ఇలాంటప్పుడే ఉభయ చరములైన జీవులు కప్పల వంటివి నీటిలోను, నేలపైన కూడా జీవించడం నేర్చుకొన్నవి పుట్టుకురాసాగాయి.

మరికొన్నివేలసంవత్సరాలకు సరీసృపాలు - ఇవి కూడా జలచరాలు, ఉభయచరాలు, స్థలచరాలు ఇలా అభివృద్ధి చెందసాగాయి.

నీ దశావతారాలలో రెండవదైన కూర్మావతారం ఇదని నేను తలుస్తున్నాను.

మందర పర్వతాన్ని మోసిన కూర్మము నీవు. విజ్ఞానశాస్త్రము చెప్పిన కూర్మము కూడా నీవే అయి ఉండవచ్చు.

**సీ. ఏండ్లుపూండ్లు కురిసె - హిమవర్షములు నాడు**
**కడగండ్లు మించెను - కలగెజీవు**
**లంతరించుచునున్న - నా సరీసృపముల**
**నుండి వెడలెనంట - రెండుతెగలు**
**పక్షులై యొకకొన్ని - పై కెగురగలిగె**
**స్తన్యజంతువులిట - సాగెధరణి**



**క్రోడ మీ దశయంద్రు - కువలయమెత్తుట**
**యీ నాటి జ్ఞానాని - కిమడలేదు**

**తే.గీ. పూర్వకావ్యాల వివరణ - పొదవినటుల**
**నా హిరణ్యాక్షు మర్దించి - నవనిబ్రోతె**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!**
**నమ్మి నానయ్య నిన్ననే - నారసింహ! 54**

**భావము :** సరీసృపములు విజృంభణగా పెరుగసాగినవి. విచ్చలవిడిగా నేల, నీరు కలయతిరుగుతుండినవట. పర్వతాలంత ఎత్తుగా శరీరాలుండేవట. అటువంటి కాలములో ప్రకృతి వైపరీత్యములు విశేషంగా హిమవర్షములు ఏండ్లకొలది కురిసినాయంట. అటువంటి సమయంలో సరీసృపాల నుండి రెండుతెగలైన జంతువులు ఉద్భవించినాయట. ఒకరకం జంతువులు ముందరికాళ్ళను రెక్కలుగా మార్చుకొని భూమినుండి పైకెగరడం నేర్చుకొన్నాయట. అవి చెట్లపైన కూర్చొని మంచుబారి నుండి తమను తప్పించుకోగలిగినాయట. వీటినే పక్షులు అని ఆ తరువాతి కాలంలో పిలుస్తున్నాము. రెండవతెగజీవులు భూమిపైననే బ్రతుకుతూ క్రమ పరిణామంలో స్తన్యజీవులుగా మార్పు చెందాయట. వరహావతారము ఈ దశలో ఏర్పడినవే. అయితే సముద్రములో మునిగిన భూమిని పైకి ఎత్తిన విషయం యీ నాటి విజ్ఞానానికి అందడంలేదు.

ఏమైనప్పటికి మన మతగ్రంథాలు చెప్పినట్లుగా హిరణ్యాక్షుడిని అంతమొందించిన ఆదివరాహము, విజ్ఞానశాస్త్రము తెల్పిన వరాహము రెండును ఒకటేయని భావనతో నీకు నమస్కరిస్తున్నాను స్వామీ!

**సీ. విజ్ఞానశాస్త్రపు - పెనులోకమందున**
**సింహాలు మనుజులు - చెలగిరయిన**

**నరహరీ! నీ యొక్క - నాల్గవయవతార**
**మైనట్టి యీ రూపు - కానరాదు**
**భాగవతులు తెల్పు - ప్రహ్లాదు కథనమ్మె**
**విన్నవించెదనయ్య - వినుముదేవ!**
**ఆ హిరణ్యకశిపు - దపురూపవరముల**
**బ్రహ్మదేవునినుండి - పరగపొంది**

**తే.గీ. విష్ణుభక్తుడైన సుతుని - వెతలు బెట్ట**
**డింభకుని బ్రోవ వెడలితి - స్తంభమందు**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!**
**నమ్మి నానయ్య నిన్ను నే - నారసింహ! 55**

**భావము :** క్రమపరిణామసిద్ధాంతము ననుసరించి పక్షులు, స్తన్యజీవులు నానాటికి అభివృద్ధి చెందినాయి. అలాంటి జీవులనుండి వచ్చినవారే సింహాలు, మనుష్యులు కూడ. అయితే సింహంరూపు సగం, మానవ రూపు సగం కలిసిఉన్న జీవుల యానవాళ్ళు ప్రస్తుతానికి లభించలేదు. కాని పత్రికలలో వచ్చే వింతలు విశేషాలలో పైభాగం చేపరూపు క్రిందిభాగం మానవరూపు ఉన్న శిలాజాలు దొరికాయని చదివాను. బహుశా నరసింహుని రూపులో కూడ శిలాజాలు భవిష్యత్తులో దొరుకుతాయేమో.

కాని ఇప్పటికి మాత్రం భాగవతులు వర్ణించిన నరసింహ రూపుడైన నిన్నే వేడికొంటున్నాను. ఆ హిరణ్యకశిపుని వరముల కనుగుణంగా శరీరాన్ని సృజింపజేసుకొన్నది నీ రూపు. అతడిట్లు బ్రహ్మను వేడుకొన్నాడట. సురాసురులు, మనుజులు, జంతువులు తనను చంపకూడదు. ఏ రకమైన ఆయుధములు తనను చంపకూడదు. రాత్రి మరియు పగలులో తనకు చావు రాకూడదు. ఇంటిలోపల, ఇంటిబయట తనకు చావు రాకూడదు. నేలపై, నింగిపై చావు రాకూడదు. ఇన్నిరకాలకు ఒప్పుకొన్నాడు బ్రహ్మదేవుడు.



ఇప్పుడా బ్రహ్మవాక్కుకు గౌరవమిస్తూ హిరణ్యకశిపుని చంపావట నీవీ రూపు ధరించి. అతనికిచ్చిన వరాలు ఎలా సరిపోయాయంటే సగంసింహంశరీరం, సగంనరునిశరీరంతో ఉండే నరసింహాకృతి. రెండవది ఆ రాక్షసుని చీల్చడానికి నీ చేతి గోళ్ళు కోరలు. సింహానికి ఇవి రెండు చాలా పదునుగా ఉంటాయి. కనుక ఆయుధాలతో పనిలేకపోయింది.

మూడవది రాత్రి కాని పగలు కాని సంధ్యాసమయం. నాల్గవది ఇంట, బయటకాని, తన వాకిలి వద్ద, నేల, ఆకాశం కాని నీ మోకాళ్ళపై పెట్టుకొని విదారించినావు. మహావిష్ణుభక్తుడైన ప్రహ్లాదుని కాపాడుటకు ఇటువంటి వింతరూపంతో వెడలిన నరసింహస్వామీ నీకు వేల వేల నమస్కారాలు.

**సీ. దొసగులుండిన గాని - దొడ్డగుణంబొందు**
**బలిచక్రవర్తిలో - నెలమిగంటె**
**మూడడుగుల నేల - ముచ్చట నడిగితే**
**ముల్లోకములు నెల్ల - కొల్లగొంటె!**
**బలితల పదమిడి - పాతాళమున కంపి**
**కీర్తికాయ మిచట - కృపనునిడితె**
**వామనశుభమూర్తి - పావనగుణమూర్తి**
**సజ్జనరక్షక - సాధుసాధు**

**తే.గీ. నీదు చేతల గన నాకు - నేర్పులేదు**
**యభయమిచ్చి కాపాడుమా - యమరవినుత!**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!**
**నమ్మి నానయ్య నిన్ను నే - నారసింహ! 56**

**భావము :** దేవా! నీ దగు ఐదవఅవతారములనుండి అన్నియు మానవాకారములే.

ఇంద్రునితల్లి అదితి కోరికపై బలి ఆక్రమించుకొన్న దేవరాజ్యమును మరల అతని కప్పగించుటకై ఎత్తిన అవతారమిది. ఇంద్రుడు, బలి దాయాదులైన అన్నదమ్ములు. వారి మధ్యలో పొరపొచ్చెము లేవోయున్నవి. కాని అదితి తపస్సుకు మెచ్చి భూమి మీదకు వచ్చుటకు ఆమె గర్భస్థుడుగా నుండి వచ్చినావట. పుట్టిన నిసువు చూస్తుండగానే వటువుగా మారితివట. ఉపనయనము చేయించుకొని తల్లిదండ్రులను విడిచి బలిచక్రవర్తి చేయు యజ్ఞమును చూచుటకేగితివట. అతడిని మూడడుగుల స్థలము కోరితివట. అందులో ఒక అడుగుతో పైలోకములను, ఒక్క అడుగుతో క్రింది లోకములను కొలిచితివట. మూడవ పాదమునకు చోటులేనందున బలి తన శరీరమునే చూపెనట. దానిపై నీపాదమిడి అతనిని పాతాళమున కంపితివట.

హే వామన శుభమూర్తి! పావన గుణమూర్తి! నీదు చేతల నెట్లు అర్థము చేసికొనవలెనో నాకు తెలియుటలేదు. ఒక్కొక్క పదమునకు ఏడులోకములు. కావున బలిశిరము కూడ ఏడులోకముల కీడైనదనుకొందునా? అతని దానగుణమును లోకమునకు వెల్లడి చేయుటకే నీవు యాచకుడివైతివా?

ప్రభూ! నేను నిన్నే యాచించుచున్నాను. అభయము నిమ్మని.

**సీ. దుర్మదమ్మున నుండు - దుష్టనృపాలుర**
**పరశురాముండవై - నరకినావు**
**తండ్రియాజ్ఞను పొంది - తల్లిశిరంబునే**
**ముక్కముక్కలు గాగ - చెక్కినావు**
**సంతసించిన తండ్రి - చక్కంగవరమీయ**
**తల్లిరేణుక నప్డు - చల్లగగొని**
**తల్లిదండ్రుల పట్ల - తగిన భక్తియు శ్రద్ధ**
**చొరవ మిగుల చేసి - చూపినావు**



**తే.గీ. భళిర! పరశురామా! భళి - భళిర! దేవ!**
**యుట్టి మొదలెక్కి స్వర్గంబు - ముట్టి తవల**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!**
**నమ్మి నానయ్య నిన్ను నే - నారసింహ! 57**

**భావము :** నీదగు ఆరవఅవతారము పరశురామావతారము. మాతాపితరులపట్ల మిక్కిలి భక్తిగలిగినవాడవు. తల్లిని శంకించిన తండ్రి కోపగించి ఆమె తలత్రుంచమనిన పిత్రాజ్ఞను నెరవేర్చినావు. ఆయన తపోబలము నెరిగినవాడవు కనుక ఆయన సంతోషముతో వరమును కోరుకొమ్మనగా తల్లిని బ్రతికించుకొన్నావు.

హైహయరాజు దుష్టుడై కామధేనువు కొరకు తండ్రి తలనరికి చంపినందులకు కోపగించి ఆతడినే కాదు. ఆనాడు మదాంధులై భూమికి భారమై దుష్టపాలనము చేస్తున్న రాజుల నందరిని నీ పరశువు అనే ఆయుధముతో చంపినావట.

దుష్టశిక్షకా! శిష్టరక్షకా! నమోస్తు.

**సీ. దశరథు రాముడై - ధరపైన జనియించి**
**సీతామహాసాధ్వి - చేయిపట్టి**
**కైకేయి కోరిక - గౌరవింపగ చేసి**
**తమ్ముడా భరతుని - దయను దనిపి**
**దండకారణ్యాన - దనుజుల చెండాడి**
**పంచవటిని నుండ - పచ్చగాను**
**దుష్టరావణుడదె - దొంగిలె సీతను**
**సుగ్రీవు మైత్రిచే - చొప్పుగనగ**

**తే.గీ. హనుమ నంపితి వటుపైన - దనుజుదునిమి**
**రామరాజ్యంబు నడిపితి - రమ్యముగను**

**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!**
**నమ్మి నానయ్య నిన్ను నే - నారసింహ! 58**

**భావము :** త్రేతాయుగములో రావణాసురునివలన దేవతలకు బాధలెక్కువైనవి. ఆతడు బ్రహ్మదేవుని ప్రార్థించునపుడు తనకు చావులేకుండునట్లుగా వరము వేడుచున్నప్పుడు నరులను, వానరులను పేర్కొనలేదు.

ఇది కారణముగా భూమిపై దశరథ మహారాజుకు జ్యేష్ఠకుమారునిగా అవతరించితివి. ఆదిలక్ష్మి స్వరూపమైన సీతాసాధ్వి చేయిపట్టుకొంటివి. రావణ సంహారమునకు ఆమె తనవంతు సాయము నందించుటకై యేతెంచినది. ఇట్టి దేవకార్యము నెరవేర్చుటకే కైకేయి విపరీతమైన కోర్కెలు కోరినది. ఆదర్శసోదరులైన లక్ష్మణ, భరతాదులు తమ భక్తితో నీ యనుగ్రహమును పొందిరి. దండకారణ్యములో మునుల కోరికపై సమయము వచ్చినపుడు దుష్టరాక్షసులను సంహరించితివి. శూర్పణఖ సూచనల ననుసరించి రావణుడు మారీచుని సహాయముతో సీతాదేవిని దొంగిలించెను.

అటుపై వానరోత్తముడైన సుగ్రీవునిసహాయము లభించెను. హనుమంతుడు సీతజాడ కనుగొని వచ్చెను. కపిసైన్యముతో రావణునిపై యుద్ధము ప్రకటించితివి. దేవతల మనోరథము నీడేర్చితివి. రావణ సంహారమైన పిదప అయోధ్యకు వచ్చి రామా! ఆదర్శప్రాయమైన రామరాజ్యము నేర్పరచితివి.

సూర్యచంద్రులున్నంతవరకు, గిరులు, నదులు, సముద్రములున్నంత వరకు నీ చరిత జనులమధ్యలో నిలిచియుండును గదా. రామప్రభూ! నమోస్తు.

రామరాజ్యంబు నడిపితి అనడంలోని అందం గమనించండి.



**సీ. దేవకీవసుదేవ - దివ్యదంపతులకు**
**నష్టమగర్భాన - నష్టమితిథి**
**జనియించితివి గాదె - తన పుణ్యవశమున**
**నలరించితివి గాదె - నా యశోద**
**గోపాలబాలుడై - గొల్లవారిండ్లలో**
**వెన్నదొంగగ మారి - పేరుగొంటె**
**దరిసినదనుజుల - తగనెందరినొ కూల్చి**
**ఖలవిదారుడనుచు - ఖ్యాతిగొంటె**

**తే.గీ. పాండుసూనుల పక్షాన - బవరమాడి**
**ధర్మవిజయంబు కలిగింతె - దైత్యహంత!**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!**
**నమ్మి నానయ్య నిన్న నే - నారసింహ! 59**

**భావము :** ఎనిమిదవ అవతారముగా శ్రీకృష్ణమూర్తివైనావు ప్రభూ. దేవకీ వసుదేవుల అష్టమ గర్భముగా శ్రావణ బహుళ అష్టమినాడు జనన మందితివి. యశోద పూర్వపుణ్యఫలముగా ఆమె వద్ద పెరిగితివి. బాలగోపాలుడిగా గొల్లవనితల పుణ్యమున పండించుచు చోర, జార లీలలను చూపితివి. నిను చంపుటకై వచ్చిన రాక్షసులను రూపుమాపితివి. దేశమునందు విజృంభించిన దుష్టులైన క్షత్రియులను పాండుకుమారులచే హతమొనర్పచేసితివి. ధర్మబద్ధులైన పాండవులకు అండగానుండి ధర్మోద్ధరణ గావించి, తర్వాతి యుగములవారికి కరదీపికగా నుంటునట్లు గీతాబోధన చేసితివి.

కృష్ణమూర్తీ! నీ దయను ఎంతని వర్ణించవచ్చును.!

**సీ. త్రిపురుల చెండాడి - త్రినయను పురిగొల్పి**
**పశుపతిగా జేసి - పంపునాడు**

సాధ్వీమణుల కప్పు – చల్లంగమదిజారు
రూపమే బుద్ధుని – రూపమంద్రు
కపిలవస్తుపురాన – కని శుద్ధోదను
పుత్రుడే యవతార – బుద్ధుడంద్రు
అవతారమూర్తియౌ – యాబుద్ధ మూర్తిగా
నిందులో నెవరౌట యేనుగనను

తే.గీ. దుష్టశిక్షణ చేయుచు – శిష్టరక్ష
చేయు ప్రభువెవ్వడేనియు – చేతునతులు
దొడ్డధాళివట్టములోని – దొడ్డవేల్ప!
నమ్మి నానయ్య నిన్ను నే – నారసింహ! **60**

**భావము :** తొమ్మిదవది బుద్ధుని యవతారము. ఈ యవతారమును గూర్చి లోకులు చెప్పు కథలతో సందిగ్ధమైనది బుద్ధి. కావున చదివిన హైందవ గ్రంథములోని కథను మరియు ఈనాటి లోకులు తెల్పు బుద్ధదేవుని కథను కూడ వివరించుచున్నానిక్కడ.

త్రిపురాసుర సంహారము సేయుటకు శంకరుని ప్రేరేపించినారు దేవతలు. పశుపతిగా పట్టము కట్టినారతనికి. అయినప్పటికి త్రిపురాసురులు వారి భార్యల పతివ్రతాధర్మముచే అవధ్యులైనారని, వారికి మనశ్చాంచల్యము కలిగించుటకై నిన్ను నియోగించగా నీవు బుద్ధుడవైనావను ఐతిహ్యము మన ప్రాచీనగ్రంథములు చెప్పుచున్నవి.

కలియుగంలో కపిలవస్తుపురములో మాయాదేవి శుద్ధోదనులకు పుట్టిన గౌతముడివి. మిక్కిలి దయామయుడవు. యశోధరాదేవిని పెండ్లాడి రాహులునకు కన్న తండ్రివైన పిదప లోకములోని ప్రజలు పడే కష్టాలకు కారణాలు తెలుసుకోవాలని మమతానుబంధాలు త్రెంచుకొని అడవులకు



పోయి తపస్సుచేసి గౌతమబుద్ధుడైనావని యీ కాలపుచరిత్రను వివరించుచున్నారు.

ఇట్లుండుటచే ఇదమిత్థముగా నీ అవతారమును నిర్ణయించు స్థితిలో నేను లేను. లోకరక్షకుడుగా నీవెట్లు వచ్చినను నాకు సమ్మతమే. అందుకొనుమయా నా నతులు.

సీ. విష్ణుశర్మ యనగ – వెలుగుభూసురునకు
పుట్టబోయెదవట – గట్టిబిడ్డ
కల్క్యవతారంబు – కానంగ నగునట
కత్తియాయుధమూని – కదనుచేతె
హయముపై వత్తట – హర్షంబుపొదలంగ
దుష్టశిక్షణ కీవు – దొరగనిలుతె
యెప్పుడోవచ్చుట – యెన్నడోచూచుట
యీ జన్మమున నది – మెవరి కబ్బు

తే.గీ. నంద దనుక నిన్నేతల్తు – చింతలడచు
పాపచింతన పోకార్చి – బాగుపరచు
దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!
నమ్మి నానయ్య నిన్ను నే – నారసింహ! **61**

**భావము :** హే నరసింహస్వామీ! పదియవదగు కల్కియవతారము కలియుగమునందే ఎత్తెదవట. శంబళయను గ్రామములో విష్ణుశర్మయను బ్రాహ్మణునకు కల్కిపేరుతో పుట్టెదవట. గుఱ్ఱముపై స్వారీ చేయుచు కత్తిదూయుచు దుష్టశిక్షణ చేసెదవట.

ఈయవతారమును చూడగలుగు అదృష్టము ఎవరికబ్బునో, ఏమో అంతవరకు నీ నామమే తలచెదను. నాకున్న చింతలను అణగించుము. పాపములను పరిహరించుమయా.

**సీ. ఎవరిపై నీ దయ – యెట్లువర్తిల్లునో**
**తెలియ నేరరెవరు – తెల్లమిదియు**
**గురుపుత్రు బ్రతికించి – గొనకొని నిచ్చితి**
**వభిమన్యుకొసగతి – వర్ధమాయు**
**వాయయోధ్యాపతి – కర్పించితివి పిండి**
**నా జటాయువునకు – నగ్నికర్మ**
**గ్రుడ్డికి చూపితి – గురుతరరూపమ్ము**
**నా సుయోధను కండ్ల – కానవైతి**

**తే.గీ. పూతన కొసగితే నతి – పూతతనువు**
**సీతనంపితి కానకు – పూతచరిత**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మి నానయ్య నిన్ను నే – నారసింహ! 62**

**భావము :** హే నరసింహా! పరమాత్ముడవు నీవని ప్రస్తుతి చేయుచున్నాను. భక్తపరాధీనుడవని నమ్ముచున్నాను. కాని నీ వివిధములైన అవతార విశేషములకు పరిశీలనగా చూచినచో ఎవరిపై నీ దయ యెట్లు పనిచేయునో తెలిసికొనుట సాధ్యము కాదు.

రామావతారములో దశరథునికి పుత్రకామేష్టి ద్వారా పొందిన సుతుడవు. నీవు పుట్టినది మొదలుకొని తాను గిట్టెడు వఱకు నీపైననే ప్రాణముంచుకొనిన ప్రియాతిప్రియుడైన తండ్రి. అటువంటి తండ్రి చనిపోగా ఆయనకు కొరివిపెట్టలేకపోతివి. మునివృత్తిలో నుండుటచే గారపిండితోనే పిండములు పెట్టినావట.

అదే అవతారములో ఒక పక్షిమాత్రుడు జటాయువు, మీ తండ్రికి తాను స్నేహితుడనని మీతో తెలుపుకొని, కష్టసుఖములు విచారించెదనని తెల్పినవాడు. అట్లే ఆచరించినాడు కూడ. ఆ విధముగా పక్షి నీ భార్యను



రావణుని బారినుండి రక్షించుప్రయత్నములో మరణించగా ఆ పక్షిని దహనముచేసినావు. పుణ్యగతులుకల్పించినావు. ఇట్లు తండ్రి కబ్బని కర్మకాండను ఆయన మిత్రుడగు పక్షి కందించినావు.

కృష్ణావతారము నందలి విశేషములిట్లేయున్నవి. గురువుసాందీపుని కుమారుడు మృతుడైనాడు. గురుదక్షిణగా అతనిని బ్రతికించి యిమ్మన్నాడు. వల్లెయని అన్న బలరామునితో కలిసి యమధర్మరాజు పురమున కేగి ఆ పిల్లవానికి జీవమును పోసి తెచ్చి యిచ్చినారు. కాని అనుంగు చెల్లెలు ఇష్టుడైన బావమఱిది అర్జునునికి పుట్టిన ప్రియపుత్రుడు, ఉత్తమధనుర్ధారి అయిన మేనల్లుడు అభిమన్యుడు పద్మవ్యూహములో చిక్కి అల్లాడుచుండగా అతనికి నీవు రక్షణ కల్పించలేదు. అర్ధాయుష్కుడై అతడు మరణించెను. నీ చెల్లెలికి గర్భశోకము కల్పించెను. ఇట్లు అయినవారిని నీవు గమనించనేలేదు.

ఇంకొక ఉదాహరణము – పసితనము నుండి నీవు చేస్తున్న అద్భుత కార్యములను వింటున్నారు, చూస్తున్నారు. రెండుకళ్ళులేని పుట్టుగ్రుడ్డి ధృతరాష్ట్రమహారాజు, రెండుకళ్ళు బాగుగానున్న రాజరాజైన సుయోధనుడు ఈ యిర్వురిలో గ్రుడ్డివానికి నీ విశ్వరూపమును చూసే అదృష్టమిచ్చినావు. కళ్ళున్న సుయోధనునకు అందరకు కన్పించే ఆ రూపమును కూడ సరిగా గ్రహించలేని వానిగా చేసినావు.

నీకు విషపుపాలిచ్చి చంపుటకు వచ్చిన పూతన అను రాక్షసిని పవిత్రదేహనుగా మార్చినావు. ఇది ఎట్లనగా పూతన విషపుపాలతోపాటు దానిప్రాణములను కూడ త్రాగినాడు కృష్ణుడు. దాని శవము భయంకరముగా పడియుండిన దానికి అగ్నిసంస్కారము చేయగా అగరు, సాంబ్రాణి మొదలగు ధూపములు వేసినవచ్చు సువాసనలు ఆ అడవియంతా వ్యాపించినవట.

రామావతారములో నీవు అడవికేగుతుండగా అక్కడ నీవొక్కడవే కష్టములు పడుటకు ఇచ్చగించని నీ యిల్లాలు తానుకూడ వనవాసములో

నీతోడుగా వచ్చినది. అటువంటి యిల్లాలిని గర్భవతిని వనవాసమున కంపితివి.

ఇట్టులెన్నియో నిదర్శనములను చూపించవచ్చునయా, శ్రీహరీ! నరహరీ!

పూతచరిత అంటే పవిత్రమైన చరిత్ర కలవాడు/ కలది అని అర్థము. ఇది సీతకు వర్తిస్తుంది. మరియు రామునికి సంబోధన కూడా అవుతుంది.

**సీ. చెట్టుకు పుట్టకు - చేయెత్తి మ్రొక్కుటే**
**వృక్షాల పశువుల - విభుడుగలడు**
**కనిపించు ఱాతికి - కాల్సాచి మ్రొక్కుటే**
**జగదీశ్వరుండును - జడములందు**
**నీళ్లకు నేలకు - నిప్పుకు నెఱగుటే**
**పంచభూతములందు - పరముడుండు**
**మూర్తికి పటముకు - మ్రొక్కుట యేటికో**
**వారి స్థాయికితగ్గ - వరదుడుండు**

**తే.గీ. మనుజుడెదుటి వానిని గని - మరి నతువిడు**
**వానిలోన నుండు పరమ - పావనుండు**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!**
**నమ్మి నానయ్య నిన్ను నే - నారసింహ! 63**

**భావము :** ఈ పద్యములో హైందవులు ఆచరించు అనేక పూజా విధానములు తెల్పబడినవి.

తులసిచెట్టును హరిప్రియ అని ప్రతియింటిలో బృందావనమేర్పరచి పూజ చేస్తారు. అశ్వత్థరూపములో ఉంటానని గీతలో కృష్ణుడు చెప్పాడు. అశ్వత్థానికి - వేపకు నారాయణుడు - లక్ష్మీయని భావించి సంతానం



కోరేవారు, వివాహములు ఆలస్యమైనవారు వివాహం జరిపిస్తారు. పంచపల్లవాలను పూజల్లో ఉపయోగించే చెట్లు రావి, జువ్వి, మామిడి, మఱ్ఱి, మేడి. తెల్లజిల్లేడు గణపతికి ప్రతిరూపమంటారు. కానుగ, ఊడిగ ఇట్లెన్నో చెట్లను కులదేవతలుగా కొలుస్తారు. విజయదశమినాడు జమ్మిచెట్టు ప్రత్యేక పూజలందుకొంటుంది. ఇట్లు అనేకచెట్లు పూజలందు కొంటున్నాయి.

పుట్టలో పాములుంటాయి. నాగపూజ చేసేవారు మనదేశంలో ఎందరో ఉన్నారు. నాగులే కాక ఆవులు, ఎద్దులు సంక్రాంతి పండుగలో పూజింపబడుతాయి. ఆవులను నిత్యము పూజిస్తారు. దేవతలందరికి వాహనాలు వివిధజంతువులే. విష్ణువునకు గరుడుడు, శివునికి నంది, బ్రహ్మకు హంస, కుమారస్వామికి నెమలి, గణపతికి ఎలుక ఇట్లా ఎన్నో జంతువులు పూజార్హములైనాయి. ప్రతిచెట్టులో, పశువులో పరమేశ్వరుడున్నాడని ఈ ప్రజలు నమ్ముతారు.

చెట్లు, పశువులేకాక రాళ్ళకు కూడా చేయెత్తి మ్రొక్కుతారు జనులు. కాళ్ళుసాచి సాష్టాంగనమస్కారాలు చేస్తారు. ఈ రాయి దేవుడని ప్రక్కనున్న వారెవరు చెప్పినా అది జడపదార్థమని చూస్తున్నప్పటికీ జగదీశ్వరుడందులో ఉన్నాడనే నమ్మకంతోటి భక్తిభావనను ప్రదర్శిస్తారు. బస్సుల్లో ప్రయాణం చేసేటప్పుడు తీర్థయాత్రల్లో తిరుగుతున్నప్పుడు అసలు దేవుళ్ళ కన్నా యీ కొసరు దేవుళ్ళు మనకు కోకొల్లలుగా దర్శనమిస్తారు.

✢ ఇంతేకాక దేవతల ప్రతిమలకు చిన్నవి, పెద్దవి - పరిమాణం ఎంతైనా ఉండవచ్చు. అట్లే చిత్రపటాలు, ఫోటోలుగా ఉన్నవి. వీటినన్నింటిని భక్తితో చూస్తారు. ప్రతిమలకైతే అర్చనాదులు కూడా ఉంటాయి. ఫోటోలకు చందనము, కుంకుమ అలంకారముంటుంది. ఊదువత్తులు వెలిగించి షోడశోపచారాల్లో ఒక్కటైన దానినైనా చేస్తారు. వీటిలో ఆయా మనుష్యుల జ్ఞానశక్తికి తగిన స్థాయిలో భగవంతుడుంటాడు.

✦ హైందవులు ప్రాణరహితములైన నీళ్ళు, నిప్పు, నేల వీనికి కూడ పూజలు చేస్తారు.

జలాధిదేవతయని గంగకు, స్నానంచేసేటప్పుడు గంగ, సింధు మొదలగు నదులను తలచుకొని ఆ నీళ్ళల్లోకి అవహింపచేసుకొంటారు. ప్రతిదేవతాపూజలోను నీటితో చేసే సేవలనే అర్ఘ్యపాద్యాదులు, అభిషేకము వంటివని తెల్పుతారు. ప్రయాణాలు చేసేటప్పుడు దారిలో వచ్చే నదులకు, ఏర్లకు వందనాలు చేస్తారు.

నిప్పు – అంటే అగ్ని. ప్రతిశుభకార్యములో దీపారాధన ఉంటుంది. అగ్నిసాక్షిగా చేసేవి వివాహము, ఉపనయనము, అన్ని రకముల యజ్ఞములు, అగ్ని మనము సమర్పించే హవిస్సులను దేవతల కందించేవాడని ఆయన పూజలందుకొంటాడు. సూర్యుడు ప్రత్యక్షదైవమని నమ్మి నమస్కరిస్తారు.

నేల – భూమి పూజ. ఏ రకమైన భవన నిర్మానమునకైనా భూమిపూజ ఉంటుంది. పెద్దలు నిద్రలేచిన వెంటనే "భూమాతా! నీ మీద పాదములు పెడుతున్నాను. నన్ను మన్నించమ్మా" అని అర్థాలువచ్చే శ్లోకం లేక పద్యం చెప్పుతారు.

పరమాత్మ పంచభూతాల్లో దాగి ఉన్నాడని భావించి నమస్కరిస్తారు.

ఇవన్నీ ఒక యెత్తు. మనుష్యుడు ఇంకొక మనుష్యుని చూచినపుడు అతనికి నమస్కారములు చేస్తున్నాడు. అతడు కూడ తనవంటి వాడేయని యనుకోడు. హైందవధర్మము చెప్పేదేమిటంటే ఆ వ్యక్తిలో ఉండే పరమాత్మకు ఆ వందనము చెందుతుందని.

సారాంశమేమిటంటే పరమాత్మ సర్వగతుడు. అంటే చరాచరములన్నింటి యందు ఉంటాడు. మనకు పెద్దలుచెప్పిన పద్ధతిలో ఆయా చెట్లకు, పుట్టలకు, రాళ్ళకు, ప్రతిమలకు నమస్కరించుట అనే ఉత్తమ



సంస్కారమును చిన్నప్పుడు అలవరచుకొంటే పెద్దవారైనాక జ్ఞాన సంపన్నులైనాక ఆయన సర్వగతత్వమును అర్థము చేసికొంటారు.

**సీ. ఎవ్వారు నీవారొ – యెవ్వారు పెరవారొ**
**నిజము పల్కమనుచు – నిగ్గదీతు**
**నినుగన్న పుణ్యాన – నెలతలు కుమిలిరి**
**నీవు దూరమగుట – నెమరువేసి**
**నిను నమ్మినందుకు – నేస్తాలు చుట్టాలు**
**కడగండ్ల పాలైరి – కనలుచుంద్రి**
**నిను తిట్టు శాత్రవుల్ – నిను చూచి యెల్లెడ**
**నీలోన చేరిరి – నీల్గినంత**

**తే.గీ. ప్రేమ చూపించి పెనవైతు – వే మురారి!**
**వైర మూనగ జేసి నీ – దారి కీడ్దై**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్పు!**
**నమ్మి నానయ్య నిన్ను నే – నారసింహ! 64**

**భావము :** ఈ పద్యములో భగవంతుని 62 పద్యములోవలెనే నిలదీయుచున్నాను.

ఓయి నా బంగారు స్వామీ! నీయవతారవిశేషములను తలచిన కొలది వింతగా అనిపించును. నీవారెవరు, పరాయివారెవరు అని నిలదీయాలనిపిస్తుంది.

నిన్ను గన్న కౌసల్య మరియు, దేవకి, యశోద వీరందరికి నీవు ఎంత వరకు దగ్గరయుండి సంతోషమందించావు. కారణాలు ఏవైనా కావచ్చుగాక – నీవు దూరమవగా వారెంత క్రుంగిపోయినారో కదా–

నిన్ను ఆప్తబంధువుగా, ప్రియమిత్రుడిగా తలచినందుకు రామావతారంలో అడవికి నీవు పోగా వారెంత దుఃఖించినారో కదా. అట్లే

కృష్ణావతారంలో ఆ గోపికలు గోపాలురుపడిన వేదన అంతాయింతాకాదు. బృందావనం విడిచి నీవు మధురకు పోగానే వారియేడ్పులు గోపికాగ్రేతలలో వెల్లడి చేశారు కదా! వ్యాసుడు, పోతన మొదలగువారు.

వింత అనిపించేదేమిటంటే... నిన్ను ప్రొద్దుస్తమానము తిట్టుచుండిన శత్రువులు చావగానే నీలోనికే వచ్చి చేరినారు. కంసుని తీసుకొందాము. నీవు అష్టమ గర్భంలో దేవకికి జన్మిస్తావని చెప్పిన దగ్గరనుండి నీపైన వైరము పెంచుకొన్నాడు. ఎందరినో రాక్షసులను నిన్ను చంపుటకు పంపాడు. ఆఖరుకు తనవద్దకే పిలిపించుకొని చంపనుయత్నించాడు. ఇట్లు ఎంతో భయముతో నిన్ను చూచి, చూచి, చచ్చి నీలో చేరినాడు.

శిశుపాలుడు కూడా అంతే. పుట్టి బుద్దెఱిగిన నాటినుండి నీపై అయిష్టమే. వైరమే. అలాంటివాడు రాజసూయయాగము వంటి పవిత్రమైన స్థలములో నిన్ను తిట్టి తిట్టి ఆఖరికి నీ చక్రాయుధమున కాహుతియైనాడు. అదే సమయములో వాడి ఆత్మ నిన్ను చేరినది.

హే మురారి! మధుసూదనా! అని పిలిపించుకోవడంలో కూడా నీ శత్రువులను స్మరింపజేయుచున్నావు కదా. మురుడను వానికి వైరివని మధువసువానిని సంహరించినవాడనే అర్థములతో జనులతో వారిపేరులతో నీ పేరు వచ్చేటట్లు జనశ్రుతిలోకి తీసుకువచ్చావు కదా!

ఈ విధంగా ప్రేమతో కొందరిని, వైరముతో కొందరిని నీ వైపుకు లాగుకొనుచున్నావు కదా! పరీక్షిత్తుకు శుకయోగి చెప్పినట్లుగా ఏ భావనల తోనైనా నిన్ను చేర వచ్చునని, ప్రజల భావనలకు తగినట్లుగా నిన్ను నీవు మలచుకొందువని,

దేవా! ఏ విధముగా నాపై అనుగ్రహమును వర్షింతువో?

**సీ. ఏడుకొండల పైన - యీడైనమూర్తిగా**
**వేంకటేశ్వరు పేరు - వెలసినావె**



**యాకాశ రాట్పుత్రి - నలమేలుమంగను**
**ప్రేమతో పెండ్లాడి - ప్రీతిగనుదె**
**భక్తజనాళికి - పాపంబు పోకార్చి**
**కలియుగంబున నీవు - కలిమినిడుదె**
**యాపద మ్రొక్కుల - నాదిదేవుండవై**
**యన్న మయార్చిత - యాదుకొనుదె**

**తే.గీ. భువికి వైకుంఠ పురముగా - దివికి సాటి**
**తెత్తువె గిరుల సిరుల - తిరుమలేశ!**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!**
**నమ్మి నానయ్య నిన్ను నే - నారసింహ! 65**

**భావము :** హే పరమపురుషా, కలియుగంలో తిరుమలను వైకుంఠముగా తీర్చిదిద్దుచున్నావా స్వామీ! ఆ ఏడుకొండలపైన వేంకటేశ్వరుడు, శ్రీనివాసుడు వంటి పేర్లతో అర్చనలనందుకొనుచున్నావా? 'వెం' అనగా పాపములను 'కట' అనగా పోగొట్టువాడుగ వెంకటాచలువాసుడిగా ప్రసిద్ధి కెక్కినావా! నీ వద్దకు వచ్చిన, నీ నామమును తలచుకొన్న వారి పాపములను పటాపంచలు చేయుచున్నావా? ఆపదమ్రొక్కులవాడా! వడ్డికాసులవాడా! అని ఆర్తులు, భక్తులు ఎలుగెత్తి పిలుచుచుండగా అన్నమాచార్యులవంటి వాగ్గేయకారుల పదములు, కీర్తనలతో నీ ప్రభలను వెదజల్లుచున్నావా? తిరుమలగిరుల సిరులు నీవైభవమును, శోభను చాటుచున్నవి గదా. ఆకాశరాజ కుమార్తెయైన పద్మావతిని ప్రేమించి పెండ్లాడినావు. నీవు కొండపైన ఆమె కొండక్రింద కొలువులుతీరి భక్తుల మ్రొక్కులను తీర్చుచున్నారు కదా.

**సీ. జంగమస్థావర - సర్వభూతములలో**
**విజ్ఞానవేత్తలు - విభుని గనిరి**
**యణుపరమాణువు - లా గ్రహగోళముల్**
**జరుగును సర్వధా - జరుగ గనము**

**జీవకణాలందు - జీవనిర్జీవముల్**
**జరుగును సర్వథా - జరుగు గనము**
**భూమిపై తిరుగుచు - పొరిపొరి చూతుము**
**జరుగును పృథ్వితా - జరుగ గనము**

**తే.గీ. కదలలేనట్టివస్తువు - కనము జగతి**
**కదలుచున్నను కనలేము - కదలుస్థితిని**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! 66**

**భావము :** ఈ కాలపు వైజ్ఞానికులు చరాచరజగత్తు అంతా నిరంతరము చలనములోనే నున్నదని ప్రతిపాదించుచున్నారు. మనకంటి కందని విషయములవెన్నో భ్రాంతిగా మరియు వింతగా కనిపించుచున్నవి.

ఈ విశ్వమంతయు పదార్థముచే నిర్మింపబడినది. ఈ పదార్థము తన ధర్మములను నిలబెట్టుకొన్న అతిచిన్నకణము అణువు. ఈ అణువులో ఇంకను చిన్నవైన పరమాణువులుండును. ఈ పరమాణువులందు కేంద్రకము (న్యూక్లియసు) అనే పేరుతో మధ్యభాగముండును. ఈ కేంద్రకము చుట్టు ఎలక్ట్రానులనబడే అతి సూక్ష్మపరమాణుపదార్థములు నిరంతరము తిరుగుచుండును. ఇవి నిరంతరము తిరుగుచున్నను వాటి భ్రమణములు మనకు తెలియడము లేదు. ద్రవ, వాయువులలోని అణువులు నిరంతరము కదులుచునేయుండును. అట్లే ఆకాశమందు గల గోళములు, గ్రహములు, నక్షత్రములు నిరంతరము తిరుగుచునేయుండును. అయినను వాటి గమనమును మనము గుర్తించ లేకుండ యున్నాము.

జీవులు అనగా జంతువులు, మానవులు, వృక్షములు. వీటన్నింటి యందు రేయింబవళ్ళు ఎన్నో జీవ మరియు నిర్జీవపదార్థములు తిరుగుచునేయుండును. కాని వాని భ్రమణములను గురించి మనము తెలుసుకొనలేకపోతున్నాము.



ఇంతేకాదు, భూమిపైననే మనము నివసించుచున్నాము. ఈ భూమి నిరంతరము తనచుట్టు తాను తిరుగుకొనుచు సూర్యుని చుట్టు భ్రమించుచున్నది. తనచుట్టు తానొక్కసారి తిరుగుట పూర్తియైనపుడు ఒకదినము అంటే ఒక రాత్రి+ఒక పగలు అయినదని, అదే భూమి సూర్యుని చుట్టి వచ్చేటప్పటికి ఒక్క సంవత్సరము పట్టుచున్నదను పాఠములను పిల్లలకు బోధించుచున్నాము గాని, వాటి గమనములను మనము భౌతికముగా గుర్తించలేక పోవుచున్నాము.

ఇన్ని రకములుగా జగత్తులోని వస్తుసంచయమంతయు నిరంతరము కదులుచున్నను మనము వాటి కదలికలను తెలియ లేకున్నాము కదా.

స్వామీ! నీ నియంత్రణశక్తి ఏమిటో, నీ భ్రమణశక్తి ఏమిటో నాకు అంతుపట్టకున్నది.

**సీ. ఏకాదశీ వ్రత - మింపుగా చేసిన**
**నంబరీషుకడకు - యతియువచ్చె**
**దుర్వాసు పూజించి - యుర్వీపతి పిలచె**
**పారణచేయంగ - భక్తిమీర**
**మజ్జనంబును చేసి - మరి వచ్చెదనుచును**
**నాలసించె మునియు - నపుడు రాజు**
**ఘడియ దాటుచునుండ - గంగను గైకొని**
**మౌనిరాక కొఱకు - పూనివేచె**

**తే.గీ. నలుకచెంద మునిని రాజు - నడుగులపడ**
**చేసి యంబరీషవరద - వాసిగంటె**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!**
**నమ్మి నానయ్య నిన్ను నే - నారసింహ! 67**

**భావము :** ఈ పద్యములో అంబరీషుని కథయున్నది. ఇక్ష్వాకు వంశములోని సుప్రసిద్ధుడైన రాజు అంబరీషుడు. ఈతడు మహావిష్ణుభక్తుడు. ముఖ్యముగా

ఏకాదశీ వ్రతమును నిష్ఠతో ఆచరించు చుండెడివాడు. ఏకాదశీ వ్రతమనగా హిందువుల కాలమానిక ప్రకారము ప్రతిమాసములో ఏకాదశి రెండుసార్లు వచ్చును. ఆ తిథియందు పూర్తిగా ఉపవాసము చేసి భగవంతునికి విశేషార్చనలు చేసి ద్వాదశితిథిలో పెందలకడనే భగవంతునికి ఆహారాదులు నివేదనము చేసి భోజనము చేయవలయును.

ఇట్లు ఒకసారి ఏకాదశీ వ్రతము చేసి, ద్వాదశినాడు పూజలు ముగించి, భోజనమునకు ఉపక్రమించు సమయములో వారివద్దకు దుర్వాస మహర్షి వచ్చెను. మహర్షి రాకకు మిక్కిలి సంతసించి వారిని కూడా భోజనమునకు పారణకు విచ్చేయుమని అంబరీషుడు ఆహ్వానించెను. ఋషియు అందుకంగీకరించెను. అయితే ఇంకా స్నానముచేయలేదని నదికి పొయివత్తునని శిష్యులతో పోయెను. ఎంతకు వచ్చుట లేదు. ఈ లోపుగా ద్వాదశిగడియలు ముగింపునకు వచ్చుచున్నవి. అంబరీషుని పరిస్థితి అడకత్తెరలో చిక్కిన పోకవలెనైనది. తిన్నచో మహర్షికి కోపము వచ్చును. తినకపోయినచో ద్వాదశగడియలలో జరుపు పారణసమయము దాటిపోవును. చేసిన వ్రతము నిష్ఫలమగును. అప్పుడు గురువుల సూచనల మేరకు గంగను గైకొనెను.

నీటిని తీసుకొనుట వలన వ్రతఫలమును దక్కించుకొనవచ్చునని మహర్షులకాగ్రహము రాదని తలంచెను.

కాని దుర్వాసమహర్షి రానేవచ్చెను. ఆయనకు ఆగ్రహము రానేవచ్చెను. వెంటనే అంబరీషునిపై కోపించి శపించుట కుద్యుక్తుడయ్యెను. విషమించుచున్న పరిస్థితిని చూసి అంబరీషుడు మహావిష్ణువును ప్రార్థించెను. మహావిష్ణువు పంపిన చక్రము దుర్వాసుడు పంపిన కృత్యను నిర్వీర్యము చేసి అతని వెంటపడెను. అపుడు దాని బారినుండి తప్పించుకొనుటకు త్రిమూర్తుల వద్దకేగెను. శ్రీమహావిష్ణువు తన భక్తలను నిష్కారణంగా శిక్షించు



వారిని తానుపేక్షించనని, ఆ యంబరీషునినే క్షమింప వేదుకొమ్మని పంపెను. చివరకు విధిలేక దూర్వాసుడు అంబరీషుని క్షమింపమని యడిగెను. సుదర్శన చక్రము తిరిగి విష్ణుహస్తమునందు చేరెను.

ఇట్లు అంబరీషవరదుడను బిరుదు నామము పొందితివా మహాశయా! దొడ్డవేల్పా! ఇవే నీకు వేవేల నమస్కారములు.

**సీ. శ్రీ రుక్మిణీపతి – శ్రీనివాసాఖ్యుండు**
**వ్యాపారమును చేసె – వజ్రవితతి**
**పిసినారి దరిచేరి – వేడితే ధనమీయ**
**గృహిణి రుక్మిణి ద్వార – కృపణుబ్రోతె**
**పరతత్త్వ మగుబుద్ధి – మెరసిన క్షణమందె**
**వజ్రాల రత్నాల – వన్నెతరుగ**
**నాస్తి దానమొసంగ – హరిదాసు చేసితే**
**నిను పాద భక్తుని – నెమ్మిచూతె**

**తే.గీ. శ్రీ పురందరదాసుగా – చిన్నె నిడితె**
**పరమపూరుష దాసుని – వాసిగాంతె**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మి నానయ్య నిన్ను నే – నారసింహ! 68**

**భావము :** ఈ పద్యములో పురందరదాసు కథ వర్ణింపబడినది.

శ్రీనివాసుడని పేరుగల వజ్రాల వ్యాపారి ఒకడు దక్షిణదేశాన ఉండెను. ఈతడు మిక్కిలి ధనవంతుడు, గుణవంతుడు కూడ. అయితే అతని చరిత్రలో ఒక లోపముండెను. అది యేమనగా పిసినారితనము.

ఈయన భార్య రుక్మిణి. ఈమె పతివ్రతా శిరోమణి. దానధర్మముల విషయములో మాత్రము భర్తకు విరుద్ధము. భర్తలోభియైనందున, తాడితులు,

పీడితులు వచ్చినప్పుడు భర్తకు తెలియకుండా తనకు చేతనైనది యిచ్చి పంపుచుండెను.

ఈ దంపతుల ననుగ్రహించుటకై సాక్షాత్తు శ్రీమహావిష్ణువే ఒక బీద బ్రాహ్మణునివలె మొదట యజమానిని వేడికొన్నాడిలా 'నా కుమారునికి ఉపనయనము చేయవలెను. దానికి తగినంతగా ధనసహాయము చేయండి'. శ్రీనివాసుడు మొండిచేయి చూపెను. ఇప్పుడాయన ఇంటివద్దకు వచ్చెను. అమ్మగారికిదే విషయము చెప్పి ధనసహాయమును కోరెను. ఆదొడ్డ యిల్లాలు ధనము తనవద్ద లేనందున వజ్రపు ముక్కర తీసియిచ్చి దానిని అమ్మి వచ్చుడబ్బుతో తనకార్యమును జరుపుకొమ్మని బాపని చేతిలో పెట్టినది.

ఆ మాయా భూసురుడు ఆమె భర్త వద్దకే పోయి దానిని అమ్ముటకు యిచ్చి దానికి తగిన డబ్బు యిమ్మని అడిగినాడు. ఆ ముక్కర చేతిలో పడగానే అది తన భార్యదేయని అతనికి నమ్మకము కలిగినది. ఇంతటి విలువైన వస్తువు భార్య దానమిచ్చినదాయని కోపము వచ్చినది... నిజమదేనా తేల్చుకొంటానని ఆ బ్రాహ్మణుని అక్కడే యుండమని చెప్పి అతడింటికి వచ్చినాడు. భార్యను నిలదీసినాడు. ఆశ్చర్యకరముగా ఆమెకు అట్టిదే ముక్కర లభింపచేసినాడు మహావిష్ణువు. బ్రాహ్మణునికి విషయము తెలిపి డబ్బు ఇచ్చివచ్చెదనని అంగడికి పోయినాడు. కాని అక్కడ బ్రాహ్మణుడు లేడు. ఇప్పుడు కాకపోతే కొంచెం సేపైనాక వస్తాడని ఎదురు చూశాడు. ఎంతకు రాకపోయేటప్పటికి, అతని గుర్తులు చెప్పి, ఊరిలోను, ఊరి పరిసరాల్లో వెతికింప చేశాడు. ఎవరికి అతడు కనిపించనేలేదు.

ఈ ఘటనతో శ్రీనివాసునకు ఇది శ్రీ విష్ణుమాయయని తెలిసివచ్చినది. తన పిసినారితనమును తెలియజేసి కనువిప్పు కలిగించుటయే దీని ఉద్దేశ్యమని బోధపడినది. అటుపైన పరమాత్మతత్త్వము తలలో మెరిసినది. ఆ మెరుపులో తాను చేస్తున్న వజ్రాలు, రత్నాల మెరుపులు తక్కువని గ్రహించి



వ్యాపారమును మానినాడు. ఉన్న సంపదలనంతయు హరి సమర్పణమంటూ దానధర్మములు చేసినాడు.

ఈయనకు కమ్మని కంఠమున్నది. లౌకికమైన పాండిత్యమున్నది. ఇప్పుడు హరిభక్తి తోడైనది. ఈ భక్తిమార్గపుజీవనము నెంచుకొన్నాడు. భార్య ఆ ధర్మముతోనే అనుగమించినది. హరిదాసుగా మారిన తర్వాత పురందరదాసు అనుపేరు వచ్చినది. లెక్కలేనన్ని పాటలు, భక్తితో పులకించి పోయేవి రచించి గానంచేసేవాడు. ఈయనే కర్ణాటకసంగీతానికి ఆద్యుడయ్యాడు. దేశంలోని పలుపుణ్యక్షేత్రాలు దర్శిస్తూ, భక్తులను తరింపచేస్తూ తాను తరించిన మహనీయుని చరిత్రయిది.

సీ. **తమ్మునితో పాటు – తండ్రియంకముపైని**
**తా కూడ కూర్చుండ – స్థానమడుగ**
**పినతల్లి వారింప – పేరలుకనుపొంది**
**జనని యనుమతితో – సాగెనడవి**
**నారదుడీయ నీ – నామ జపమ్మును**
**భజియించి నాడుగా – భక్తిమీఱ**
**వాని తపము మెచ్చి – వరముల నొసగవే**
**ధ్రువున కిచ్చితి గాదె – ధ్రువపదమ్ము**

తే.గీ. **వాసుదేవుడా! కరుణించి – గాసిబాపు**
**ధ్రువుని యట్టుల నాకును – త్రోవచూపు**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్పు!**
**నమ్మి నానయ్య నిన్ను నే – నారసింహ!** **69**

**భావము :** ఈ పద్యములో ధ్రువచరిత్ర వర్ణింపబడినది.

స్వాయంభువ మనుచరిత్రలోని కాలమది. ఉత్తానపాదుడు ఆనాటి భూమికి ఏలిక. ఆతని కిద్దరు భార్యలు. పెద్ద భార్య సునీతి. ఆమెకు ఒక్క

కొడుకు ధ్రువుడు. రెండవ భార్య సురుచి. ఆమెకు ఒక్క కుమారుడు ఉత్తముడు.

రాజుకు చిన్నభార్యపైన మోజు ఎక్కువ. ఆమె భర్తను తనవశవర్తిగా చేసికోవడం చేత మొదటి భార్య సునీతికి రాజాదరణ తగ్గిపోయింది. ఆమెతో పాటు ఆమె కుమారుడైన ధ్రువుని కూడ తండ్రివద్దకు చేరనిచ్చేది కాదు సురుచి.

ఇటువంటి నడవడిక చాలాదూరానికి దారితీసింది. తమ్ముడైన ఉత్తముడు తండ్రిఒడిలో ఆడుకోవడం చూచిన ధ్రువునకు తానుకూడ తండ్రి ఒడిలో కూర్చోవాలని ఆశపడ్డాడు. అప్పటికింకా బాల్యప్రాయమే. ఐదారేండ్ల వయసే అది. అతిసహజమైన యీకోరికను తీర్చుకొనేటందుకు తండ్రిదగ్గరకు పోతుండగా పినతల్లి వారించింది. ప్రక్కకు లాగేసింది. అంతటితో వదలక మాటల బాణాలతో గ్రుచ్చింది. మీ నాయన ఒడిలో కూర్చోవలెననుకుంటే నా కడుపులో బిడ్డగా పుట్టాలి. ఇట్లా చేతలతో మాటలతో చీదరించి దూరంగా తరిమిన సవతితల్లిని గురించి తన తల్లి దగ్గర చెప్పుకొని యేడ్చాడు పసిబాలుడైన ధ్రువుడు. భర్త అనాదరణకు, సవతిఅసూయకు బలియౌతూ జీవితము గడుపుతున్న సౌమ్యురాలు సునీతి. ఆమె తన అసహాయతను తెలియజేస్తూ మీ పిన్ని చెప్పినదే నిజము నాయనా అని బాధపడసాగింది. ధ్రువునిలో పట్టుదల హెచ్చినది. వేరేమార్గము లేదా యని తల్లి నడిగితే భగవంతుని దయ ఉంటే అన్ని సాధ్యమౌతుంది అని చెప్పినది. ఇది విన్న అతడు దేవుడిదయను సంపాదించి యింటికి వస్తానని చెప్పి అడవిలోకి పోయాడు. అడవిలో నారదమహర్షి కనిపించి విషయమంతా తెలిసికొని బాలకుని పట్టుదలకు సంతోషించి ద్వాదశాక్షరీ మంత్రాన్ని ఉపదేశించాడు.

'ఓం నమోభగవతేవాసుదేవాయ'ను భక్తితో జపించసాగాడు ధ్రువుడు. అనతికాలంలోనే అతని భక్తి పండినది. దేవతలు, మునులు ఆ తీవ్రతను



భరించలేక శ్రీహరిని వేడుకొన్నారు ధ్రువునికోర్కెలు తీర్చుమని. శ్రీమహావిష్ణువు ధ్రువునకు దర్శనమిచ్చాడు. లౌకికమైన భోగములతో పాటు అతడడుగని నక్షత్రపదవిని కూడ అనుగ్రహించాడు.

భగవంతుని భక్తరక్షణాతత్పరత ఎట్లా ఉంటుందో యెవ్వరెరుగరు. ఇట్టి కథలను విన్నాము కావున వరవాసుదేవుడా! నన్నెట్లు కరుణింతువయ్యాయని నిన్ను వేడుకొనుచున్నాను.

**సీ. మకరిచేత బడిన - మాతంగ మానాడు**
**వత్సరాల కొలది - వారిపోరి**
**గెలుచు మార్గములేక - తలచులేదోనిన్ను**
**నూహకలంగిన - దేహిపోలె**
**విశ్వాత్ముడా నాడు - వినిపింపగా పిల్వ**
**సర్వంబు విడచుచు - పర్వులిడవె**
**యార్తరక్షణకయి - నార్తి చూపెదనుచు**
**జనులు నీ పేరిట్లు - చాటుచుండ్రు**

**తే.గీ. నాటి ఖ్యాతిని నిలుపంగ - బోటివినతి**
**విమలవేదండరక్షక! - వేద వినుత!**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!**
**నమ్మి నానయ్య నిన్ను నే - నారసింహ!** **70**

**భావము :** గజేంద్ర మోక్షము కథ యిచ్చట వివరింపబడినది. పోతన పద్యములలోని కొన్ని మాటలట్లే పద్యమునందు పొదగబడినవి. గమనించుడు.

తామసుడను మనువు నాటి కాలపుకథయిది. మునిశాపవశమున ఏనుగుల రాజుగా భూమిపై జన్మిస్తాడొక మహారాజు. ఏనుగు జన్మకు తగినట్లు వేవేల కరిణీసమూహంతో క్రీడిస్తూ ఆనందంగా జీవితమును

గడుపుతూ ఉంటాడు. ఆ కాలంలోనే హూహూ అనే గంధర్వుడు కూడ మరియొక మునిశాపంవలన ఆ అడవిలోని ఒకపెద్దకొలనులో మొసలిగా మారి జీవనం గడుపుతుంటాడు.

వీరిరువురి పాపపుణ్యాలు పండి గజరాజు యీ కొలను దగ్గరికే వచ్చి భార్యలతో సహా దాహాన్ని తీర్చుకొని, జలకాలాడి బయటకు వచ్చే సమయంలో మొసలి ఏనుగు కాలు పట్టేస్తుంది. విదిలించుకొని రాబోతాడు. ఏనుగు. వెంటనే మఱల పట్టుకొంటుంది మొసలి. ఇట్లా మొదలైన కరిమకరుల యుద్ధం వేయిసంవత్సరాలు నడుస్తుంది. మొసలికి నీరు స్వస్థానమైనందున క్రమంగా దానిబలం పెరుగుతూ వస్తుంది. ఏనుగుకు బలం తగ్గుతూ వస్తుంది. అప్పుడు పూర్తిగా అలసి నిస్త్రాణలోనున్న ఏనుగుకు పూర్వజన్మపుణ్యఫలం వలన భగవంతుడు గుర్తుకు వస్తాడు. అనేక విధములుగా ప్రార్థనలు చేస్తాడు. ఊహ కలంగిన దేహివోలె 'విశ్వాత్ముడా! లావొక్కింత యులేదు, సంరక్షించు భద్రాత్మకా' అని దీనాతిదీనంగా ప్రార్థనలు చేస్తాడు. ఇవి తనచెవుల్లో పడేటప్పటికి వైకుంఠంలో రమాదేవితో సరసమాడుతున్న విష్ణుదేవుడు సర్వము మరచి అలవైకుంఠపురంనుండి సిరికింజెప్పక శంఖచక్రముల చేదోయి సంధింపక గజరాజు రక్షణకై బయలుదేరుతాడు. ఈయన ఆత్రము, భక్తపాలన తత్త్వమును అర్థం చేసుకొన్న వైకుంఠపురవాసులంతా లక్ష్మితోపాటు ఆయనను అనుగమిస్తారు. చివరకు సుదర్శనచక్రము స్వామి చేతిలోకి చేరగా దానిని మొసలిపై ప్రయోగిస్తాడు.

వేదండ రక్షకా! నాటి ఖ్యాతిని నిలుపుకో. ఈ బోటిని కూడా రక్షించు.

**సీ. రామాయణము నాడు - లంకకు నేగుచో**
**వానరులందరు - వార్థికడను**
**వారధి కట్టుచు - పనిచేయుచుండగా**
**నుడుత యొక్కటి నాడు - కడలిమునిగి**



**యిసుకలో పొర్లాడి - యేతెంచి వార్థిపై**
**నిటునటు పొర్లాడ - నిసుకరాల**
**కడగంట చూచితే - యుడుత భక్తిని నీవు**
**ప్రేమతో నిమిరితే - వీపుపైన**

**తే.గీ. దేవ యిసుమంత భక్తికి - భావమందు**
**పెద్దపీటను వేయుదే - పేర్మిగనుదె**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహా! 71**

**భావము :** జనశ్రుతిలో ఉన్న కథయిది.

అది రామాయణకాలం. శ్రీరాముడు రావణుని సంహరించేటందుకు సముద్రమువద్ద కపిసైన్యంతో విడిసియున్నాడు. సముద్రుడు తెల్పిన ప్రకారం లంకను చేరడానికి సముద్రంపై వారధి బంధనం జరుగుతున్నది. నలుడు, నీలుడు అనే పేర్లుగల వానరముఖ్యులు ఆనాటి ఇంజనీర్లు. దరిదాపుల్లో ఉన్న పెద్దపెద్ద చెట్లను పడగొట్టి దుంగలను కొండల్లోని బండలను గొప్ప గొప్పవానరులు తెచ్చియిస్తుంటే వాటిని సేతువుమీద పరిచి ముందుకు సాగుతున్నారు. శ్రీరాముడు లక్ష్మణ సహితుడై దగ్గరగా చెట్లనీడన కూర్చొని వీరు చేస్తున్న పనులను పర్యవేక్షిస్తూ ఉన్నాడు.

కోతులు, ఎలుగుగొడ్లు ఇలాంటి భారమైన పనులు నిర్వహిస్తూ ఉండగా ఒకానొక ఉడుత నీటిలో మునగడం, వెంటనే ఒడ్డున ఉన్న ఇసుకలో పొరలడం, అటుపై క్రొత్తగా కడుతున్న వారధిపై పొరలడం, మరల నీటిలో మునగడం, ఇసుకలో అటు వారధిపై పొర్లడం. ఇదే దినచర్యగా ఉదయంనుండి సూర్యాస్తమయంవరకు అలుపెరుగక చేస్తూ వచ్చిందట.

దాని భావమేమిటంటే తన శరీరంనుండి రాల్చిన ఆ యిసుక కొంతయినా సేతుబంధనానికి ఉపయోగపడాలని. ఇంత భక్తిభావం

నిండారగా ఆ ఉడుత చేస్తున్న పనిలోని గొప్పదనాన్ని అర్థం చేసికొన్న నీవు దాని వీపుపై ప్రేమతో నీ వ్రేళ్ళతో నిమిరావని, నాటినుండి దాని సంతతికంతా ఆ గుర్తులు నిలిచాయని జనం చెప్పుకొంటారు.

దేవ! ఇసుక రేణువులంత అల్ప పరిమాణంలో భక్తి ఉన్నప్పటికి నీవు దానికే పొంగిపోయి పెద్దపీట వేస్తావని యీ కథ తెలుపుతున్నది. నేను కూడ ఆ ఉడుత వంటి దాననే ప్రభూ! నాపైన కూడ నీ అనుగ్రహం చూపించు.

**సీ. చిననాటి తప్పును - చెలునకు తెల్పంగ**
**దారిద్ర్యమతనికి - తగులగడితె**
**వామాక్షి పోరంగ - వారనిభక్తితో**
**ద్వారక చేరంగ - దరియవత్తె**
**చెంతన కూర్చుండి - చేయెత్తి విసరుచు**
**కైంకర్యముల చేతె - కమలకూడి**
**యటుకుల మెక్కుచు - పటుసంపదల నిత్తె**
**సఖ్యతఘనతను - చాటిచెపితె**

**తే.గీ. లేరు నీయట్టి స్నేహితు - లేరికైన**
**ఘన కుచేలసఖా! నను - కరుణగనుము**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! 72**

**భావము :** ఈ పద్యములో కుచేలుడని నామాంతరముగల సుదాముని కథను తెల్పుచున్నాను.

శ్రీకృష్ణమూర్తి సాందీపని అనే మహర్షి వద్ద విద్యాభ్యాసం చేస్తున్న రోజులవి. అక్కడ సుదాముడు అనే బ్రాహ్మణ వటువుతో శ్రీకృష్ణునికి చెలిమి కుదిరింది. ఒకనాడు వీరిరువురిని కట్టెలు మరియు సమిధలను తీసుకొని



రమ్మని పంపారు గురుపత్ని. వాటిని సేకరించి మోపులుగా కట్టి తిరిగి వచ్చే సమయానికి చీకటిపడింది. అప్పుడే పెద్దగా గాలివాన కూడా వచ్చింది. ఒక చెట్టువద్ద చేరుకొన్నారు మిత్రులిద్దరూ. ఆ సమయంలో తప్పొకటి చేశాడు సుదాముడు. గురుపత్ని అటుకుల మూటనిచ్చి ఆకలి వేసినపుడు ఇద్దరిని తినమన్నది. వీటిని కృష్ణునకు ఇవ్వకుండా, పైకి తాను తింటున్నట్టు కూడా తెలియనివ్వకుండా చాటుగా తానొక్కడే తిన్నాడు.

ఈ పాపపుఫలితమే అతడి జీవితంలో వెంటాడింది. అమిత దరిద్రుడయ్యాడు. పిల్లలు చాలామంది కలిగారు. కాని వారికి పెట్టి పోషించడానికి తగిన ఆధరువులు చూపించలేకపోయాడు సుదాముడు. సరియైన బట్టలుకూడా అతడు ధరించలేకపోయాడు. 'చేలము' అంటే వస్త్రము 'కు' అంటే మంచిగాలేనిదని అర్థము. అంటే ఎప్పుడు చాలీచాలని, చిరుగులున్న వస్త్రాలనే ధరించడంచేత కుచేలుడని పిలువబడ్డాడు ఈ సుదాముడు.

ఇవి లౌకికమైన సాధక, బాధకాలు. కాగా సుదాముడు గొప్ప భక్తుడు. నిరంతరం హరినామస్మరణ చేస్తుండేవాడు. మరి యీ భక్తివలన ఆయన నిత్యజీవనం కష్టంగా గడుస్తున్నది. ఈయన భార్య పేరు వామాక్షి. ఈమె కూడా సాధ్వీమణి. ఒకనాడు ఆమె భర్తకు ఉపాయం చెబుతుంది. ద్వారకలో ఉన్న తన భర్తకు బాల్యస్నేహితుడైన శ్రీకృష్ణుని దర్శించి తన దారిద్ర్యాన్ని పోగొట్టమని అర్థించమంటుంది. భౌతికఅవసరాలు తీర్చమని అడగటం అతనికి అయిష్టమనిపించినా తామున్న పరిస్థితులో తప్పనిసరి అని తెలుసుకొని సరేయని బయలుదేరుతాడు. భగవంతుని దర్శనానికి వట్టి చేతులతో పోకూడదని కొంచెం అటుకులను చిరుగుపాతల్లోనే మూటకట్టి యిస్తుంది వామాక్షి.

ఎన్నో కష్టనష్టాలకోర్చుకొని కుచేలుడు నీ వద్దకు వచ్చాడని తెలియగానే ఎంత దయ, గౌరవము చూపించావు. ప్రక్కన కూర్చొనబెట్టుకొని ఎన్ని

మర్యాదలను చేశావు. బ్రాహ్మణులపట్ల ఉన్న భక్తిని, స్నేహితునిపట్ల ఉన్న ప్రేమను, ఆతని భక్తికి ఆదరణ అన్ని కలియగలిపి లోకోత్తర రీతిలో స్నేహానికి భాష్యం వచించావు.

నీవు సేవించడమేకాక నీ భార్యలచే కూడా సేవింపచేశావు. అతడి వద్ద ఉన్న అటుకులను వెతుకుకొని తిన్నావు. అపారమైన భౌతిక సంపదలను అందజేశావు. భక్తి మాహాత్మ్యాన్ని తెలిపిన ఓయి కుచేలసఖుడా! నన్నుకూడ కరుణించు.

**సీ. మానుగా సేవ సం - యమివరులకు చేసె**
**మాతంగ శిష్య యి - మ్మహిని శబరి**
**గురునాజ్ఞ గైకొని - పరమాత్మ నినుగన**
**వేచియుండెను కదా - విమలభక్తి**
**నాతిథ్యమిడుటకై - యడవిలో ఫలముల**
**రుచిచూచి తెచ్చెగా - శుచిగనీయ**
**నీవు దర్శనమీయ - నిలువెల్ల పొంగెను**
**జీవన సఫలత - త్రోవగనెను**

**తే.గీ. శబరివలె నిరీక్షింపగ - శక్తినైన**
**నిమ్ము నాకును వేచెద - నినకులేశ!**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! 73**

**భావము :** ఈ పద్యములో శబరిని అనుగ్రహించిన రామునికథ వివరింపబడినది.

రామచంద్రుడు, లక్ష్మణసహితుడై సీతాదేవిని వెదుకుతున్నాడు. కబంధుడనే రాక్షసుని చేతుల్లో చిక్కుకొంటారు. వాడు తినబోతుండగా



ఆత్మరక్షణ ప్రయత్నంలో వాడి చేతులను నరుకుతారు. అప్పుడు వాడికి శాపవిమోచనమై ఒక గంధర్వుడిగా రూపొందుతాడు.

సీతను వెతకడానికి వీరు వెళ్తునట్లు తెలిసికొని వారికి సాయపడే సుగ్రీవుని గురించి చెబుతాడు. అంతేకాక వీరి రాకకోసం సంవత్సరాల తరబడి వేచియున్న ఒక భక్తురాలి గురించి చెప్పి ఆమె యుండే స్థలం వివరాలు చెప్పి అంతర్ధానుడవుతాడు.

ఆ భక్తురాలే శబరి. ఆమె ఇప్పటికి చాలా వృద్ధురాలయింది. ఆమె మతంగుడనే మహర్షికి శిష్యురాలు. గురుదేవులసేవ యెన్నో యేళ్ళు చేసింది. వారు దివంగతులవుతున్నప్పుడు తానుకూడా వారిని అనుగమిస్తానంటుంది. అయితే గురుదేవులు వారించారు. అవతార పురుషులయిన రామలక్ష్మణులు భూమి మీదకు వస్తారు. భార్యను వెతికే ప్రయత్నంలో భాగంగా మన ఆశ్రమానికి వస్తారు. వారికి ఆతిథ్యమిచ్చి ఆదరించిన పిమ్మట నీవు మేమున్న లోకానికి రమ్మని సెలవిస్తారు.

గురునాజ్ఞ పాటిస్తూ శబరి నిలిచిపోయింది. ఎన్నోయేళ్ళ తరువాత రామలక్ష్మణులు అడవికి వచ్చారని విని సంతోషించింది. అటుపై కొంతకాలానికి సీతాపహరణం గురించి విన్నది. అప్పటినుండి రాముని రాకకు ఎదురుచూడడమే. అతనికి ఆతిథ్యమివ్వడానికి తగిన ప్రయత్నాలే తీయని ఫలములను తెలుసుకోవడానికి రుచి చూడడమే పద్ధతి. ఇలా ఫలపుష్పాదులను ప్రతిరోజు సేకరించి ఎదురుచూడడమే. ఎంతో కాలము నిరాశ చెందడమే. కాని ఒక్కరోజు ఆ సుదినం వచ్చింది. ఆమె పుణ్యం పండింది. ఆయనకు ప్రియమారగా ఆతిథ్యమిచ్చింది. నిలువెల్లా చూచి పులకరించిపోయింది. సుగ్రీవుడు ఉండే పర్వతాలను చూపించింది. జన్మస్థారకమయిందని, గురువాక్యాలు స్మరించి వారి సమక్షంలోనే యోగాగ్నిలో తనువు చాలించింది.

నీ దయను పొందేటందుకు నాకున్న ఆత్రతకు సమయము కలిసివచ్చుటలేదు ప్రభూ, అందువలన ఆ శబరివలె నిరీక్షించుటకైనా శక్తి యిమ్ము.

**సీ. కలియుగమ్మున కూడ - కనికరించవె నీవు**
**భక్తివత్సలతలో - రక్తిగనవె**
**మీరాను నారాణ - మేరలే లేనట్టి**
**కష్టాల గురిజేయ - కావలేదె**
**పాన్పుపై ముండ్లను - పరిపింపగాజేయ**
**పూచెండ్లుగా మార్చి - బ్రోవలేదె**
**పానంబు సేయించ - పాల విషముగల్పి**
**మధురామృతమ్ముగా - మార్చలేదె**

**తే.గీ. నందగోపాల గిరిధర - సుందరాంగ!**
**మీర వందిత మోహనా - శౌరి గనుమ**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! 74**

**భావము :** ఈ పద్యములో మీరాబాయి కథను వర్ణించినాను.

ఇంతవరకు తెల్పిన భక్తుల కథలు పూర్వ, మన్వంతరాలలో, యుగాలలో అయితే ఈ కలియుగంలో జరిగిన కథ మీరాబాయిది. పురందర దాసులది కూడ.

భారతదేశములోని రాజస్థాను రాజ్యములో ఒక మహాభక్తురాలు కొన్ని వందలయేండ్ల క్రిందట జన్మించినది. ఆమె పుట్టినది రాజవంశములో. ఆమెయే మీరాబాయి. బాల్యదశలో ఉండగా ఇంటిముందు సాగిపోతున్న ఒక పెళ్ళిఊరేగింపు ఆమెకు మహదానందాన్ని యిచ్చినది. తల్లితో తనకు



కూడా అట్టి ఊరేగింపు చేయించమని కోరిందట. ఆమె నీకు భర్త వచ్చినపుడట్లే చేస్తామంటే భర్తను చూపించమని బాల మీర మారాము చేసిందట. అప్పుడు తల్లి ఇంట్లో ఉన్న కృష్ణవిగ్రహము నామెచేతితో పెట్టిందట. కొంత కాలమైనాక ఊరేగింపు చేస్తామని ఊరడించినదట.

ఈ విధంగా బాల్యంలో చేతికందిన శ్రీకృష్ణమూర్తినే, గిరిధర గోపాలునే తనభర్తగా మనసులో ముద్రించుకొన్న దీ భక్తశిరోమణి. అటుపై లోకాచారంగా ఎదిగిన మీరాకు రాజకుమారుడైన కుంభ రాణాగారితో వివాహమైనది. అయితే దురదృష్టవశాత్తు ఆయనతో ఈమె కాపురం చేయకముందే ఆయన కాలం చేశారు. అయినా లౌకికజీవనవిధానాన్ని అనుసరించి ఆమె అత్తగారింట్లో శేషజీవితం గడపడానికి వెళ్ళింది.

అక్కడ ఆమె భక్తికి తగిన గుర్తింపు లభించలేదు. పైగా మరిదిగారినుండి వ్యతిరేకత మొదలైంది. ఇవి వికృతరూపాలు ధరించి ఆమెను హతమార్చేందుకు ప్రయత్నాలుగా మారినాయి. మీరా పడుకొనే పాన్పుపై ముళ్ళను పరిపించాడు రాణా. కాని మీరాబాయి పాన్పుపై చేరేసరికి అవి పూలచెండ్లుగా మారినవట. మీరా త్రాగే పాలలో విషము కలిపి పంపించాడట మరిది. భక్తితో ప్రసాదంగానే స్వీకరించినదా పాలను మీరాబాయి. అది అమృతంగా మారినదట. పాముతోకాటు వేయింపించి చంపే ప్రయత్నం చేయగా అది ఒక సాలగ్రామంగా మారినదట.

నీ లీలలెన్నో, గిరిధరగోపాల ముద్రతో నందనందనుడైన నిన్ను ఆ మీరాబాయి చేసిన స్తుతులెన్నో. జీవితకాలమంతా నీ భక్తులతో కలిసి చరిస్తూ, నిన్ను గానం చేస్తూ, ఆనందంతో నాట్యంచేస్తూ పరవశించిన మీరా సాధుగాథ విన్నవారికి కళ్ళు చెమర్చుతాయి. ఒళ్ళు పులకరిస్తుంది.

నందనందనా! అనుగ్రహించు. నిన్నే నమ్మినానయ్య నరసింహయ్యా అనే మకుటంతో తెల్పుకొంటూ ప్రతిపద్యంలో వేడుకొంటున్నాను.

సీ. పన్నిద్దరాళ్వార్ల - వరుసతా చేరెను
గోవింద నినుకొల్చి - గోదదేవి
తులసీవనములోన - పొలుపుగా నుదయించి
విష్ణుచిత్తునియింట - పెరిగెగోద
పరమాత్మ నినుతల్చి - పాశురమ్ముల వ్రాసె
ధనువున రవి చేరు - దినములందు
పూమాల నీ మెడ - పొలుపొందుటకకు మున్న
తా ధరించుచు చూచి - తనివినొందె

తే.గీ. తెలిసి తండ్రి శిక్షింపగ - తెలిపి యతని
కామె ప్రేమను గైకొంటి - వతులితముగ
దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!
నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! **75**

**భావము :** ఆముక్తమాల్యద కథ నీ పద్యంలో పొందుపరిచినాను.

విష్ణుచిత్తుడను పేరుతో ఒక భక్తుడు దక్షిణదేశంలోని శ్రీవిల్లిపుత్తూరు గ్రామంలో ఉండేవాడు. ఆతనినే పెరియాళ్వారు అని కూడా జనులు పిలుస్తుండేవారు. మహాభక్తితో నిన్ను సేవించే అతడికి ఒకనాడు తులసీవనాన్ని పెంచడానికి భూమిని సరిచేసుకొంటున్న సమయంలో ఒక ఆడుబిడ్డ దొరికింది. జనకమహారాజు చేతికి దొరికిన సీతమ్మలాగా. పిల్లలు లేని ఈ పెరియాళ్వారు అమితసంతోషంతో ఆ బిడ్డను పెంచుకొన్నాడు. ఆమెయే గోదాదేవి. బాల్యంనుండి నీ దివ్యకథలను వింటూ తండ్రి చేసే పూజల్లో పాల్గొంటూ ఉన్న ఆ కన్యామణి రుక్మిణీమణివలె నీకే మనసిచ్చినది. యౌవనం వచ్చేసరికి ఆమె భక్తియంతా మధురభక్తిగా మారినది. నీ పొందుకోరడానికి కృష్ణావతారంలో గోపికలు కాత్యాయనీ వ్రతం చేసినట్లుగా ఈమె ధనుర్మాసం ప్రారంభమైన నాటినుండి నీపై భక్తిగీతాలు, వీటినే



తమిళంలో పాశురాలు అంటారు. వీటిని వ్రాయడం ప్రారంభించింది. దినానికొక్క పాశురంగా వ్రాసి, చెలికత్తెలతో కూడి పాడి నిన్ను సేవించింది.

ఇట్లు అపూర్వమైన భక్తితో భజిస్తూ నిన్ను భర్తగా పొందాలని తపిస్తూ ఉన్న ఆమె చేసిన పని యొక్కటి ఆమెను ఆముక్తమాల్యదగా చేశాయి.

ఆ సంఘటన ఏమంటే ఆమె తండ్రి నీ సేవకై స్వయంగా పూలనుకోసి, అల్లి, సమర్పించవలసిన ఆ పూమాలను తన మెడలో వేసికొని, కోనేటి నీటిలో చూచి ఆ సౌందర్యమునకు ముచ్చట పడిందట. ఇదంతా జరిగినదని తెలియని తండ్రి దేవుడికి వేసే ముందు చూస్తే ఒక వెంట్రుక కనిపించినదట. అలా రావడానికి కారణం తెలుసుకొని, బాధపడి, ఆమెపై కోపించి, ఆనాటికి మాలా సమర్పణము చేయలేదట.

ఆ నాడు గోదా తండ్రికి కలలో కన్పించి ఆమె చర్యను సమర్థించినావట. తాను ధరించి యిచ్చిన పూలదండయే నీకు అత్యంత ప్రియమని విష్ణుచిత్తునికి చెప్పినావట. అంతేకాదు. ఆమెను పెండ్లియాడ దలచినావని, ఆమెను పిలుచుకొని వచ్చి నీతో తనకు శ్రీరంగములో వివాహము జరిపించమని ఆనతిచ్చావట.

మేల్కొనిన విష్ణుచిత్తుడు భగవంతుని యానతి ప్రకారం గోదాకు పరిపూర్ణ ఆనందాన్నియిచ్చిన యీ స్వప్నవృత్తాంతాన్ని నిజం చేశాడట. ఆమెను నీకు పెండ్లిచేయగానే ఆమె నీలో లీనమవడాన్ని ఆనాటి జనులందరు చర్మనేత్రములతో చూశారట. అప్పటినుండి 11 సంఖ్యలో నున్న ఆళ్వారులు 12 అంటే ద్వాదశసంఖ్యకు చేరుకొన్నారట.

ఆముక్తమాల్యదాప్రియా! నమోస్తు, జయోస్తు, నన్ను కూడ ఈ విధముగానే దీవించవే.

సీ. చదువువాసన లేని - శబరుండె యయినను
తిన్నని విని నేను - తెలియనైతి

**చెప్పుకాళుల తోడ – చెత్తను తొలగించి**
**పుక్కిటనీటితో – చొక్కపరచి**
**కరుకుట్ల తిండితో – కడుపును నిండించి**
**భక్తిభావము తోడ – బాగుకొలచి**
**కంట రక్తముకార – కంటికి కన్నిచ్చి**
**తనదు ప్రాణమునైన – ధారవోసి**

**తే.గీ. నిన్ను కాచుకొనగ బూనె – తిన్నడపుడు**
**మొరటువాడైన నేమయా – ముక్తి నందె**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 76**

**భావము :** ఈ పద్యములో భక్తకన్నప్ప అనబడు తిన్నని కథ వివరించాను.

ఇంతవఱకు స్మరించిన భక్తులతో అందరు ఉన్నతకులములకు చెందినవారే. అంతో ఇంతో చదువు, భక్తిని గురించిన జ్ఞానమున్న వారే. ఇక్కడ తెల్పబడు భక్తుడు పూర్తిగా అమాయకుడు. అడవి బిడ్డ. నాగరీకము ఏ మాత్రము తెలియనివాడు అయినా భక్తి – మూఢ స్థితిలోనున్నవాడు. పరమాత్మ దానికి కూడా ప్రీతి చెందుతాడు. జ్ఞానవైరాగ్యములున్న భక్తులనెట్లు అనుగ్రహించుతాడో అమాయకుడు, మూఢభక్తి యున్నవానిని కూడా అదేవిధంగా అనుగ్రహించుతాడని తెలిపిన ఒక దివ్యగాథ. ధూర్జటి అనే కవిరాజు కలంనుండి వెలువడిన ఒక మహాశివభక్తుడి గాథ కాళహస్తీశ్వర మహాత్మ్యంలో విపులంగా వర్ణించబడినది.

శ్రీకాళహస్తి అనే పేరుతో ప్రస్తుతమున్న క్షేత్రానికి చుట్టు పట్లనున్న అడవిలోనున్న ఉడుమూరిలో ఒక కోయదొర ఉండేవాడు. సద్గుణ సంపన్న అయిన భార్యవానికి ఉండేది. ఈ దంపతులకు పిల్లలు కలుగలేదని బాధపడుతుండగా వారి చింత తీరుస్తూ ఒక కుమారుని వారికి ప్రసాదించినాడు. ఆతడే తిన్నడు.



గిరిజన బాలురు నేర్వవలసిన విద్యలు అన్ని చక్కగా నేర్చాడు. నేస్తాలతో కలిసి ఒక రోజున వేటకు వెళ్ళాడు. అక్కడ స్వర్ణముఖీనది ఒడ్డున ఉన్న శివలింగాన్ని చూశాడు. అదేమి యోగమో, ఆ లింగముపై విపరీతమైన ప్రేమ పెరిగింది. కల్జువృక్రీనీడలో యెవ్వరులేక ఒంటరిగా ఇక్కడ ఉండడమెందుకు, మా ఉడుమూరికి వచ్చేయి, నీకక్కడ కావలసినవన్నీ తెచ్చి అమర్చుతామని ఇలా ఎన్నో విధాలుగా వేడుకొంటాడు. ఏమి చెప్పినా మాట్లాడక పోయేటప్పటికి, పోనీలే నీవు మా యూరికి రాకపోతే నేనే నీదగ్గర ఉండిపోతానని చెప్పి ఉండిపోతాడు. వాడి వెంట వచ్చిన స్నేహితులు ఎన్నిరకాలుగా నచ్చజెప్పినా వినక అక్కడే ఉండి పోతాడు.

శివుడికి ఆకలి, దప్పి తీర్చేందుకు అడవి పందిని చంపి ఆ ముక్కలను కాల్చి కరుకుట్లుగా తెస్తాడు. శివలింగముపైనున్న పూలు, గంధము వంటివి 'చెత్త' అనుకొంటూ చెప్పుకాళ్ళతో తొలగించి శుభ్రపరుస్తాడు. అటు నదిలోనుండి పుక్కిట్లో పట్టుకొచ్చిన నీటిని లింగముపై ఉమ్మివేసి శుభ్రం చేశాననుకొంటాడు. కరుకుట్లను ముందుపెట్టి తినమంటాడు. అతడు తినకపోతే తానే తినబెట్టే సరికి శివుడు తింటాడు. ఇట్లు కొన్ని దినాలు గడిచిన తరువాత శివపూజాధురంధరుడైన ఒక బ్రాహ్మణునకు తిన్నడి భక్తిని ఋజువు చేసే నిమిత్తమై కంటిలో మొదట నీరు, తర్వాత రక్తమును బయటకు వచ్చేటట్లు చేస్తాడు శివుడు. తనకు తెలిసిన ఆయుర్వేద వైద్యమంతాచేసి, దానికి లొంగని ఆ వ్యాధికి తన కన్ను పెకలించి ఆ కంటి స్థానములో అమరుస్తాడు తిన్నడు. ఇది జరిగిన వెంటనే రెండవకంటి నుండి కూడా రక్తముకారడం ప్రారంభిస్తుంది. అప్పుడు తనరెండవ కంటిని పెకలించేందుకు ప్రయత్నిస్తూ తిన్నడిలా చెప్పుతాడు. దేవా! నీ మూడవకన్నుకు కూడా ఇటువంటి హాని కలిగిందంటే నా ప్రాణముల నర్పించి దానిని కాపాడుకొంటానంటాడు.

అప్పుడతని భక్తిశీలతకు మెచ్చిన పరమేశ్వరుడు ప్రత్యక్షమౌతాడు. ఈ కథ ద్వారా భగవంతునికి ప్రీతి పాత్రమైనది పాండిత్యము, బాహ్యాచారములు మొదలగునవి కావు. అచ్చమైనభక్తిమాత్రమే అని నిరూపిస్తాడు శ్రీ కాళహస్తీశ్వరుడు.

ఓయీ నరసింహా! ఇటువంటి దృఢభక్తిని నాకు ప్రసాదించు. జన్మజన్మలకు నిన్ను స్మరించే శక్తిని నాకు కల్గించు.

**సీ. సిరియాళ బాలుడా – శివభక్తు కొఱకునై**
**ప్రాణమొడ్డుటకైన – పణమునిడెనె**
**యాతని తలిదండ్రు – లమరింప బోనమ్ము**
**కడుపుకోతను కూడ – నడుచుకొనిరి**
**ఒకపూట తిండిలో – నొక యింత తగ్గినా**
**యేను తాళగ లేనె – హే ప్రభుండ**
**కొమ్మని యొసగ మా – కులములో లేదంట**
**తెమ్మని యడుగుట – తేగకొనుట**

**తే.గీ. తరతరమ్ముల నుండియే – తనరెనంట**
**దానధర్మాలు లేని నీ – దాసి గనవె**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 77**

**భావము :** శైవభక్తుల గాథలలో ప్రసిద్ధమైన మరియొక కథ భక్త సిరియాళుడిది. అది ఇక్కడ తెల్పబడినది.

జంగమ దేవరకు అన్నము పెట్టనిదే తాను భుజించని భక్తుడొకడు. ఒకవేళ అట్లు జంగముడు కనిపించనిచో ఆ రోజు వారికి పస్తే. ఇట్టి మహా శివభక్తుడొక కాలమున ఉండెను. అతనికి అన్ని విధముల తగిన



యిల్లాలుండెను. ఈ పుణ్యదంపతులకు ఉదయించిన మహాశివభక్తుడే సిరియాళుడు.

ఈ కుటుంబసభ్యుల భక్తిని పరీక్షించుటకు పరమశివుడే జంగమ వేషమును దాల్చి సిరియాళుని తండ్రికి కానిపించెను. అర్ఘ్యపాద్యాదులన్నీ తీసికొనిన తరువాత ఆ నాటి భోజనములో వడ్డించు పదార్థములేవియని యడిగెను. ఆ నాడు వండిన వంటకముల జాబితాను ఆయనకు తెలియజేసిరి. అప్పుడాయన ఒకింత మొగమాటము లేకుండా మీ కుమారుని తలను వండి వంటకముగా పెట్టమని కోరెను.

ఈ కోరికను విన్న దంపతులు హతాశులైరి. లేకలేక పుట్టిన కొడుకు. వానిని చంపి స్వహస్తములతో వండి వడ్డించమనగా ఎవ్వరు సహింతురు? అయినను జంగమ దేవుని తృప్తి పరచుటకు గుండె చిక్కబట్టుకొనిరి. బడిలో చదువుకొనుచున్న పిల్లవాడిని పిలిచి విషయము చెప్పి ఇంటికి కొనివచ్చిరి. వాడు తల్లిదండ్రులు చెప్పిన విషయము వినెను. నన్ను చంపవలదని మారాము చేయలేదు. సంతోషముగా జంగమదేవరకు ఆహారమయ్యెదనని తల్లిదండ్రుల అతిథిపూజకు అనుకూలించెదనని, తనను చంపమని కూర్చుండెను. పులికడుపున పిల్లి పుట్టునా? మహాభక్తుడైన ఆ దంపతులకు తగినట్లు ఆ బిడ్డ కూడ వ్యవహరించెను.

జంగమ రూపముననున్న మహేశ్వరునకు సంతోషము కలిగెను. ఆ బిడ్డను బ్రతికించి వారి ముందుంచెను. అడుగకనే ఎన్నో వరములు ప్రసాదించెను.

ఇటువంటి భక్తులీదేశమున నున్నారని చదివి విని సంతోషపడుటయే కాని, నా వద్దకు వచ్చేటప్పటికి నేనేమి చేయుచున్నానని ఆత్మ విమర్శచేసి కొనుచున్నాను. ఒక్కపూట కూడ ఉపవాసము మాట అటుండ నే తిన గలిగిన పరిమాణములో కొంత తగ్గినా తాళలేకున్నాను. దానము

లిప్పించుకొనుటలోనే మేము ఘనులము. దానములిచ్చుట యనుమాట మేమెఱుగము.

ఇట్టి దీనదశలోనే మా తరతరాలనుండి బ్రతుకులు గడుచుచున్నవి. ఇటువంటి నన్ను నీ వెట్లు బ్రోతువో నరసింహయ్యా!

**సీ. గోచరమ్ముల కావు – గూఢార్థముల పొల్చు**
**గీతలు నీ యొక్క – చేతలౌర!**
**శూన్యంబు నీవందు – చూడ నెల్లెడ నుందు**
**స్థూలమందువు నీవు – సూక్ష్మమందు**
**పుట్టుకలేదందు – పుట్టుచునుందువు**
**చావది లేదందు – చనుచునుందు**
**తెల్పెదొక్క గుణము – తెల్పెదు వ్యతిరేక**
**మిట్లు చెప్పగ నాకు – నిముడుటెట్లు**

**తే.గీ. జ్ఞానరహితను విజ్ఞాన – శక్తివిమల**
**దీప్తిని తెలుపు దివ్యమౌ – తేజమొసగు**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 78**

**భావము :** గీతార్థములను తెలియుటకై విఫల ప్రయత్నము చేసినాను. హే భగవాన్! భగవద్గీతలో నీవు చెప్పిన అనేక విషయములు నా బుద్ధికి అందుటలేదు. అందులోని గూఢార్థములు ఎన్నో. దానికి తగినట్లే నీ అవతార విశేషములుండును.

కొన్నింటినిక్కడ ఉదాహరింతును. నీవు గగనసదృశుడవందువు. గగనమంటే ఆకాశము, ఆకాశమంటే శూన్యము. శూన్యమంటే సున్న – అనగా ఏమీలేక పోవుటయేకదా. మరి అంతలోనే విభూతియోగము – దానినిండా నీవెట్లు ప్రపంచమంతా నిండియున్నావో తెలుపుట. బ్రహ్మాండము



అంతానిండియున్నట్లు నీ విశ్వరూపము. అణోరణీయం – మహతోమహీయం అన్ని రెండు రకములుగా కుదించిన – విస్తరించిన నీ శరీర పరిమాణం.

నీవజుడవట – అంటే పుట్టుకలేనివాడవని అర్థము. మరి అదితికి వామనుడిగా, కౌసల్యాదశరథులకు రాముడిగా, దేవకీవసుదేవులకు కృష్ణుడిగా పుట్టావని రామాయణ, భాగవతాలు ఘోషించుచున్నవి. నీకు చావు లేదని అందువు. అయితే రాముడుగా సరయూనదిలో మహాప్రస్థానము చెందావని, కృష్ణుడుగా వేటగాని చేతిలో (మునుపటి జన్మలో వాలి) బాణపుదెబ్బకు హతుడవైనావని వర్ణించబడినవి.

ఈ విధముగా పరస్పర వ్యతిరేకములైన విషయములను చదువుతుంటే నాకు ఆయాపదముల కర్థమే గోచరించుటలేదు.

స్వామీ! నాకు పరమపవిత్రమైన గీతను అర్థముచేసికొను జ్ఞానము లేకున్నది. దానిని తెలిసికోగలుగు దివ్యజ్ఞానమును, తగిన శక్తిని ప్రసాదించుము.

నరసింహామూర్తీ! అందుకో నా ప్రణతి!

**సీ. చిత్తశుద్ధిరహిత – శివపూజ లేలన**
**భాండశుద్ధిరహిత – పాకమటుల**
**భాండశుద్ధిని చేసి – పాకంబు వండితి**
**చిత్తశుద్ధిని వీడి – శివునివీడి**
**యాత్మశుద్ధిని వీడి – యాచారమును వీడి**
**అర్థరహితమైన – యాసపడితి**
**ఆత్మతత్త్వము తెల్పు – నా సూత్రమేదైన**
**పట్టువడక నేను – వట్టినైతి**

**తే.గీ. ఇట్టి నన్నెట్టు బ్రోచెదో – యినకులేశ!**
**పట్టువదలక నా చేయి – పట్టుకొనుము**

**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ!** **79**

**భావము :** నీతులు చదువుట - ఆచరణలోకి తెచ్చుట మధ్యనున్న అవాంతరాలు.

వేమన గారొక పద్యంలో ఇలా చెప్పినారు

**ఆ.వె. ఆత్మశుద్ధిలేని / ఆచారమది యేల**
**భాండశుద్ధిలేని / పాకమేల**
**చిత్తశుద్ధిలేని / శివపూజ లేలరా**
**విశ్వదాభిరామ / వినురవేమ.**

ఇందులో రెండవ దానిని అమలు పరిచితిని. అనగా పాత్రను శుభ్రపరిచి అందులో వంటను వండాను. తక్కినవన్నియు గాలికిపోయినవి. ఆత్మతత్త్వమును తెలిపే సూత్రము లేవియైనా పట్టుకొందామని ఎంత ప్రయత్నించినా వాటినందుకోలేకపోయాను.

ఇటువంటి, నన్ను నీవెట్లు బ్రోతువో! ఇప్పుడే త్యాగరాజుగారి పాట 'ఎటుల బ్రోతువో తెలియ, ఏకాంత రామయ్యా'యని పాడుకోవాలనిపిస్తుంది. కనుకనే 'పట్టువదలక నా చేయి పట్టుకొనుము' అని నిన్ను ప్రార్థిస్తున్నాను.

**సీ. విద్యల లక్ష్యంబు - విత్తమార్జించుటే**
**పరమార్థ మరసెడు - ప్రజలెయరుదు**
**విద్యనేర్చిన యంత - విత్తంబు వచ్చునే**
**యా యదృష్ట మొకింత - యమరకున్న**
**ధనము చేరినయంత - ఘనమదం బొందుచు**
**దొరలు చుందురు గాదె - దుష్టరీతి**
**ధర్మకార్యాలకు - ధనము నీయగరారు**
**ధనమిట్లు చేయుగా - ధరణినరుని**



**తే.గీ. ధనమొ, విద్యయొ యార్జింప - ఘనము కాదు**
**యెట్లు వెచ్చించి నారొ నా - హితము కూర్చు**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ!** **80**

**భావము :** విద్య, ధనముల నార్జించుట - వినియోగములను గురించి ఇచ్చట వివరించబడినది.

హే నరసింహస్వామీ! ప్రాచీనకాలములో విద్యార్జనకు ఏ కారణములు ప్రోత్సహించినవో నాకు తెలియదు. కాని ఈనాడు మాత్రం విద్యార్జన యనగా ధనార్జన కొఱకే. పరతత్త్వములను తెలిసికొనుటకు విద్యార్జన చేయవలెనను సూత్రములు ఆశించువారు కోట్లలో ఒకరిద్దరున్నారేమో.

ధనార్జనకొరకు ప్రారంభించిన విద్యార్జన కూడా వెంటనే కోరిన ఫలములిచ్చుట లేదు. ఇక్కడ గుమ్మడికాయంత విద్యయున్నా ఆవగింజంత అదృష్టము లేనిదే ధనార్జన కుదరదు అనే సామెత వర్తిస్తున్నది.

అదృష్టము కూడ కలిసి వచ్చినది. దండిగా డబ్బును సంపాదించుచున్నారు. కాని విపరీతమైన మదముకూడ వారిలో చేరుచున్నది. మదము చేరుటతో దురలవాట్లకు పాల్పడి వాటికి దొరలగుచున్నారు.

దురలవాట్లకు లొంగినపుడు ధనమంతయు వాటి వినియోగములోనే హరించుకొనిపోవును. ధర్మకార్యాలకు వెచ్చించుటకు హృదయము ఉండదు. ఒకవేళ ఇహానికో, పరానికో భయపడి ఒకింత యిస్తామనుకొన్నా ఆ ధనము వారి అలవాట్లను కొనసాగించుటకు తక్కువగునని భావించి వెనకడుగు వేస్తారు.

కావున ధనార్జనమో, విద్యార్జనమో చేయుట ఘనమనుట కన్న ఆర్జించిన వానిని ఏయే పనులకు, ఏయే విధములుగా

వినియోగించుచున్నారో ఆ విధమైన ఫలితములే వారందుకొందురు కదా, దేవా!

**సీ. ముక్కోటి దేవుల – పూజింప నేలయా**
**యొక్కొక్క మానవుం – డొకరిమెచ్చు**
**మనుజుల తిండిలో – మార్పు లిన్నేలయా**
**భిన్నత్వరుచులలో – భేదమరయ**
**నీరున్న చోట్లకు – వేరుపేళ్ళేలయా**
**గందర గోళంబు – కలుగకుండ**
**మనుజుల రంగుల – రకము లిన్నేలయా**
**తరతమభేదమం – తరముతెలియ**

**తే.గీ. మెత్తురు లోకులెప్పుడుం – భిన్నరుచుల**
**కాన వైవిధ్య ముంచితి గాదె చెపుమ**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 81**

**భావము :** భిన్నత్వము – ఏకత్వమును గూర్చి ఈ పద్యములో వివరింపబడినది.

హిందూమతములో ఎక్కువమంది దేవుళ్ళ ప్రసక్తి వస్తుంది. అది ఒకటి రెండు కాదు. ముక్కోటి మంది అంటారు. ఎందుకిలా?

దీనిని సమర్థించడానికి వేర్వేరు ఉదాహరణలు. మానవులు అందరూ తినే మూలపదార్థాలు కొన్నే అయినప్పటికి ఎన్ని విధములైన తిండ్లు, భోజన పదార్థములు ఉన్నవి?

నీళ్ళు అనేక స్థలాలలో కన్పిస్తుంది. పడియలు, కుంటలు, చెరువులు, ఏరులు, వాగులు, నదులు, బావులు, సముద్రాలు. ఇన్ని పేర్లెందుకు అన్నింటిలో ఉండేది నీరే కదా.



మానవులలో కొందరి చర్మము తెల్లగా, కొందరికి నల్లగా కొందరు చామనఛాయగా ఇలాంటి రకములెందుకున్నవి. వీరిపైన కనిపించే ఆకారములో తేడాలెందుకు. లోపల ఉన్న శరీరనిర్మాణము అందరిలో ఒకటే కదా.

లోకులకు వైవిధ్యమంటే ఇష్టము. అంతరంగా ఉన్నది ఒకే విషయమైనా దానిని వ్యక్తీకరించేందుకు వేర్వేరు పేళ్ళు కావాలి. అన్నిదేశాల్లో, అన్ని ప్రాంతాల్లో తినే పదార్థాలు అనేకమైనప్పటికి అవన్నీ శరీరంలో జీర్ణమైనాక రక్తమై శరీరనిర్మాణానికి అనుకూలమై తగిన బలాన్నిస్తున్నాయి.

అలాగే నీరు కనిపించే స్థలాలు అనేకం. అందులో ప్రకృతిలో సహజంగా ఏర్పడినవి కొన్ని. మానవుడు ఏర్పరచుకున్నవి కొన్ని. ఆయా పరిణామాలనుబట్టి అవి నిశ్చలంగా ఉన్నాయో లేక ప్రవహిస్తున్నాయో అనే దానిని బట్టి ఇలా ఎన్నో కారణాలతో అన్నింట్లో ఉన్నది నీరేయైనా వాటిని వ్యక్తీకరించడంలో గందరగోళము కలుగకుండ పేర్లు పెట్టారు.

మనుజుల రంగుల్లో తేడాలకు కారణము సృష్టిలోనే ఏర్పడింది. ఆయా ప్రజలు నివసిస్తున్న దేశము, వాతావరణ పరిస్థితులు, వారు తినే ఆహారాదులు మొ॥ వానిని బట్టి వారి ఆకార పరిమాణాల్లో భేదాలు ఏర్పడుతున్నవి.

ఒక ప్రధాన విషయమును గమనించండి. వివిధ దేవతలను స్తోత్రం చేస్తున్నప్పుడు అనేక లక్షణాలు ఒకటిగానే కన్పిస్తాయి. ఎందుకు? నిజానికి దేవుడు ఒక్కడే. వేదమాత చెప్పినట్లు 'ఏకం సత్ – విప్రాః బహుధా వదంతి' ఉన్నది ఒకే సత్యము. దానినే పండితులు అనేక రీతులుగా చెప్తూతారు.

అనేక విషయాలు పైకి భిన్నంగానే కన్పిస్తాయి. తఱచి చూస్తే అందులో ఏకత్వం దర్శనమిస్తుంది. వైవిధ్యమును ప్రజలు ఇష్టపడుతారు అనేది సత్యమైన విషయమే కదా!

**సీ. శంకరుడందునా – శాంకరి వందునా**
**కింకరత్వము సేతు – క్రీస్తువైన**
**మధ్వుడవందునా – మహ్మదువందునా**
**మానుగా నీ నామ – మహిమనెంతు**
**నానకువందునా – నరిసింహుడందునా**
**సందేహమును వీడి – సంస్తుతింతు**
**బుద్ధుడవందునా – మునిజినుడందునా**
**శుద్ధమనమ్ముతో – స్తుతినిసేతు**

**తే.గీ. పేరు ముఖ్యము కాదయా – పెరిమ వెంతు**
**పథము లేవైన నదులన్ని – వార్ధి చేరు**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్పు!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 82**

**భావము :** ఈ పద్యములో వివిధ మతగురువులను ప్రస్తుతిచేస్తున్నాను.

శంకరుడను దేవుని ప్రధానంగా అర్చన చేయు వారిని శైవులంటారు. శంకరిని పూజించు వారిని శాక్తేయులందురు. క్రీస్తునారాధించువారిని క్రైస్తవులందురు. మధ్వాచార్యులు అనబడే ప్రవక్తను అనుసరించేవారు మాధ్వులనబడుదురు. మహ్మదు అను ప్రవక్త చూపిన మార్గము ననుసరించువారు మహమ్మదీయులు. గురునానకు మార్గస్థులే సిక్కుమతము వారు. ఇట్లు అనేకపేర్లతో మతములున్నవి. ప్రతిప్రవక్త శ్రేష్ఠమైన మానవధర్మములనే బోధించినాడు. పరోపకారమును చేయమన్నాడు. పరపీడనము వలదన్నాడు. కావున నీ కిష్టమైన పేరుతో దేవుని పిలుచుకో. మానవజీవనమును సుసంపన్నము చేసికో.

చివరగా ఇచ్చినది ఒక చక్కని సూక్తి. నదులు అన్ని ఎత్తైన కొండలనుండే ఉద్భవిస్తున్నవి. అవి ప్రవహించే మార్గాలు వేర్వేరు. కాని



చివరికి అవి అన్ని కలియుచున్నది సముద్రములోనే కదా. ఈ విషయమునే తెల్పుచున్నది సనాతన ధర్మము. 'సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి' అనగా సర్వదేవతలకు చేసిన నమస్కారములు చివఱకు కేశవుని వద్దకే చేరుచున్నవి.

నరసింహా! దొడ్డధాళవట్టములోని దొడ్డవేల్పు అనే మకుటము నీకు పెట్టినను, ఈ గ్రంథములోనే ఎన్నో పేర్లతో నిన్ను పిలుచుచున్నాను. ఇదియంతయు సత్యమే అని పైని చెప్పిన శ్లోకము ఋజువు చేయుచున్నది కదా.

**సీ. నారాయణాయని – నోరార పిలువంగ**
**నంత్య కాలంబున – నతనిబ్రోతె**
**పందరీపురమున – పాటొందిన విటుని**
**నిగమశర్మకు నీవు – నెలవునిడితె**
**కుబ్జకు నొసగితే – కొమరైనరూపమ్ము**
**కుంతి మ్రుమ్మనుమని – కోరికాతె**
**గోవర్థనమునెత్తి – గోపులకాచితె**
**నరకాంతకుడవయి – సురలబ్రోతె**

**తే.గీ. దనుజ భంజనంబును చేసి – దయనుపొల్చి**
**మనుజరంజనంబును చేతె – మారజనక**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్పు!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 83**

**భావము :** విష్ణుమూర్తి అనుగ్రహించిన కొందరి భక్తుల నిక్కడి పద్యములో గుర్తుకు తెచ్చుకొంటున్నాను. భాగవతంలోని అజామీళుని కథలో అజామీళుడను వాడు చెప్పలేనన్ని దుర్మార్గపు పనులనుచేసి, అనేక దురలవాట్లకు బానిసయి అంత్యకాలములో తన చిన్నకొడుకు పేరు

నారాయణ యగుటచే వాడిని పిలుస్తూ ప్రాణంవిడిచాడు. కేవలం నారాయణపేరు నుచ్చరించడంచేత విష్ణుదూతలు వచ్చి, అప్పుడే వచ్చియున్న యమదూతలను వెనుకకు పంపినారు.

ఇదే విధమైన కథ పాండురంగమాహాత్మ్యములో నున్నది. నిగమశర్మయనువాడు బ్రాహ్మణకుమారుడు. వాడు పుట్టినది మాత్రమే బ్రాహ్మణుడుగా కాని బ్రాహ్మణ బ్రువుడిగా జీవితం సాగించినాడు. నీచాతి నీచమైన పద్ధతుల్లో జీవించి చివరకు అగ్ని ప్రమాదంలో ఉంచుకొన్న పెళ్ళాము బిడ్డలు చనిపోతే దుఃఖిస్తూ చనిపోతాడు. వాడి అదృష్టమేమంటే వాడు చనిపోయింది పండరీపురములో. పాండురంగనికృపకు పాత్రుడవుతాడీ కారణంచేత.

మధురానగరికి కంసుడు అక్రూరునితో పిలువనంపగా బలరామకృష్ణులు వచ్చినారు. కంసరాజుకు చందన చర్చచేసేటందుకు వెళ్తున్న కుబ్జదారిలో కనిపించిన మోహనాంగులైన రామకృష్ణులను చూచింది. చందనచర్చ చేసినది. అప్పుడు ఆమెననుగ్రహించి కుబ్జత్వమును తొలగించినాడు.

కుంతి మున్ముమనుడు అంటే పరీక్షిన్మహారాజును పిండదశలో నున్నప్పుడే చంపి కురువంశమును నిర్వంశముగా మార్చుతానని అశ్వత్థామ దుర్యోధనునకు మాట యిచ్చాడు. ఆ ప్రకారం చేయబోయాడు. కాని అప్పుడు కుంతి, ఉత్తర ప్రార్థనలు చేశారు. ఉత్తరాగర్భస్థుడై అశ్వత్థామ ప్రయోగించిన అస్త్రానికి మృత్యువుకు చేరువవుతున్న ఆ బిడ్డను శ్రీ కృష్ణమూర్తి తన చక్రాయుధంచే రక్షించాడు. ఆతడే పరీక్షిత్తుగా పిలువబడి పాండవుల వంశాన్ని నిలిపాడు. ఆతడే భాగవతం శుకుని ద్వారా విన్న మహనీయుడు.

ఇంద్రుడు అహంకరించి బృందావనంపై ఏడహోరాత్రములు వడగళ్ళ వాన కురిపించాడు. అన్నిదినాలు బాలగోపాలుడు గోవర్ధనపర్వతాన్ని



గొడుగులాగా తనచేతితోపట్టి ఎత్తాడు. దానిక్రింద గోపక, గోపికా గోగణములను కాపాడినాడు.

నరకుడు లోకోపద్రవకారిగా రాజులను గోబ్రాహ్మణులను బాధించుచుండగా ఆతని వధించుటకు వచ్చుచుండగా సత్యభామ వెంటవత్తుననెను. ఇద్దరు కలిసి నరకాసురునంతము చేసినారు.

ఇట్లు ఏ అవతారమెత్తినను, ఏ పేరుతో పిలిచినను రాక్షసుల సంహారమును, మానవసంరక్షణమును చేసినావు ప్రభూ! మారుడ జన రంజనమును చేసినటులే మారజనకుడవు నీవు కూడ మనుజుల కనవరతము రంజనమును కలిగించుచున్నావు.

**సీ. సారహీనంబైన – సంసారమందునే**
**తెరువేమి తెలియక – తిరుగుచుంటి**
**తలిదండ్రులఋణము – తవిలితీర్చగలేదు**
**తొలిపతివ్రతలతో – తూగలేను**
**సేవసంఘము చేరి – సేవల నొనరింప**
**రోగుల జోగుల – నోగుచేయ**
**నిరుగుపొరుగువారి – యిక్కట్ల నరయను**
**భక్తబృందము చేరి – బాగుకొలవ**

**తే.గీ. చివరి దశలోన నిన్నిదే – చేరితయ్య**
**చేరదీతువో త్రోతువో – చిద్విలాస!**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 84**

**భావము :** ఈ పద్యములో ఆత్మవిమర్శ చేసికొనుచున్నాను. నేను చేసిన మంచి పనులేమున్నవి?

తల్లిదండ్రుల ఋణమును తీర్చుకొనుట సాధ్యము కాలేదు. సీత, సావిత్రివంటి పాతకాలపు పతివ్రతలతోనే తూగలేను. ఎన్నో రకములైన సేవా సంఘములున్నవి. వాటిలో సభ్యులుగా చేరి ఎంతోమంది సమాజసేవ చేస్తున్నారు. నే నే సంఘములోను సభ్యురాలిగా చేరలేదు. కొందరు రోగులకు సన్యాసులకు అయాచితంగా సేవలను చేస్తుంటారు. వ్యక్తిగతంగా మరియు రకరకాల సంఘాలద్వారా ఈ విధమైన సేవలను కూడా నేను చేయలేదు. భక్తసంఘములందు చేరి భజనలు, దేవతా ప్రతిష్ఠలవంటి సేవలను చేయలేదు. కనీసము ఇరుగుపొరుగు వారి కష్టసుఖములలో కూడా నేను పాలు పంచుకోలేదు.

సారహీనమైన సంసారమందుండి కూడా ఎంతోకొంత పుణ్యకార్యములను పైన తెలిపినటువంటివి చేసిన, చేస్తున్న వారున్నారు. కాని నేనేమియు చేయలేకపోయినాను. లౌకికములైన విషయవాంఛలను తీర్చుకొనుటలోనే జీవితము గడచిపోయినది. ముసలితనము వచ్చినది. ఈ చివరి దశలో నిన్ను చేరుకొంటున్నాను. నన్ను చేరదీతువా, త్రోసివేతువా నరసింహా! నీ చిద్విలాసమును ఎట్లు చూపుదువు?

**సీ. శైవులు వైష్ణవుల్ – సాగించిరే పోరు**
**హిందు బౌద్ధులు కల – హించి రంట**
**జైనులు వైష్ణవుల్ – జగడాల పాలైరి**
**యూదులు క్రైస్తవుల్ – మోదుకొనిరి**
**కాథలిక్ ప్యూరిట్లను – కలహంబులాడిరి**
**తెలుపు నలుపు వారు – తెగడికొనిరి**
**హరిజన గిరిజన – యగ్రవర్ణములందు**
**మహ్మదీయుల హిందు – మతములందు**

**తే.గీ. పోరు కొనసాగె సిక్కుల – పురములందు**
**దైవమా! యెట నుంటివే – దయను కనవె**



**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ!** **85**

**భావము :** ప్రపంచవ్యాప్తంగా మతాల పేరుతో జరిగిన మారణకాండలిక్కడ పేర్కొనబడినవి.

మన దేశములో వేయి సంవత్సరముల క్రితం శైవులకు, వైష్ణవులకు మధ్య విపరీతమైన వైరముండెడిది. అంతకు మునుపు హిందువులు బౌద్ధులు కొట్లాడుకొన్నారట. అదేవిధముగా జైనులు, వైష్ణవులు పోట్లాడుకొన్నట్లు చరిత్ర చెప్పుచున్నది.

హరిజనులు, గిరిజనులు, అగ్రవర్ణముల వారిమధ్య ఉచ్చనీచభేదములు ప్రచ్ఛన్నములైన దశనుండి వ్యతిరేకత ముదిరినపుడు ప్రత్యక్షమైన తిట్లు, కొట్లాటలు ఇట్లొక వందసంవత్సరాలనుండి వైరుధ్యములు పెల్లుమీరినవి. మహమ్మదీయుల పాలన కాలమునుండి హిందూ ముస్లిముల మధ్య తగవులు, సిక్కులు ముస్లిముల మధ్య జరిగిన యుద్ధములగూర్చి చరిత్ర ఘోషించుచున్నది.

ఇక యూరోపియన్లలో కాథలిక్కులు – ప్రోటస్టెంట్లు, యూదులు – క్రైస్తవుల మధ్య జగడాలెన్నో జరిగినవి. ఇక తెల్లవారు నల్లవారికి పెట్టిన బాధలనేకం. మనదేశములో అగ్రవర్ణాలవారు క్రింది వర్ణాలవారితో వెట్టిచాకిరి చేయించుటే పాపంగా భావిస్తున్నామీనాడు. కాని అంతకంటే హీనంగా తెల్లవారు జంతువులవలె బానిసలను పేరుతో నల్లవారిని కొనుట, అమ్ముట అను వ్యాపారమునే చేసెడివారు. ఈ వ్యాపారములలో భార్య, భర్త, పిల్లలు కకావికలైపోయెడివారు. ఎవరైనను తప్పించుకొను ప్రయత్నములు చేసినవారిని ఆకలిగొన్న సింహాలకు, పులులకు ఆహారముగా వేసెడివారు. ఇంత ఘోరముగా క్రూరముగా బానిసల వ్యాపారములు జరిగినవని చరిత్రలు తెలియజేయుచున్నవి. ఇంతకు ఈ పద్య సారాంశమేమనగా ప్రపంచములోని

నలుమూలలా హెచ్చుతగ్గులనేవి ఉండినవని బలవంతులు, బలహీనులను అణచే ప్రయత్నములన్ని కాలములలో జరిగినవని తెలియజేయుటయే.

**సీ. మనసు యొక్క ఘనత - మానుగా తెల్పిరి**
**మేధావు లెందరో - శోధసల్పి**
**వేగముగా బోవు - విశ్వమంతయు చూచు**
**జ్ఞాపకంబు నెలవు - జ్ఞాననిధియు**
**ననురక్తి ద్వేషంబు - నంతము చూచుగా**
**కిట్టులవెన్నియో - యెలమిగుణము**
**లున్నను లోపమ - దొక్కటి స్పష్టంబు**
**ఒక యొరలో కత్తు - లొదుగనట్లు**

**తే.గీ. దీని యవలక్షణము పట్టి - తెప్పరిల్లి**
**నిన్ను నిముసమైన నిలుప - నేర్పరియగు**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! 86**

**భావము :** ఈ పద్యములో మానవుని మనస్సుయొక్క గొప్పదనము వివరించబడినది.

మనసు ధర్మములను తెలుపు శాస్త్రమే మానసిక శాస్త్రము - సైకాలజీ అందురు. పరేంగితగ్రాహియైన వాడే పండితుడు అని చిన్నయసూరి నిర్వచనము. ఈ శాస్త్రమును చదివి లేక లోకమును చదివిననే వాడు వృత్తి, వ్యాపారములందు రాణించును. ఇందులకు అనేక కారణములున్నవి. మేధావులు శోధించి దీని ఘనతనిట్లు చెప్పిరి. వాయువు కాంతి వేగములకంటె ఎక్కువ వేగముతో పోగల్గునది మనోవేగము. విశ్వమంతటిని జ్ఞాననేత్రముతో చూడగలదు. జ్ఞాపకశక్తి దీనివలననే ఉండును. ప్రేమ, పగ రెంటిని సాధించుకొను శక్తి దీనికుండును.



ఇట్లెన్నో విశేషగుణములున్నను ఒక్కటి మాత్రము లోపమున్నది. అది ఏమనగా ఏకకాలములో రెండువిషయములు దీనిలో దూరవు. అది ఎట్లనగా ఒక ఒరలో రెండు కత్తులిముడవుకదా. చక్రవర్తి రాజగోపాలాచారి గారు 'భజగోవిందము'నకు వ్యాఖ్య వ్రాస్తూ ఈ విధముగా చెప్పినారు. ఈ ఒక్క లోపము అనగా ఏకకాలమున రెండువిషయములు మనసున దూరవు కావున దీనినిబట్టి భగవంతుని పట్టి నిలుపుకొని కొన్ని నిమిషాలు లేక క్షణాలైనా ధ్యానించమని. అది సాధనద్వారా సాధ్యమని.

**సీ. గీతలో తెల్పిన - లోతైన భక్తిని**
**నిలపైన నరుదుగా - కలిగియుంద్రు**
**ఆర్తికూడిన భక్తి - యందరిలోనుండు**
**తరతమ భేదాల - పొరసియుండు**
**నందుకు దృష్టాంత - మవధరింపుము దేవ!**
**చదివినదానిని - వదరుచుంటి**
**పరమాణువులలోన - ప్రక్రియ జరుపంగ**
**నిమిడి యుండునుగదా - యింత శక్తి**

**తే.గీ. అయిన పాల్గొన జాలునే - నన్ని క్రియల**
**కాలకర్మాలు తమయంత - కలియుదాక**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! 87**

**భావము :** ఈ పద్యములో భక్తి ఫలించుటను పరమాణువుల మధ్య జరుగు రసాయనిక క్రియలతో పోల్చబడినది.

మానవులందరిలో భక్తియను భావమున్నది. అయితే అందరిలోను ఒకే స్థాయిలోనుండదు. తరతమ భేదములుండును. భగవద్గీతలో ప్రవచించిన లోతైనభక్తి చాలా అరుదుగా కాన్పించును. భగవద్గీతలో భగవంతుడు భక్తులు

నాల్గురకములని చెప్పినాడు. 1. ఆర్తులు 2. అర్థార్థులు 3. జిజ్ఞాసువులు 4. జ్ఞానులు. ప్రపంచములో అన్ని కాలాలలోను వీరి సంఖ్య ఆరోహణక్రమములో తక్కువగా నుండును.

ఆర్తితో కూడిన భక్తికి పదార్థములందు జరుగు రసాయనిక చర్యకు నాకు సామ్యము కనిపించినది. దానినే తెల్పుచున్నాను.

ప్రతి పదార్థమునందును పరమాణువులున్నవి. ఆ పరమాణువులే రసాయనిక చర్యలో పాల్గొనగల్గును. అయితే ఇవి చర్య జరుపుటకు తగినంత కాలము మరియు అందవలసిన శక్తి అందవలెను.

ఇట్లే ఆర్తితో కూడిన భక్తి ఫలించుటకు తగినంత కాలము మరియు పరమాత్మ నుండి శక్తి కూడవలెను.

అర్థార్థుల సంఖ్య నానాటికి పెరుగుతున్నట్లు ప్రతి దేవాలయము వద్ద పెరుగుచున్న రద్దీనిబట్టి తెలుసుకొనగలము కదా.

**సీ.** **సాధువెవ్వనికేని – సరిపోవు గతముండు**
**పరమనీచునకేని – భవితయుండు**
**జీవాల జడముల – నీవంటుకొని యుండ**
**పలువిధమ్ములుగాగ – నలరుచుంద్రు**
**తగుసహస్రాక్షుండ – తగు సహస్రపదుండ**
**తగునయ్య విశ్వాత్మ – తగునునీకె**
**యెవ్వాని నెత్తెదో – యెవ్వాని దించెదో**
**యెవ్వడెరుగునయ్య – యీవుదప్ప**

**తే.గీ.** **యెవడు చేసిన కర్మాల – నింతకూడ**
**వదలకిత్తువె యనుభవ – ఫలముగాగ**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ!** **88**



**భావము :** కర్మఫలమే – జీవనగమనముగా ఈ పద్యమందు వివరింపబడినది. Every saint has his past and every sinner will have future అనే ఆంగ్ల సామెత కనువాదమే మొదటి పాదము.

జంగమము, స్థావరము అను తేడా లేక ప్రత్యణువు నందు నీవంటుకొనియే యున్నావు. ఇట్లుండి యుండుట చేతనే నీవు సహస్రాక్షుడవని, సహస్రపదుడవని పిలువబడుచున్నావు. అంటే లెక్కకు మిక్కిలిగా కళ్ళు, కాళ్ళు కలిగినవాడవని యర్థము. కళ్ళుచూపుటకు, కాళ్ళు గమనమున కని వేరే చెప్పనక్కరలేదు. ఇట్లుండి నీవు చేయుచున్నదేమి? పైకెత్తవలసిన వానిని ఎత్తుచున్నావు. దించవలసిన వానిని దించుచున్నావు. అయితే ఎత్తుట, దించుట ఎవరిని అనునవి మాకు అర్థము కావు. నీవు మాత్రమే ఎరుగుదువు. దానికి హేతువులు వారు చేసికొన్న పాపపుణ్యములను కర్మముల ఫలితములు. వీటి సమాహారముగనే సాధువులు, నీచులు అనే తెగలేర్పడును. ఎన్నిజన్మల పుణ్యములఫలితములో సాధువులుగా తీర్చిదిద్దును. అట్లే పాపియగువానికి కర్మఫలములనుభవించుటకెన్ని జన్మములో ఎత్తవలసియుండును.

**సీ.** **జయదేవవందిత – జయమయ్య విజయము**
**చైతన్యసంస్తుత్య – జయముజయము**
**సంతతులసినుత – జయమయ్య విజయము**
**సాధుసూరవినుత – జయముజయము**
**శమి తుకారాంపూజ్య – జయమయ్య విజయము**
**జయ కబీరార్చిత – జయముజయము**
**సక్కుబాయీ స్తుత్య – జయమయ్య విజయము**
**సతి మీర పూజిత – జయముజయము**

**తే.గీ.** **వరద పన్నిద్ద రాళ్వార్ల – వంద్య జయము**
**జయము భక్తపరాధీన – జయముజయము**

**దొడ్డథాళవట్టములోని - దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ!** **89**

**భావము :** విష్ణుభక్తుల స్మరణము ఈ పద్యమునందు చేయబడినది.

గీతాగోవిందమును సంస్కృతభాషలో రచించి రాధామాధవుల ప్రణయమును కన్నులకు కట్టినట్లు చూపినవాడు జయదేవుడు. చైతన్య మహాప్రభువు బంగాళదేశమున భక్తితరంగములను ఉవ్వెత్తుగా లేపిన కృష్ణభక్తుడు. రామచరితమానసమను పేరుతో హిందీలో రామాయణమును రచించిన తులసీదాసు పరమరామభక్తుడు. సూరదాసుకు బాహ్యమైన చూపులేకున్నను అంతరదృష్టి కలిగిన శ్రీ కృష్ణస్వామి భక్తుడు. మహారాష్ట్రములో నివసించి పాండురంగనిపై భక్తితో అభంగములను పాటలు రచించిన మహాభక్తుడు తుకారాం. హిందూముస్లిములిద్దరి చేతను ఆదరింపబడిన గొప్ప భక్తుడు కబీరు. పాండురంగని భక్తురాలు సతీ సక్కుబాయి. గిరిధరగోపాలుని మధురభక్తితో హిందీలో తన పాటలలో బంధించిన పరమసాధ్వి మీరాబాయి. దక్షిణదేశములో అందునా తమిళనాట విష్ణుదేవుని పూజించి వైష్ణవమును వ్యాపింపజేసిన పంద్రెండు మంది ఆచార్యులను పన్నిద్దరాళ్వారులు అంటారు. భక్తుల నామస్మరణము కూడా భగవంతుని నామస్మరణముతో సమానము.

అందుకే భక్త పరాధీనా! నీకు జయము!

**సీ.** **ఆకారమును పూని - అర్చన చేయుటల్**
**తొలిమెట్టుగా నంద్రు - తోయజాక్ష!**
**మన్మానసాంబుధిం - పవళించితే దేవ**
**యోగనిద్రను వీడు - యోగముంచు**
**సచ్చిదానందంబు - చక్కంగనందంగ**
**సదమల మార్గంబు - సంతరించు**



**ప్రహ్లాదునకు వోలె - ప్రతివస్తువందును**
**నీవె కానబడుమో - నిత్యతత్త్వ**

**తే.గీ.** **యవని కూవస్థమండూక - మట్లుగడపి**
**యలసి పోతిని దయయుంచి - యాదుకొనుము**
**దొడ్డథాళవట్టములోని - దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ!** **90**

**భావము :** ఈ జన్మకు ఈ కాంక్ష తీర్చుమని మనవి. భగవంతుడు నిరాకారుడు, నిర్గుణుడు, నిరంజనుడు. అయితే ఈ లక్షణాలను అర్థము చేసికొనుటకు సామాన్యమానవుల కర్థము కాదు. అందుకే రాముడు, కృష్ణుడు, నరసింహుడు, లక్ష్మి, పార్వతి, సరస్వతి, గణపతి, కుమారస్వామి, ఆంజనేయస్వామివంటి ఆకారముగల దేవతలను దేవాలయములలో ప్రతిష్ఠించి ఇండ్లలో ప్రతిమలు లేక చిత్రపటాలు పెట్టుకొని పూజించుట అలవాటు చేసినారు హిందూమతమందలి పెద్దలు. అయితే ఇట్లు పూజచేయుటను భగవంతుని అందుకొనుటకు నిచ్చెనయొకటి ఉన్నట్లయితే ఇది తొలిమెట్టు మాత్రమే.

క్షీరసాగరశాయిగా వర్ణించబడు పరమాత్మా! నా మనస్సులో నీవు శయనించియున్నావా, యోగనిద్ర నుండి మేల్కొనుమయ్యాయని వేడికోలు.

ఆతడు మేల్కొన్నాక నాకొక యోగమును కల్పించమని మనవి. అదియేమనగా సచ్చిదానందమందుకొనగా ఒక చక్కని, పవిత్ర మార్గమును ఏర్పరచమని.

నా దృష్టిలో అదియెట్టిదనగా ప్రహ్లాదునకువలె ప్రతివస్తువులో నీవే కన్పించవలెను.

**కలఁడంబోధి, గలండుగాలిఁ, గలఁడాకాశంబునం, గుంభినిం**
**గలఁ, డగ్నిం దిశలం బగళ్ళ నిశలన్ ఖద్యోత చంద్రాత్మలం**

**గల, దోంకారమునం త్రిమూర్తులంద్రిలింగవ్యక్తులం దంతటం**
**గలఁ డీశుండు గలండు, తండ్రి! వెదకంగానేల నీ యా యెడన్.**

**ఇందుగలడందు లేఁడని**
**సందేహము వలదు చక్రిసర్వోపగతుం**
**డెందెందు వెదకి చూచిన**
**నందందే గలడు దానవాగ్రణి! వింటే.**

ఇట్లు ఆయన ప్రత్యక్షముగా ప్రతివస్తువులో భగవంతుని దర్శించినాడు. కనుక ఇప్పుడు ఈ కోరిక కోరుచున్నాను. నా స్థితి యెట్టిదనగా బావిలోని కప్పవలె పరిమితమైన జ్ఞానముతో జీవితము గడిపి ముసలిదాననైనాను. మిక్కిలి అలసిపోయినాను. కనుక నాపై దయచూపుము మహానుభావా!

**సీ. సర్వంబు నీవంచు – సర్వేశు డీ వంచు**
**జ్ఞానంబునుం బొందు – జ్ఞానయోగి**
**భగవంతుడీ వంచు – భావంబునందుంచి**
**పారవశ్యము నొందు – భక్తియోగి**
**కర్తకారకు లీవు – కరణంబు తానని**
**కర్మఫలంబిచ్చు – కర్మయోగి**
**సులభమై యున్నట్టి – సూక్ష్మమార్గము కూడ**
**యాచరించక నేను – వ్యర్థనైతి**

**తే.గీ. పాపపుణ్యాల బరువేమి – వలదునాకు**
**నీవ మోయవె యికపైన – నీరజాక్ష!**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 91**

**భావము:** భగవద్గీతలో జ్ఞాన, భక్తి, కర్మయోగములున్నవి. ఆయా యోగములకు సంబంధించిన జ్ఞానులిట్లుందురు.



జ్ఞానయోగికి సర్వప్రపంచము నీవే. అందుండు సర్వులకు వారిని నడిపించుటకు రక్షించుటకు, శిక్షించుటకు అన్నింటికి నీవే ప్రభుడవు.

భక్తియోగికి భావానురక్తి ప్రధానము. భక్తుల కష్టసుఖముల అనుభూతులు ఆయనను పారవశ్యములోనికి తీసుకుపోవును.

కర్మయోగి లోకములో జరుగుపనులన్నింటికి కర్త, కర్మ, కారకుడు అంతా నీవేనని తలంచుచు, ఆ కర్మఫలమును నీకే అంకితమిచ్చును.

'శ్రీకృష్ణార్పణం' అనుటతో తాను చేసిన కర్మఎట్టిదైనా అతనినంటదు అనే భావన కలిగియుంటాడు.

మొదటిది, రెండవది కష్టమగు నేమోకాని మూడవదానికి శ్రమపడే పనియేమి లేదు. కేవల మా క్షణము మాత్రమే పరమాత్మను స్మరించుకొని కర్మఫలము నీకే యని చెప్పిన చాలును. అయితే సులభమైన విధానమును కూడ నేను తెలిసికొనలేక ఆచరణలో నుంచలేక వ్యర్థమైనజీవితమును గడిపినాను. ఇప్పుడు నీవద్ద పలుకుచున్న యీ మాటలు సత్యములుగా గొమ్ము దేవా! పాపపుణ్యాల బరువులు ఏవియు నాకు వలదు. అన్నింటిని నీకే యర్పణ చేయుచున్నాను నీరజాక్షా!

**సీ. ఎవ్వాని చారిత్ర – మేకాల ప్రజకైన**
**యాదర్శప్రాయమై – యలరుచుండు**
**నెవ్వాని సేవన – మిహపర తారణ**
**యాగమై యలరారు – నుర్విమీద**
**ఎవ్వాని కీర్తన – యెనలేని కీర్తిని**
**కలిమిని కలిగించు – కవివరులకు**
**నెవ్వాని నామంబు – నిష్టంబుగా తల్తు**
**రేవేళలందైన – నెచ్చటైన**

తే.గీ. నట్టి కరుణాపయోనిధి - నఘవిదారు
నట్టి యలఘుసత్త్వుని నే - నాశ్రయింతు
దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!
నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! **92**

**భావము :** పేరులేని భగవంతుడి ప్రశస్తిని ఇక్కడ తెల్పుచున్నాను.

ఎవ్వని చరిత్ర అన్ని కాలాలలో ప్రజలకు ఆదర్శప్రాయముగా నుండునో, ఎవ్వని సేవించిన ఇహపరములు రెంటిని దాటించగల సమర్థుడో, ఎవ్వని గురించి పాడిన కవులకు కీర్తి మరియు సంపదలను కలిగించునో ఎవ్వని పేరును అన్నివేళల, అన్నిచోట్ల అందరు తలచుచుందురో అట్టి దయాసింధువును, పాపములను పోగొట్టువానిని అట్టి మహాబలశాలిని నే నాశ్రయించుచున్నాను.

సీ. న్యాయాధికారుల - న్యాయాధికారులై
తెలుపును కప్పిరి - నలుపుకోట్ల
గురువులు లఘువులై - గురుతను తూలిరి
విద్యను తామమ్ము - విపణియందు
వాస్తుశాస్త్రజ్ఞులు - పరభాగ్యజీవులై
నీతికి గట్టిరి - నెఱిసమాధి
రోగార్తి దరిచేర - భోగాలకాశించి
రోగాల పెంతురీ - రుజనిపుణులు

తే.గీ. కనక కశిపుని కనకాక్షు - కసిని చీల్చి
కనకజీవుల కనుచును - కనల వేమి?
దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్పు!
నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! **93**



**భావము :** వివిధ వృత్తులలో నున్నవారు ఈనాడు ఎట్లు నడచుకొనుచున్నారో ఇచ్చట వర్ణింపబడినది.

న్యాయాధికారులు అన్యాయములకధికారులై తెల్లటివస్త్రములపై నల్లని కోట్లను ధరించుచున్నారు. గురువులు తమ గురుత్వమును తేలిక పరచుకొన్నారు. ఎట్లనగా తాము బోధించవలసిన విద్యలను బజారులో అమ్ముట వలన.

వాస్తుశాస్త్రజ్ఞులు ఇతరుల సంపదలపైననే కన్నుంచి తాము నిర్మించవలసిన గొప్పకట్టడముల మాట ఎట్లున్నా, నీతికి సమాధిని కట్టుచున్నారు.

వైద్యులు సంపాదనల కాశించి దగ్గరకు వచ్చిన రోగికి ఉన్నవి, లేనివి చెప్పి రోగాలనుపశమింప చేయుటకు బదులుగా పెంచుచున్నారు.

హే నృసింహా! ఆనాడు హిరణ్యాక్షుని, హిరణ్యకశిపుని కసి తోడ చీల్చినావే. మఱి ఈనాడు హిరణ్యముకై అడ్డదారుల త్రొక్కు యీ వివిధ వృత్తుల వారిని చూచి నీవెందుకు కోపగించుట లేదు?

హిరణ్యము, కనకము ఇవి బంగారుకు పర్యాయపదాలు.

సీ. పలుకు నీవే యిమ్ము - భావ మీవే యిమ్ము
నోరార నుతియింతు - నారసింహ!
పదము నీవేయిమ్ము - పథము నీవేయిమ్ము
వడివత్తు నినుచేర - పద్మనాభ!
కరము లీవేయిమ్ము - కార్యమీవేయిమ్ము
యిష్టంబుతో చేతు - నిందిరాప!
కనులు నీవేయిమ్ము - కాంతి నీవేయిమ్ము
కనులార నినుగాంతు - కమలనేత్ర!

**తే.గీ. తనువు స్వాస్థ్యము నీవిమ్ము – తనివితీర**
**మాధవామిమ్ము సేవింప – మధురరీతి**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 94**

**భావము :** కరచరణాది అవయవాలతో భగవంతుని సేవించుటకు త్రోవచూపుమని వేడుట.

నారసింహా! నిన్ను నోరారాస్తుతి చేయాలని యున్నది. దానికి కావలసినట్లుగా పలుకులను, వానికి జోడించగా చక్కని భావమును నీవీయవలెను.

పద్మనాభా! నీ వద్దకు నడిచిరావాలని యున్నది. అందులకై పదములను, దారిని నీవే యీవలె మరియు చూపించవలెను లక్ష్మీపతీ! నీకర్పణము చేయవలెనని ఎన్నో పనులను చేయదలంచినాను. అట్లు చక్కగా, నేర్పుగా చేయుటకు చేతులను మరియు చేయవలసిన కార్యములను నీవే యీవలెను.

కమలనేత్ర! కనులారా నిన్ను కాంచాలని ఉన్నది. అందుకు ఆరోగ్యముగానుండు కన్నులను, వానికి తగిన కాంతిని నీవిచ్చిననే సాధ్యమగును.

మాధవా! ఈ శరీరమునకు తగిన విధంగా ఆరోగ్యమిమ్ము. అట్లున్నప్పుడే మిమ్ములను చక్కగా సేవించగల్గుదును. మధురరీతి యనగా ప్రియురాలు/ భార్య ప్రియుని/ భర్తను సేవించు విధముగా అని కూడ అర్థము చేసికొనవచ్చును.

**సీ. శ్రీకాకుళపుకీర్తి – చెన్నుగా తెలిసెగా**
**పురుషోత్తమాఖ్యుండు – పొగడతెగడ**



**భద్రాచలయశము – బహువిస్తరించెగా**
**గోపన్నచేతల – కూర్మికృతుల**
**శ్రీధర్మపుర ఖ్యాతి – చెలువార పెరిగెగా**
**శేషప్పకవినాల్క – చిందవాణి**
**తిరుమల మహిమల – తీరులుతెలిసెగా**
**అన్నమాచార్యుండు –వన్నెదిద్ద**

**తే.గీ. ఈ ప్రభావతి కృతి నంది – యేలుకొమ్మ**
**ధాళవట్టము రాజిల్ల – ధాత్రిపైని**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 95**

**భావము :** కవులు, వాగ్గేయకారుల రచనల వలన ఆయా పుణ్యక్షేత్రాలు ప్రసిద్ధి చెందినవి.

శ్రీకాకుళమనునది ఒక చిన్నగ్రామము. కృష్ణాతీరములోనున్నది. ఇక్కడి దేవుడి పేరు ఆంధ్రమహావిష్ణువు.

**చిత్ర చిత్రప్రభావ, దాక్షిణ్యభావ**
**హతవిమత జీవ! శ్రీకాకుళాంధ్రదేవ!**

అనే మకుటంతో కాసుల పురుషోత్తమకవి ఆంధ్రనాయకశతకాన్ని రచించారు. ఈ శతకము ప్రఖ్యాతమైనట్లే ఆ స్వామి గొప్పదనము ప్రపంచానికి తెలిసినది.

భద్రాచలముయొక్క మహిమలు బాగుగా ప్రచారంలోకి రావడానికి ప్రధానకారకుడు కంచెర్లగోపన్న. ఈయన గుడికట్టడమేకాక, వ్రాసిన దాశరథిశతకము మరియు అనేకకీర్తనలు ఈ క్షేత్రముయొక్క ఖ్యాతిని పెంచినవి.

శ్రీధర్మపురిలో నివసించి అక్కడి నరసింహస్వామిపై వ్రాసిన 'శ్రీ నరసింహాశతకము' వలన ధర్మపురిపట్టణము గుఱించి ఎక్కువ ప్రచారములోనికి వచ్చింది.

**భూషణవికాస! శ్రీధర్మపురనివాస!**
**దుష్టసంహార! నరసింహదురితదూర!**

అనునది యీయూరి పేరును తెలిపే మకుటము.

తిరుమలేశుని గూర్చి ఎందరో భక్తులు ఎన్నో విధములైన సేవల నొనరించినారు. అయితే దేశదేశాలకు విస్తృతముగా తెలియబడినది అన్నమాచార్యుల పాటలవలననే.

కావున పైన తెలిపిన కవులు, వాగ్గేయకారులవలె ఈ ప్రభావతి వ్రాసి యిచ్చుచున్న యీ చిన్నశతకము కూడ ప్రఖ్యాతము చెందవలెనని, అట్లే నిన్ను మకుటముగా నిల్పినందుకు పేరులోన దొడ్డతనమున్న ఊరు చిన్నగానున్న ఈ దొడ్డధాళవట్టము కూడ విఖ్యాతి నొందవలెనని, ఇది చదివిన వారలకు నీ భక్తపాలనను గురించి నమ్మకము జనించి నిన్ను దర్శించుకొనవలెనని దొడ్డవేల్పయిన నరసింహా! నీవు తప్పక నా కోర్కెతీర్చగలవని నమ్ముచున్నాను.

**సీ. ఉత్తమకళలేని – యొల్లరు ప్రజనేడు**
**చౌకబారగు వాని – చవులదవిలి**
**రేడియో ఆడియో – వీడెను వీడులు**
**వీడియో ప్రబలెను – నేడురేపు**
**టీవీలు వచ్చెను – టీవిని పెంచుచు**
**నాబాలవృద్ధులు – హర్షమంద**
**విజ్ఞానమును తెల్పు – విషయాలు వచ్చెనా**
**వెంటనె మూతురు – విసుగనుచును.**



**తే.గీ. నాత్మ నుద్ధరింప గలుగు – నంశములవి**
**యెట్లు తెల్పిన నొల్లరే – హితముకలుగు**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్న నే – నారసింహ!** **96**

**భావము :** ప్రజల మధ్య – కళలు

హే భక్త పాలకా! ఈ కలియుగము ప్రభావమింతయని చెప్పుటకు వీలులేకున్నది. ఈనాటి ప్రజలకు ఉత్తమకళాభిరుచి తగ్గుచున్నది. చౌకబారయిన కళలను ఆదరించుచున్నారు.

ఏది ఉత్తమము, ఏది నీచమని యెట్లు నిర్ణయింతుమనగా దేనిని చదువుట, వినుట, చూచుటవలన మనోరంజనముతోపాటు ఆత్మోద్ధరణ అనగా విజ్ఞానము, మనోవికాసము కూడ కలుగునో దానిని ఉత్తమ మందురు.

దేనిని చదువుట, వినుట, చూచుటవలన మనిషియొక్క ఆలోచనలు, వ్యక్తిత్వము పతనముకై దారితీయునో. మనోరంజన మొక్కటియే కలుగునో అట్టి కళలను నీచమని చెప్పవచ్చును.

సమాజములో వ్యాపారదృష్టితో మానసికదౌర్బల్యములను పెంచు కళలను ప్రోత్సహించు వారెక్కువ ఉన్నారు. అట్లే ఉన్నతపథంవైపు నడిపించు వ్యక్తులు ఉన్నారు. సంస్థలు కూడా ఉన్నాయి. అయిన రెండవతెగకు చెందినవారి సంఖ్య తక్కువ.

దీనికి తగినట్లు ప్రభుత్వములు కూడ ఈ వ్యక్తులపై, సంస్థలపై కట్టడిచేయు శక్తులను కోల్పోవుచున్నవి. సాంకేతికపరిజ్ఞానము మిక్కిలిగా పెరుగుట ఒక కారణమైతే, ప్రభుత్వములోని లొసుగులు కూడా ఇందులో పాత్ర వహించుచున్నవి. ఇట్లెన్నియోకారణముల మూలముగా ఏ మాధ్యమము

ద్వారా ప్రజలను ఉన్నతకళలవైపు తీసికొని పోవుదమనుకొన్నను అడుగడుగున ఆటంకములే ఎదురగుచున్నవి.

ఇంక కేవలము నీ దయయున్న వ్యక్తులకు మాత్రమే ఉత్తమకళలు పట్టుబడుననే నిర్ణయానికి నేను వచ్చినాను.

**సీ. వారి శక్తిని తెల్పు - భౌతికశాస్త్రంబు**
**వివరణలిచ్చును - విధవిధముల**
**నా యంబులను గూర్చి - యా రసాయనవేత్త**
**వివరణలిచ్చును - విధవిధముల**
**జీవంపు విల్వల - జీవశాస్త్రజ్ఞుండు**
**వివరణలిచ్చును - విధవిధముల**
**నిత్యజీవనమందు - నీటివాడుక గూర్చి**
**వివరణమిత్తురు - విధవిధముల**

**తే.గీ. వొక్క నీటిని గూర్చియే - లెక్క లేని**
**వివరణములుండ నీకెన్ని - వివరణములొ**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్న నే - నారసింహ! 97**

**భావము :** నీటిశక్తిని ఒక ఉదాహరణముగా తెల్పుచు భగవంతుని మహిమలను తెల్పుట ఈ పద్యముయొక్క ఉద్దేశ్యము.

నీటియొక్క శక్తులను రకరకములుగా వినియోగించు శాస్త్రమే హైడ్రాలజీ. ఇందులో పెక్కుశాఖలున్నవి. నీటినుండి విద్యుత్తునుత్పత్తి చేయుటను హైడ్రోఎలక్ట్రిసిటీ అందురు. పారే నీటిని గుఱించి తెలుపు విజ్ఞానమును హైడ్రోలిక్స్ అందురు. ఇందులో హైడ్రోస్టాటిక్స్‌వంటి శాఖలు మరెన్నియోయున్నవి. ఈ శాస్త్రపరిజ్ఞానమును పొందుటకై రచింపబడిన వందల వేల పుస్తకములున్నవి.



నీటితో ఏయే మూలకములు, ఏయే సమ్మేళనాలు, ఏయే మిశ్రమములు ఎట్టి చర్యలు చూపించునో రసాయనిక శాస్త్రము తెలియజేయును. ఆ విధమైన చర్యల వలన కలుగు మేళ్ళను కీళ్ళను తెలియజేయు నీ శాస్త్రము. వీటినన్నింటిని తెలిసికొనుటకు వందల వేల పుస్తకములున్నవి.

నీటితో జీవశాస్త్రమునకున్న సంబంధమును వివరింపవలెనన్న ఎన్నో వందల వేల గ్రంథములను వ్రాయవలెను. జీవము పుట్టినది నీటిలోనే, పెరుగునది నీటితోనే, అంతమగునది నీటిలోనే.

వీటినన్నింటిని ప్రక్కకుపెట్టి మన నిత్యజీవితములో నీటి యుపయోగములను గురించి చదువుకొనుటకు ఇంత ఘనముగా చెప్పుకొనవలసియున్నదే. తక్కిన నాల్గుభూతములను గురించి, వీటినన్నింటిని సృజించిన నిన్ను గూర్చి చెప్పుట కెన్ని వివరణము లవసరము?

నరసింహామూర్తీ! నమస్సుమనస్సులనందుకో!

**సీ. ఒక్కచుక్కను బెట్టి - చక్కంగ గీతురు**
**మున్నూట యరువది - మొనలదారు**
**లెక్కంచు వైయంచు - నీ బీ లటంచును**
**వేమారు నిడుదురు - నామములను**
**కూడంగ, తీయంగ - గుణియించ, భాగించ**
**గుర్తులు పెడుదురు - గుర్తుకొఱకు**
**సామాన్యగణితంపు - శాస్త్రంబు నేర్వంగ**
**నిన్ని కిటుకులనే - నెఱుగవలసె**

**తే.గీ. నింక నీదగు తత్త్వంబు - నెఱుక కొఱకు**
**నెన్నిరీతుల గణనంబు - లెఱుగవలయు**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! 98**

**భావము :** ఈ పద్యములో గణిత శాస్త్రవిషయములను తెల్పుచు పరమాత్మ గొప్పదనమును తెలియపరుస్తున్నాను.

ఒక బిందువును పెట్టి దానిని కేంద్రముగా చేసికొని గీచు వృత్తములో 360 కోణములుండును కదా. రేఖాగణితమంతా యిట్లే యుండును.

X,Y,Z లనుచు A,B,C లనుచు వ్యక్తులను వస్తువులను మొదలగువానిని సూచించుటకు పేళ్ళను పెట్టుదురు. మరియు బీజ గణితమంతయు ఈ అక్షరముల చేతనేయుండును.

లెక్కలు అనగానే కూడిక, తీసివేత, గుణకారము, భాగహారములు. వీటిని తెలియజేయుటకు ఉపయోగించినవి +, –, × మరియు ÷ గుర్తులే. ఇవియేకాక మరెన్ని సాంకేతికపు గుర్తులో.

సామాన్యగణితశాస్త్రమును నేర్చుకొనుటకే ఇటువంటి గణనము లెన్నో తెలిసికొనవలెను. ఇంక ఈరేడు లోకాలను సృష్టించిన నిన్ను తెలిసికొనుటకు ఎన్ని రకముల గణనములను నేర్చుకోవలయును ప్రభూ!

**సీ. రావణు గొల్చిరి – రహి పరిజనములు**
**రాముని గొల్చిరి – లక్ష్మణాదు**
**లా సుయోధనుగొల్చి – రాతనితమ్ములు**
**ధర్మజు గొల్చిరి – తమ్ములెంతొ**
**భక్తివిశ్వాసాల – ప్రకటన సమమేను**
**ఇరువురి యందును – తరచిచూడ**
**నాశ్రయింప నసత్తు – నంతమందిరి వారు**
**సత్తునమ్మిన వారు – సత్త్వమంద్రి**

**తే.గీ. నిన్ను నమ్మిన వారిని – నిర్మలముగ**
**చెంత చేర్చి శాంతినిడవె – వంతలుడిపి**



**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ!** **99**

**భావము :** సత్తు – అసత్తుల నాయకత్వములు ఇట్లుండునని ఈ పద్యములో తెల్పబడినది.

దొడ్డవేల్పా! నారసింహా! రామాయణములో కథానాయకుడు రఘురాముడు. ఆతడు సుగుణాభిరాముడు. అన్నింటికన్నా ప్రధానమైనది ధర్మమార్గమును అనుసరించినవాడు. ఈతని తమ్ముళ్ళైన భరత, లక్ష్మణ, శత్రుఘ్నాదులు తదితర పరిజనమును రామునే తమకాదర్శముగా పెట్టుకొని జీవించినారు.

రావణాసురు డా కాలమున ప్రతినాయకుడు. ఈతడు కూడా అన్ని విధముల గొప్పవాడే. బలము, తపము, ధనము, పరివారము అంతా గొప్పగానే యుండెను. ఈతనితమ్ముడు కుంభకర్ణుడు, కుమారులు ఇంద్రజిత్తు. అక్షుడు మొ।। ప్రహస్తాది మంత్రులు రాజునెంతో ప్రేమించి అనుసరించినవారే. ఈతని మార్గము అధర్మము.

భారతకథలో ధర్మరాజును అతని తమ్ముళ్ళెంత విశ్వాసముగా ప్రేమించి అనుసరించినారో, దుర్యోధనుని అతడి తమ్ముళ్ళు కూడా అంతే విశ్వాసముతో ప్రేమించి అనుసరించినారు.

అయితే రాముడు, ధర్మరాజు ఆశ్రయించినది ధర్మము. ధర్మమంటే సత్త్వగుణము. రావణుడు ఆశ్రయించినది అధర్మము. అంటే అసత్తు.

సత్తును నమ్మినవారెప్పటికి చెడిపోరు. అసత్తును నమ్మినవారు బాగుపడరు. ఇది పై గ్రంథాల మూలకముగానే కాక ప్రపంచములో జరుగుతున్న చిత్రములతో పోల్చినపుడు వెలువడుతున్న సత్యము.

**సీ. సుందరాంగి నగును - చూడ వికారిని**
**బలహీను గని నగు - బలయుతుండు**
**ధనికుండు నవ్వును - ధనవిహీనుని చూచి**
**పామరు గని నగు - పండితుండు**
**ప్రకటింత్రు పైదెల్పు - భావాల పైవారు**
**అనుకొంద్రు మదిలోన - నణగువారు**
**కాలచక్రము పేర - వ్రేలి చక్రముత్రిప్పి**
**జ్ఞాన మొసంగెదవ - జ్ఞానులకును**

**తే.గీ. మాయ యెదియోయి యెచటోయి - మనసునందె**
**మాకు మాయ చీల్చెదుశక్తి - మసలకిమ్ము**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! 100**

**భావము :** లోకములో ప్రతి విషయములో రెండు అంచులుండును. బాగుగా డబ్బున్నవాడు. కడుబీదవాడు. అట్లే సుందరాంగులు - కురూపులు, పండితుడు - పామరుడు, బలవంతుడు - దుర్బలుడు.

ఇందులో అధికముగా బలము, ధనము, సౌందర్యము, పాండిత్యము గలిగినవారు గర్వమును పొందక నిశ్చలముగా అందరిని సమదృష్టితో చూడగలిగిన లక్షణమున్న వారైనచో వారు కడవరకు స్థిరముగానే యుండగల్గుదురు. కాని ఎక్కువ మంది జనులలో అట్లుండరు. ఎక్కువ యున్నవారు తక్కువయున్న వారిని గేలి చేతురు. ఇట్లు నిరాదరణ చేయుట బాహ్యముగానే అందరి యెదుటనే చేతురు.

ఈ నిరాదరణ, ఎగతాళికి గురియయినవారు అనేక కారణములుగా తమమనసులలోని భావాలను, కోపము, ఈర్ష్య, అవమానముల వలన కలిగిన



బాధలు చెప్పుకోలేకపోవచ్చు. కాని లోలోననే తిట్టుకొందురు. శపించుచుందురు.

కాని నీవున్నావే - సామాన్యుడవా! కాలమను చక్రమును నీ వ్రేలితో త్రిప్పుచుండగా రాజు-బీదగును, బీద-రాజగును.

ఇప్పుడు మాయ అనునది యెక్కడ ఉన్నదయ్యా అంటే ఆ గర్వము మనసున నంటుకొన్నదానికి చూపుదువు ఉత్థానపతనములను. హే ప్రభూ! మాకు మాయను చీల్చెదు శక్తిని ఆలసించక ప్రసాదించుము.

**సీ. ఆదిమానవునాటి - యాకాలమున నుండి**
**పశుబలమ్మున దేను - పైని చేయి**
**అది లొంగగల దొక్క - యర్థబలానికే**
**నాటినుండి మొదలు - నేటివఱకు**
**ఆధ్యాత్మ లెడనెడ - నణచి రద్దానిని**
**వారలు జీవించి - వఱలుదనుక**
**వారటు వోవగా - వక్రభాష్యాలతో**
**వంచింత్రు స్వార్థాన - సంచరింత్రు**

**తే.గీ. తాను మినహాగ న్యాయంబు - నూనగాను**
**నెల్లరాశింత్రు యెల్లెడ - నెల్లవారు**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! 101**

**భావము :** పశు బలము - ఆధ్యాత్మ బలముల ప్రభావము

ఓ దేవుడా! చరిత్రను చదువగా తెలియవచ్చిన విశేషములివి. మానవుడు మొదలుగా యీ కాలమువరకు పశుబలమునకు జనులు భయపడుదురు. వీరినే అంటే ఇట్టి పశుబలము గలిగిన వారినే రౌడీలు

అనుచున్నాము. వీరిని లొంగదీసికొనుటకు ప్రధానఉపాయము డబ్బు. వీరినిద్దరిని అదుపు చేయగలిగినవారు ఆధ్యాత్మిక జ్ఞానమును విశేషముగా గలిగిన మునులవంటివారు. అటువంటి మహానుభావులున్నంతవరకు ధర్మమును ప్రజలచేత ఆచరింపజేయ గలుగుదురు. కాని వీరు పోయిన పిదప సాంఘిక పరిస్థితులు యథాప్రకారముగానుండును.

ఏ ధర్మపన్నాలను మహనీయులైన గురువులు చెప్పియుండిరో, వారు పోయిన తరువాత వాటికెన్నో సవరణలను, వక్రభాష్యములను తరువాతి వారు తీసుకువత్తురు.

ఇంతేకాక ప్రతివ్యక్తి న్యాయమును పాటించమని చెప్పును. కాని తన వంతు వచ్చునప్పటికి మినహాయింపు నాశించును.

**సీ. పూర్ణంబు మొదలంద్రు – పూర్ణంబు కడయంద్రు**
**పూర్ణాని కర్థంబు – పొసగుటెట్లు**
**అండంబు వీర్యంబు – గుండుగా నుండును**
**వాని కలయికగు – వరలుగుంద్ర**
**మణుపరమాణువు – లమరంగ గుండ్రంబు**
**ప్రోటాన్లెలక్ట్రాన్లు – పూర్ణముండు**
**సూర్యుండు గుండ్రంబు – సోముండు గుండ్రంబు**
**గోళాలు తారలు – గుండ్రముండు**

**తే.గీ. పూర్ణమున బుట్టి పూర్ణాన – పొదలుచుండి**
**పూర్ణమున లీనమై జీవి – పొలుచుచుండు**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 102**

**భావము :** సుప్రసిద్ధమైన వేద ప్రతిపాదితమైన శ్లోకమిది.



**పూర్ణమదం, పూర్ణమిదం**
**పూర్ణా త్పూర్ణముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయ**
**పూర్ణమే వావశిష్యతి**

దీనికి వాచ్యార్థము అది నిండుగానున్నది. ఇది నిండుగా నున్నది. పూర్ణమునుండి పుట్టుచున్నది కూడ పూర్ణమే. పూర్ణమునుండి పూర్ణమును తీసికొన్నను చివరకు మిగులునది కూడ పూర్ణమే.

దీనికి అధ్యాత్మవాదులు చెప్పిన వ్యాఖ్యానములెన్నో. ఇప్పుడీ శ్లోకమునకు చేయు వ్యాఖ్యానము ఈనాటి విజ్ఞాన శాస్త్రమునకు ఇదియొక నూతన దృక్పథము.

పూర్ణము మొదలని, పూర్ణమే చివరిదని చెప్పుదురు. ఈ విధముగా పూర్ణమునకున్న అర్థమేమి?

జీవశాస్త్రముననుసరించి ఒక జీవి ఉదయించుటకు అనగా ఒక జీవి రూపుదిద్దుకొనుటకు స్త్రీనుండి అండము, పురుషుని నుండి శుక్లము అవసరము. అండముయొక్క ఆకారము గుండ్రమే. శుక్లముకూడా సాగదీయబడిన వలయాకారమే. కాకున్న అది అండమును చేరువరకు కదలుటకై ఒక తోకయుండును. ఇట్టీ రెండుగుండ్రములు ఒకదానితో ఒకటి కలిసినప్పుడు ఏర్పడిన దానిని జీవశాస్త్రపరిభాషలో 'జైగోటు' అందురు. ఇదియే పిండము అని సామాన్యులు పిలుతురు. మొత్తముమీద అండము, వీర్యము, పిండము అన్నియు గుండ్రని ఆకారములతోనే యుండును. అనగా జీవుల ఆకారములన్నియు పూర్ణముతోనే మొదలగును.

పదార్థనిర్మాణశాస్త్రమును పరికింతము. పదార్థమునకు కడపటి యూనిట్టు అణువు. ఇది గుండ్రముగానుండును. అణువును చీల్చగా పరమాణువు లేక పరమాణువులు ఏర్పడును. ఇవియన్నియు గుండ్రములే.

పరమాణువును కూడ చీల్చిన అందు మూడు రకములైన సూక్ష్మాంశములుండును. దాని కేంద్రకములో రెండు రకములైనవి న్యూట్రాన్లు, ప్రోటాన్లుండును. ఇవి రెండును గుండ్రముగానేనుండును. కేంద్రకమునకు వెలుపల కొన్ని నిర్దిష్టకక్ష్యలలో కొన్ని గుండ్రముగానున్న భాగములు తిరుగుచుండును. వీనిని ఎలక్ట్రానులని పిలుతురు.

ఇట్లు పదార్థములోని అణువులు, పరమాణువులు న్యూక్లియసు, ప్రొటాన్లు, న్యూట్రాన్లు, ఎలక్ట్రాన్లు అన్నియు గుండ్రములే – అంటే పూర్ణములే. అనగా సృష్టిలోని ప్రతిపదార్థము గుండ్రముగానే భాసించును. నేలమీదయున్న మనకు అందనంత దూరంలో ఉంటున్నవి అనగా ఆకాశంలో ఉన్నవి అయిన సూర్యుడు, చంద్రుడు, నవగ్రహాలు మరియు నక్షత్రాలుకూడ గుండ్రముగానే యున్నవని ఖగోళశాస్త్రజ్ఞులు చెప్పుతున్న విషయములను మనము నమ్మవలెను కదా!

ఇట్లు ప్రపంచములోని అన్నిజీవులు, వస్తువులు, గోళములు, గుండ్రములే కదా. కావున ఇన్ని గోళముల మధ్య పుట్టి, పెరుగుచు, ఇందులోనే అంతమవుచున్న ప్రపంచము పైన తెల్పిన శ్లోకమునకు చక్కని ఉదాహరణమని నేను విశ్వసిస్తున్నాను.

**సీ. ఎంత యద్భుతసృష్టి – యెన్నేండ్లు పట్టెనో**
**యింత వైవిధ్యంబు – నేర్పరింప**
**నగముల గాముల – నానా విధమ్ముల**
**సామ్యాల భేదాల – చక్కనునిచి**
**యొకదాని కొక్కటి – యోగిరమ్ముగ చేసి**
**ప్రతిజీవి బ్రతుకంగ – బాటచేసి**
**హద్దుమీరిన దాని – హద్దులో నుంచంగ**
**కట్టడి నేమముల్ – కలుగచేసి**



**తే.గీ. యెంత మేధావియయిన నీ – యంతుకనని**
**రీతి సల్పితి వోహోహో – లీలకాదె**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 103**

**భావము :** జీవుల నిర్మాణములో అభివృద్ధి ఎంత అద్భుతములు – పరిశీలన.

హే సృష్టికర్తా! నీశక్తి, లీలలు ఇంతింతయని పొగడగలమా, ఇటువంటి ప్రకృతిని – ప్రపంచమును సృష్టి చేయుటకు నీకెన్ని కోట్ల కోట్ల సంవత్సరములు పట్టినది?

చలించునవి, చలనము లేనివి అనగా జీవనిర్జీవములకు మధ్య ఎన్నో సామ్యములు, మరియెన్నో భేదములను పెట్టినావు. అటుపై జీవులను వృక్షములు– జంతువులను రెండు భాగములుగాచేసి వాటిలో ఎన్నో సామ్యములను మరియెన్నో భేదములను కలిగించినావు. మఱల ఈ జీవులు ఆహారమును తిని బ్రతుకవలసియున్నది. కనుక ప్రతియొక్క జీవికి అహారమును ఆది పుట్టుటకు ముందుగానే అమర్చియున్నావు. దీనినే జీవ శాస్త్రజ్ఞులు ఆహారపుగొలుసులందురు. వేదాంతులు 'నారు పెట్టినవాడు నీరు పోయడా' అందురు.

ఇట్లు ఆహారము నమర్చి అవి పెరుగుటకు దోహదము చేసిన నీవే అవి అంతము చెందుటకు తగిన పరిస్థితులను కల్పింతువు. ఇట్టి వానినే జీవశాస్త్రజ్ఞులు బ్రతుకుటకై పోరాటము అందురు. అనగా సృష్టిలోని అన్ని జీవరాసులు బ్రతుకవలెను. కాని యే ఒక్కటి అధికము కారాదు. అధికమైనచో అవి నాశనము చెందుటకు ఎన్నో విధములైన కారకములను సృజింతువు. ఆహారము తగ్గుటయో, మైథునము చెందుటకు తోడులేకయో, ప్రకృతిలో ఉత్పాతములు కల్గించుటో, జబ్బులను ప్రబలింపజేయుటో.

ఇట్లు ఒక్కొక్కవిషయమును లోతుగా తఱచి చూసిన యెడల ఎటువంటి మేధావికూడ, నీ సృష్టియొక్క అంతమును తెలిసికొనలేదు కదా! ఈ అద్భుతకార్యములను శభాషనకుండా ఉండగలడా! బాగు – బాగు, లెస్స – లెస్స ఎన్నిరకములుగా చెప్పినను నీ గొప్పదనముకది తక్కువేయగును.

**సీ. ఎంతచిత్రముగా – నిచ్చినా వీరూపు**
**లెక్కయొక్కింతయు – తక్కుగాక**
**యెముకలు కండరా – లెన్నంగ నాడులు**
**ధమనులు సిరలవి – తప్పకుండ**
**ఎవని పిడికిలెంతొ – హృదయమంతే కాగ**
**గాలితిత్తుల మధ్య – హేల నిడితె**
**మెదడును తలయందు – పదిలమ్ముగా నిల్పి**
**దాని యధీనాన – తనువునుంచి**

**తే.గీ. అన్ని యంగాల నడుమగా – నబ్బురంపు**
**రీతి ననుబంధ ముంచితే – లెస్సలెస్స**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్పు!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ!** **104**

**భావము :** ఈ పద్యములో జంతువుల, మనుష్యుల శరీర నిర్మాణముయొక్క గొప్పదనము వర్ణింపబడినది.

హే సృష్టికర్తా! జంతువులు అందునా మనుష్యుల శరీరనిర్మాణము మరింత యద్భుతము. ఇందులో ప్రతిమనిషికి నిర్దిష్ట సంఖ్యలో ఎముకలు, కండరాలు, నాడులు, రక్తనాళాలు, ఆయా భాగములలో సరిగా జొప్పించినావు.

గుండెను ఎవరి పిడికిలి యెంతో అంతే పరిమాణముతో నుండునట్లు, దానిని కూడా రెండుఊపిరితిత్తుల మధ్యగా ఉంచినావు. ఈ రెండు



మృదువైనవి మరియు నిరంతరాయముగా పనిచేయువానిని ఎంత భద్రముగా ఉరఃపంజరములో నుంచినావు.

జీర్ణమండలవ్యవస్థను, విసర్జకావయవములను, సృష్టిచేయు అవయవములను అన్నింటిని చక్కగా నిర్దిష్టస్థానములో పొదిగినావు. అన్ని అవయవములు తమతమ పనులను నెరవేర్చుకొనుచుండగా అన్నింటి మధ్య సహకారసంబంధముండునటుల నాడీమండలమును, దానికి అధినేతగా మెదడును, ఆ మెదడును అమితమైన భద్రత నివ్వగలుగు కాపాలమందును ఉంచినావు.

అపాయములు సంభవించునపుడు పనిచేయుటకు సహవేదన నాడీమండలమును పెట్టినావు.

ఇట్లు ప్రతిశరీరభాగము నిర్వహించు విధులను, ఆయా విధులను నిర్వహించుటకు తగిన శక్తినిచ్చు మేధస్సును ఈ శరీరమును నిర్దిష్ట పరిమాణంలో జీవింపచేయుటకు కావలసిన బాహ్యమైన సౌకర్యములను, ఇట్లెన్నని ఎన్నవచ్చును నీ శక్తి సామర్థ్యములు?

**సీ. బాలునా ప్రహ్లాదు – లాలన చేసిన**
**వరనృసింహస్వామి – శరణుశరణు**
**కరిరాజు మొరవిని – కావంగవచ్చిన**
**పరమపూరుష చక్రి – శరణుశరణు**
**సాధ్వి మొరాలించి – సభలోన గాచిన**
**మురవైరి హేశౌరి – శరణుశరణు**
**గాదిలి మిత్రుడా – బీదనుబ్రోచిన**
**సిరిదాత శ్రీనాథ – శరణుశరణు**

**తే.గీ. ధరణి బలికీర్తి విస్తార – శరణుశరణు**
**హరి విభీషణ రక్షకా – శరణుశరణు**

**వరద కరుణాంతరంగుడా – శరణుశరణు**
**శరణుశరణాగత త్రాణ – శరణు శరణు**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్పు!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 105**

**భావము :** శరణాగతి ద్వారా ప్రసిద్ధులైన భక్తులనిక్కడ తలచుచున్నాను.

బాలుడైన ప్రహ్లాదుని తండ్రియైన హిరణ్యకశిపుడు వెతల బెట్టగా ప్రతి ఆపద యందును అతనిని కాచుచు లాలన చూపించిన శ్రీ నరసింహుని నేను శరణువేడుచున్నాను.

గజరాజు మొరవిని ఆర్తితో వానిని కాచుటకు పరుగుపెట్టిన పరమ పురుషుడు, చక్రధరుడు అయిన వానిని శరణు వేడుచున్నాను.

ద్రౌపదీదేవి దుష్టులైన దాయాదులతో సభామధ్యములో అవమానింపబడినపుడు, ఆ సతీమతల్లికి అంతులేని వస్త్రదానముచేసి ఆమె మానమును కాపాడిన శౌరిని, మురారిని నేను శరణు వేడుచున్నాను.

దుర్భరదారిద్ర్యములో కొట్టుమిట్టాడుతున్న ప్రియమిత్రుడైన కుచేలునికి అంచితమైన సంపదలిచ్చి కాపాడిన శ్రీనాథా! నిన్ను నేను శరణు వేడుచున్నాను.

బలిచక్రవర్తికి కీర్తిని కల్పించుటకై యాచకుడిగా మారిన వామనమూర్తీ! త్రివిక్రముడా! నిన్ను శరణు వేడుచున్నాను.

సుగ్రీవునకు మరియు విభీషణునకు వారి యన్నల వలన కలిగిన ప్రాణభయములను పోగొట్టి రక్షణకల్పించుటయేకాక ఆయా సామ్రాజ్యములకు అధిపతులుగా చేసిన దయామూర్తీ! నిన్ను శరణు వేడుచున్నాను.



వరదరాజా! కరుణామయుడా! నిన్ను శరణుకోరుచున్నాను.

శరణన్న వారి కష్టములను తొలగించి కాపాడుదైవమా నిన్ను శరణు వేడుచున్నాను.

**సీ. నీ నిరాకారత – నేవింటి నిటు గాన**
**నీకంట కాంచుట – యెట్లు పొసగ**
**సాకారు డనుచునే – యాకారమున గొల్తు**
**పుంభావమా లేక – పుణ్యవతివ**
**స్థూలుడీవని విని – చూచుద మనుకొంటె**
**యల్పదృష్టిగల నా – కానలేదు**
**సూక్ష్ముడీవని చూడ – సూక్ష్మదర్శిని కానె**
**యెవ్విధి నినుగందు – నిందిరేశ!**

**తే.గీ. దృష్టి గోచరుడవు గాక – సృష్టియెల్ల**
**నిండి నిబిడీ కృతుడవగు – నిన్నునేను**
**సాకృతి నిరాకృతుల భావ – సమమునూని**
**స్థూలసూక్ష్ములందెల్ల – చూడవలతు**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్పు!**
**నమ్మినానయ్య నిన్ను నే – నారసింహ! 106**

**భావము :** భగవంతుని లక్షణములను కొన్నింటి నిక్కడ తెల్పుచు దర్శన భాగ్యముకై వేడుచున్నాను.

ఓయీ, స్వామీ! నీకు ఆకారమేలేదని చెప్పుచున్నారే అలాంటప్పుడు నిన్ను చూచుటయెట్లు?

ఒకవేళ ఆకారము ఉన్నదియనుకొన్నను నిన్ను పురుషునిగా చూడవలెనా లేక స్త్రీ దేవతగా భావించవలెనా?

నీవు గ్రహగోళములను, నక్షత్రమండలములను, బ్రహ్మాండ భాండముల నన్నింటిలో వ్యాపించియున్నావని అందురు. అందుకే అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకా అని భక్తులు గొంతెత్తి పిలుచుచున్నారు. ఇంత పెద్దదైన ఆకారమున్నా నిన్ను చూచుదామనుకొంటే నాది అల్పదృష్టి. అందుచే నా కంటికి ఆనుటలేదు.

భగవద్గీతలో "అణోరణీయం – మహతోమహీయం" అన్నారు. అనగా పెద్దవైన వానిలో పెద్దవట. సూక్ష్మమైన వానిలో సూక్ష్మము నీవేనట. కావున సూక్ష్ముడవు నీవని చూచుదమనుకొంటే అది కూడ సాధ్యపడలేదు. ఎందుకంటే నాకు సూక్ష్మదృష్టి లేదు.

ప్రభూ! నీవేమో మా మానవుల కంటికి కనిపించవు. సృష్టియంతటిలో నిండి నిబిడీకృతుడిగానున్నావు. నాకేమో నిన్ను చూడాలనే కోరిక మిక్కుటముగానున్నది. అది ఎంతగా నున్నదంటే ఆకారములున్న అన్నింటిలోను, ఆకారములులేక భావనా మాత్రములుగా నున్న అన్నింటిలోను సమత్వము నుంచి స్థూలములు మరియు సూక్ష్మములునైన అన్ని పదార్థములందును ఇంకొక విధముగా చెప్పవలెనంటే ప్రహ్లాదునివలె, త్యాగరాజువలె, రామదాసువలె నిన్ను చూడాలని ఉన్నది. ఎందుకంటే 'అంతా రామమయం – జగమంతా రామమయం' అని వారు పాడినారు కదా.

**సీ. శక్తుల్పదార్థాల – సంఖ్యము ల్లేరేరు**
**పుట్టించపొలియించ – భువనములను**
**ఆమ్లజనుదజని – యా నత్రజనిమొదల్**
**కార్బన్డయాక్సైడ్ – కాకనీరు**
**వలయాలవన్నియు – ప్రకృతిలో నెఱపెడు**
**క్రియలవి పూర్ణంపు – ఖేలనమ్మె**
**శక్తులన్ని రకాలు – సమయును పూర్ణాన**
**శాస్త్రంపుగతులన్ని – సమయునిందు**



**తే.గీ. ఎన్ని సమసిన, పుట్టిన – నన్నియిచటె**
**లెక్క పూర్ణమొక్కటె యౌను – లేదితరము**
**విశ్వమంతయు పూర్ణాన – వెలసియుండు**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్పు!**
**నమ్మి నానయ్య నిన్ను నే – నారసింహ! 107**

**భావము :** పూర్ణత్వమున గుఱించి నేటి విజ్ఞానశాస్త్రముతో సమన్వయమును క్రింది విధముగా చేయుచున్నాను.

ప్రకృతిలోనున్న శక్తులనేకములు. పదార్థముల సంఖ్యయో – ఇన్నని చెప్పుటకు సాధ్యమేకాదు. ఈ రెండింటిని పుట్టించుటకు, నశింపచేయుటకు ఎవరికిని సాధ్యముకాదు. ఇవి రూపములలో మార్పు చెందునేకాని పూర్తిగా నశింపబడవు. విజ్ఞానశాస్త్రముతెల్పు ఈ సత్యమునకు వివరణయిది. భూమిపై గాలి, నీరు, కర్బనవలయములను గురించి తొలుత వివరింతును. గాలిలో ప్రధానముగానున్న వాయువులను నత్రజని: అమ్లజని–4:1 పాళ్ళల్లోనున్నవి. నత్రజని మూలస్వరూపముతో ఎట్టి జీవులు ఉపయోగించుకొనలేవు. కాని నైట్రేటులనబడు లవణములుగా మొక్కలు గ్రహించును. ఈ రూపములో భూమిని చేరుటకు ప్రకృతిలో అనేక విధములున్నవి. ఆకాశంలో మెరుపులుమెరిసిన వానకురిసి నైట్రేటులు తయారై భూమిని చేరును. సింబయాసిస్ అనే జీవనవిధానము ద్వారా కొన్ని బాక్టీరియాలు చిక్కుడు జాతికి చెందిన మొక్కలవేళ్ళలో నైట్రేటులను తయారుచేయును. వీనిని మొక్కలు గ్రహించి మాంసకృత్తులుగా మార్చును. ఈ మాంసకృత్తులను జంతువులు, మానవులు గ్రహింతురు.

జీవుల శరీరములలో జీర్ణముకాబడిన తరువాత మలమూత్ర విసర్జనములద్వారా భూమిని చేరును. క్రుళ్ళిన, చచ్చిన పదార్థములపై అనేక రకముల బాక్టీరియాలు వీటిపై పనిచేయును. ఇవి అన్నియు కలిసి నత్రజని లవణాలను విచ్ఛిన్నముచేసి మఱల గాలిలోనికి కలుపుచుండును.

జీవులశరీరములలో జీర్ణముకాబడిన తరువాత మలమూత్ర విసర్జనములద్వారా భూమిని చేరును. క్రుళ్ళిన, చచ్చిన పదార్థములపై అనేక రకముల బాక్టీరియాలు వీటిపై పనిచేయును. ఇవి అన్నియు కలిసి నత్రజని లవణాలను విచ్ఛిన్నముచేసి మఱల గాలిలోనికి కలుపుచుండును.

ఇట్లు గాలిలో 4:1 నిష్పత్తిలో నత్రజని కోట్లకొలది సంవత్సరముల నుండి కొనసాగుచునేయున్నది. దీనినే నత్రజని వలయమని పిలుతురు.

శరీరధారులకు ఎక్కవగా కావలసిన మరియొక మూలకము కర్బనము. దీనిని కూడా జీవులు మూలకస్థితిలో ఉపయోగించుకొనలేవు. ఇది ఆక్సిజనుతో కలిసి కార్బన్‌డయాక్సైడ్‌గా మారినపుడు మొక్కలు గ్రహించును. దీని సహాయముతో అవి పిండిపదార్థములను తయారుచేసి వీటిని అవి ఆహారముగా ఉపయోగించుకొనును. అంతేకాక ఇతర ప్రాణులన్నియు ఆహారముగా ఉపయోగించుకొను ఆహారములు మొక్కలనుండి ఈ రూపములలోనే వచ్చుచున్నది. ఇవి జీవుల శరీరములలో అనేక మార్పులు చెంది మఱల విసర్జింపబడును. అట్లు కార్బన్‌డయాక్సైడ్‌గా ప్రకృతిలోకి చేరును. సముద్రములో నివసించు అనేక పెంకులున్న జీవులున్నవి. ఈ పెంకులలోనున్నది కర్బన సమ్మేళనములే. ఇవియే కాక చెట్లనుండి వచ్చిన ఇంధనములు కట్టెలు, బొగ్గు మొదలైనవి మరియు పెట్రోలియంనుండి వచ్చిన పదార్థములైన డీజిలు, పెట్రోలు, కిరోసిను వంటివి మరియు వంటసిలిండర్లలో వాడు గ్యాసులు మరియు ఫ్యాక్టరీలు విడుదలచేయు వాయువులలో ఆయా పదార్థాలు మండినపుడు వచ్చునది కార్బన్‌డయాక్సైడ్. ఇది సింహభాగములోనుండును.

భూమిలో ఎన్నో రకముల బాక్టీరియాలు సంక్లిష్టమైన చర్యలు జరుపుచు నిరంతరము కర్బనము, ఆక్సిజను, హైడ్రోజను, నత్రజనులపై పనిచేయుచునే యుండును. ఇట్లు నిరంతరాయముగా కర్బనము ప్రకృతిలో తిరుగుటనే కార్బన్‌వలయమందురు.



నీటిలో హైడ్రోజను, ఆక్సిజనుల సమ్మేళనము 2:1లో ఉండును. జీవులశరీరములలో ఇవి విడగొట్టబడునేకాని ఇతర విధములుగా విడిపోవు. నీటిని యథాతథంగా ఎన్నో జీవులు స్వీకరించుచు, ఉపయోగించుకొనును. ఆకాశముననున్న మేఘాలనుండి వర్షంద్వారా భూమిని చేరడం, ఇక్కడ ఉన్న అనేకజలాశయాలు, సముద్రాలు, నదులు, చెరువులు, బావులద్వారా జీవులు ఉపయోగించుకోవడం, మరల వీటన్నింటినుండి ఆవిరిగా మారిన నీరు గాలిలోచేరి ఆకాశంలో మేఘాలుగా మారడం దీనినే జలచక్రము అంటారు.

ఈ విధముగా ప్రధానమైన మూలకాలు ప్రకృతిలో అనేక రకములుగా ఉపయోగింపబడుతూ వలయాకారంగా తిరుగుతున్నవి. వలయము అంటే పూర్ణములోని భాగమే కదా.

ప్రకృతిలో అనేకశక్తులున్నవి. విద్యుత్తు, వేడిమి, అయస్కాంతము, రసాయనికశక్తి మొదలగున వన్నియు ఒక రకమునుండి మరియొక రూపములోనికి మారును. కాని ఏ శక్తియు నశించదు. శక్తిని క్రొత్తగా పుట్టించలేరు. మరియు నశింపచేయలేరు. దీనిని శక్తినిత్యత్వ సూత్రమందురు. ఇట్లే పదార్థమును కూడ ఎవరు సృష్టించలేరు మరియు నశింప చేయజాలరు. ఒక రూపమునుండి మరియొక రూపమును మాత్రమే పొందును. దీనినే పదార్థ నిత్యత్వ సూత్రమందురు.

దీనినిబట్టి అర్థము చేసికోవలసిన దేమిటంటే విశ్వములో శక్తులుగాని, పదార్థములు గాని ఇందే, ఈ పూర్ణమునందే పైకి, క్రిందకు, ప్రక్కలకు తిరుగుచున్నవేగాని అన్యము కాదు. కనుక పూర్ణము, పూర్ణముగానే యుండును.

**సీ. ఈనాటి విజ్ఞులు – నేర్పడ చెప్పిన**
**ఆయా పదార్థము – లమరుతీరు**

**ప్రాపంచికంబంత – పాంచభౌతికమనెడు**
**హైందవసూత్రాలు – నిందునొదిగె**
**ఘనపదార్థములన్ని – ఘనమైన పృథ్వియే**
**ద్రవపదార్థములన్ని – రసజగత్తు**
**వాయుపదార్థముల్ – వాయులీనము తాను**
**పరమాణులన్నింట – వహ్నియుండు**

**తే.గీ. ఈ పదార్థలక్షణమిది – యెద్దియైన**
**స్థలమాక్రమించుననుటె – చదలుసుమ్ము**
**దొడ్డధాళవట్టములోని – దొడ్డవేల్పు!**
**నమ్మి నానయ్య నిన్ను నే – నారసింహ! 108**

**భావము :** హిందూధర్మములను తెలుపు గ్రంథములలో ప్రపంచము పంచభూతములచే చేయబడినదని చెప్పెదరు. అవి ఏమనగా నేల, నీరు, గాలి, అగ్ని, ఆకాశము.

చిత్రముగా ఆధునిక విజ్ఞానశాస్త్రములో ఇచ్చిన వివరణములతో సమన్వయము చేయవచ్చునని నేను గుర్తించినాను.

అది ఎట్లనగా నవీన శాస్త్రజ్ఞులు పదార్థములన్నియు మూడు స్థితులలో నుండునని తెల్పినారు. 1. ఘనములు, 2. ద్రవములు, 3. వాయువులు.

ఘనపదార్థములన్నియు భూమిఅంశములోనికి చేరును. ద్రవపదార్థములన్నియు నీరు అను అంశములోనికి వచ్చును. వాయువుల స్థితిలోనున్నవన్నియు వాయువును అంశమునకు చెందును. ఈ రకముగా మూడుస్థితులకు మూడురకముల పదార్థములుచేరగా మిగిలిన రెండింటికి వివరణ యీ క్రింది విధముగానున్నది.

పైన తెల్పినవి మూడును పదార్థములు. నాల్గవదైన అగ్ని శక్తి స్వరూపము.



శాస్త్రజ్ఞులు తెల్పునదేమనగా సృష్టిలో కనిపించు పదార్థములన్నియు పరమాణువులతో చేయబడినవి. ప్రతి పరమాణువులోను అనంతమైన శక్తి యిమిడియున్నది. అయితే ఈ శక్తి ఎల్లప్పుడు నిద్రాణ స్థితిలోనే యుండును. ప్రచోదనము చేసినపుడు మాత్రమే ఇది బయటపడును. దానినే అటామిక్ బాంబులుగా విచ్ఛిన్నకర శక్తులుగా ఉపయోగించుకొనుచున్నారు. ఇటీవల లోకోపకారకములైన పనులకు కూడ దీనిని వినియోగించుకొనుచున్నారు.

చివఱగా ఆకాశము. ఆకాశశబ్దమునకు శూన్యము, గగనము అనునవి పర్యాయపదములు.

ఆధునిక శాస్త్రములో 'పదార్థము'నకు ఇచ్చిన నిర్వచనమిది. ద్రవ్యరాశిని కలిగియుండి, స్థలమును ఆక్రమించునది. అనగా ఏ స్థితిలో నున్నదైనను, ఘనమో, ద్రవమో, వాయువో ఉండుటకు స్థలము కావలెను. స్థలము లేనిచో అవి ఉండలేవు. అంటే స్థలమేది అనగా శూన్యమే కదా – దానినే ఆకాశమని ఐదవదైన అంశముగా పేర్కొనవచ్చును.

దేవా! నరసింహా! నేను చదివిన వినిన, అనుభవమునకు వచ్చిన ప్రకారముగా వేదాంతవిషయాలకు, విజ్ఞానవిషయములకు సమన్వయమును చూపినాను.

విజ్ఞులు ఇందులోని బాగోగులను గమనించి ప్రపంచ వ్యాప్తము చేయగా కోరుచున్నాను. ఇందులకు నీ దయ అవసరము.

**సీ. సాలోక్యమొసగుమా – సజ్జనసంస్తుత్య!**
**నిస్సంగ తత్త్వంబు – నేర్చుకొనగ**
**సామీప్యమొసగుమా – సనకాదివందిత!**
**నిర్మోహతత్త్వంబు – నేర్చుకొనగ**
**సారూప్య మొసగుమా – సరసిజనాభుడా!**
**నిశ్చలతత్త్వంబు – నేర్చుకొనగ**

**సాయుజ్య మొసగుమా - సచ్చిదానందుడా!**
**నీలోననే నాకు - నెలవునొసగ**

**తే.గీ. సాగిలబడి వేడెద నిదే - స్వామి వినుమ**
**తనువు రాలుచో నేమౌనొ - తలతునిపుడె**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! 109**

**భావము :** దేవదేవా! నిన్ను చేరుటకు ఈ నాలుగు మెట్లున్నవంట. ఆది శంకరులు కూడ భజగోవిందము స్తోత్రములో జీవన్ముక్తికి నాలుగు సోపానములను తెల్పినారు. వానికి సమన్వయము కల్పించుచున్నాను.

సజ్జనులచే పొగడబడుదేవా! నాకు సాలోక్యమును ప్రసాదించు, తద్వారా నిస్సంగతత్త్వము నేను నేర్చుకొందును.

సనకాది మునివందితా! నాకు సామీప్యమును ప్రసాదించుము. తద్వారా నేను నిర్మోహత్వమును నేర్చుకొందును.

సరసిజనాభుడా! నాకు సారూప్యము నిచ్చినచో నిశ్చలతత్త్వము నలవరచుకొందును.

స్వామీ! సచ్చిదానందుడా! నాకు సాయుజ్యమిమ్ము. నీలో నున్న చేర్చుకొనుము. ఈ శరీరము రాలిపోవునపుడు నిను తలచుటకు సాధ్యమగునో కాదో ఇప్పుడే సాగిలపడి వేడికొనుచున్నాను.

విన్నవించుకొనుచున్నది. దొడ్డధాళవట్టములో కొలువైయున్న నారసింహా! అన్ని విధముల నిన్ను నేను నమ్మియున్నాను.

**సీ. సాధులో నీచులో - చదివిన దీనిని**
**పట్టుకొనును గాక - వరదుకరము**



**జ్ఞానులో హీనులో - చదివిన దీనిని**
**జ్ఞానమొసగుగాక - జ్ఞాతగురుడు**
**సరసుడో విరసుడో - చదివిన దీనిని**
**వానికొసగుగాక - వలచనాడు**
**చదువుకై పదవికై - చదివిన దీనిని**
**చాల యొసగుగాక - జగతిభర్త**

**తే.గీ. దాసి చేసెడు వినతని - వాసి నిలుపు**
**యెవరు కోరిన వరముల - మివుల నిమ్ము**
**దొడ్డధాళవట్టములోని - దొడ్డవేల్ప!**
**నమ్మినానయ్య నిన్ను నే - నారసింహ! 110**

**భావము :** ఫల శ్రుతి నిచ్చట తెల్పుచున్నాను.

స్వామీ! ఈ గ్రంథమును సాధులులేక నీచులు చదివినను వారిని నీ చేతితో పట్టుకొనుము.

జ్ఞానులులేక అజ్ఞానులు దీనిని చదివినను వారికి తగినంత జ్ఞానమును ప్రసాదించుమని జగద్గురువైన నిన్ను వేడుచున్నాను.

సరసుడు దీనిని చదివినవానికి సరసమాడుటకు కావలసిన సౌకర్యములను విరసుడు చదివినవాడు ఆశించు వైరాగ్యమును ప్రసాదించుము.

చదువు నాశించి చదివినవానికి చక్కని చదువును, పదవుల నాశించి చదువువారికి మంచి పదవులను ప్రసాదించుము.

ఇట్లు ఎవరు దీనిని ఆశించి చదివిన వారికటువంటి కోరికలను నెరవేర్చుమని నీ దాసియైన ప్రభావతి విన్నవించుకొనుచున్నది.




దొడ్డధాళవట్టం శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి దేవాలయం